

భారతి

సాహిత్య మాస పత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులు

1961 అక్టోబరు

సంపుటి: 38

సంచిక: 10

వెల ఒకరూపాయి

క్రీడాభిరామపద్యంలో చరిత్రాంశాలు
శ్రీ కె. హెచ్. వి. శర్మ

కాళిదాసకవిత : మానవధర్మ సంస్కృతులు
శ్రీ కొండూరి వీరరాఘవాచార్యులు

కథకచక్రవర్తి సామర్సెట్ మామ్
శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

ఆచార్యప్రఫుల్ల చంద్రరాయలు
శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

మన చిత్రకళ పరిస్థితి
శ్రీ యస్. వి. రామారావు

నీలి
శ్రీమతి కె. వి. యస్. అచ్యుతవల్లి

ఇంకా అనేక వ్యాసాలు, కథానికలు, నాటిక, కలగూరగంప, గ్రంథవిమర్శనలు.

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

అక్టోబరు 1961

సంపుటము 38 : : సంచిక 10

విడిపత్రిక వెల ఒకరూపాయి

విషయానుక్రమణిక

అక్టోబరు 1961

సౌందర్యలహరి	శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు	1
క్రీడాభిరామ పద్యంలో చరిత్రాంశాలు	శ్రీ కె. హెచ్. వి. శర్మ	3
పరాజితుడు	శ్రీ జి. రామకృష్ణ	6
కాదంబరి వర్ణనావైదగ్ధి	శ్రీ యస్వీ జోగారావు	8
నీలి	శ్రీమతి కె. వి. యస్. అచ్యుతవల్లి	11
కాళిదాసకవిత : మానవధర్మ సంస్కృతులు	శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు	18
మధువ్రతనిర్వాహణము	శ్రీ మిరియాల రామకృష్ణ	24
కథకచక్రవర్తి సామర్సెట్ మామ్	శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి	27
రంగమార్తాండులు	శ్రీ బలిజేపల్లి రాఘవరావు	35
వర్షావిలాసము	శ్రీ వేముగంటి నరసింహాచార్యులు	56
విశ్వనాథ - ప్రయోగ వైలక్షణ్యము	శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి	57
మేఘుమొక్కడుమిగిలెను మింట నింట	శ్రీ మానాప్రగడ శేషశాయి	69
మన చిత్రకళ పరిస్థితి	శ్రీ యస్. వి. రామారావు	71
ఏం చెప్పను నేస్తం?	శ్రీమతి నాయని కృష్ణకుమారి	76
ఎందుకు?	శ్రీ వీరాజీ	77
ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయలు	శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి	81
కలగూరగంప		86
గ్రంథ విమర్శనము		93
వార్తలు		100

గమనిక

ప్రచురింపబడని రచనలు తిరిగి పంపగోరువారు తగినన్ని తపాలాబిళ్ళలు జతపరచవలెను. రచయితలు తమ చిరునామా మార్పులు వెంటనే తెలియజేయ ప్రార్థితులు.

సౌందర్యలహరి

శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు

అమృతవారాశి మధ్యమునందు
కల్పవృక్షావృతమై చెలువారునట్టి
అల మణిద్వీపమ్మునందు, అక్కడిమిపూదోట
నెన్నడిమి యచ్చోట, అల్ల
కోటి సూర్యద్యుతి కొమరారుచున్న
చింతారత్న హర్మ్య శుద్ధాంతసీమ
మించు శివాకార మంచకాసీనుడౌ
పరశివు పర్యంక భద్రపీఠి

లాలితమ్మౌ చిదానందలహరినిన్ను
అమ్మరో! భజియించు పుణ్యమ్ము సలుపు
వారెపో చరితార్థులు వారె ముక్తి
కులవధూగాఢ బాహూప గూహరతులు

భరియింపన్ హరి వేయి శీర్షములకున్ భారమ్ములై సర్గవి
స్తరముం జేయగ ధాత పాలిటి కుపాదానమ్ములై, ఆ దిగం
బరుడౌ శర్వుడలందికో మృదులముల్ మైపూతలై మించు త్వ
చ్చరణాంభోజపరాగ లేశములు మత్పాపమ్ములన్ జోపుతన్

నీవె మనస్సు, నాకసము నీవె, మరుత్తును నీవె, అగ్నియున్
నీవె, జలమ్ము భూమియును నీవె, త్వదన్యము లే దొకండు, నీ
వే వివిధస్వరూపమగు ఈ జగదాకృతియందు నిండియు
న్నావని, చిత్సుఖాత్మవయినావని భావన సేతు నీశ్వరీ!

స్మరయోని లక్ష్ములను నీ
వరమంత్రాదిన్ ఘటించి, బహుభోగరతుల్
హరవహ్ని ఆలనే వే
ల్తురు చింతామణిసరాలతో జపపరులై.

సతిసేతున్ దపనేందుకోటిరుచి, నాజ్ఞాచక్రవర్తిన్, శివా
శ్రిత వామార్ధశరీరు నా పరశివున్-వేనిన్ సదా భక్తి న
ర్చితు గావించిన-సూర్యచంద్ర తపనాగ్నేయం, బమేయంబు, సం
చితచంద్రాతప లోకమందు వసతుల్ చేకూరు నవ్యానికిన్.

స్ఫాటికనిర్మలున్, గగనసంజనకున్ శివు, వాని, కన్నిటన్
దీటగు నిన్ను గొల్చెదను దేవిరో! నీదు విశుద్ధియందు, ము
మ్మాటికి సాంద్రచంద్రికలమాడ్కి వెలింగెడి మీతనుద్యుతిన్
గాటపుజీకటుల్ దొలగ గ్రాలు జగమ్ముచకోరికంబలెన్.

కలనాదమ్ము కలాకలాపములకున్ గాణాచిగా, నీటిలో
గల పాలంబలె దోసమందు గొనమున్ గైకొంట సాజమ్ముగా
విలసత్ జ్ఞాన సరోజనీధురసమే బల్విందుగా బొల్చు నం
చలజంటక్ భజియింతు సజ్జనమనస్సంచార పారీణమున్.

సందిటసందెడ్డై తరగజాలున కేలిక లాచు, సాజమా
గందముకల్మి నయ్యమరకాంతుని పూవులతోట పూలకున్
విందులు పెట్టి, క్రందుకొని, విచ్చిన నల్లని కల్వపూల తో
టం దులకించు నీకురు లడంచుత నాయెద చిమ్మచీకటిన్.

పైపయి నుబ్బిపారెడు భవద్వదనద్యుతి వీచి కల్గు జా
లై పెనుపొంది పెన్నెరుల పాయలపేరిటె యిర్లబందెకున్
బ్రాపగు నూత్నభాస్కర కరంబను చెందిరబొట్టుతోడి నీ
పాపటత్రోవ మా కఖిలభద్రము లిచ్చునుగాత మాతరో!

కదలే తుమ్మెదపిండునా సహజవక్రంబైన చూర్ణాలకల్
పొదువక్, గేసరకాంతి పల్వరుస సొంపుల్ నింపగా, సౌరభా
స్పదమై, పంకజశోభలన్ గలకలం బల్మారులు న్నవ్వు నీ
వదనమ్మందు స్వరారినేత్రమధుపవ్రాతమ్ము దారారెడిన్.

ఆవతంసీకృతచంద్రమశ్శకల పర్యాయంబుగా వెల్గు నీ
నవలావణ్యపరీతమైన నొసలున్ జంద్రార్ధమై తోచు, ఆ
కవ నట్టిట్టొనరించి చేర్చి కలుపంగా సౌధలేపాన, గ
న్గవవింద్రై చెలువొందు నో జనని! రాకాచంద్రమోబింబమై!

క్రీడాభిరామ పద్యంలో చరిత్రాంశాలు

శ్రీ కె. హెచ్. వి. శర్మ

“కడిమి కత్తులమ్మ నిడువాలుఁ గన్నులు
గండు మీల నడఁచు మిండగీఁడ!
దాని చన్నుదోయి ధారా సురత్రాణ
కటకకుంభి కుంభ కలహకారి”

కవిసార్వభౌముఁడగు శ్రీనాథ విరచితమని చెప్పబడు క్రీడాభిరామములోని దీ పద్యము. ఆంధ్ర వాఙ్మయమున క్రీడాభిరామమున కొక విశిష్ట స్థానము. తద్గ్రంథ పరిష్కర్తలగు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వివరించినట్లు విషముష్టి విత్తులు, నాభి, నల్లమందు, ఉల్లి, పాషాణము మున్నగు ననర్థ వస్తుసముదాయముతో సరియైన దిది. కాని ఇందు మన దేశ భాషా, సాంఘిక, చారిత్రిక విశేషములెన్నియోగలవు. కొన్ని పద్యములలో అసభ్య శృంగారము ఎక్కువగ వర్ణించబడుటచే నియ్యది శ్రీనాథ విరచిత మెంతమాత్రము కాజాలదనియు, ఆ గ్రంథమునందు పేర్కొనబడినట్లే వినుకొండ వల్లభరాయనిచే రచియించబడియుండునని కొందరి మతము. అట్టివారు గూడ శ్రీనాథుని పద్యములు కొన్నిమాత్ర మెట్టులో యిందు చేరినవనియేనని నిరూపించిరి. గ్రంథము ఆమూలాగ్రముగ శ్రీనాథుని రచనయే కానిండు, లేదా కొన్నిపద్యములు మాత్ర మాతనివి చేరినవనినను మొత్తము కవిసార్వభౌమునకు క్రీడాభిరామముతో సంబంధముగలదని అందరు అంగీకరించినదియే.

కథానాయకుడగు గోవింద మంచనశర్మ మాధవశర్మ కూఁతురగు మధుమావతినిగూర్చి తన నర్మసఖుడైన టిట్టిభ సెట్టికి దెల్పు సందర్భమున ఆ తలిరుంబోడి భూతభవద్భావి కాలముల జన్మములను, జాతులను ప్రస్ఫుటముగా నొకచొక్కపు జోగి ఆమె సౌధాట్టమున నీ క్రింది దెనుంగు పద్యమున లిఖించెనని జూపును.

“‘సీ. అలకా పురంబున నంగారవర్ముఁడన్
గంధర్వపతి కన్య కమలపాణి
యా దివ్య గంధర్వి కపరావతారంబు
మధుమావ తోర్గంటి మండలమున
నా సుందరాంగి దాక్షారామమునఁ బుట్టు
భువనమోహిని చిన్నిపోతి యనఁగ
నట్టి సత్ స్త్రీజాతి యా సానికూఁతురు
చిరకాలమున సదాశివుని గూడి
పావనంబైన తమిలేటి పరిసరమున
వేఁగి కురువాటికాదేశ విపినభూమిఁ
గోపులను పేరి చెంచుల కులమునందు
గడిమి కత్తుల యమ్మ నాఁ గలుగఁ గలదు”

ఈ పద్యము తర్వాతనే పై నుదహరించిన “కడిమి కత్తులమ్మ నిడువాలుఁగన్ను”లను పద్యమున్నది. మధుమావతీదేవి భావి కాలమున చెంచులకులమునందు గోపులను పేర కడిమి కత్తులయమ్మగా పుట్టగలదట. ఆమె నిడువాలుఁ గన్నులు గండుమీల *నడచును*; చన్నుదోయి ధారాసురత్రాణ కటకకుంభి కుంభకలహకారి యట. ధారాసురత్రాణునకు కటకకుంభిరాజులకు గల కలహకారణమును చక్కగా చమత్కరించినాడు కవి. ధారానగర సుల్తానునకు, కటకమునుండి పాలించిన గజపతులకు జరిగిన యుద్ధమునుగూర్చి ప్రస్తావించుటచే విందప్పుతమైన చరిత్రాంశము తెలియవచ్చినది.

శ్రీనాథు డాశ్రయించిన రాజమహేంద్రవరరెడ్డి రాజుల సంతమొందించినది యొడ్డెరాజగు సూర్యవంశపు కపిలేశ్వర గజపతి. తూర్పు గాంగ వంశజుఁడగు నాల్గవ భానుదేవుని సింహాసనమునుండి తొలగించి మహా బలపరాక్రమసంపన్నుడు, ఉత్సాహపూరితుఁడగు నీతడు క్రీ. శ. 1435 లో కటక సింహాసనము నాక్రమించి భ్రాతృ, పుత్ర, మిత్ర సహాయమున గంగానది మొదలు శ్రీరంగము వరకునుగల దేశమునంతయు జయించి నాటి హిందూదేశ సార్వభౌములందరిలో మేటియనిపించుకొనెను. ఈతని దిగ్విజయములన్నియు వెలిగలని, చిట్రవోలి తామ్రశాసనములలోని క్రింది శ్లోకమున నభివర్ణించబడియున్నవి.

“వీరశ్రీ కపిలేంద్ర లావక చమూధాటీషు బేరీధ్వనౌ
భారాభుగ్న భుజంగపుంగవ ఫణాస్వాక్రాంతరోదోంతరే
హంపాకంప మగాత్తదాధిక ధరాధారా చ ధారాతుర
ద్వారాకల్బెరగా విముక్త తురగా ఢిల్లీ చ భిల్లీ వృతా!”

కపిలేంద్రుని సైన్యధాటీ భేరీ ధ్వనులచే భూమ్యాకాశములు నింపివేయబడగా హంపా పట్టణము కంపమొందెను, ధారా నగరమాతురతతో మూయబడిన ద్వారములు గలదియు కల్బెరగా అశ్వ సైన్య రహితముగను, ఢిల్లీ నగరము భిల్లపు రంధ్రములతో నాక్రమించబడినవయ్యెనట. దీనినిబట్టి కపిలేశ్వరుడు హంప, ధార, కల్బెరగ, ఢిల్లీ పట్టణముల విజయము గాంచెనని తెలియుచున్నది. హంపా పట్టణము విజయనగరరాజులకు, ధారా నగరము మాళ్వదేశమునకు, కల్బెరగ బహ్మనీ సుల్తానులకు, ఢిల్లీ పట్టణము బానిస వంశజులకు వరుసగా ఆనాడు రాజధానులు. ఈ విజయములన్నియు ఆతని గోపీనాథపుర శాసనమున గూడ పేర్కొనబడినవి.

“కర్ణాటకోద్ఘాత సింహః కలబరగ జయా
మాళవ ధ్వంసలీలాజంఘాలో
గౌడః పుర్వీ ప్రభువర స్వనో
ధ్వస్త ఢిల్లీంద్ర గర్వః”

ఈ దిగ్విజయము లెప్పుడు, యెట్లు, యెంతవఱకు చేకూరెనను విషయము మాత్రము మనకు స్పష్టముగ తెలియుటలేదు. నాటి విజయనగర సామ్రాజ్యాంతర్గతమగు నెల్లూరుజిల్లా ఉదయగిరి, కర్నూలులోని శ్రీశైలము, తమిళ జిల్లాలలోని మున్నూరు, శ్రీరంగములందును, బహ్మనీ రాజ్యములోని వరంగల్లునందలి గజపతుల శాసనములనుబట్టి కపిలేశ్వరుని హంప, కల్బరిగల విజయములను కొంతవఱకు నిర్ధారణ సేయవచ్చును. ధారానగర, ఢిల్లీ పట్టణముల నాతని విజయములనుగూర్చి యింతవరకు మనకేమియు తెలియదు. శ్రీ డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్యగారు గజపతి హంవీర దేవుని చిఱ్ఱవోలి తామ్ర శాసన పరిష్కార సందర్భమున నిట్లు దెల్పిరి. “ధార : ఇది మాళవ దేశమునకు రాజధాని. కపిలేశ్వరుని కాలమున రెండవ మహమ్మదు ఖిల్జీయను నొక తురుష్క పాదుశాహ యచట రాజ్యము సేయుచుండెను; కపిలేశ్వరునికి మహమ్మదు షహాతో నే సందర్భమున నెచ్చట ఘర్షణ కలిగెనో చెప్పుటకు వీలుకాదు; కపిలేశ్వరుఁడు మాళవముపై నెత్తిపోయినట్లుగాని, మహమ్మదు కటక రాజ్యముపై నెత్తివచ్చినట్లుగాని తెల్పు నిదర్శనములేవియుఁ గానరావు. కాని యీ సందర్భమునఁ జింతించఁదగిన విషయమొకటి కలదు. ఒండొరులపై వారికి ద్వేషము లేకున్నను ఆశ్రితుల కొరకు అన్య రాష్ట్రములయందుఁ బోరియుండవచ్చును. ఇట్టి పోరాటమునకేమేనియు నవకాశముగలిగియుండెనేమో విచారించవలయును. ఫెరిష్టా మొదలగు మహమ్మదీయ చరిత్రకారులు బహమనీ సుల్తాను రెండవ అల్లాఉద్దీను చరిత్రను వర్ణించుచు మాళవ సుల్తానగు మహమ్మదుతో నతఁడొనర్చిన యుద్ధమునుగూర్చి యిట్లువ్రాసియున్నారు : బహమనీసుల్తాను క్రింది యమీరులు జలాల్‌ఖాన్ బుఖారియు, నతని పుత్రుఁడగు సికందరు ఖానుడును దమ ప్రభువుపైఁ గలుషించి యతని అధికారమును గూలఁద్రోయనెంచి ధారాసుల్తానగు మహమ్మదు షహను బహమనీ రాజ్యాంతర్గతములైన బీరారు, తెలింగాణా దేశములపై నెత్తిరమ్మని ప్రేరేపించిరి. రాజ్యకాంక్షచే మహమ్మదు సైన్య సమేతుడై వచ్చి మాహూరముపై దిగి ముట్టడి వేసెను. అంతట బహమనీసుల్తాను భీకర సైన్యము మాహూరికి రాఁగా మహమ్మదు భయచేతస్కుఁడై పాఱిపోయెను. మహమ్మదీయ చరిత్రకారులీ విజయముగొనిన కీర్తియంతయు నల్లావుద్దీనుకే అంటగట్టినను నతఁ డన్య సహాయమపేక్షించక మాళవసుల్తాను నెదుర్కొన దలపెట్టలేదు. రేచర్ల లింగనాయఁడు సికందరుఖానుని జయించి యల్లాఉద్దీన్ సుల్తానుని యధికారమును దెలింగాణమున నిల్పినట్లు వెలుగోటివారి వంశావళియందు వచింపఁబడియున్నది. అట్లే కపిలేశ్వరుడుఁను నల్లాఉద్దీనునకు బాసటయై మాళవ సుల్తానుని మాహూరినుండి తరిమివేయుటకుఁ దోడ్పడి యుండవచ్చును. ఈ యూహ రెండు విషయములపై నాధారపడియున్నది : 1. కపిలేశ్వరునికిని బహమనీ సుల్తానుతో సఖ్యము గలదని గంగాదాస ప్రతాపమువలనఁ దెలియుచున్నది. 2. కపిలేశ్వరుడు జయించిన పట్టణములలో మాహూర మొకటియైన ట్లొక చాటువునందుఁ జెప్పియున్నది :

సీ. “కటకంబులోపలి గజవాడ బెజవాడ
యొద్ది బందారిల్లు యోరుగల్లు
తోటకూరంగళ్ళు తొండమార యగుళ్ళు
సెరటి బచ్చలికోట బెడదకోట
వీరపుంగవులకు వేటలు, మాడెలు
మణికి విహారంబు మాహూరంబు
గజయూధములు గట్టు కంబాలు కంబాలు
పట్టణంబు గురాలపల్లె ఢిల్లి
గీ. ఇట్టి గజరాజ శౌర్యంబు లెన్నిచూడ
కొలఁది మీరిన దేవరకొండ కొండ
నీదు కోర్కంటి సింహంబు నిఖిల బిరుదు
దిశలములు జూపు దామెర లిమ్మభూప!”

డాక్టర్ రాయప్రోలు సుబ్రహ్మణ్యముగారు తమ ఒరిస్సా సూర్యవంశపు గజపతుల చరిత్రమున పై డాక్టర్ వెంకటరమణయ్యగారి యూహ సరియైనది కాదనియు, గంగాదాసప్రతాపవిలాసమున గజపతి, హయపతు లిఱువురు నొక్కమారు విజయనగర సామ్రాజ్యమును ముట్టడించిరనియే గలదుకాని వారిరువురకును మైత్రి యుండెనని లేదనియు, పై చాటుపద్యములోని మాహూరము, బెడదకోట, ఓరుగల్లు మున్నగునవి కపిలేశ్వరుడు బహమనీసుల్తానుల శత్రువుగనే సాధించియుండుననియు, ఇక వెలిగలని చిఱ్ఱవోలి తామ్ర శాసనములలోని పై శ్లోకము కేవల మతిశయోక్తులతో గూడినది మాత్రమేగాన అందలి “ధారా చ ధారాతురద్వారా” యనుటనుబట్టి ఆ నగరాధిపతి కపిలేంద్రుని దండయాత్రా ఘోష విని భయపడియుండెననునంత మాత్రమున వాస్తవముగ ధారాసుల్తానుకు, గజపతి కపిలేశ్వరునకు యుద్ధము జరిగినట్లు తలంచనక్కరలేదనియు నందులకు తగిన శాసన వాఙ్మయాధారము లంతగా లేవని తెల్పిరి.

క్రీడాభిరామములోని “ధారా సురత్రాణ కటక కుంభి కుంభ కలహకారి” అను పద్య పాదమునుబట్టి ధారానగర సురత్రాణునకు, కటక కుంభిరాజునకు పోరు జరిగెననుట నిశ్చయము. క్రీ. శ. 1464 నాటికి గోపినాథపుర శాసనములోని “మాలవ ధ్వంసలీలాజంఘాలో” “కృత్వా సంయతి మాలవేంద్ర జయనం” అనువానినిబట్టిగూడ మాళవదేశాధీశ్వరుడగు ధారాసుల్తానునకు కపిలేశ్వరునితో యుద్ధము సంభవించెననియు,నందు గజపతి కపిలేశ్వరుడే విజయము గాంచెనని యుస్పష్టమగుచున్నది. ఇక వెలిగలని, చిఱ్ఱవోలి తామ్ర శాసనము

లతో ''ధారాతురద్వార'' యనుటచే కపిలేశ్వరుడే తన సైన్యములతో ధారానగరముపై దండెత్తిపోయినట్లు తలంప వీలున్నది. విజయనగర, బహ్మనీదేశాధీశులను జయించిన తదనంతరము కపిలేశ్వరుడు మాళవదేశ రాజధానియగు ధారా నగరముపై కూడ దండెత్తి ఆ సుల్తాను నోడించియుండును.

క్రీడాభిరామములోని పద్యమునుబట్టి ధారాసురత్రాణ, గజపతి కపిలేశ్వరులకు జరిగిన యుద్ధము స్త్రీమూలకమనునట్లు ధ్వనించుచున్నది. ధారా నగరముపై దండెత్తుటకు కపిలేశ్వరుని కెద్దియైన కారణము గావలెను గనుక ఏదో స్త్రీ విషయమగు చిన్న కారణము నొకదానిని కల్పించి యుండును. ఈ సందర్భమున నిజామ్‌ఉద్దీన్ అహ్మద్ బక్షీ, ఫెరిస్టా మున్నగు ముస్లిమ్ చరిత్రకారులు వ్రాసిన విజయనగర మొదటి దేవరాయలకు, బహ్మనీసుల్తాను ఫిరూజ్ షాహ్‌కును జరిగిన యుద్ధములలో నొక్కటి కేవలము ముధోల్ నగరమందలి సుందరయువతి మూలమున జరిగెనను విషయము జ్ఞప్తికి వచ్చును. నిజమున కిట్టి కారణములు బలవంతునకేదో మిషతో కయ్యమునకు కాలు దువ్వుట వంటివి.

ఈ చరిత్రాంశములు క్రీడాభిరామ కర్తృత్వ కాలములను నిరూపించుటకు మిక్కిలి తోడ్పడును. క్రీ. శ. 1458 నాటి గజపతి కపిలేశ్వరుని వెలిగలని తామ్రశాసనములో మొట్టమొదటిసారి ఈ యుద్ధ ప్రస్తావన గలదు. కావున ఆ తేదిముందర కపిలేశ్వరుడు మాళవ దేశాధీశ్వరుని జయించి యుండవలెను. మెకంజిదొరగారి మాన్యుస్క్రిప్ట్సులోని ఈ క్రింది శ్లోకమునుబట్టి క్రీ. శ. 1448 నాటికి కపిలేశ్వరుడు రెడ్డి రాజ్యమును కబళించి పశ్చిమ గోదావరిజిల్లా పెనుగొండ ప్రాంతమును పాలించుచుండినట్లు తొలిసారి తెలియుచున్నది.

''శాకాబ్దే గగనాద్రిరామ ధరణీ సంఖ్యా సమాపూరితే
విభవాబ్దేచ తపస్యమాసి శశినోవారే ద్వితీయం తిథౌ
పెన్గొండాఖ్య పురోత్తమం గజపతి క్షోణీశ సందీపితం''

వీనినిబట్టి క్రీ. శ. 1448 తర్వాతను వెలిగలని తామ్రశాసన కాలమునకు పూర్వము క్రీ. శ. 1455 ప్రాంతమున కపిలేశ్వరుడు ధారానగరాధిపతి నోడించి యుండవలెను. ఉపలబ్ధమైన చారిత్రికాధారములనుబట్టి ధారానగర సుల్తానులకు కటక కుంభిరాజులకు నొక్క కపిలేశ్వరుని కాలమున మాత్రమే యుద్ధము సంభవించినట్లు దెలియుచున్నది. ఈ యుద్ధ ప్రస్తావన క్రీడాభిరామమున పేర్కొనబడియుండుటచే ఆ గ్రంథము క్రీ. శ. 1455 తర్వాత రచియించబడెననుట నిశ్చయము. కవి చరిత్రకారులగు శ్రీ చాగంటి శేషయ్యగారు తమ ఆంధ్ర కవితరంగిణిలో క్రీడాభిరామ కాలమునుగూర్చి ''క్రీ. శ. 1435 నాటికి శ్రీనాథుడును వల్లభరాయలును వయసు చెల్లినవారుగా నున్నారు. ఆ కాలమున నిట్టి శృంగార కావ్యరచనాసక్తులైరని యనుటకంటె శ్రీ వీరేశలింగము పంతులుగారనినట్లు క్రీ. శ. 1420 ప్రాంతమున నీ కావ్యము రచితమైనదని తలంచుటయే సమంజసమని నా యభిప్రాయము''ని వచించిరి. క్రీ. శ. 1420 ప్రాంతమున గజపతు లెవ్వరు కటక సింహాసనమున లేరు; మరియు గజపతి కపిలేశ్వరుడు క్రీ. శ. 1435 నాటికి మొట్టమొదటిసారి కటక సింహాసనము నధిష్ఠించెను. క్రీ. శ. 1445 ప్రాంతమున నాతడాంధ్రదేశమున నడుగిడలేదు. క్రీడాభిరామము నందలి పై పద్యమునుబట్టి నేను వివరించిన చరిత్రాంశములు సరియగుచో నది క్రీ. శ. 1455 నకు పూర్వము రచియింపబడిన దనుట కెంతమాత్రము వీలుకాదు. అట్లే శ్రీ శేషయ్యగారు శ్రీనాథుని కాలమునుగూర్చి ''ఈ కవి వతంసుడు క్రీ. శ. 1445 ప్రాంతమునందు స్వర్గము నలంకరించెనని నా యభిప్రాయము. శ్రీ ప్రభాకరశాస్త్రులుగారు శ్రీనాథుడు 1475వరకు నుండెనని వ్రాసిరి. కాని యందుల కాధారములు నాకు లభింపలేదు. ఆ మహాకవి యప్పటివఱకు జీవించి యుండినచో నాతని వాణి యంతకాల మూరక యుండదు. అట్టి నిదర్శనము లేవియు లేవ''ని దెల్పిరి. క్రీడాభిరామకర్త శ్రీనాథుడే యయినను, లేదా ఆ గ్రంథముతో నాతని కెట్టి సంబంధముండిన దనుకొనినను కవిసార్వభౌముడు క్రీ. శ. 1455 తర్వాతను గూడ జీవించి యుండెననుటకు పై చరిత్రాంశములే చక్కని నిదర్శనములని మనవి చేయుచున్నాను. మరియు ''కాశికా విశ్వేశు గలిసె వీరారెడ్డి' —యను శ్రీనాథుని సీసపద్యమునుబట్టి బ్రహ్మశ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు అందు పేర్కొనబడిన వీరభద్రారెడ్డి, పంట మైలారుడు, తెలుంగురాయడు, విస్సనమంత్రి, భాస్కరుల కాల నిర్ణయము చక్కగాచేసి శ్రీనాథుడు ఆంధ్రదేశమున గజపతుల పరిపాలనారంభమున బహుశః క్రీ. శ. 1454 ప్రాంతమువరకు జీవించియుండెనని కూడ దెల్పియున్నారు.

తెలుగు కవులందఱిలో శ్రీనాథునకు సాంఘిక, చారిత్రక విషయములను తన పద్యములలో ప్రతిబింబించునట్లు చేయు పాటవము మిక్కుటముగ గలదు. కావుననే ఆతని రచనల నాధారముగ పండితులు రెడ్డిరాజుల చరిత్ర, నాటి ఆంధ్రుల చరిత్రములను రచియించుటకు చక్కటి యవకాశము గల్గినది. పైన వివరించిన చరిత్రాంశములనుబట్టి గూడ క్రీడాభిరామకర్త శ్రీనాథుడే యని చెప్పుటకు కొంత వరకు వీలున్నది.

పరాజితుడు

శ్రీ జి. రామకృష్ణ

పోలయ్య ఆరోజు చేయవలసిన పని అయిపోయింది. కూలీడబ్బులు రూపాయి పావలా సంపాదించాడు. అదే అతనికి పెద్దమొత్తంగా తోచింది. రూపాయి నోటును అటూ యిటూ తిప్పి చూశాడు. మనస్సు సంతోషంతో తబ్బిబ్బు అయింది. పావలాబిళ్ళ అరచేతిలో మెరుస్తోంది. దాన్ని చూసి పోలయ్య మురిసిపోయాడు.

రేపటి గురించి అతనికి ఆలోచనే లేదు. కూలీ దొరకదన్న చింతలేదు.

పొలంనుంచి పంటధాన్యం లోలుకొస్తున్న రైతుమాదిరి పోలయ్య యింటికి బయలుదేరాడు రూపాయి పావలాతో. అతని నడకలో ఠీవి పుట్టిపడుతోంది, ముఖంలో తృప్తి నిండి వుంది. కొంతదూరం వచ్చాక చొక్కాజేబు తడిమి చూచుకున్నాడు. నోటూ, బిళ్ళా భద్రంగా వున్నాయి గూట్లో పక్షి పిల్లల్లాగా.

చకచకా ముందుకు అడుగులు సాగుతున్న పోలయ్య వున్నట్టుండి నడకజోరు తగ్గించాడు. వింత వాసన ఏదో అతణ్ణి ఆవరించి లోబరుచుకుంది. కమ్మటి వాసనలు విరజిమ్మే తోటగా తోచింది ఆ ప్రదేశం. అది పోలయ్యకు పరిచితమైన వాసనే. దాని తియ్యదనం, కమ్మదనం అతనిణ్ణి ఆకర్షించాయి. ఇలాంటి పరిస్థితి పోలయ్యకు తరచు ఎదురవుతూనే వుంటుంది. కొన్నిసార్లు నిగ్రహం చూపగలుగుతాడు, కోరికను జయించి ఆ ప్రదేశందాటి దూసుకుపోగలుగుతాడు. కానీ తరచు ఆ కోరికకు దాసుడైపోతాడు.

ఆనాడు పోలయ్య కల్లుఅంగడిని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయాడు. రోడ్డుప్రక్కగా నిలబడి కోరికతో పోరాటం ప్రారంభించాడు. తానే జయంపొందినట్టు భ్రమించి కాలు ముందుకు వేయబోయాడు. కోరిక రెండు కాళ్ళనూ గట్టిగా పెనవేసుకుంది. శక్తి అంతా కూడగట్టుకుని నిగ్రహాన్ని వుసికొలిపాడు కోరికను లాగిపారేయమని. లాభంలేకపోయింది. నిగ్రహం చిత్తుగా ఓడిపోయి పోలయ్యవంక జాలిగా చూసింది. కోరిక విజయగర్వంతో జేబులోని రూపాయి పావలావైపు తొంగిచూసి పకపకా నవ్వింది.

తీర్పు చెప్పేసి నిష్క్రమించే న్యాయాధిపతి హుందాతో పోలయ్య కల్లు అంగడివైపు దారి తీశాడు. అప్పటికే అక్కడ కోలాహలంగా ఉంది. ముంతలు గబగబా ఖాళీ అవుతున్నాయి. రకరకాల తినుబండారా లమ్మేవాళ్ళు తమ బేరం జోరుగా సాగుతున్నందుకు సంతోషిస్తున్నారు.

పోలయ్య ముంతనిండా కల్లు పోయించుకున్నాడు. పాల సముద్రం చిలికి సంపాదించిన అమృతభాండంలా తోచింది ఆ ముంత పోలయ్యకి. కల్లుకుతోడు తినడానికి ఏవైనా వుంటే గాని పసందుగా వుండదు. పైగా పోలయ్యకి ఆకలిగా కూడా వుంది. మామూలు పదార్థాలు ఆ ముంతదగ్గర అంతగా రాణించవు. నాలిక చురుక్కుమని నషాళంవరకు ఘాటు అంటేనే దాని సాటికి ఆగుతాయి. అందుకుని పచ్చిమెరపకాయ బజ్జీలు ఒక అరడజను తీసుకున్నాడు. ప్రక్కగా జంగెట్లో 'ముక్కలు' అమ్ముతోంది ఒక అవ్వ. మధ్య మధ్య నంజుకోవడానికి వాటిని మించినవి లేవు. ఆవి నాలుగు కొన్నాడు. బీడీకట్టకూడా కొన్నాడు.

అన్నీ తీసుకుని ఒక ప్రక్కగా కూర్చున్నాడు. ముంత ఐదు నిమిషాలలో ఖాళీ అయిపోయింది. అటూ యిటూ చూశాడు. మసగ మసగగా వుంది. ముంత వంక చూశాడు. లోపల కల్లు లేదు. నెమ్మదిగా లేచి వెళ్ళి మరోముంత పోయించుకున్నాడు.

ఇది గబగబా త్రాగలేకపోతున్నాడు. బీడీపైన బీడీ కాలుస్తున్నాడు. ఎంతో హాయిగావుంది. ఏమీ తెలియడంలేదు. ఎలాగయితేనేం ముంత ఖాళీ అయిపోయింది. బజ్జీలు, 'ముక్కలు'కూడా అయిపోయాయి. ఆ సంగతి పోలయ్యకి బాగా తెలియదు.

ఆ కల్లు అంగడి అతనికి ఇంద్రసభ మాదిరిగా కనిపిస్తోంది. ఇంద్రసభ ఎలా వుంటుందో ఒకసారి సినిమాలో చూశాడు, అవన్నీ తెలియకుండానే తలుపుకొస్తున్నాయి.

రుచి, మైకం, సంతోషం ఈ మూడింటిలో మునిగి తేలుతున్నాడు. మనిషి తేలికబడుతున్నట్టు అనిపిస్తోంది. కనురెప్పలు బరువెక్కుతున్నాయి.

ఎత్తుపీటమీద కూర్చుని కల్లు అమ్ముతున్న ఆసామీ పోలయ్య కళ్ళకు దేవేంద్రుడులా వున్నాడు. తూలుతూ పోతున్న ఆడవాళ్ళని చూసి అప్సరసలు నాట్యం చేస్తున్నారనుకున్నాడు. బిచ్చగాళ్ళు చేసే రణగొణ ధ్వనులు దేవతలు మ్రోయించే దుందు

ఖులుగా తోచాయి. అక్కడక్కడ జనం చతికిలపడిపోయి మైకంలో తీసే లల్లాయి పదాలు గంధర్వులగానం అని అనుకున్నాడు.

పోలయ్య స్వర్గసుఖం అనుభవిస్తున్నాడు. కళ్ళుమూసుకుపోయాయి. అతికష్టంమీద కళ్ళు తెరవగలుగుతున్నాడు.

కొంతసేపు ఆ మగతలో సర్వం మరిచి కూర్చుండిపోయాడు ఆ యోగముద్రలో తాపసి మాదిరి.

మరికొంతసేపటికి కష్టపడి లేచి నిలబడ్డాడు. దూరంగా వెలుగుతున్న దీపాలు తారామండలంగా తోచాయి. మైకం యింకా దిగలేదు. కాళ్ళు తడబడుతున్నాయి. తూలుతూ క్రింద పడబోతూ, నిలద్రొక్కుకుంటూ అడ్డదిడ్డంగా నడుస్తూ వంతెన దగ్గరికి వచ్చాడు. వంతెన అంగడికి యిరవైగజాల దూరంలోనే వుంది.

తూలుతూపోయి అక్కడ నుంచున్న ఒకాయనమీద పడ్డాడు. ఆయన పోలయ్య అవస్థ చూసి నెమ్మదిగా అతన్ని నెట్టాడు. పోలయ్య క్రింద కూలబడ్డాడు.

మైకం సాంతం తగ్గకపోయినా యింటికి వెళ్ళాలన్న తలపు కలిగింది అతనికి తెలియకుండానే.

అర్థంలేని మాటలు ఏవో వాగుతున్నాడు. కనిపించిన ప్రతి రిక్షావాడితో ఏదో సోది చెప్పుతున్నాడు మాటలు సగం మింగేస్తూ.

పోలయ్యవాలకం చూసి రిక్షావాళ్లెవరూ అంగీకరించడం లేదు.

జేబులు తడిమి చూసుకున్నాడు. లోపల మిగిలిన పావలా బయటికితీసి పావలా యిస్తాను కిరాయి కట్టమంటున్నాడు. కాని ఎక్కడికి తీసుకుపోవాలో తెలియక ఎవరూ రావడంలేదు.

పది నిమిషాలనుంచీ యీ తతంగం అంతా గమనిస్తున్న ఒక రిక్షావాడు, తక్కిన రిక్షావాళ్ళను నెట్టుకుంటూ ముందుకొచ్చి నే తీసుకెళ్తా రమ్మన్నాడు. పోలయ్యను చేయి పట్టుకుని రిక్షాదగ్గరికి తీసుకెళ్ళాడు. మూటను పెట్టినట్లు అమాంతంగా పోలయ్యను రెండుచేతుల్తో ఎత్తి రిక్షాలో కూర్చోపెట్టాడు.

ఇది చూస్తున్న తక్కిన రిక్షావాళ్ళు అతని వింత ప్రవర్తనకి ఆశ్చర్యపోతున్నారు.

రిక్షా రంయిమని సాగిపోయింది.

పోలయ్య రిక్షాలో వాలిపోయి ఏదో మాట్లాడుతున్నాడు. రిక్షావాడు అదేమీ వినిపించుకోవటంలేదు.

రిక్షా అతివేగంగా పోతోంది.

పోలయ్య తన యింటినిగురించి చెబుతున్నాడు వినిపించీ వినపించని మాటలతో.

రిక్షావాడు ఆ మాటలు లక్ష్యపెట్టటంలేదు. పోలయ్య వుండే పాక రాగానే రిక్షావాడు అతణ్ణి ఎత్తుకుని దింపి, పాక ముందు కూర్చోబెట్టాడు కుదేసినట్టు.

జేబులోనుంచి పావలాతీసి రిక్షావాడి చేతిలో పెట్టాడు పోలయ్య.

రిక్షావాడు ఆ పావలావంక చూశాడు. అతని కళ్ళు అప్పటికే నీళ్ళతో నిండిపోయాయి. అది సరిగా కన్పించలేదు కూడా.

లోపల యిందాకటినుంచి అణచిపెట్టిన ఆవేశం పట్టు తప్పి పెల్లుబికింది. ఆ పావలాబిళ్ళను కసితో పోలయ్య ముఖానికేసి కొట్టాడు. అది పోలయ్యనుదురుమీద తగిలింది.

ఆ దెబ్బకు పోలయ్య అబ్బా! అని కేక పెట్టాడు.

లోపలనుంచి పోలయ్య భార్య గబగబా వచ్చింది కేక విని. భర్త త్రాగివచ్చి చేసే గొడవ ఆమెకు అలవాటే. భర్తను చూసింది.

అప్పటికే రిక్షావాడు వెనక్కు తిరిగి వెళ్ళిపోబోతున్నాడు.

పోలయ్య భార్య అతణ్ణిచూసి ''నువ్వా రంగన్నా! అయ్యను తీసుకొచ్చింది. లోపలికి రాకుండా చక్కా పోతుండావేరా నాయనా?'' అని ఖంగారుగా అడిగింది కొడుకుని.

రంగన్న కళ్లవెంట నీళ్ళు జలజలా కారుతున్నాయి. గొంతు మూగవోయింది.

కళ్ళు తన చింకి చొక్కాతో తుడుచుకుని రిక్షా త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు బస్తీ వైపు, రిక్షా యింకా రెండుగంటలు తనవద్ద వుంచుకోవచ్చు కాబట్టి!

కాదంబరి వర్ణనా వైదగ్ధి

శ్రీ యస్వీ జోగారావు

వర్ణన యనగా నొక వస్తువుయొక్క స్వరూప స్వభావాలను నిరూపించునట్లు చెప్పుట. లోకములోని వస్తు వైవిధ్యమును బట్టి జీవితములో నెంత భావ వైవిధ్య మేర్పడుచున్నదో అట్లే కావ్యములలో కథా వైవిధ్యమును బట్టి యంత వర్ణనా వైవిధ్య మేర్పడుచున్నది. అష్టాదశ వర్ణనాత్మత నొక మహాకావ్య ముఖ్య లక్షణముగా చెప్పినారు మన ప్రాచీనాలంకారికులు. కొందరష్టాదశాధిక పరిగణనమును జేసిరి. మహాకావ్య మనగా అది మానవజీవితము నావరించుకొని యుండవలె నని వారి యాశయముగా దోచును. ఆ వెనుకటి వ్యవస్థలో మానవజీవితము నావరించుకొనియున్న వస్తు సంచయములో నేని ముఖ్యమనుకొనిరో వారు, వాని పట్టిక నొకటి ప్రసాదించినారు. అయితే వానినే తప్ప వస్త్వంతరమును వర్ణింప గూడదనుట వారి మతము గాదు. వాని నన్నిటిని విధిగా వర్ణించి తీరవలె ననుటయు సహృదయ సమ్మతము గాబోదు. ఒక్కొక్క కథయొక్క సంగతి సందర్భములనుబట్టి వాని తీరు మారుచుండును. మారవలెను. వర్ణన యన్నది కథయొక్క పరిస్థితి కొక ప్రతీక. దృశ్యకావ్య ధర్మమునుండి శ్రవ్యకావ్య ధర్మమును పృథక్కరించు ప్రధాన లక్షణములలో నిది యొక్కటి. దృశ్యకావ్యమున పాత్రం చర్య మూలమునను వివిధవస్తు సాక్షాత్కృతివలనను కథాస్వభావ మావిష్కృత మగును. అట కవిపాత్ర నేపథ్యమున నుండిపోవును. కథాగత పాత్రల ప్రత్యక్ష ప్రవృత్తివల్లనే రంగమున కథ రక్తికట్టవలసి యుండును. అట విపులవర్ణనల కవకాశము లేదు. శ్రవ్యకావ్యములందు కథ పాత్రముఖముననే ప్రవర్తితము కానవసరములేదు. కవికి రాసుగా వర్ణనలు చేయు నవకాశము కావలసినంత. అస లవసరమును గలదు. ఇందు రంగప్రసాధనాదిక దర్శనయోగ్యత పఠితకు ప్రత్యక్షముగా లేదు కావున శబ్దమునే సర్వ పరికరముగా గ్రహించి కవి పఠితకు కథాపరిస్థితి నంతటిని మనోగోచరము చేయవలసి యున్నది. అందులకే శ్రవ్యకావ్యములు వర్ణనా ప్రచురములుగ నుండును.

వర్ణనా వైదగ్ధ్య ప్రదర్శనము బాణకవుల యూహాశాలితకు, లోకజ్ఞతకు నొక శాణోపలరేఖ. ఆ విషయమున భారతీయ వాఙ్మయమున కోటికి పడగెత్తిన కావ్యము కాదంబరి. అది వివిధ వర్ణనల కొక నిధి, నిక్షేపము. అదియొక వర్ణనా మహార్ణవము. 'బాణోచ్ఛిష్టం జగత్సర్వ' మ్మను ఆభాణక ప్రావిర్భావమున కొక ప్రధాన కారణ మీ వర్ణన. బహుముఖ ప్రజ్ఞాశాలియైన బాణుని భావనాపరిధిలోనికి రాని రాజాలని విషయములు లేవు. ఆ విషయవిన్యాసమున అతని లేఖిని పోజాలని పోకడ లేదు. కవి సమయములు, ప్రాక్తన గాథలు, అర్థాలంకారములు, శబ్ద చిత్రములు, శైలీ విలాసములు, ధ్వనులు చమత్కారములు ఒకటేమిటి అనేక యోగ్యతల కది కాణాచి. వైచిత్రి, వైవిధ్యము వాని ప్రదర్శనమున అతిమాత్ర వైదగ్ధ్యము బాణభారతికి జీవలక్షణములు. ఆ వర్ణనల పట్టున బాణ లేఖిని నెరపిన వర్ణ విన్యాస వాణీ విలసన మా కవి చతురాస్యతను నిరూపించుచున్నది. అందుచేతనే అవి సుదీర్ఘములయ్యు సుందరములు. విసువుగొల్పక అడుగడుగున క్రొంజవు లెసలార్చును.

ప్రకృత మా మహాకావ్యమునం దతి ప్రత్యేకములైన వర్ణన లందలి కతిపయ చతుర చమత్కార విశేషముల నించుక సమీక్షింతును.

శూద్రకరాజ ప్రశంసతో కాదంబరి కథారంభము. పిదప రాజధాని విదిశానగర వర్ణన. తదుపరి రాజ సభావర్ణనము. రాజు, మంత్రి, రాజ్ఞి, రాజధాని, రాజసభ, అంతఃపురము, రాచవారి స్నానశాల, హిమగృహము (Air conditoned apartment) మొదలగు రాజ సంబంధి విషయము లనేకము గతించిన మహారాజుల గాథలు రూపు గైకొని వచ్చినట్లు వర్ణింపబడినవి. మహామహా రాజాస్థాన విహారభోగము లందిన మహాభాగుడు భట్టబాణుడు. అట్లని రాజపురుషులనే కాదు ఋషిప్రవరులను, రాజ్ఞినే కాదు దాసిని, చండాల కన్యను, రాజాంతఃపురములనే కాదు సూతికాగృహమును, కాంతారాంతర భయంకర దుర్గాలయమును, ఉద్యానమునే కాదు తపోవనమును, తపోవనమునే కాదు కుట్ర నట్టడవి పట్టులను అరణ్యమందలి సరోవరమును, ఆ చెఱువుగట్టుమీది చెట్టును, చెట్టులోని తొఱ్ఱను, తొఱ్ఱలోని పిట్టను గూడ సమానమైన నైపుణితో వర్ణింపక మానలేదు.

పురవర్ణన

సర్వసాధారణముగ పురవర్ణనతో కథారంభ మగుట కావ్య పరిపాటి. అది కవుల కలాల కటారి సాములకు గరిడిసాల వంటిది. ఇందలి పురవర్ణనలలో మొదటిది విదిశావర్ణనము. కాని తద్వర్ణన మం దొక ప్రత్యేకత యేమియు లేదు. ప్రధానమైనది కథానాయకుని రాజధాని ఉజ్జయిని కాని విదిశ కాదు. విదిశయొక్క అప్రధానతను సూచించుటకే కాబోలు కవి యిందు కావ్యపరిపాటికి విలక్షణముగ రాజవర్ణనము ముందు చేసినాడు. ఉజ్జయినీపురవర్ణన చతురసమాస తోరణ

ములతో వివిధాలంకారరంగవల్లికంతో మనోహరముగా తీర్చినాడు. కొన్ని యేండ్లకు విద్యాభ్యాసానంతరము చంద్రాపీడుడు పురప్రవేశము చేయు సందర్భమున—'సర్వతశ్చ సముపావృత కవాటపుటప్రకటవాతాయనసహస్రతయా చంద్రాపీడదర్శన కుతూహలా ప్నగర మపి సమున్మీలితలోచన నివహ మివాభవత్'—అనగా ఆ సమయమున వేలకొలది తెరచుకొన్న కిటికీలతో ఆ నగరమే చంద్రాపీడ దర్శన కౌతూహలదోహలమై కనువిప్పినదా యున్నట్లున్నదట! అప్పుడు ప్రాసాదములన్నియు నారీమయములుగా నున్నవట. అంత "కౌతుక ప్రసారిత నిశ్చలలోచనానాంచ పశ్యంతీనాం తాసా మాదర్శ మయానీవ సలిలమయానీవ స్ఫటికమయానీవ హృదయాని వివేశ చంద్రాపీడాకృతిః"—అట్లు కౌతుకముతో నిశ్చలలోచనలై చూచుచున్న ఆ యువతి హృదయములలో చంద్రాపీడాకృతి ప్రవేశించినదట. అవి అద్దములు, జలములు, స్ఫటికములు అనగా వారి హృదయము లంతటి అచ్ఛము లనియు, స్వభావతః రమణీయ రూపాకర్షణ రసికము లనియు, చంద్రాపీడుడు చాల అందగాడనియు, ఆ ఆదర్శాదులందు వస్తు ప్రతిఫలన మెంత సహజమో ఎంత సుగమమో అంత అవలీలగా అతని యాకృతి వారి హృదయములందు ప్రవేశించినదనియు భావము. పై వాక్య మా సన్నివేశమునకు భరతవాక్యము. ఆ వర్ణన కదియొక మకుటమువలె నున్నది. ఆ సమాసముతోడి యెత్తుగడతో పొత్తు గలిసిన 'ఆదర్శమయానీవ, సలిలమయానీవ, స్ఫటిక మయానీవ' అను సమాసశకలములు శయ్యకొక యొయ్యారపు హొయలు నీయగా చంద్రాపీడుడు సవిలాసముగా నొక్కొక్క మెట్టు నెక్కి చట్టున మేడలో ప్రవేశించినట్లున్నది.

రా జ స భ

తారాపీడుని రాజసభా వైభవమును, అక్కడ సమావిష్టమైన రాజకులమును వర్ణించుపట్టున దానిని ఉత్కృష్ట కవిగద్యము, నాటకము, పురాణము, కావ్యము, వ్యాకరణము, మహాభారతము, నరవాహనదత్తచరితము మొదలగు వాఙ్మయోపమానములతో సరిపోల్చుట విశేషము. ఆ సరిపోల్చుటలో అడుగడుగున సాధింపబడిన శ్లేషానుప్రాణితధ్వనిచమత్కారము లతిసరసములు. అందొకటి రెండు: ఆ రాజకులము 'ఉత్కృష్ట కవి గద్యము' వలె 'వివిధవర్ణశ్రేణీ ప్రతిపాద్యమానానేకాభినవార్థసంచయ' ముగ నున్నదట. రంగురంగులవలన దోచు రకరకములైన వస్తువాహనాదికము గలదని రాజకుల పరమైన యర్థము. వివిధాక్షర విన్యాసమువలన వివిధ నవార్థ బహుళ ముత్కృష్ట గద్యమని యసలర్థము. కాదంబరి అచ్చముగా నట్టిదే కదా. మరియు ఆ రాజకులము 'ప్రథమ వేశ్యా సమాగమ మి వావిదిత హృదయాభిప్రాయచేష్టా వికార' మట. సభలలో సభ్యవ్యక్తుల ప్రవర్తన అట్లే యుండును గదా. అదియొకమర్యాద. వగ లొలుకబోయు వెలవెలది తొలి కూటమిలో ఆమె అభిప్రాయపు వాట మవిదితమేగదా. అదియొక మనస్తత్త్వ సత్యము.

అం తః పు ర ము

'శృంగార మయ మివ, సౌందర్య మయమివ, సురతాధిదైవత మయమివ, కుసుమశర మయమివ, కుతూహల మయమివ, ఆశ్చర్య మయమివ, సౌకుమార్యమయమివ, ప్రేమ మయమివ కుమారః కుమారీపురాభ్యంతరం దదర్శ'—చంద్రాపీడుడు చిత్రతరమాంతఃపురమును కాదు కాదు కాదంబరీమందిరమును సందర్శించినాడు. ఏవేవో విశేషము లనేకము చెప్పియు తనివిసనక కవి దాని సౌభాగ్య సామస్త్యమును వివిధ సుందర వస్తు సందోహైకత్ర సన్నివేశప్రభావమును పురస్కరించుకొని నిరూపించుటకు ప్రయత్నించెను. ఆ పదపదార్థ క్రమవిన్యాసమున ఆ సౌభాగ్య వర్ణన కొక ఆత్యంతికతాస్ఫూర్తి కల్గినది. అక్కడ మరియొక మెలకువను ప్రదర్శించినాడు కవి. అట కన్యకా జన కపోలతలావలోకనమే ముఖప్రక్షాళన మట! ఆ యువతుల దేహముల నావరించుకొనియున్న లావణ్యప్రభలే వారికి మేలి ముసుగులట! ఆ సుకుమార భావ చరిత్రము సుదూరము సాగినది. కన్యాంతఃపుర వర్ణనా వ్యాజమున నది యొక యొప్పు. ఒప్పా యొప్పున్నర! అక్కడ చకచకలాడుచు తిరుగు అంతఃపుర పరిచారికల సరసాలాపములు, సందడి సమ్వ్యగ్వర్ణితములు. 'మిథ్యా మౌగ్ధ్యము ప్రకటిస్తున్నావు—ఎవరి నభిసరిద్దా మనుకుంటున్నా వేమిటి ?'—ఇట్టివి వారి సల్లాపములు.

వ న వ ర్ణ న

చెట్లు చేమలు జంతుజాలముల పేర్ల పట్టిక లేకరువు పెట్టగల కవు లందరికి సరి సుకరమైన దీ వర్ణన. కాని అంత మాత్రమున సంతుష్టులుగారు విదగ్ధకవులు. ఆ జంతువృక్ష సన్నివేశమున ప్రధానితమైన వనప్రకృతి వైచిత్రి నలంకారప్రచురముగా దీర్చుట వారి పరిపాటి. కాదంబరి యందలి వింధ్యాటవీ వర్ణన మట్టిది. అందలి శ్లేషాశ్లేష విశేషములు కొన్ని: 'బాలగ్రీవేవ వ్యాఘ్ర నఖపంక్తి మండితా'—అరణ్యపరముగా సరేసరి, పిల్లలకు పులిగోరు పతకము కట్టు నాచారము చిరకాలానుగత మనియు తెలియనగును. 'ఉన్మత్తేవ వాయువేగ కృతతాలశబ్దా'—గాలి రివ్వున వీచునపుడు తాటితోపులందగు గంగల విలక్షణమైనది. గాలికి తాళము వేయుగలవా డున్మత్తుడు. ఇట కవి లోకజ్ఞత గమనింపదగినది. 'క్వచి ద్విధవేవ ఉన్ముక్త తాలపత్రా'—వితంతువు తాళి యూడినట్లు కొన్ని తాడిచెట్ల యాకులు రాలిపోయినవి. వివాహ సంకేతముగా తాళిగట్టు నాచారము ఔత్తరాహులలోను ఆనాడు నున్నదన్నమాట. 'పుష్పవత్యపి పవిత్రా'—ఇందలి శ్లేష సరసులు గురుతింపగలరు.

స రో వ ర ము

సరోవరవర్ణన మిందు ద్విवారము ప్రసక్తము. వర్ణ్య విషయము పునరుక్తమైనను వర్ణనలో పునరుక్తి లేకుండ చేయగల సమర్థుడు బాణుడు. అందుల కిందలి పంపా సరస్సు, అచ్ఛోద సరస్సుల వర్ణనలే తార్కాణలు. ఒకవేళ ఎక్కడనేని పునరుక్తి వచ్చినచో అది అవశ్యము దోషము కానట్టి వీప్సాభీక్ష్ణ్య క్రియాసమభిహార సందర్భములందే యుండును. 'అగాధ మనంత మప్రతిమ మపాం నిధానం పంపాభిధానం పద్మసరః'—అది నేలబడిన ఆకాశమువలె నున్నదట! అచ్ఛోదసర,

స్వచ్ఛసిత శరదభ్ర బృందము ద్రవీభూతమై ఏకత్ర నిష్యందితమై సట్లున్నదట! అది ఆ మహాకవి భావనావిహంగపు విహారము.

బూ రు గు చె ట్టు

ప్రత్యేకముగా కవుల వర్ణన కెక్కిన మహా వృక్షములలో మర్రితో పాటిదియు నొక్కటి. పంప యొడ్డున గలదట యొక పెద్ద బూరుగుచెట్టు. మూలముకడ చుట్టుకొనియున్న ముసలి కొండచిలువ దాని పాలిటి కొక పెద్ద యూటవాలము వలె నున్నదట! కొమ్మల నుండి వ్రేలు పాపకుబుసము లుత్తరీయముల వలె నున్నవట! భువనాంతరాళ విప్రకీర్ణములగు ఆ బూరుగుశాఖలు చంద్రశేఖరుని ప్రళయకాల తాండవప్రసారిత భుజసహస్రమువలె నున్నదట! దాని మూల మెంత దృఢమైనదనిన అది 'కల్పస్థాయి' యట. తొఱ్ఱలోపలి తుమ్మెదల రొద దానిలోని ప్రాణఘోషమువలె నున్నదట! అది మరియు దుర్యోధనునివలె ఉపలక్షితశకుని పక్షపాతము గలదట! (పక్షం రెక్కపాటు అని అర్థాంతరము). దండకారణ్యమున కధిపతివలె, సర్వ వనస్పతులకు నాయకుని వలె, వింధ్యపర్వతమునకు సఖునివలె నున్నదట! వింధ్యాటవిని తన శాఖాబాహువులతో కౌగిలించుకొనుచున్నదట! వర్ణ్య వస్తువునకు సందర్భమును బట్టి తగిన యుత్కర్షను కూర్పగలట్టిది బాణుని వర్ణప్రకర్ష.

చి లు క లు

ఆ బూరుగుచెట్టుపై బోలెడు పిట్టలు. కొమ్మ కొమ్మకు కోటి చిలుకలు.—"శాఖాగ్రేషు, కోటరోదరేషు, పల్లవాంతరేషు, స్కంధసంధిషు, జీర్ణవల్కల వివరేషు ..... మహావకాశతయా విస్రబ్ధ విరచితకులాయసహస్రాణి, దురారోహతయా విగళితభయాని నానాదేశ సమాగతాని శుకశకుని కులాని ప్రతివసంతిస్మ"—చెడుగుడులోని తరుము గుక్కల వలె నున్న వా పదముల సోహళింపులు. అవి రెక్కలల్లార్చుచు ఆకాశవీధి నెగురుచుండగా వాని పచ్చని పక్షపుటములు దినకర కరనికర పరిఖేదితములైన దిశాముఖములకు కదళీదళ వీజనములవలె నున్నవట! అవు డంతరిక్ష మింద్రధనుస్సు పొడసూపిన ట్లున్నదట! వర్ణనానైపుణి యన్న బాణుని చేతిలో పరుసవేది!

శ బ ర సై న్య ము

ముదురుపాకపు నలుపు మూర్తీభవించిన మేనులు గల శబర సైనికుల వర్ణనలో వారికి బహువిధోపమానము లుపాయనము లిచ్చినాడు బాణుడు. అందు 'కలికాల బంధువర్గమివ ఏకత్ర సంగత' మ్మనునది దొడ్డ కానుక. వారి వేట కుక్కలు 'మృగవధూ వైధవ్య దీక్షాదానదక్షము' లట! ఆ శబ్ద సంపుటిలోని యా నిబిడత్వముతోపాటు అర్థ చమత్కార మెంత చతురముగా ప్రతిపాదింపబడినది! ఇక బాణుడు శబరసేనాపతి కిచ్చిన కితాబులు—'అపత్యమివ వింధ్యస్య, అంశావతార మివ కృతాంతస్య, సహోదర మివ పాపస్య, సార మివ కలికాలస్య'—ఇట్టి ఉపమా నిపుణ ప్రయోగము కాళిదాసునికే చెల్లినది, బాణునికే చెల్లినది. అందును బాణుని ప్రయోగము తూర్ణబాణ పరంపరయే. అది చక్కని లక్ష్యశుద్ధియును గలది. దానికితోడుగ వాక్యవిన్యాసమందలి ఆతూగు, ఆరోహణావరోహక్రమము, అవధారణము ఆశించిన అర్థమున కొక రుటితిస్ఫూర్తిని సమకూర్చినవి. ఆ శబరసేనాపతి స్థౌల్యము, నైల్యము, దౌర్జన్య క్రౌర్యములు ఆ మాటలతో ఇట్టే పొడకట్టినవి. శబరసేనాకులకులాయమానమై కలగుండుపడిన వనములో 'నిపతిత శుష్క మర్మరధ్వని' గూడ వినిపించినది బాణునకు. 'వనమహిష విషాణకోటి కులిశభిద్యమాన వల్మీక ధూళి' యు గనిపించినది. ఆ పుట్టలు పర్వత పరిమాణములనుటధ్వని. విశిఖనిశితము బాణభట్టారకుని చూపు. ఇప్పట్టున వస్త్రక్రీడను గురించిన స్ఫురణయు నాతని యూహాప్రపంచమున నే మారుమూలనైన పొదిగియున్నదేమో!

పా రి జా త మం జ రి

మహాశ్వేతాహృదయమధుకరము నాకర్షించిన దీ పుండరీకుని పారిజాత కుసుమ మంజరియే. అది—'అతి సురభితయా అనులింపంతమివ పూరయంత మివ తర్పయంతమివ ఘ్రాణేంద్రియ మహమహమికయా మధుకరకులై రనుబధ్యమాన మనాఘ్రాత పూర్వ మమానుష లోకోచితమ్'—ఎక్కడ పడిన అక్కడ బాణుని గీర్వాణ మెట్లు నరసాగునో చూడుడు. ఆ పదజాల మొక యింద్రజాలము. ఆ శైలీ లాలిత్య మొక సౌరభ స్రవంతి. భట్టుమూర్తి కితాబు 'బాణువేగంబును' అను మాటలో శ్లేషాసహ్యమైన ఉపమను మించియున్నది బాణుని భావనావేదము, రచనావేగము. ఆ మంజరి వసంతదర్శనానందితయైన వనలక్ష్మి స్మితప్రభవలె, చైత్రుడు మలయమారుత స్వాగతార్థము పట్టిన లాజాంజలివలె, సుమలక్ష్మియొక్క యౌవనమువలె, సురత శ్రమ పొందిన రతీదేవి యొక్క జలకణజాలకావళివలె, మనోభవగజధ్వజచిహ్నమైన చామర పిచ్ఛికవలె నున్నదట! మరియు అది 'మధుకర కాముకాభిసారిక' యట! అది మధుకరకాముకాభిసారిక యగుటకాదా భావము బాణాభిసారికయైనది.

ఇట్లనేక విషయముల నాపోశనము పట్టినాడు భట్టబాణుడు. అస లతని ప్రతిభ కగమ్యమైన విషయ మున్నదా యనిపించును. కాదంబరి తన వర్ణనలతో లోకమునే లోగొన్నది. వర్ణనా విన్యాసమునను, వర్ణ విన్యాసమునను అర్వాచీన భారతీయదేశభాషాసాహితీ సమారాధనములం దన్నపూర్ణాదేవి హస్తోదక మైనది కాదంబరి.

వివిధ కావ్యాంగములం దీ వర్ణన యన్నది రానురాను కవులపాలిటి కొక కండూతియై రకరకాల కల్పనల కవాతులు కసరత్తులును చేయించి కథాగతి నరికట్టి చివరికి రసికులకు విసువెత్తిన సందర్భములును లేకపోలేదు. వర్ణనము కథా వాహనము కావలెగాని తానే దానిపై నెక్కి స్వారి చేయరాదు. కాదంబరియు నిందులకు పూర్తిగా అపవాదము గాదనుట సాహసోక్తి కాదనుకొందును. కాని వర్ణనకు వర్ణనగా వెలకట్టవలసి వచ్చినప్పుడు కాదంబరితో సమానమైన కావ్యము 'నభూతో న భవిష్యతి' అనుటయు సాహసోక్తి కాదేమో! విజ్ఞులు యోజింతురుగాక.

సిరి

శ్రీమతి కె. వి. యస్. అచ్యుతవల్లి

లేత నీలి టిష్యూ పరదాలోంచి పచ్చని గుండ్రటి ముఖముతోని చారెడేసి నల్లని కళ్లు మిలమిల్లాడుతూండగా ఒకచేతితో మృదువుగా కాశీ జరీచీర కుచ్చెళ్ళు పట్టుకుని, ఇంకొక చేతితో రాంగోపాల్ చిటికెనవ్రేలు పట్టుకుని "రాగభవనం" లో గృహప్రవేశం చేసింది రాధ. అద్భుతమైన శిల్పంతో నవ్యకళ ఓన్నతున్న ఆ భవన సౌందర్యంలో తను అణువైపోయినట్లు భావన రాగా కుంచించుకుపోయింది రాధ. రాంగోపాలుని తన సౌందర్యారాధకుడుగా ఎరుగును. కాని ఇంత ధనవంతుడని తెలియదు. తన అదృష్టానికి తనే మురిసిపోతోంది రాధ. అతని హృదయంలో తనమీది ప్రేమ కలకాలం నిల్చిపోవాలనుకుంటున్నది. అతను పూర్ణచంద్రుడు. తను రోహిణి. అతను నారాయణుడు. తను లక్ష్మి. అతను గోపాలుడు. తను రాధ! తమ ఏకత్వంలో భిన్నత్వం రాకూడదు. తుషారబిందువులాంటి పల్చని, తెల్లని వస్త్రాలు ధరించి రాంగోపాలు బెడ్‌రూంలోనికి వెళ్లింది. ఆమెను చూస్తూనే బొటనవ్రేలితోనూ, నడిమివ్రేలితోనూ కణతలు నొక్కుకుంటూ "అబ్బా!" అన్నాడు.

"ఏమిటి!" అన్నట్లు చూసింది.

అతను మాట్లాడకుండా సోఫాలో జార్లబడ్డాడు.

"తలనొప్పా!" సన్నగా అడిగింది. పైన ఫాన్ గిరగిర తిరుగుతున్నా అతని ముఖంమీద పెదిమలపైనా మంచి ముత్యాలల్లే చెమట పట్టసాగింది. ప్రక్కన కూర్చొని అతని భుజంమీద చేయివేసి,

"మాట్లాడరూ! తలనొప్పా!" మృదువుగా అడిగింది. ఆమె కళ్లల్లోకి చూడలేనట్లు రెండు చేతులతోనూ ముఖం దాచుకుని

"రాధా! ముందు నన్ను ఎప్పటికీ వదిలిపోనని మాటియ్యి" అన్నాడు. ఎంత అమాయకత్వం! తనా! అతన్ని వదిలిపోటమా! ఎందుకని!

"మన్ని మృత్యువే వేరు పరిచేది గోపాల్" సితార్ మీటినట్లు జలజల్లాడింది.

"అయితే ఆ బట్టలు మార్చుకో!" అజ్ఞాపించాడు. ఆశ్చర్యపోయింది రాధ! అతనికేసి చూసింది. పచ్చని అతని ముఖం బాధతో కమిలిపోయింది. నుదుటిమీద ఆలోచనల ముడతలు! ఆ వదనం చూళ్లేకపోయింది. మధురసీమల్లో విహరించే మనస్సుని లాగుకొని డ్రస్సింగురూంలోకి వెళ్లిపోయింది.

2

ఉపాహారం తీసుకువచ్చింది సూరమ్మ. ప్లేటులో రెండు ఇడ్లీ, వెలూ. రాత్రి సంఘటనలు గురించి వికలమైన మనస్సుతో యథాలాపంగా స్పూన్ ఇడ్లీమీద గుచ్చి పంచదారకోసం చూసింది. చిన్న పింగాణి కప్పులో ఆవిర్లు వస్తూ సాంబారు కన్పించింది. "నాకు సాంబారు అక్కర్లేదు. పంచదార తీసుకురా!" సూరమ్మ మతి చలించినదానిలా వెర్రిగా చూడసాగింది. రాధకు అమితాశ్చర్యం కలిగింది.

"ఎందుకలా చూస్తావ్ నా ముఖంకేసి!"

తడబడింది సూరమ్మ. తలొంచుకుంది.

"పంచదార తీసుకురా!"

"వొద్దు వొద్దు అమ్మగారూ! అయ్యగారు కూడా వస్తారు ఫలహారానికి" వణికిపోయింది.

"వస్తే! నాకు పంచదారే ఇష్టం!"

"అయ్యగారికి ఇష్టంలేదు. మీకు ఇష్టమని తెలిస్తే బాధపడతారు."

"బాగుంది సూరమ్మా. వేడుకగ్గా ఉంది. నేనుకూడా ఇడ్లీ, పంచదారలో తినకూడదన్నమాట!" పకపకా నవ్వింది రాధ. మనస్సు తేలికైంది. గోపాలుకి అన్నీ తన యిష్టప్రకారమే జరగాలన్నమాట! తన కట్టూ బొట్టూ చివరికి తిండీ! పెద్ద జమీందారు మరి! తన సర్వస్వం గోపాలు అధీనం. తన హృదయాధినేత గోపాల్! ఇష్టంలేకపోయినా సాంబారు నంజుకు తినేసింది. గార్డెనులో మంచుబిందువులతో తళతళ్లాడుతున్న గులాబీలు రాధని ఆహ్వానించాయి. ఎన్ని గులాబీలు! ఎన్ని గులాబీలు? అవి అన్నీ కోసేసుకుంటే ఆ మొక్కలు చిన్నబోయి తన్ని శపిస్తాయా? తోటలో గులాబీల మధ్య తిరుగసాగింది రాధ. ఎన్నో రకాల విరిసినపూలు. ఒక్క గులాబీలే పది పదిహేను రంగుల్లో ఉన్నాయ్! అందులో ఒక్కచోట తెల్లని గులాబీలు. వంద మొక్కలు ఎన్నో లెక్కలేనన్ని పూలతో విరిసి

హాయి ఉన్నాయ్ ! ఒయారంగా నెమురుబట్టం అర్చీమీద అల్మాండ్ పచ్చని పూవులు రాధని చూసి సంతోషంతో ఊగుతున్నాయ్. ఎర్రని ముద్ద మందారాలకు చుట్టుకున్న తెల్లని శంఖుపూలు తమ జాతీయులని చూడమంటున్నయ్. సొంపుగా ఇంద్రధనుస్సు రంగుల్లో ఉన్న బోగంవిల్లాలు "మా షోకు ముందర నువ్వెంత" అని సవాల్ చేస్తున్నాయ్. సీమ తాడి చెట్ల వలయంలో ఉన్న ఫౌంటెన్‌లోని లిల్లీలు రాధని రాగ మాలాపించమంటున్నాయి. నేలబారున నాలుగు చదరపుగజాల మేర పొట్టిగా పూసిన బొగడబంతిపూలు రాధ తమని పరిశీలించటం లేదని చిన్నబుచ్చుకున్నాయ్. కుండీల్లో అందంగా అమర్చబడిన జినియాలు, పెంకీసు రకాలు ఒక్కొక్కటీ తోట మాలి రామన్న రాధకు విశదంగా చెప్తుంటే కూడా కూడా తిరుగుతున్నాడు. ఆ తోటను అంతగా తీర్చిదిద్దిన మాలిని ఆమె ఎంతో అభినందించింది. ఆ వసంతోదయంలో ఇన్ని పూల మధ్య తిరుగుతూంటే ఆమె సంతోషంతో చేతులు బార చాపి ఎగరగల్గితే బాగుణ్ను అనుకుంది. చటుక్కున ఆమెకు తమ బెడ్‌రూంలో "వాజ్" లో పూవు లుంచితే బాగుంటుం దని స్ఫురణకు వచ్చింది. నాలుగంటె నాలుగు తెల్ల గులాబీలు, కోసి మొక్క దవనం రెమ్మలు త్రుంచి చుట్టూ ఉంచి అరటినారతో "బొకే" గా కట్టసాగింది. రామన్న నిశ్చేష్టుడై పోయాడు.

"ఎందుకమ్మగారూ రోజాలు కోశారు !"

"ఎందుకా ! వాజ్‌లో అమర్చటానికి. రామన్నా ! రోజూ ఉదయం నాకు నాలుగు తెల్ల గులాబీలు కోసియ్యి" ముద్దుగా తలాడిస్తూ అన్నది.

"అమ్మగారూ ! వాజ్ లోకి ఇంకేమన్నా పూలు కోసుకోండి. తెల్లగులాబీలు వద్దు" ముసలాడి ముఖం భీతావహమైంది.

"నాకెంతో యిష్టం తెల్ల గులాబీలు. అవే పెట్టా వాజ్‌లో" పెంకెగా, అధికారంగా అంది.

"నామాటిను చిట్టితల్లీ ! అయ్యగారికి తెలిస్తే ఎంత బాధపడతారనీ" బ్రతిమిలాడాడు.

"ఏమిటి రామన్నా ! ఎన్ని కోశాననీ ? నాలుగంటే నాలుగే కదా ! అంతమాత్రానికే అయ్యగారు బాధపడతారా ? నేను కోసుకున్నానని చెప్తే ఏం అనరులే !" అర్ధాంగిని హోదాతో ధీమాగా ఉంది. ఇంక లాభంలేదు. రామన్నకి స్తిమితం తప్పింది.

"రాధమ్మా ! నామా టినరుకదూ ?" వణకిపోతున్నాడు.

"ముసలివాడవైనందుకు నీకు బాగా పిచ్చి ఉందే తాతా! ఎందుకలా వణికిపోతావ్ ! చూడకపోతే మీ అయ్యగారు డిక్టేటరులా ఉన్నారే !" హుషారుగా నవ్వుతూ "బొకే" ని మృదువుగా చెంపల కానించుకుంది. ఈమెకి చిన్నతనం వదల్లేదు. అతని బాధ తను చెప్పలేడు. చూడలేడు. స్థిరనిశ్చయుడై నాడు రామన్న. గమ్మున రాధ చేతిలోని "బొకే" ని పూడ లాక్కుని గట్టిగా రెండు చేతులతో నలిపేసి "ఫౌంటెన్" లోకి విసిరేసి పొగడచెట్లలోంచి నడుచుకుపోయాడు. రాధకు కోపం దుఃఖం వచ్చింది. ఇంక తోటలో తిరగ బుద్ధి వేయలేదు. ఆమెకు. ఈ సర్వెంట్సుకి తను యజమానురాలిగా రావటం ఏమాత్రం ఇష్టంలేనట్లు ఉంది. అందరూ తను చేసే ప్రతి పనీ విస్మితదృష్టితో చూస్తూ ఆటంకపరుస్తున్నారు. విస విస యింట్లోకిపోయింది.

3

గోరువెచ్చని నీళ్లతో స్నానంచేసి, వళ్లంతా పన్నీరు చల్లిన టర్కిష్ తువ్వాలులో తుడుచుకొని శుభ్ర వస్త్రాలను ధరించేసరికి ప్రశాంతత పొందింది ఆమె మనస్సు. అద్దం ముందు నుంచుని కూనిరాగం తీసుకుంటూ జుత్తంతా రిబ్బనులో ముడెట్టి చెవుల వెనుక రాసుకుందామని పునుగు సీసా తీసేసరికి ఒక మృదుహస్తం పునుగు సీసా తీసుకుని "యుడికిలోన్" సీసా అందించింది. వెనక్కి కోపంగా చూసింది. సుందరి మృదువుగా నవ్వింది. రాధకు కోపం ఆగలేదు.

"నేను చేసే పనికి మీరంతా ఎందుకని అడ్డు తగులుతున్నారు ? నేనంటే మీకంత అయిష్టం ఎందుకు."

"కోపగించకండి రాధా ! పునుగు వాసన అయ్యగారికి ఇష్టం ఉండదు."

"నాకెంతో ఇష్టం ! నా ఇష్టానిష్టాలు వారికి అక్కర్లేదా ! సరే ! అడుగులా ఆయన్నే" తీక్ష్ణంగా అంది.

"అడగకండి రాధా ! ఇన్నాళ్లకి ఆయన శిశిరజీవితంలో వసంతంలా వచ్చిన మీరు ఆయన్ని వ్యథపాలు చేస్తారా ? ఆయనంటే మీకు అపేక్ష లేదూ ?" అనునయంగా అంది సుందరి.

"లేకేం ! నా సర్వస్వం తనే అనుకొన్నాను. ఆయన కళ్లల్లోని కరుణ కరిగిపోనిదే అనుకున్నాను. అంతేకాని స్వేచ్ఛగా ఎగిరే తూనీగని రెక్కలు విరిచి దారంకట్టి మునుపట్లా ఎగరటంలేదని వాపోయే రాక్షస మనస్తత్వం అని తెలుసుకోలేక పోయాను. సుందరీ ! నిజం చెప్తున్నాను. ఇక్కడకురాని క్రితం ఎంత హాయిగా ఉండేవాళ్లమనీ ! ఆయన గొంతులో అనంతమైన ఆవేదనే కాని ఆజ్ఞలు వినిపించేవా ? ఆయన నుదుటిమీద ఆలోచనాతరంగాలు ఉండేవా? నామీది అనురాగంతో

పూర్ణచంద్రుడిలా వెలిగే నుదురు! నా సన్నిధిలో ఆనందదీప్తిలో మెరిసే చంపలతటుకులు, అటువంటి అనూహ్యమైన నే నెలా వూహిస్తాను చెప్పు! సుందరీ! చెప్పు! నువ్వు స్త్రీవి! నే నిక్క డుండలేను. ఈ నిర్వేదం, దుర్భరమైన నిర్వేదం నేను భరించలేను. సుందరీ! అందాలుచిందే ఈ సౌధం నా స్వప్నసౌధం కాదు. అంతర్గర్భితమైన ఆలోచనల పానుంపుట్ట!''

ఆలోచనగా వూరుకుని, కాస్సేపు నిశ్శబ్దానంతరం సుందరి ఇలా అంది :

''రాధా! ఆయన మనఃక్లేశానికి కారణాలు తెలుసు. చెప్తే మీరు తట్టుకోగల్గుతారా? ఉన్మత్తమైన మనస్సుతో ఉన్న మీరు ఆయనమీద కాఠిన్యం పూనితే ఏమయిపోతారు? ఇప్పటికే గాయపడిన ఆయన మనస్సు జన్మలో కోలుకోదు. రాధా! మీరు ఆయనపట్ల మృదువుగా సంచరిస్తానని మాట యిస్తే నేను ఆయన మనోవ్యథకి కారణం వివరిస్తాను. నామీద ఒట్టేసుకోండి రాధా!'' సుందరికేసి చూసింది రాధ. ఆమె ముఖంలో తనమీది ఆపేక్ష స్పష్టమయింది. అచేతనంగా ఆమె చేతిలో చేయి వేసింది రాధ. ఆ చేతిని అల్లానే పట్టుకుని వరండాలోనికి వచ్చి పనిమనిషిని కేకేసి ''అయ్యగా రెక్కడ!'' అన్నది సుందరి.

''షికారు వెళ్ళారు''. ''అమ్మయ్య'' అంది సుందరి. వరండా చుట్టు తిరిగి వెనుకవైపు నున్న మెట్లు దిగి తోట లోనికి వచ్చింది. దూరంగా పూలమొక్కల మధ్య ''డోమ్'' ఆకారంలో ఉన్న ''రెస్ట్‌హవుస్'' కేసి నిదానంగా చూసింది, ఇరువైపులా విరబూసిన పూలమొక్కల చివుళ్ళని మురిపిస్తున్న లేత ఎండలో రాధ సుందరి తొందరను గమనించ కుండా వయ్యారంగా నడువసాగింది.

''గమ్మున రండి రాధా'' అంది సుందరి. త్వరగా నడిచి సుందరిని జేరింది. రెండంగల్లో రెస్ట్‌హవుస్ సమీపించి లోపలికి వెళ్ళి తలుపు గడియవేసింది సుందరి. వూపిరి బిగబట్టి ఆమెను అనుసరించింది రాధ. సుందరి ముఖమూ, శరీరమూ చెమటతో తడిసిపోయాయి.

''చేతిలో చేయి వేశారు జ్ఞాపకం ఉందా!'' అన్నది.

''మళ్ళీ అడగాలా సుందరీ! ఇచ్చినమాట తప్పను.'' రాధకు ఆమె భయానికి కారణం తెలీటంలేదు. రాధను సుందరి మేడపైకి తీసుకువెళ్ళింది. దట్టమైన నీలి పరదాను తొలగించి తలుపు తాళం తీసి లోపలికి ప్రవేశించి మళ్ళీ తలుపులు వేసింది సుందరి. అదొక పెద్ద హాలులా ఉన్నా పడక గదిలా ఉన్నది. వెంటిలేటర్సుకి అమర్చబడిన నీలిగాజు పలకల్లోంచి నీలికాంతులు తెల్లని చలువరాతి భవళత్వాన్ని నీలి రంగులోకి మార్చటానికి వృథా ప్రయత్నాలు చేస్తూ పైనించి నగందాకా ఏటవాలుగా వచ్చి ఆగిపోతున్నాయ్. సోఫాలు, ముఖ ములు దిండ్లలో ఉన్న శయ్య! తూర్పు గోడకి ''రాయ్ రిచ్'' చిత్రించిన లైఫ్ సైజు దేవికారాణి త్రివర్ణచిత్రం, పడమర గోడకి నాలుగు అరలున్న రోజ్ వుడ్ బీరువా! అది తీసింది సుందరి. తెల్లని పచ్చని జరీచీరలు, ముఖమల్, కంచి, పట్టు, బ్లౌజులు పడిలిపోయిన తెల్ల గులాబీలు! పై అరలో ఆల్బంలు అయిదారు ఉన్నయ్. ఒకటితీసి చూసింది రాధ. కాశ్మీరు, కులూ, సిమ్లా, డార్జిలింగ్, కన్యాకుమారి మొదలైన స్థలాల ప్రకృతి ఛాయాచిత్రాలు పొందుపరచిఉన్నాయ్! ఇంకొకటి తీసి చూసింది రాధ! అందులో ''కస్తూరీ, ఎలిఫెంటా, అజంతా, ఎల్లోరా, మహాబలిపురం మొదలైన సుందర శిల్పాల ప్రతి చిత్రాలు ఉన్నాయ్. ప్రతి చిత్రం కింద డ్రాయింగుపేపరు మీద, ఇండియన్ ఇంక్‌లో చిత్రాల వివరాలు చూసి చూసి నప్పుడు తను పొందే అనుభూతులన్నీ పొందికగా వ్రాసు కున్నాడు రాంగోపాలు! ఆతనిలోని కళాహృదయానికి ఫోటో గ్రాఫిస్టు ఇంకొక ఆల్బం తీసింది రాధ. సుందరి స్థాణువులా నిలబడింది. మొదటిపేజీలో అరచేయి అంత నీలి ముఖములు గుడ్డమీద బంగారులతలమధ్య చిన్న ఫోటో అంటించి ఉన్నది. తెల్లగా పచ్చగా శరీరం వంపులు వ్యక్తమయ్యే వస్త్రం! స్లీవ్‌లెస్ బ్లౌజ్ భుజాలమీదికి కెరటాల్లా పడే జుత్తు! చెవి ప్రక్కగా రెండు ఆకులతో ఉన్న తెల్ల గులాబీ! అచ్ఛాదనలేక నున్నగా ఎత్తుగా ఉన్న భుజంమీదికి వాలుచూపు! చారెడేసి నల్లని కళ్ళకి నల్లని సన్నని పట్టుదారాలతో అల్లిన జాలర్లాంటి కనురెప్పలు! రాధ పేజీలు తిరగేసింది. అన్నిట ఆ అద్భుత సౌందర్య రాశి రకరకాల భంగిమల ఛాయాచిత్రాలు. ఆఖరుపేజీలో అందాలరాణి మెడలో మోయలేనన్ని పూలహారాలతో సొలిపోతున్నట్లు భువనమోహనంగా రాంగోపాలు భుజాన్ని పూతగా నించున్న వివాహచిత్రం! క్రింద ''నీలి'' అనుగ్రహించిన ''రాధిక'' అని ఉంది. రాంగోపాల్ సౌందర్యార్చన ఎంత ఉన్నతమైనదో గ్రహించిన రాధ కళ్ళు చమరించాయి.

''రాధా! నీలమ్మలోని అందాలు మీలో చూసినారు. కనుకనే అయ్యగారు మళ్ళీ జీవించకల్గుతున్నారు. మిమ్మల్ని ఆరాధించుతున్నారు. రాధా! ఆమె శరీరమే అందమైనది అనుకోకు. ఆత్మ అంతకు వెయ్యిరెట్లు దయాపూరితమైనది. అందాలరాణుల కుండాల్సిన గర్వం ఆమెలో అణుమాత్రం లేదు. ఆమె ఎనలేని అనురాగంతో మమ్మల్ని అలరించింది. ఈ భవనం ప్రతి అంగుళమూ ఆమె పదస్పర్శచేత పునీతమైంది. అయ్యగారిని దివ్యలోకాలను స్పర్శించేట్లు చేసింది,

ఆయన పుట్టిన రోజున పనివాళ్ళందరికీ దోసెడేసి మంచి ముత్యాలు పంచిపెట్టేది. తోటలో ప్రత్యేకం వంద తెల్ల గులాబీ మొక్కలను ఆమె స్వయంగా పెంచింది. ఆమె పవిత్ర మైన గంగానది లాంటిది. ఆమెకు పుట్టింటివారు ఉన్నారో! లేరో! మాకు తెలీదు. నాలుగేళ్ళు మమ్మల్ని ఆనందాల్లో సుందర స్వప్నసీమల్లో విహరింపచేసిన అందాలరాణి ఆమె!" సుందరి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. దోసిట్లో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది. రాధ ఆమె తల ఆప్యాయంగా నిమిరింది.

"సుందరీ! నాకూ యిదంతా వింటుంటే అమిత వ్యథ కలుగుతూంది. ఆమె అనురాగమయి, సౌందర్యవతి, మృదు స్వభావ కనుకనే మీ హృదయాలలో ఇంత గాఢముద్ర వేసుకో గలిగింది. అక్క చనిపోయి ఎంతకాలమయిందీ" అంది రాధ బాధగా.

"ఆరేళ్ళయింది రాధా! ఆరేళ్ళయింది. ఈ ఆరేళ్ల ల్లోనూ అయ్యగారికి మతి భ్రమిస్తుందేమో అన్నంత భయం వేసేది. ఆమె జ్ఞాపకాలు రాకుండా చేయటానికి మేము ఎంతో ప్రయత్నించాము. ఎవరితరం? మా జీవితాలే నీలమ్మగారి ఆదరణతో నిండి మరిచిపోలేని బాధను కలుగజేస్తూంటే జీవితభాగస్వామిని, సహధర్మచారిణి అయిన ఆమెలేని లోటును అయ్యగారిదరి చేరకుండా చేయగలమా రాధా! నీలిస్మృతులతో ఆయన బాధపడలేక ఈ భవనానికే రావటం మానుకున్నారు. అలా పిచ్చి పట్టినట్లు దేశాలు తిరిగారు. ఆయన జీవితం గురించి ఎంత బెంగపడ్డామో రాధా! పోయిన నెల ఆయన వచ్చి మీకు కొత్త యజమానురాలు వస్తుందని చెప్పినప్పుడు ఎంత ఆనందించామో! రాధా! మీరు మేలి ముసుగుతో లోపలికి వస్తున్నప్పుడు, మళ్ళీ నీలమ్మగారే బ్రతికివచ్చారా! అని ఆశ్చర్యపోయాము. ఆయన హృదయం గాయాన్ని మాన్ప శక్తి మీ కొక్కరికే ఉంది. ఆయన మనస్సు ప్రశాంతత పొందటానికే దయామయుడైన భగవంతుడు మిమ్మల్ని సృష్టి చేసి ఆయన కంటపడేట్లు చేశాడు. రాధా! నీలి గురించి మీతో చెప్పవద్దన్నారు. ఆమె స్మృతినుండి కోలుకోవటానికే రాధను తీసుకువచ్చాను అన్నారు. నీలిస్మృతిని ఎలా మభ్య పెట్టగలము? నీలిలాగే మీకూ అన్నీ ఆమె అలవాట్లే అయి నందుకు పనివారంతా దిగ్భ్రమ చెందుతున్నారు. అయన్ని నీలి స్మృతులు కలవరపెడతాయనీ ఆమె కిష్టమయిన విష యాలు మీనుండి వేరుపర్చాలనీ చెప్పారు. రాధా! అందు వల్లనే మేము మీతో అలా ప్రవర్తించవలసి వచ్చింది. మీరంటే మాకు ఎంతో ప్రేమాభిమానాలున్నాయ్. అయ్యగారిని భరించలేని విషాదంలోంచి తప్పించే అమృతమూర్తి మీరు! రాధా! మీ మనస్సు గాయపట్టం భరించలేక అయ్యగారి ఆజ్ఞను అతిక్రమించాల్సి వొచ్చింది. మీరు ఈ విషయం తెలియనట్లు ఆయనపట్ల సంచరించాలి. ఒట్టు వేశారు!" రాధ చేతుల్ని గట్టిగా పట్టుకుంది. గాఢంగా నిట్టూర్చింది.

"సుందరీ! అక్క చనిపోలేదు. ఆమె అమరత్వం పొందింది. మన అందరి హృదయాలలో స్థిరంగా నిల్చి పోయిన జీవనజ్యోతి! అక్కా! నన్నాశీర్వదించు! నీ అడుగు జాడల్లో నడువటానికి ప్రయత్నిస్తాను". నీలి చిత్రాన్ని కళ్ళ కద్దుకుని ఇవతలికి వచ్చింది రాధ.

4

రాంగోపాలు నీలిని అత్యధికంగా ప్రేమించాడు. విధి ప్రతికూలించి నీలి అతన్ని ఒంటిగా చేసింది. నీలిలోని అందా లను సంతరించుకున్న రాధను ఉన్మత్తంగా ఆరాధిస్తున్నాడు. ఆ ఆరాధనలో రాధకు వేరే అభిరుచు లుండకూడదు. తన నీడలా ఉండాలి అనే ఆధిక్యత గోచరించింది రాధకు. భర్త ఆధిక్యత భరించలేకపోతున్నది. ఇటు భవనం అంతా నీలి స్మృతుల జాలంలో ఉన్నది. రాధకు తన అస్తిత్వము మీది నమ్మకము పోతోంది. తన భాగ్యనిధి సన్నిధిలో కొంచెం సంతోష పారవశ్యం అనుభవించినా ఇవతలికి వచ్చేసరికి మామూలు నిరాశ నిస్పృహలు ఆమెను అలముకొనేవి. ఎంత ప్రయత్నించినా రాధ పనివాళ్ల మనస్సుల్లోంచి నీలి చిత్రాన్ని చెరిపివేసి తన్ని ప్రతిష్ఠించుకోలేక పోతూంది. పండుగలప్పుడు పనివాళ్లందరికీ కొత్త బట్టలూ, స్వీట్సూ పంచిపెట్టేది.

వాళ్ళు "నీలమ్మగారిలాగే ఎంతో దయగా ఉండే వారు" అనేవాళ్ళు. తను పాడినా, ఆడినా, మాట్లాడినా "నీలమ్మగారిలాగే" అంటూండేవాళ్ళు. ఈ సపత్నీత్వం రాధ భరించలేకపోయేది. ఆమెకి నీలి ప్రశంస వింటూంటే అగ్ని జ్వాలల్లో దగ్ధమవుతున్నట్లుండేది. పోనీ బ్రతికుందా నీలి! చనిపోయిన స్త్రీప్రశంసే వినలేనంతగాఢంగా ఆరాధించిందా తను గోపాల్ని!" పోనీ తను చచ్చిపోతే ఈ ప్రశంస వినక్క ర్లేదేమో! అనుకునేది కచ్చగా. అప్పుడు కూడా "నీలమ్మ గారిలాగే రాధమ్మగారు కూడా చాలా మంచివారు" అని అనుకో రని నమ్మక మేమిటి? చచ్చినా తన ఆత్మ ఈ ప్రశంస విని సంతోషిస్తుందా! భగవాన్! తనకీ నరకయాతన తప్పదా? ప్రేమ! పెళ్లి! తన సుందరస్వప్నం కరిగిపోటానికే ఇక్కడికి వచ్చిందా? ఈ నిజం తెలియకుండా ఉంటే ఎంత బాగుం డును? నీలిస్మరణ చెవులకి వినపడని సుదూరతీరాలకి తను రామ్‌గోపాలుని తీసుకపోతే ఎంత బాగుంటుందీ! రాంగోపాలు

మాత్రం నీలిస్మృతుల పునశ్చరణ కోసమే తన్ని ఇక్కడికి తీసుకువచ్చాడా ? తన సన్నిధిలో ఆయనకీ ఆలోచన్లు ఎందుకు? ఉండుండి ఉలికిపాటు ఎందుకు ?

టెర్రేస్‌లో పర్షియన్ రగ్గుమీద బాలీసు కానుకుని రాధ యివన్నీ ఆలోచించుకుంటున్నది. ఒడిలో వీణ ఉన్నది. తెలిమబ్బుల్ని కదిలించే నిండు చంద్రుడు తనలోని నల్లని మచ్చని అందమైన రాధ గమనించటం చూసి గాభరాగా మబ్బు చాటుకి తప్పుకోబోతున్నాడు. అదని చల్లని వెన్నెలకి కరగిపోతున్న మబ్బులు "నీ రహస్యం నీవే చెప్పుకో ! మా చాటున ముఖం దాచుకుంటా వెందుకు ?" అన్నట్లు దూరంగా తప్పుకుంటున్నాయి. అలా తదేకంగా చూస్తున్న రాధ రాంగోపాలు వచ్చి పిట్టగోడ కానుకుని నిలుచున్నట్లు గమనించకుండా వీణను శ్రుతిచేసి మీటుతూ సారంగరాగ మాలాపించి ఇలా పాడింది.

అఙ్కంకేపి శశాఙ్కరే, జలనిధేః
పఙ్కం పరే మేనిరే,
సారఙ్గం కతిచిచ్చ సంజగదిరే,
భూచ్ఛాయ మైచ్ఛన్ పరే,
ఇన్దౌ యద్దళి తేన్ద్ర నీలశకల
శ్యామం దరీ దృశ్యతే,
తత్ సాన్ద్రం నిశి పీత మన్ధతమసం,
కుక్షిస్థ మాచక్ష్మహే.

'ఆ చంద్రునిలో ఉన్న నలుపు కొందరు మచ్చగా భ్రమించిరి. సముద్రము బురదగా కొందరు తలంచిరి. కొందరేమో లేడి అని పలికిరి. కొందరు భూమి నీడ అంటారు. మేము రాత్రి చీకటిని త్రాగుటచేత దట్టమయిన చీకటి కడుపులో ఉండిపోయింది అనుకుంటున్నాము.'

"హు" గాఢమైన నిట్టూర్పు విని వెనక్కి తిరిగి చూసింది రాధ. వీణ తాళం తీగలు చిటికెనవ్రేలితో మీటుతూ అలానే కూర్చుండిపోయింది.

"నీకంతా తెలిసిందన్నమాట."

రాధ మాట్లాడలేదు. మౌనంగా కూర్చుండిపోయింది.

"రాధా ! బాధపడుతున్నావా ?" గొంతులో జీర విన్పించింది.

రాధకు మౌనమే భూషణం !

"ఈ సంపదంతా నాది అని తెలిసుండీ ఇది లేకుండా నాతో ఉండగలవా ?" ఎందుకీ యక్షప్రశ్నలూ ? కొరడా దెబ్బ తిన్నట్లయింది రాధకు. "మీరు పరిచయమైనప్పుడు ఇంత సిరికలవారుగా ప్రవర్తించలేదు. మర్చిపోయారా ?" దుఃఖంగా అంది.

"అయితే ఇల్లా రా ?" లేచి దగ్గరగా నడిచింది. ఆమె నడుము మట్టూ చేయివేసి "పద" అన్నాడు. అనుసరించింది రాధ. ఇద్దరూ వెన్నెల వర్షానికి చలించిపోతున్న పూలరెమ్మల మధ్యనించి నడిచి "రెస్టుహవుస్" లోకి వెళ్ళారు. వరసాగా ఉన్న గదులన్నీ దాటి "నీలి బెడ్‌రూం" లోనికి తీసుకవెళ్ళాడు. "రోజ్ వుడ్" బీరువా తీసి పది వజ్రాలు జేబులో వేసుకున్నాడు. రాధ దిగ్భ్రమ చెందింది. నెమ్మదిగా రాధ కళ్ళ ముందు మర్నాడు "జలరాణి" లో బయలుదేరుటకు రిజర్వు చేయబడిన రెండు పాస్‌పోర్టులు ఆడించాడు. రాధ సంతోషంతో రెండు చేతులూ చెంపల కదుపుకుంటూ "అబ్బ!" అంది. రాంగోపాలు అంతతో పూరుకోలేదు. మంచంమీది పరుపులు, ముఖమల్ దిండ్లు చాకుతో కోసి అందులో ఉన్న పట్టు, దూది, రిసాసీ నడుంగా కుప్ప వేశాడు. దానిమీద "నీలి" ఫోటోలున్న ఆల్బం. ఎండి వాడిపోయిన తెల్ల గులాబీలు పడవేశాడు. "సిగరెట్ లైటర్" సహాయంతో అది అంటించబోయే సమయానికి రాధ అతని చేయి పట్టుకుని మృదువుగా వారించింది.

"ఏంపనీ ! 'నీలి' స్మృతుల గురించి అసూయ పడుతున్నా నన్నుకున్నారా ?"

"హు. అసూయని కాదు. ఆ ఆలోచనతే అనుసరిస్తే నేను బ్రతుకలేను."

"మీ అభిమానమే నన్ను చిరంజీవగా చేస్తుంది" కృతజ్ఞతగా అన్నది. రాంగోపాలు క్షణం నిశ్శబ్దంగా వూరుకున్నాడు. అతని ఫాలభాగము ఆలోచనలుతో ముడుతలు పడసాగింది. గట్టిగా వూపిరి నిడిచి ఒక టెలిగ్రాం కాగితం ఆమెకు అందించాడు. ఏముంది అందులో ! రాధ జీవిత మూలమే కదిలించేదుందా ?

"ఆల్బర్ట్‌తో వస్తున్నాను. నీలి".

రాధ అచేతనమై పోయింది. నమ్మాలా ? నమ్మకూడదా ? తల గిరగిర తిరిగిపోగా దూది కుప్పమీద కూలబడి వెక్కివెక్కి ఏడ్వసాగింది. దూరంగా వూరి కావతల గుడిసెల్లో "కొక్కొరోకో" అని సుషుప్తావస్థలోనున్న జగతిని జాగ్రదవస్థలోనికి తేవటానికి ప్రథమ సహాయకులు పాటుపడుతున్నాయి. రాంగోపాలు ఈ సూచన విని గాభరాపడ్డాడు.

"ఒక్కమాట విన్పించుకో రాధా ! టైం లేదు. మరి".

రాధ మాట్లాడలేదు. ఆమె కళ్ళు వరిసిపోయినట్లు ఎర్రగా ఉన్నాయి. ఆమె కన్నీళ్ళన్నీ ఇంకిపోయినట్లుగా వెక్కుతున్నా కన్నీళ్ళు రావటంలేదు. చెంపలు ఎండిపోయాయ్.

"నన్ను నమ్మ !"

రాధకి అతని మాటలు విన్పించుకోవాలన్న ధ్యాస లేనట్లు శూన్యంగా "దేవికారాణి" చిత్రంకేసి చూస్తూ కూర్చుంది. అయినా సరే చెప్పుకపోయాడు రాంగోపాలు. "తన అంతరంగిక వ్యథలు వినేనా ఈ దేవత కరుణించకపోతుందా?" అన్నట్లు చెప్పుకపోయాడు.

"నీల" ని ఒకసారి హొటలులో కలుసుకున్నాను. ఆమె అత్యద్భుత సౌందర్యానికి ముగ్ధుడనై, మేరేజ్ కి ప్రపోజ్ చేశాను. ఆమె వెంటనే ఒప్పుకుంది. తొలిరాత్రి మాపాలిటి కాళరాత్రయింది. ఆమె విశ్వరూపం పరిశీలించాను. ఆమె అద్భుతమూర్తి కాదు. కామినీ పిశాచి ! స్వైరిణి ! ఛీ ఛీ ! నా వంశం ఎక్కడ ! ఆమె ఎక్కడ ! భగవాన్ నాకెందుకు పెట్టావు ఈ పరీక్ష ! నా గుండె ఆమెయందు విపరీతమైన ద్వేషంతో మండిపోసాగింది. ఆమె శరీరం అంతా తూట్లు తూట్లుగా గాయపరచాలనిపించింది. నౌకర్లందరూ ఆమెని జమీందారిణిగా గౌరవిస్తూంటే ఆమె నీచ జీవితం గురించి గట్టిగా అరవాలనిపించేది. నే నిలా దుర్భర మనోవేదనతో నా నూరేళ్ళ జీవితంగురించి యాతనపడుతూంటే ఆమె మాత్రం నిశ్చింతగా తిరిగేది. డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుతూ విందులూ వినోదాలూ ఏర్పాటు చేసేది. పూరంతా నీలా రాంగోపాలు సౌందర్యాన్ని దర్పాన్ని సహృదయతనీ మెచ్చుకునేవారు. తను ఈ ఇంటికి రాణి ! అన్న గర్వంతో ఇల్లంతా తన యిష్టం వచ్చినట్లు అలంకరించింది. నేను చేతకానివాణ్ణయి పోయాను. ఆమెను ఏంచేయటానికీ పాలుపోలేదు. నా వంశం, గౌరవము, ప్రతిష్ఠ, ఈ బజారు మనిషివల్ల కూలి పోయాయి ! ఆమె నా భార్య ! నా గృహిణి ! అబ్బా ! నాలు గేళ్ళు, నాలుగేళ్ళు అలా యమలోకంలో గడిపాను. ఒకనాడు ఆమె నాతో అన్నది.

"నీ కరుణ నా కక్కర్లేదు. నాకొక అయిదు లక్షలు ఇచ్చావంటే నా దారిని నేను పోతాను. జన్మలో నా ముఖం నీకు చూపెట్టాల్సిన అవసరం కలగకుండా చూసుకుంటాను."

"నిన్ను విషతుల్యంగా చూస్తున్నాను. నువ్వు నాకు చచ్చిపోయినట్లు జమ. ఆ విషయం నలుగురికీ తెలిసేటట్లు చేస్తాను. ఒప్పుకుంటే నువ్వు అడిగిన డబ్బు యిస్తాను." ఆమె హేళనగా నవ్వింది.

"నిన్ను ముందు ముందు ఇబ్బందుల్లో పెడతానన్న కొన్నావా ! నువ్వంటే నాకు చెడ్డ అసహ్యం. నా జీవితం గురించి విన్నప్పుడు ముడుచుకుపోయిన నీ ముఖం చూడగానే నాకు నువ్వంటే చెప్పలేని ద్వేషం కలిగింది. అందుకే ఈ నాలు గేళ్ళబట్టీ, నీవ్యథ చూస్తూ ఇక్కడ జమీందారిణిగా గడిపాను. నువ్వే నీతిమంతుడివా ? నాకు డబ్బే ప్రధానం. అందుకే నువ్వు నన్ను పెళ్లిచేసుకోమని కోరగానే ఒప్పుకున్నాను. ఆ డబ్బు నాకు ఇచ్చావంటే నీ జీవితం జోలి నా కక్కర్లేదు." నాలుగేళ్ళల్లోనూ నేను ఆమె వంటిమీద చేయివేసిన పాపాన్న పోలేదు. ఆమె దగ్గరికి వస్తే నాకు రోత ! తెల్లని గులాబీల్లో తెల్లని వస్త్రాలతో దూరంగా ఉన్నప్పుడు ఆమె దేవ కన్యలా కనపించేది ! విషపూరితమైన ఆ సౌందర్యాన్ని చూస్తూ అల్లానే రోజులు గడిపాను. నేను సూచించిన ప్రకారం ఆమెను నేను 'బొంబే' రేసెస్‌కి వెళ్తున్నామని చెప్పి తీసుకు పోయాను. అక్కడ ఆమె సడన్‌గా "కొలాప్స్" అయిందని పుట్టెడు దుఃఖంతో మునిగిపోయినట్లు ఇంటికి వచ్చాను. కాని లోపల్లోపల ఆమె మళ్ళీ డబ్బంతా ఖర్చు పెట్టేసుకుని వచ్చి ఏడుస్తుందనే భయంతో కృంగిపోయి దేశాలు తిరిగాను."

హఠాత్తుగా రాధ అడిగింది.

"మరి ! మరి ! నన్నంతా ఆమె పోలికే అంటారు ! మీరెలా ....

"అవును. నువ్వంతా ఆమె పోలికే ! నిన్ను మొదట చూసినప్పుడు ఆమె అనే భ్రాంతిలో పడ్డాను. ఆమెను హత్యచేయాలన్నంత కసి ఉండేది. అంచేత నీ వెంట పడి నిన్ను గురించి ఆరా తీశాను. ఆమె అయితే చంపేసి పారిపోదా మను కున్నాను. కాని నువ్వు సామాన్యస్త్రీవి అని తెలిసినప్పుడు నిన్ను ఆరాధించటం మొదలెట్టాను. నాకు ఆమె సౌందర్యం కావాలి ! కాని పవిత్రంగా మనఃస్ఫూర్తిగా నన్ను ప్రేమించాలి. నా అదృష్టంకొద్దీ నువ్వు దొరికావు ?"

"నాకూ తెల్లగులాబీలన్నా అన్నీ ఆమె అలవాట్లన్నా అమితమయిన యిష్టంకదా? అవి మీరెందుకు వారించారు ?"

"విశృంఖల మనస్తత్వంతో సంచరించే ఆమె అల వాట్లు నాకు ప్రాణాంతకంగా ఉండేవి. అవి నీలో ఉంటం నేను భరించలేక పనివాళ్లందరికీ నిన్ను వారించమని చెప్పాను. వాళ్లంతా నాకు "నీలి" మీదున్న మరచిపోలేని మమతకు ఎంతో దుఃఖించటం చూచి నాలో నేనే నవ్వుకున్నాను. నిన్ను ఈ విష వలయంలోకి తీసుకొనిరాకపోదును. మానేజరు ఒకసారి వచ్చి జమీ వివరాలు చూసుకొమ్మని టెలిగ్రాం యిచ్చాడు. నిన్ను వదలి ఉండలేక తీసుకవచ్చాను. రాధా ! నువ్వు నీలి అమర

త్వంతో విషాదం పొందుతూంటే ఎంత జాలి వేసేదో! పని వాళ్ళకి నీలి దేవత! వాళ్ళదాకా మా ఆంతరంగిక రహస్యాలు పోనీయలేదు. ఇక్కడ వాళ్ళంతా మమ్మల్ని శివ పార్వతు లనుకొనేవాళ్ళు. ఆమెమీది పగతో నేను దేశాలు తిరుగుతూ న్నప్పుడు ఇక్కడివాళ్ళు ఆమెమీది అవ్యాజానురాగంవల్ల విరా గినై పోతున్నానని బాధపడి నాకు నీతులు బోధించేవారు.

"ఆమె వస్తుందంటావా ?"

"వస్తుందా అంటావా ! అమాయకురాలివి. ఆమె తప్పకుండా వస్తుంది. నన్ను నవ్వులపాలు చేయటం ఆమెకు ఎంతో సరదా! పైగా ఆమెకు అవసరం కూడా ఉన్నది."

"ఆల్బర్టు ఎవరు."

"ఎవరంటే ఏం చెప్పను రాధా! ఆమెఎడమకాలి బంటు.

"ఛీ! ఛీ!" తటాలున ఆమెకు వచ్చిన కొత్తలో నీలి చిత్రాన్ని తను కళ్ళ కద్దుకుని "నీ అడుగుజాడలో నడు స్తాను, ఆశీర్వదించు" అన్న తన పలుకులు జ్ఞాపకానికి వచ్చి వళ్ళు ముడుచుకుపోయింది.

"ఆమెకు ఆరోమాసంట !"

రాధ ఆశ్చర్యపోయింది.

"కడుపులో ఉన్న తన పసిపాప తన కళ్ళు తెరిపించిం దట. వ్రాతమూలకంగా విడాకులు లేనందున ఆ 'బేబీ' ని నాదిగా నిరూపించి ఆమెకి వారసత్వం నిలబెట్టుతుందట! ఆ విషయాలు మాట్లాడుతాను. అందుకని "ఆల్బర్టుతో వస్తున్నాను" వ్రాసింది. "ఈ సుందర రాజ సౌధంలో ఎలాంటి విషపూరిత వాతావరణం నిండుకున్నదీ!" అనుకున్నది రాధ.

"మరి కర్తవ్యం!"

"చెప్పాగా! నా అస్తిత్వం నేను భరించలేక పోతు న్నాను. ఈ దూదికుప్ప సాయంతో ఇల్లు అంటించేస్తాను. నేను అప్పుడప్పుడు ఇక్కడ నీలి స్మృతుల్లో విహ రిస్తానని మా నౌకర్లందరికీ తెలుసు. ఈ మంటల్లో నేను దగ్ధమై పోయాయని విచారిస్తూ అశ్రుతర్పణం విడిచేస్తారు" రాధ కళ్ళు జలపూరితాలవుతూంటే రాంగోపాలు నోటిమీద చేయి వేసింది.

"ఆమె వస్తే!" ప్రశ్నతో నిలేసింది.

"వస్తే ఉంటుంది. లేకపోతే భవనం మాత్రమే మిగిలిన జమీ అమ్మేసుకపోతుంది. లేకపోతే దయ్యమని "సీసా" లోకి దింపేస్తారు. ఇక్కడివాళ్ళకి నమ్మకాలు ఎక్కువ! పద! పద! తెల్లారిపోతుంది!" అమె రెండు చేతులూ పుచ్చుకుని లేవ దీశాడు. రాధ గది అంతా నిర్లిప్తంగా కలయచూస్తూ నిల బడిపోయింది.

"నీకుకూడా ధనంమీద లాలసత్వం కలుగుతోందా ?"

"నాకు నిధి అక్కర్లేదు. మీ సన్నిధి చాలు!"

దూదికుప్ప భగ్గుమన్నది. ఆ మంటలు విపరీతమైన ఆకలితో క్రమక్రమంగా బీరువాల్ని కిటికీ రెక్కల్ని మంచాన్ని సోఫాల్ని నాలుకలు చాచుతూ అంటుకున్నాయి. వెనుక గుమ్మంలోంచి నారిద్దరూ ఉషాకన్యాగమనాన్ని సహించలేక త్వరత్వరగా తోటలోంచి నడుచుకుపోయారు. రాగ భవనంలో నౌకర్ల రోదన ధ్వని మింటి కెగసిపోగా సూర్యుడు పలక రించటానికని ఉదయించబోతున్నాడు!

కాళిదాసకవిత: మానవధర్మ సంస్కృతులు

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

"కాళిదాస కవితా నవంవయః
మాహిషందధి సశర్కరం పయః
ఏణమాంస మబలా చ కోమలా
సంభవన్తు మమ జన్మజన్మని."

"కాళిదాసుకవిత్వము, పడుచుప్రాయము, కమ్మని బర్రెపెరుగు, పంచదారకలిపిన పాలు, లేడి మాంసము, లేబ్రాయపుకోమలాంగి నాకు ప్రతిజన్మమునందును లభించుచుండు గాక" అని ఒక సహృదయుడు కోరుకొన్నాడు. దీనినిబట్టి కాళిదాసకవీంద్రుని కవిత్వమున కెంత మహిమయున్నదో తెలియుచున్నది. కాళిదాసకవిత్వమున కింత కమ్మదన ముండుటకు ఆతని లోకోత్తరప్రతిభ యొక్కటే కారణముగాదు. మానవ జీవిత తత్త్వమును, ధర్మమును, సంస్కృతిని తీర్చి దిద్దుటలో ఆతడు చూపిన జాగరూకతయు హేతువులే! తేనె సోనలు కురియు మధురాతిమధుర కవిత్వముతో బాటాతడు ఉత్తమోత్తమ మానవ ధర్మములను, ఉదాత్త భావములను గూడ చిత్రించి లోకారాధ్యుడయినాడు. కాళిదాసుని తత్త్వదృష్టి యెంత నిశితమును, పరిపూర్ణమును, సమన్వయసాధకమును, సత్య సమ్మతమునో ఇదివఱ కొక వ్యాసము (1960 ఏప్రిల్ భారతి)లో దిఙ్మాత్రముగా నిరూపించియున్నాను. ఈ వ్యాసమున ఆతని మానవ ధర్మోన్మీలన సామర్థ్యమును, విశ్వమానవసంస్కృతి ప్రతిపాదనమును సంగ్రహముగా పరిశీలింతము.

కాళిదాసు కనిష్ఠికాధిష్ఠితుడను సుప్రసిద్ధికి పాత్రుడయినను పరమనిరహంకారి. గర్వము లేశము నైత మాతనికి లేనేలేదు. తత్త్వ ప్రపూర్ణ హృదయముతో—మానవతోన్మీలన ప్రవణచిత్తముతో ఆతడు గీర్వాణ వాణినారాధించి తాను ధన్యుడై లోకమును గూడ ధన్య మొనర్చినాడు. రఘు వంశకావ్యారంభమున నే ఆతడు—

"మందః కవియశః ప్రార్థీ గమిష్యా మ్యుపహాస్యతాం
ప్రాంశులభ్యే ఫలే లోభా దుద్బాహు రివ వామనః"

కవి యశస్సునుగోరు మందుడనైన నేను ఉన్నతుని కందునట్టి పండును గోసికొన చేయెత్తు పొట్టివానివలె పరిహాస పాత్రుడనగుదును. అని యనుకొనుట యెంత వినయ సూచకము!

అంతేగాక, తాను వ్రాయదలచుకొన్నది మహాపురుషులగు సూర్యవంశపురాజులచరిత్రము. అది సముద్రమంత గంభీరమైనది. దానిని వాల్మీకివంటి కవి పుంగవులు వ్రాసియున్నారు. అట్టి దాని రచనకు తన కర్హతలేదని—

"క్వ సూర్యప్రభవో వంశః క్వచాల్పవిషయా మతిః
తితీర్షుర్దుస్తరం మోహా దుడుపే నాస్మి సాగరమ్"

మహిమాస్పదమైన సూర్యవంశమును నా స్వల్పబుద్ధితో వర్ణింపబూనుట దుస్తర సముద్రమును తెప్పకొయ్యతో దాటుటయగుననియు, అడకువ చూపినాడు. అట్లని మానుకొనరాదా యన్న తన కొకదారి యున్నది.గాన మాన నక్కరలేదని క్రింది శ్లోకములో సమాధానించుచున్నాడు—

"అథవా కృతవాగ్ద్వారేం వంశే స్మిన్ పూర్వసూరిభిః
మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యే వాస్తిమేగతిః"

ఈ శ్లోకముచేత కవి ప్రకారాంతరముగా పూర్వ కవిస్తుతి చేసినవాడాయెను.

కాళిదాస మహాకవి ఏదో వ్రాసికొని తనలో తానానందించుకొని తృప్తిపడువాడునుగాడు. తన రచనము విద్వత్పరితోషదాయకమైనగాని, ఆతనికి తృప్తిలేదు. ఈ యంశమునే అభిజ్ఞానశాకుంతలమున—

"ఆపరితోషా ద్విదుషాం న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్
బలవ దపి శిక్షితానా మాత్మన్యప్రత్యయం చేతః"

"విద్వాంసులు మెచ్చువరకు నా ప్రయోగము మంచిదని నేననుకొనను. బాగుగా నేర్చిన వారికైనను స్వవిషయమున విశ్వాసముండదు." అని స్పష్ట మొనర్చినాడు.

ఏనాడైనను, ఎక్కడైనను ఒకరు బాగన్న బాగను వారును, ఓగన్న ఓగను వారును ఉండియేయుందురు. ఇట్టివారు స్వయముగా గుణాగుణనిర్ణయము చేసికొనలేని అలసులు, అకృతబుద్ధులు. వీరు పాతదానిని మాత్రమే మెచ్చుకొనుమందులు గూడ. అట్టివారి నిందాస్తుతులను విజ్ఞులు లెక్క చేయరాదు. కాళిదాసు వీరిని సరకు సేయక మాళవికాగ్నిమిత్రములో —

"పురాణ మిత్యేవ న సాధు సర్వం
నచాపికావ్యం నవమిత్యవద్యమ్
సన్తః పరీక్ష్యా న్యతరద్భజన్తే
మూఢః పరప్రత్యయ నేయబుద్ధిః"

"కావ్యము పాతదయినంతమాత్రముననే ప్రతిది రమ్యము కాజాలదు. కొత్తదయినంతనే గర్హ్యముకాదు. విద్వాంసులు

పాత కొత్తలలో మేలేర్చి దానికి దగినస్థాన మిత్తురు. మూఢులు ఒరులు బాగన్న బాగనీ, ఓగన్న ఓగనీ ప్రక్కతాళము వేయుదురు.'' అని తన కావ్యగుణదోషములను నిరూపింప విద్వాంసులగు విమర్శకులే వలతులని గంభీరముగా వక్కాణించినాడు. లోకమునకు తన కావ్యముల మూలమున దివ్యసందేశము నీదలంచిన కవిసత్తముడింత వినయమును, విద్వద్విధేయతను, అవిద్వత్తిరస్కారమును, పూర్వ సూరులయెడ భక్తిని ప్రదర్శింపకున్న నెట్లు కృతకృత్యుడు కాగలడు ? కాళిదాసకవీంద్రుని ఈ సద్గుణములే తదితర కవిలోకమున కొరవఖ్యుదిద్ది, ఉదీయమాన కవికుమారులకును, ఆదర్శప్రాయము లగుచున్నవి.

కాళిదాసకవీంద్రుని శ్రవ్యకావ్యత్రయములో రఘువంశ మహాకావ్యము కన్నాకు. మేఘసందేశము గుణరత్న మహోదధి. దృశ్యకావ్యత్రయములో అభిజ్ఞానశాకుంతలము ప్రపంచ ఖ్యాతి గాంచి 'గెటే'' ప్రభృతులచే కైవారము చేయించు కొన్నది. రఘువంశకావ్యనాయకులు సూర్యవంశపు రాజులు, మానవ ధర్మములకు మూలపురుషుడైన వైవస్వతమనువు సంతతివారు. అభిజ్ఞాన శాకుంతల నాయకుడు దుష్యంతుడును, విక్రమోర్వశీయనాయకుడు పురూరవుడును చంద్రవంశము వారు. ఈ సూర్య చంద్ర వంశములవారివల్లనే భారతదేశమున క్షాత్ర ముద్దీపించినది.

ఏ కావ్యముగాని మహనీయమగుటకు అందుపవర్ణితులగు నాయకుల సద్గుణములు—వారనుసరించిన ధర్మములు కారణములు. తరువాత అట్టి (కావ్య) వస్తువును స్వీకరించిన కవి కవితా మహిమ కావ్యమహనీయతకు కారణమగును. సూర్యవంశము, ఆ వంశమువారగు రాజులు మహనీయులని ఒక్కమాటలో మొట్టమొదటనే చెప్పినకవి వారి మానవ ధర్మానురోధ విశిష్టతను తరువాత కొన్ని శ్లోకములలో వివరించుచున్నాడు.

> ''సోహమాజన్మశుద్ధానా మాఫలోదయకర్మణామ్
> ఆసముద్రక్షితీశానా మానాకరథవర్త్మనామ్
> యథావిధిహుతాగ్నీనాం యథాకామార్చితార్థినాం
> యథాపరాధదండానాం యథాకాల ప్రబోధినామ్
> త్యాగాయసంభృతార్థానాం సత్యాయమితభాషిణాం
> యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినాం
> శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం
> వార్ధకేమునివృత్తీనాం యోగేనాన్తే తనుత్యజామ్
> రఘూణా మన్వయం వక్ష్యే తనువాగ్విభవోపి సన్
> . . . .

రఘువంశపురాజులు జన్మప్రభృతి పరమపవిత్రులు ఫలము చేకూరువరకు పనులు చేయువారు. సముద్రరశనయగు భూమిని పాలించువారు. నాకమునకు గూడ రాకపోకలు సేయువారు. నిత్యాగ్నిహోత్రులు, యాచకుల కోరికలను లేదనకుండ దీర్చువారు. నేరములకు దగినశిక్షలు వేయువారు. కాలము ననుసరించి తాము చేయవలసిన పనులు చేయువారు, త్యాగము కొసనే ధనసంపాదన మొనర్చువారు, సత్యసంరక్షణమునకు మితముగా మాట్లాడువారు. కీర్తికొరకు మాత్రమే దిగ్విజయము చేయువారు. సంతానార్థమే గృహస్థులగువారు, శైశవమున విద్యాభ్యాసమును, యౌవనమున విషయోపభోగమును, వార్ధకమున మునివృత్తిని అవలంబించి కడకు యోగమార్గమున శరీరత్యాగము చేసి ధన్యులగువారు.

ఏ కవికిగాని కావ్య ప్రయుక్తపాత్రములు ఆలంబన ప్రాయములు మాత్రమే. ఆ పాత్రల నాధారముగా చేసికొని కవి లోకమునకు తానీయవలసిన ప్రబోధమును చేయుచును, చేవలసిన పరివర్తనములను దెచ్చుచును కృతార్థుడగును. ఈగుణము లన్నియు ఆ కావ్య నిరూపిత నాయకులలో ఉన్నవా లేవాయను చర్చ చేయదగినదికాదు. తత్కావ్యముచే పొందదగిన ఆనంద సదుపదేశాది ప్రయోజనములను పొందుటే సహృదయులయు, పాఠకులయు ధర్మము. అట్లు కాకున్న (వ్యాసభారత) దుష్యంతునకును, కాళిదాసుని దుష్యంతునకును ఉదాత్తాదిగుణ మహనీయతలలో ఎంతెంత భేదములేదు ? వానికి మనమీయవలసిన ప్రాధాన్యము వేఱుగదా! ప్రతికవియు తన కావ్య పాత్రములను కావ్య ధర్మానుసారము తనకువలసినట్లు తీర్చి దిద్దుకొనుట సకల సత్కవి కావ్య సాధారణము.

కాళిదాసు తన కావ్యముల మూలమున ఉదాత్త మానవత్వమును, ఉత్తమ మానవసంస్కృతిని నిరూపింపదలచుకొన్నాడు గావున, రఘువంశపు రాజుల మానవాదర్శములను ముందుగనే పేర్కొన్నాడు. ఆ పేర్కొన్న ఘనాదర్శములను రాబోవు కావ్యమునందు తత్తన్నాయకగతముగా నభివర్ణించి, వారిని లోకోత్తర పవిత్రచరిత్రులనుగా చిత్రించి కొందరు పురుషోత్తములను కాళిదాసు సృష్టించినాడు. బాల్యమున విద్యాభ్యాసము, యౌవనమున విషయసౌఖ్యానుభవము, ఆటుపిమ్మట కుటుంబభారమును సంతానముపై నారోపించి మునివృత్తితో తత్త్వచింతనము చేయుట, కడకు యోగమార్గమున శరీరత్యాగమొనర్చుట అను ధర్మములు ఏ మానవున కాచరణీయములుకావు ? ఆదేశము, ఈ దేశము, ఆ జాతి, ఈ జాతి, ఆ వర్ణము, ఈ వర్ణము అనకుండ సర్వ మానవ కోటికిని ఈ మార్గము లనుసరణీయములేయని ఏ కొంచెమాలోచించినను తెలియగలదు. సూత్రప్రాయములగు ఈ భావములకే విపులతరవ్యాఖ్యానము చేసికొని సువిస్తృతార్థమును సాధింపవచ్చును. మానవజీవితము సార్థకమగుటకు ధర్మార్థకామమోక్షము లుపాస్యములనుటను ఎవ్వరును కాదనజాలరు. ''ఈ పురుషార్థములేమి, ఈ చతురాశ్రమములేమి వేద సంబంధములు. వీనికి భారతదేశముననే సంచారము. వీని నాచరింప భారతపౌరులకే యర్హత'' అని ఎవరైన భావించిన అది వారి సంకుచితదృష్టికి తార్కాణము. కనుక ఇవి విశ్వజనీనములై సర్వమానవ సముపాస్యములై సర్వులకు మానవతాసిద్ధిని చేకూర్చి పెట్టినవి. ఇవియేకావు. తక్కిన గుణములును అట్టివే !

త్యాగముకొరకమై ధనమును కూడబెట్టి, దానిని సత్పాత్ర నిక్షేపణము చేయుటతో ఎంత సమాజశ్రేయము అంత ర్భూతమైయున్నది! సంఘమున అందరును ధనార్జనము చేయగలవారేయుండరు. చేసినను సంపాదితధనము కుటుంబ నిర్వహణమునకు చాలని పండితులు, శిల్పులు, కళా నిర్మాతలు, సంఘసేవకులు, పేదలు ఎందరో ఉన్నారు. అట్టివారికి సాయపడుటకే సంపాదనపరులు చూడవలయుననియు, స్వీయ భోగములతో మాత్రమే తృప్తి పడవలదనియు, "త్యాగాయ సంభృతార్థానాం, యథాకామార్చితార్థినాం" అను పలుకులు నిరూపించుచున్నవి. రఘుమహారాజు సర్వస్వదక్షిణముగా విశ్వజిద్యాగము చేయుట, మృత్పాత్రయుక్తుడైన ఆతని యొద్దకు గురుదక్షిణ నర్థించి కౌత్సుడు వచ్చుట, ఆ కౌత్సుని కుబేరుడు కురిసిన సువర్ణరాసులతో రఘు నర్పించుట పై సూత్రమునకు నిదర్శనములు. వర్తమాన జగత్తునను, ఆత్మభోగముకొరకుగాక, సమాజక్షేమముకొరకమై ధనరాసుల సంపాదించి సత్కార్యములకు వెచ్చించి ధన్యులగు నుత్తములు కొందరైనను లేకపోలేదు.

అధికప్రసంగము చేయుటలో అసత్యమునకు అవకాశమున్నది. సత్యవ్రతులు మితముగా భాషించుటే యొప్పును. మన కవులు గూడ "అల్పాక్షరముల ననల్పార్థ రచన" అన్నారు గదా! కావున సత్యభంగభీతితో విద్వాంసుడుగాని, వాగ్మిగాని మితభాషణ నవలవరచుకొనుట మంచిది. ఆ యంశమునే కాళిదాసు "సత్యాయ మితభాషిణాం" అన్నాడు.

ప్రజాతంతువిచ్ఛేదము జరుగకుండ సత్సంతానమును గని సమాజశ్రేయస్సును సంపాదించుటకును, ఆత్మ గుణ కళాకౌశలాదులు నశింపకుండకొనసాగుటకును మానవులకు గృహస్థాశ్రమ మేర్పాటైనది. ఇది నీతి ధర్మబద్ధమైన ఒక సువ్యవస్థ. దీనికి కొన్ని నియమములు, సంప్రదాయములు ఉన్నవి. ఏ యువతినో కట్టుకొని పదిమంది బిడ్డలనుగని సమాజముపై పడవేసిపోదునన్న కుదురదు. ఇట్టి నియమ రహిత ప్రవర్తనజనితసంతానము కుటుంబక్షేమమును, సమాజ క్షేమమును చేకూర్పజాలదు. కావున నిగ్రహపరునికే గార్హస్థ్యము. భోగ ప్రధానబుద్ధికి వేరుమార్గములున్న నుండవచ్చును. అట్టివి నాడును నేడు కూడ ఉన్నవి. పూర్వపు రాజులు, ధనవంతులు, పట్టమహిషులతోబాటు భోగభార్యలను గూడ నుంచుకొన్నారు. భోగ భార్యలకు బుట్టిన సంతానమునకుండు నర్హతలు వేరు. ప్రధాన భార్యా సంతానార్హతలు వేరు. అందుకే "సంతతిః శుద్ధవంశ్యాతు పరత్రేహ చ శర్మణే" విశుద్ధ వంశమున బుట్టిన సంతానము ఉభయలోక సౌఖ్యదాయకము అన్నారు. "దారరతిః సంతతయే కండూతిశమాయ చేటికాశ్లేషః" ఇత్యాది వాక్యములు గూడ ధర్మ బద్ధ గృహస్థాశ్రమాధిక్యమునే చాటుచున్నవి. ఉత్తమ మానవుల గృహస్థధర్మ మింత నియమబద్ధము కావుననే కాళిదాసు రఘువరాజులు సంతానార్థమై గృహస్థులగువారే, కాని ఇంద్రియభోగార్థము కాదని చెప్పినాడు. తదనుసారమే రఘువంశద్వితీయసర్గమున దిలీపుడు సంతాన లాభముకొరకు నందినీధేనువు నుపాసించినట్లు వర్ణితమైనది. సంతానార్థమయిన భార్యారతి భగవత్స్వరూపమనియు గీతలలో ("ధర్మా విరుద్ధో భూతేషు కామో స్మిభరతర్షభ") వివరింపబడినది.

ఈ విధముగ ఉత్తమమానవుల కాచరణీయములైన విశ్వజనీనధర్మము లన్నిటిని, ఉదాత్త సంస్కారముల నన్నిటిని కాళిదాసు తన కావ్యారంభముననే యుగ్గడించి ఉత్తరోత్తరము వానికి వికాసమును సంపాదించి తన కావ్యనాయకుల మూలమున వానిని సాలంబనముల నొనర్చినాడు.

దిలీపుడు నందినీధేనువును సేవించునపుడు దానినొక సింహము పట్టుకొన్నది. దిలీపు డా సింహమును వధింపబూనినాడు. అతని హస్తము స్తంభించిపోయినది. ఆ కపట సింహమునకును, దిలీపునకును కొంతసేపు సంవాదము జరిగినది. దిలీపుడు ధేనువునకుబదులు తనశరీరము నర్పింతునన్నాడేకాని, దానిని వదలననెను. సింహరూపకుంభోదరు డెంతగానో నచ్చ చెప్పెను. కాని దిలీపుడు వినక ఆతనితో—

"కిమప్యహింస్య స్తవచే న్మతోహం
యశశ్శరీరే భవమే దయాళుః
ఏకాన్త విధ్వంసిషు మద్విధానాం
పిండే ష్వనాస్థా కిల భౌతికేషు."

"నన్ను చంప గూడదని నీవు తలచినచో, శాశ్వతమయిన నాయశశ్శరీరమును గాపాడుము. మావంటివారికి నశ్వరమైన భౌతిక శరీరమునం దపేక్షయుండదుగదా!" అనినాడు.

ఎంతటి గొప్పదానము. మహారాజు భూలోకదేవేంద్రుడు అయిననేమి, గురుద్రవ్యమగు నందినీ సంరక్షణ మాయనకు ప్రధానమైనది. అందుకు నిజదేహమును గూడ తృణముగా వీడుట కాతడు కొంకలేదు. మానవునకు సత్కార్య నిర్వహణ జనితమైన యశస్సున్న చాలును. దేహమున్ననేమి, పోయిననేమి ? "కీర్తిర్యస్య స జీవతి"కదా! ఉత్తమ మానవుల లక్ష్యమును, ఆచరణమును అట్టివి! వారు అధికారమునకును స్వార్థమునకును దాసులుగారు.

కాళిదాస కావ్యనాయకులు పరస్త్రీపరాఙ్ముఖులు. పరకళత్రములను కన్నెత్తి చూచుటయు దోషమనుకొను స్వభార్యామాత్ర సంతుష్టులు. రఘువంశమున పదేనవసర్గమున శ్రీరామ స్వర్గారోహణము జరుగును. రామాదుల తనయులు భిన్న భిన్న ప్రదేశముల కాధిపత్యము వహించి పాలించుచున్నారు. అయోధ్య కిప్పుడు రాజులేడు. కుశుడు కుశావతికిని, లవుడు శరావతికిని పట్టాభిషిక్తులైనారు. ఇట్టి సందర్భమున ఒకనాటి యర్ధరాత్రమున కుశుడు తన శయ్యాగారములో ఒక లోకోత్తర లావణ్యవతిని గాంచినాడు. వేసిన తలుపులు వేసినట్లే యున్నవి. పొరపాటున గూడ గడియలు తీసి పండుకొనలేదు. ఆ సుందరి (భర్త పొరుగూరికి పోయిన) ప్రోషిత పతికవలె నున్నది. కుశుని యెదుటకువచ్చి "జయతు మహారాజః" అని అంజలిని బంధించినది. ఎట్టి మధుర సన్ని

వేళము ! కుశున కిప్పుడు కర్తవ్యమేమి ? అతడీ యేకాంత సమయమున ఇంద్రియ లౌల్యమునకు వశుడు కావచ్చును. కాకుండుట మానవమాత్రునకు సాధ్యముకాదేమో !

అతడిట్లన్నాడు :

"లబ్ధాన్తరా సావరణేఽపిగేహే
యోగప్రభావో న చ లక్ష్యతే తే
బిభర్షి చాకార మనిర్వృతానాం
మృణాలినీ హైమ మివోపరాగమ్"

"కా త్వం శుభే కస్యపరిగ్రహో వా
కిం వామదభ్యాగమ కారణం తే
ఆచక్ష్వ మత్వా వశినాం రఘూణాం
మనః పరస్త్రీ విముఖ ప్రవృత్తి."

"ఓ మంగళకరురాలా ! నీకు యోగశక్తి ఉన్నట్లు లేదు. అయినను తలుపుమూసియున్న యింటిలోనికి ప్రవేశింపగలిగినావు. మంచుదెబ్బతిన్న తామరతీగవలె నీయాకృతి దుఃఖావస్థనుసూచించుచున్నది. యోగుల కిట్టి దుఃఖముండదు. నీ వెవ్వతెవు? ఎవ్వరి భార్యవు ? నా వద్దకు వచ్చుటకు కారణమేమి? జితేంద్రియులైన రాఘవుల మనస్సు పరస్త్రీ పరాఙ్ముఖమైనదని తెలిసికొని మరి సమాధానము చెప్పుము."

ఆ వచ్చిన సుందరి అయోధ్యానగరాధి దేవత. శ్రీరామ స్వర్గారోహణానంతరమయోధ్య అనాథయైనదికదా! అందుకా నగరాధిదేవత ప్రోషితపతికాకృతిలో వచ్చి కుశమహారాజును అయోధ్యకు పట్టాభిషిక్తుడవు కావలసినదని కోరుకొన్నది. ఈ రాత్రివృత్తము స్వప్నమని భావించుకొన్నను, కుశుని శీలము అత్యద్భుతమే. మనుష్యుడు జాగ్రదవస్థలో తప్పులు చేయకున్నను స్వప్నావస్థలో చేయనచ్చును. అది ఒక అజ్ఞాన దశకదా! అట్టి దశావిశేషములో గూడ ఈ పడుచువాడు పప్పులోకాలువేయలేదు. అనగా కలలో గూడ పరస్త్రీ స్పర్శను సహింపనివాడన్నమాట. ఇప్పట్టున కుశుని శీలముతోబాటు నగరాధిదేవత స్వయముగావచ్చి వరించుటచేత ఆతని రాజ్య కరణార్హతయు లెస్సగా సంసూచితమగుచున్నది. ఇట్టి గుణములచే కావ్యమును మహనీయమగుచున్నది.

కాళిదాసు దుష్యంత విషయమున గూడ ఇట్టి పరస్త్రీ పరాఙ్ముఖత్వమునే వర్ణించి ఆదర్శమును నిలబెట్టినాడు. దుర్వాసశ్శాపముచే దుష్యంతునకు శకుంతలా విస్మృతి కలిగినది. గౌతమీ శార్ఙ్గరవాదులు గర్భవతియగు శకుంతలను దుష్యంతుని వద్దకు తీసికొనివచ్చినారు.

—పండుటాకులలో పల్లవమువలె ఉన్న ఆమెనుగాంచి— అవగుంఠనములోఉన్న ఈ అపరిస్ఫుట లావణ్యవతి యెవరో అని శంకించినాడు రాజు. ప్రతిహారి వెంటనే ఈమె ఆకృతి దర్శనీయమనును. తరువాత దుష్యంతుడు "భవతు. అనిర్వర్ణనీయం పరకళత్రం కానిమ్ము. పరుల భార్యను వర్ణింపరాదు" అనును. అంతేకాదు. శార్ఙ్గరవాదు లీమె నీభార్య అని చెప్పినప్పుడు గూడ దుష్యంతుడు నమ్మలేకపోయినాడు. చివరకు గౌతమి శకుంతల మేలి ముసుగును తొలగించి పరికించి చూడుమన్నది. కార్య నిర్ణయము చేసికొనవలసి వచ్చినందున, దుష్యంతుడు తేరిపారచూచి ఎటు తేల్చుకోలేక సందిగ్ధుడయినాడు. శార్ఙ్గరవుడు ఎంత కఠినముగా చెప్పినను పరపరిగ్రహాశంకలో—

"కుముదాన్యేవ శశాంకః సవితా బోధయతి పంకజాన్యేవ
వశినాం హి పరపరిగ్రహసంశ్లేషపరాఙ్ముఖీవృత్తిః"

"చందమామ కలువపూలనే మేలుకొల్పును. అట్లే సూర్యుడు పద్మములనే విప్పారజేయును. ఇంద్రియదాసులు కానివారి ప్రవృత్తి పరకళత్ర సంపర్కమున కొప్పదు" అన్నాడు. చంద్రుడు కలువలను మాత్రమే వికసింపజేసి పద్మాలజోలికి రానట్లు, సూర్యుడు కమలాలనే మేలుకొల్పి కుముదాల జోలికిపోనట్లు, ఎవరి భార్యలతో వారు తృప్తిపడుట ధర్మము అని ఒక చక్కని ఉపమానముఖమున కవి మహోత్కృష్ట మానవధర్మమును వ్యక్తము చేసినాడు. దుష్యంతునకు శకుంతలా లావణ్య తారుణ్యములు మాత్ర మా కర్షకములుగా లేకపోలేదు. అయినను గౌతమీ ప్రభృతులు చెప్పునట్లు ఈమె ప్రథమ పరిగృహీతమగునో, కాదో అని పెద్ద సందేహము. ఎంత ఆలోచించినను తనకు స్మృతి కలుగుటలేదు. పాపమాత డేమిచేయును ! సౌందర్యము భోగ్యవస్తువే. అయిన అది ధర్మ విరుద్ధముకారాదు. అందుకే—

"ఇద ముపనత మేవంరూప మక్లిష్ట కాన్తి
ప్రథమపరిగృహీతం స్యా న్నవేతి వ్యవస్యన్
భ్రమర ఇవ విభాతే కున్ద మన్తస్తుషారం
స చ ఖలు పరిభోక్తుం నైవ శక్నోమి హాతుమ్"

"ఇట్లు సంప్రాప్తమైన నిర్దుష్ట మగు నీ రూపమును ప్రథమపరిగృహీతమగునా, కాదా యను శంకచేత మంచు గర్భములోనున్న మల్లెపూవును తుమ్మెదవలె అనుభవించుటకును వదలుటకును చాలకున్నాను." అనుకొన్నాడు. చివరకు. శార్ఙ్గరవుని గూర్చి—

"మూఢః స్యా మహ మేషా వా
వదే న్మిథ్యేతి సంశయే
దారత్యాగీ భవా మ్యాహో
పరస్త్రీస్పర్శపాంసులః"

"ఈమెను చెట్టపట్టియు మరచిపోయిన మూఢుడనా, లేక ఈమెయే అసత్యమును పలుకుచున్నదా అను సందేహము నకు గురియైననేను ఈమెను పరిగ్రహింపకున్న దార త్యాగ దోషమునకును, పరిగ్రహించిన పరస్త్రీస్పర్శదోషమునకును పాత్రుడను గావలసివచ్చు" నన్నాడు. అప్పుడు దుష్యంత పురోహితులు ప్రసవపర్యంత మామె నింటనుండనిచ్చి, పుట్టిన కుమారుడు చక్రవర్తిలక్షణోపేతుడైన (మునులయాశీస్సట్టిది గావున) పరిగ్రహింపుమని ఉపాయము చెప్పినాడు.

వస్తుతః కాళిదాసుని దుష్యంతునికి శకుంతలను మోసగింపవలయునని లేదు. ఆతనికున్నదెల్ల పరస్త్రీపరిగ్రహదోష భీతియే. అందుకే తన్ను పలువిధముల నమ్మింపజూచు శకుంతలను గూర్చి నిర్దాక్షిణ్యముగా—

"వ్యపదేశ మావిలయితుం
కి మీహసే జన మిమంచ పాతయితుమ్"

"పరస్త్రీ పరాఙ్ముఖమైన మా కుల గౌరవమును పాడొనర్చుటకును, నన్ను పతితు నొనర్చుటకును ఏల చూచెద" వన్నాడు. నీ వన్నను నన్ను పెండ్లాడితివని యిచ్చటికి వచ్చుట చేతనే పతితవైనావనియు, పతితులగువారు పవిత్రులను పతితులను చేయుటకే యత్నింతురనియు ఇందలి ధ్వని.

కాళిదాస కావ్యనాయకు లీ విధముగా పరనారీ పరాఙ్ముఖులును, భార్యా మాత్ర సంతుష్టులును అని తెలియుచున్నది.

దుష్యంతుడు ఆదర్శ పరిపాలకుడుగా గూడ కాళిదాసుచే చిత్రితుడయినాడు. ప్రజలను కన్నబిడ్డలకంటెను మిన్నగా చూచుకొను రాజధర్మమును దుష్యంతుడు మఱవలేదు. ఆ ఱేనికి స్వనామాంకితమగు నంగుళీయకమును గాంచిన పిమ్మట శకుంతలావృత్తాంతము జ్ఞప్తికి వచ్చినది. ఆతడు విమనస్కుడై యున్నాడు. అట్టి సమయమున సముద్రవ్యాపారము చేయు ధన మిత్రుడను వణిజుడు మృతుడైనాడనియు, ఆతడు అనపత్యుడైనందున వానిధనము రాజుగారికి చెందవలసి యున్నదనియు మంత్రి మనవి చేయును. అప్పుడు దూరదృష్టి గల దుష్యంతుడు —

"కష్టం ఖ ల్వనపత్యతా. బహుధనత్వా ద్బహుపత్నీకేన తత్ర భవతా భవితవ్యం. విచార్యతాం యదికాచిదాపన్నసత్త్వా తస్య భార్యాసు స్యాత్ ?"

"బిడ్డలు లేకుండుట కష్టముకదా. ఆతడు ధనవంతుడైనందున వానికి పెక్కురు భార్య లుండవచ్చును. వారిలో నెవ్వతెయైనను గర్భవతియేమో విచారింపుడు" అన్నాడు. వ్యాపారి సొక్కమునంతను బొక్కసములో జమకట్టుమనక, పుట్టబోవు సంతానమును గూర్చియు విచారించుచున్న దుష్యంతుని మానవధర్మరక్షణ మెంతఘనమైనది! ఇంతకన్న ఉత్తమ మానవ సంస్కృతి యేమి కావలయును! తరువాత ఆతని భార్యలలో సాకేతశ్రేష్ఠికూతురు గర్భవతియని తెలిసికొని పిత్ర్యమగు నీ ధనమున కా గర్భముదే అధికారమని మహోదారముగా పలికినాడు. ఈ సందర్భమున మంత్రికిలేని దూరదృష్టిని, ధర్మప్రవణతను గూడ రాజు ప్రకటించి పాలకులకు మార్గదర్శకుడయినాడు. ఈ సందర్భముననే దుష్యంతుడు "సంతానమున్నదా, లేదా యను విచారణ చేయక ఈ విధముగా చాటించవలసిన దన్నాడు.

"యేన యేన వియుజ్యన్తే ప్రజాః స్నిగ్ధేన బన్ధునా
సస పాపా దృతే తాసాం దుష్యన్త ఇతి ఘుష్యతామ్."

"ప్రజలకు ఏ యే బంధువులతో వియోగము సంభవించిన, ఆ యా బంధువులులేని కొరత దుష్యంతునివలన తీరును. ఇచ్చట పాప సంబంధమునకు మాత్రము మినహాయింపుడు!" అనగా దుష్యంతుడు తల్లి లేనివారికి తల్లి, తండ్రి లేని వారికి తండ్రి, సోదరాదులు లేనివారికి సోదరాది కల్పడు. బిడ్డలురేనివారికి, బిడ్డ అయి, ఆ యా ధర్మములను తానే నెరవేర్చి వారిని సుఖపెట్టును. కాని భర్తలేనివారికి మాత్రము భర్తకాడు. అట్లయిన పాపమునకు తావు చిక్కునుగదా. కావుననే "పాపాదృతే" అని వాడినాడు. భార్యపోయినవారికన్నను ధనాది సాహాయ్యముచేసి ఇంకొక భార్యను సంపాదించి పెట్టవచ్చునుగదా !

కాళిదాస కవీంద్రుని దిలీపుడు గూడ ప్రజా పరిపాలనమున ఇట్టివాడే —

"ప్రజానాం వినయాధానా ద్రక్షణా ద్భరణా దపి
స పితా పితర స్తేషాం కేవలం జన్మహేతవః"

ప్రజలకు వినయాది గుణములు మప్పి సన్మార్గ వర్తనుల నొనర్చుటలోను, భయాదులనుండి రక్షించుటలోను, అన్నపానాదు లొసంగి భరించుటలోను వారికి దిలీపుడే పిత. ఇక ఆ ప్రజల తల్లిదండ్రులో, కేవలము జన్మదాతలు మాత్రమే.

సంస్కృత కావ్యనాటకములలోని నాయకులు పెక్కురిట్టి ప్రజాపరిపాలన దీక్ష కలవారే. భవభూతి యుత్తరరామచరిత్రములోని శ్రీరాముడు గూడ—

"స్నేహం దయాంచ సౌఖ్యం చ యదివా జానకీ మపి
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా."

లోకారాధనము కోసమై స్నేహమును, దయను, స్వీయ సౌఖ్యమును, కడకు ప్రాణమునకు ప్రాణమైన జానకిని సైతము త్యాగము చేసియు, నేను బాధపడనన్నాడు. అహో! ఎంత మానవసేవా తాత్పర్యము ! ఎంతటి లోకారాధన దీక్ష!

శ్రేష్ఠి మరణవృత్తాంతముచేతను, తదనపత్యతా ప్రశంసవల్లను దుష్యంతుని మనోవైకల్యము మరియు గాఢమైనది. అతని కిప్పుడు అభిజ్ఞాన సందర్శనమువలన శకుంతల బుద్ధ్యారూఢ యైనది. ఆమెను తిరస్కరించినందుకు పశ్చాత్తాపము కలిగినది. పైగా మిక్కిలి ఆమె గర్భవతియు గదా! తద్గర్భస్థ శిశువు తనకు వంశకరుడు గావలసిన చక్రవర్తి. అట్టి గర్భవతియగు శకుంతలను స్త్రీరూపమున నున్న ఒక జ్యోతి యెత్తుకొని పోయినది. కనుక ఆమె యేమైనదో, తనకు మరల దక్కునో, లేదో దుష్యంతునకు తెలియదు. ఎట్లయినను ఆతడు సిరి రా మోకాలొడ్డి నిరాకరించినాడు. కనుకనే తన్నాతడు "ఉపస్థితశ్రేయోవమాని"నని నిందించుకొన్నాడు. తాను అనపత్యుడైనందున తన పితరులు లుప్తపిండోదకక్రియు లగుదురని ఆతడిట్లు దురపిల్లినాడు.

"అస్మాత్పరం బత యథాశ్రుతి సంభృతాని
కో నః కులే నివపనాని నియచ్ఛతీతి
నూనం ప్రసూతి వికలేన మయా ప్రసిక్తం
ధౌతాశ్రుశేష ముదకం పితరః పిబన్తి."

"దుష్యంతుడు సంతాన హీనుడైనందువల్ల అతని తరువాత మనకు శ్రాద్ధాదులు చేయువారుండరుగదా యన్న దిగులుతో నా

పితరులు నే చేసిన ఉదకతర్పణాదులను స్వీకరింతురు'' సంతాన హీనతకై కుందిన దిలీపుడు స్వైతము ఇట్లే విచారపడును—

''నూనం మత్తః పరం వంశ్యాః పిండవిచ్ఛేద దర్శినః
న ప్రకామభుజః శ్రాద్ధే స్వధా సంగ్రహతత్పరాః''

కాళిదాస కావ్య నాయకులు సంతానార్థమే గృహస్థులగు ధర్మ మూర్తులు (ప్రజాయై గృహమేధినాం)గాన, సంతానాభావమున వారు పితృదేవతలకు పిండ విచ్ఛేదము కలుగునని దుఃఖించుటలో నెంతయో ఔచిత్యమున్నది.

దుష్యంతుని శకుంతలాప్రణయము కామ వాంఛతో ఆరంభమయినది. ఆతడు అనాఘ్రాతపుష్పమువంటి శకుంతల లోకోత్తరసౌందర్యమునకు ముగ్ధుడై ఆమెను వలచినాడు. అయినను ధర్మ పురుషార్థసమ్మతమయిన ఆకామము పవిత్ర దాంపత్య ప్రేమగా పరిణతమగుటకు వలసిన బీజములు మొదటి నుండియు విత్తబడుచునేయున్నవి. ఆ ప్రేమ నిర్వహణసంధిలో ఫలితావస్థకు వచ్చినది. పవిత్రమగు ఋష్యాశ్రమ వాతావరణమున నాటబడిన ఆ ప్రేమ బీజము ధర్మ సమ్మతముగాను, సంస్కారయుక్తముగాను అంకురించి, పల్లవించి పుష్పించి, ఫలించుటకు వలసిన దోహదముల నన్నిటిని మహా కవి మొదటినుండియు కడు జాగరూకతతో చేయుచునే యున్నాడు. ఈ ప్రేమ శరీర సౌఖ్యసంపాదకము మాత్రమే కాక, ఐహికాముష్మిక ప్రయోజకమై ఆదర్శప్రాయమై ఆత్మోద్గతికిని, స్త్రీ పురుషుల పురుషార్థసిద్ధికిని హేతువు కావలయుననుటయే మానవ ధర్మము. అందుకే కణ్వుడు శకుంతలను పతిగృహమునకు పంపుచు లౌను ఆరణ్యకుడయ్యును ఎన్నియో లౌకిక ధర్మముల నామెకు బోధించి గేస్తుల మానసికావస్థకు తాను స్వైతము గురియై మానవత్వమును ప్రదర్శించినాడు.

కడకు శకుంతల తపోవనమును వీడవలసి వచ్చినందుకు దుఃఖించుచు ''మరల నెప్పు డీ తపోవనమును చూడగలను నాయనా ?'' అన్నప్పుడు గృహస్థుల పరమధర్మము నిట్లు గ్గడించినాడు.

''భూత్వా చిరాయ చతురంత మహీసపత్నీ
దౌష్యన్తి మప్రతిరథం తనయం నివేశ్య
భర్త్రా తదర్పితకుటుంబభరేణ సార్ధం
శాన్తే కరిష్యసి పదం పునరాశ్ర మేస్మిన్''

''చాలకాలము రాజ్యభోగములనుభవించి, అప్రతి రథుడైన కొడుకునుగని, వానికి కుటుంబ భారము నప్పగించి, మగనితో గూడ ప్రశాంతమగు నీయాశ్రమమునకు రాగల వమ్మా !''

వార్ధకమున మునివృత్తిగదా కాళిదాస కావ్యనాయకుల ధర్మము. కావున శకుంతలాదుష్యంతులు భరతునికి పట్టము గట్టి మోక్షపురుషార్థసాధనమునకు ఆశ్రమవాసము చేయ వలయును.

ఈ సందర్భమున విక్రమోర్వశీయములోని పురూర వుని ఊర్వశీ ప్రణయము ధర్మ సమ్మతమా, అని ఒక శంక రావచ్చును. ఊర్వశి దేవవేశ్య. ఆమె ఏ ఒక్కరికిని భార్యకాదు. ఆమెనుకామించుటకు ప్రతిపురుషమాత్రునికి నధికారమున్నది. అది యునుగాక ఊర్వశీ పురూరవులకు బుట్టిన కుమారుడే వంశ కర్తగావలసి యున్నాడు. కావునను కాళిదాసు చేసిన తత్ప్రేమ వర్ణనము సముచితమును, ధర్మసమ్మతమును అగుచున్నది.

కాళిదాసిట్లు తన కావ్యములలో మానవ ధర్మమును, సంస్కృతిని అమోఘముగా నిరూపించినాడు. ఈ సంస్కృతి భారత సంస్కృతి మాత్రమేకాదు. విశ్వ మానవసంస్కృతి. ఈ ధర్మము భారతధర్మము మాత్రమేకాదు. విశ్వ మానవ ధర్మము. మానవ జాతికి సంపూర్ణ సుఖ శాంత్యా నందముల ప్రసాదించు సర్వమార్గములు ధర్మ—సంస్కృతి శబ్దవాచ్యములు కావచ్చునని యొప్పుకొన్నచో, దీనిని విశ్వ మానవధర్మము—సంస్కృతి అనుట కెట్టి యభ్యంతరము ఉండరాదు. ఇంతకన్న ఉత్తమములగు మానవతా సంపాదన మార్గము లెవరైన నిరూపించినచో వానిని గూడ విశ్వ మానవ ధర్మ—సంస్కృతిసింహాసనమునుంచి పట్టాభిషేకము చేయుట కెవ్వరికిని అభ్యంతరముండకూడదు. కడకు కాళిదాసు తన పరమ లక్ష్యమును అభిజ్ఞానశాకుంతల నాటక భరతవాక్య మిషతో ఇట్లు స్పష్టము చేసినాడు—

''ప్రవర్తతాంప్రకృతిహితాయ పార్థివః
సరస్వతీ శ్రుతిమహతాం మహీయసాం
మమాపి చ క్షపయతు నీలలోహితః
పునర్భవం పరిగతశక్తిరాత్మభూః''

'' రాజు (ప్రభుత్వము) ప్రజా హితముకొరకే ప్రవర్తించుగాక. చదువుకొన్న మహనీయులగు రచయితల వాక్కు గూడ ప్రజాహితసంపాదకమే అగుగాక. సర్వ శక్తియగు పరమేశ్వరుడు నాకు పునర్జన్మ లేకుండ జేయుగాక.'' ఇందు ప్రభు త్వముగాని, కవులుగాని ప్రజాహితమునకే ప్రవర్తింపవలయు ననుటచేత, కవి—ప్రభుత్వముమీదను, కవులమీదను ప్రజా క్షేమ సంపాదన కెంతయో గొప్ప బాధ్యత మోపినాడు.

ఈ వ్యాసమున కాళిదాస నిరూపితమానవతా సంస్కృ తులనుగూర్చి కొలదిగా మాత్రమే ముచ్చటించినాను. కేవల మానవతాప్రతిపాదన మొక్కటే కాళిదాసు కావ్య లక్ష్యముగా భావించలేదు. కావ్య సౌందర్యసిద్ధికి వలసిన అంగ ముల నన్నిటిని అతడు ఔచితీయుతముగా ఆదరించి పోషించి నాడు. పాఠకుల శక్తి సామర్థ్యములను—సంస్కారములను అనుసరించి ఆకవి లోకోత్తర ప్రతిభాదిసుగుణసంపత్తి వ్యక్తమగుచుండును. కాళిదాసమహాకవి కావ్యములు విశ్వ మానవకోటికి త్రికాలోపాస్యములు.

మధువ్రత నిర్వాహణము

శ్రీ మిరియాల రామకృష్ణ

వాలుఁగనుల్ చలింప కయి వ్రాలిన మోమున సంపువంపులై
మూలలమూలలన్ నిలిచి ముచ్చటగా చెలికారమాడుకో
వీలునఁబొంగు సిగ్గులకు వెన్నెలఁజల్లు ప్రియాసుహాసముం
బోలిన పూలగుత్తి మధువుల్ గొను నాయెడ నూరవేధ్వనుల్.

ఆగవు లీల! నా 'పదము' లామనిపూ లభిసారికల్ వలెన్
రాగకపోలలై నవపరాగపరీమళలై వనీలతల్
మూఁగగ మూఁగ లేతనగవుల్ పచరింప సమీరకర్ణవీ
ధీగళితంబుగా పెదవి తీయనిపాటల సంచరించుచున్.

కీరమయూరశారికల కేకల కోకిలరాజకంఠరే
ఖారమణీయకాకలుల కన్నులు విప్పి తుషారధార పైఁ
బాఱఁగ క్రుంకులాడి పలువన్నెల ఱెక్కలు దాల్చి యేడకో
పారఁగఁజూచు పూలు నిలువంబడిపోవును నేను వచ్చుటన్.

నాకనుగొన్న వాసనలు నాగళఝుంకృతులన్న యివ్వి రెం
డే కనిపించు లోకమున కెందును గావున రాసనర్తన
శ్రీ కళ, కేళి సల్పు సుఖజీవన లీ మకరంద సుందరుల్
చేకొనలెత్తి పిల్చెదరు చేకొన 'పాత్ర' ననున్ మధువ్రతున్.

ఆఁకలికొక్క వేళయని యాఁగఁలే నది యెంత తేనెయున్
నాకొక గ్రుక్కయే యగును నామెలుఁగంటిన కార మెంతయో
సాకెద నంత తేనె; సరసన్ విడిపోవని మంట జీవిత
శ్రీకృతి శిల్పమున్ విరుల రేకులఁబోయుదు నచ్చువేయుదున్.

ఈ వెతలంటు సంగముల యెల్లల తేనెలుగాఱు పూవులన్
తావుల నిల్చుకోక నిరతమ్ముగ నిల్చుట కోపలేని నా
జీవనమెల్ల మన్మథుని చేతనె లాఁగఁగబడ్డదౌట నా
మోవికి ఝుంకృతుల్ గురువుమోమున నేర్వకమున్నె పుట్టెడున్.

మ్రోఁగుదు నేను పూల నరమోద్పుఁగనుల్ పులకింప. నందుచే
నా గడియించు సౌఖ్యకరనవ్యతరానుభవమ్ము లిట్టివం
చే గతి విప్పి వాకొనుట కింద్రియబాల్యములడ్డ నర్థమే
వాగతివేలరీతిఁగని పాడుదు నీధ్వనిగర్భఝుంకృతుల్.

మల్లెల మాపులన్ మలఁగి మాపులతేపుల మారుతధ్వజం
బెల్లెడ నెత్తి మాయక చరించెడు నా భవవల్లి మన్మథుం
డల్లును 'నారిరూపమున' నంచెద మాధవసన్నిధాన సం
ఫుల్లములైన పూల వలపుల్ గని కృష్ణతనూవిలీనతల్.

ఆవిలమైన నా భవమునందు వసించిన పంచభూతముల్
కావిరిమబ్బువోలె నను గారచియించును గావునన్ సుధా
నావలో చందమామలో యనన్ గనిపించెడు పూలపజ్జకున్
బోవఁగ నెంచి నాదు"పదముల్" పచరింతును మాధవంబుగన్.

ఆ పరమాత్ముఁబోలె తనువచ్ఛముగా తెలుపైన పూవు సం
ధ్యాపవమాన రేఖపయి తాండవమాడ తలంచినట్లు కం
ఠోపరి నైల్యహేలవలె నుండ ననున్ బిలిపించు, కాలకూ
టోపమవేదనల్ గలిగియుండియు శాంతరుచిన్ వెలుంగుటన్.

వెన్నెల తున్కలై యిటులు వేర్పడి కొమ్మల మీఁదఁపడ్డయ
ట్లున్న విరుల్ గుబుల్కొనుట లుర్వర మీఁదనె నేర్చి నూత్నసం
పన్నములైన తేనెలకు పాకములబ్బెనో లేదో చూడుమం
చున్నవి యున్న యట్లు రుచులూరఁగఁ బూయును నాదుమోవికిన్

రంగులు గాఱు రేకుల మరందధురంధరమైన మంజరుల్
బెంగగఁజూచు మన్మథుని పిల్పులచే పవమానమానసో
త్తుంగతరంగవేగమున దూరమువోయెడు నన్ను వీడుకో
గం గనుమోడ్చి మూర్ఛవడి గాసిలి రూపఱు మట్టిలోపలన్.

మంచువలన్ కలంతపడు మంజరులన్ కరుణించు సూర్య శౌ
ర్యాంచితరూపదీపమున కర్చన సేయుచు వృక్షవల్లరీ
సంచయనూత్నదంపతులు సంగడి నా శ్రుతిసూక్తిపొంకు రా
వించి మరందగంధ సముపేతము లిచ్చెద రాతిథేయముల్.

అంబుధివేణి రాలిన నవాంబు వజాండకటాహమందు నిం
డం బయిపైన నిల్చి పవడమ్ముల కొమ్మ నధఃకరించు సం
ధ్యాంబరలక్ష్మి జాఱిన యొయారపురంగుల పైటయంచువో
లెం బొడసూపు తీగలను లీలగ నంటు నెవండు నేవినా.

నావలె నల్లనై చెలఁగు నాచెలి కోయిల జీవితంబు నా
భావమునం దుపఃఫలము పండు నుగాదుల నింపుచుండు. శా
ఖీ విడగొట్టు తొల్కరుల నేడ్చి రహఃస్మృతి నేగి యేగి శా
ఖావళి పుష్పవీణ కడనాగి విలాపము లాలపించెదన్.

ఆ మధుమాస మొక్క కలయ ట్లరుదెంచునో లేదొ యంత నెం
తో మధురధ్వనుల్ సెలఁగుచుండుపికమ్మును వచ్చు; నిర్వరున్
మామిడికొమ్మ నెక్కియల మాధవుఁడిచ్చిన పూలొ ఆకులో
మోమున కద్దుకొంచు భవమున్ తరియింతుము భక్తిగీతులన్.

చీమలు సీతకోకలగు చిల్కలు చిల్కలు గోరువంకలు
న్నామని కానుపించు నపుడప్పుడు మోదుగుచీర కట్టి య
య్యామని వచ్చి తేనియల నామెత్త చేసిన నాఁడె కాని, నే
నో! మనియుండు సర్వఋతునూతనపుష్ప మరందమానుచున్.

ఎంతగ వెన్నెలల్ పయిపయింబడినన్ నగఁజాలనట్టి పూ
లంతల బాలసూర్యదరహాసము గన్గొని నవ్వి గుండె ని
శ్చింతగ రేయి రక్తిమెయి చెందిన సౌఖ్యసమాధి వీడి నా
యంతరభావముల్ కవితయందు వెలార్చ వెలార్చు వేకువన్.

ఱెక్కలు లేవు పత్రములు లేవు మరందము 'లప్వ'గాఁగ నిం
పెక్కలతొంత కొంతలిడ నీయుదరానల మార్చి వేయుచుఁ
ఱెక్కలమీఁదనే బ్రతికి రింగున నెక్కడికేనిఁ బోవు నా
కొక్కని కిట్లు చూపగ నహో యనిపించును 'సౌమనస్యముల్'

పచ్చగ నెఱ్ఱగా, కనులఁబడ్డపువుల్ వెలార్చు పూ
లచ్చపుఁ దేనియల్ పెదవులందున దాఁచిన పూలు వెన్నెలన్
విచ్చిన నీలిపూ లనుభవించుచు, పాడిన నాదు ఝుంకృతుల్
ముచ్చటవిన్న "వారి"పయి-పూజలహో యివి "యుత్పలావళుల్ !"

కథకచక్రవర్తి సామర్సెట్ మామ్

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

సుప్రసిద్ధ విమర్శకుడు సిరిల్ కొనోలీ, "న్యూ స్టేట్స్ మన్" పత్రికలో వ్రాస్తూ సామర్సెట్ మామ్‌ను 'కథక చక్రవర్తి' అంటూ వర్ణిస్తాడు. "సమకాలీన పాశ్చాత్య రచయిత లలో ఇంతకన్నా గొప్పవాడు లేడు. ఈ మాటను మనం సగర్వంగా చెప్పుకోవచ్చు" అంటూ ముగిస్తాడు కోనోలీ తన వ్యాసాన్ని. ఇరవై మూడేళ్ల వయసు కూడా నిండకుండానే తన మొట్టమొదటి పుస్తకాన్ని ప్రచురించి, అప్పటినుండి ఈనాటిదాకా, దాదాపు ఒక అర్ధశతాబ్దానికి పైగా సర్వ పాశ్చాత్య ప్రపంచంలోనూ తలమానికంగా గౌరవింపబడుతున్న విలియమ్ సామర్సెట్ మామ్ కథకుడు మాత్రమే కాదు, నవలా రచయిత కూడాను. నవలా రచనతోనే సంతృప్తి పడకుండా మహోత్తమమైన నాటకాలను సృష్టించాడు. వీటికితోడు ఆధునిక సాంకేతికశాస్త్ర విజ్ఞానప్రభావం కారణంగా, సినీమాలోకంలో దర్శక నిర్మాత కూడా అయి జనతచేత ఔననిపించుకున్నాడు. ఇలా కథా రచయితగా, నవలా కారుడుగా, నాటక రచయితగా, దర్శక నిర్మాతగా ఒక్క వ్యక్తి రాణించడం ఈ ఆధునిక యుగంలో ఒక వింత మాత్రమే కాదు, అతని మేథాసంపత్తికీ, ప్రజ్ఞాప్రాభవానికీ ఒక నిదర్శనం కూడా.

జీవిత విశేషాలు

సామర్సెట్‌మామ్ ఆంగ్లసంస్కారాన్ని పుణికి పుచ్చుకున్నాడు. కేంటర్‌బరీ స్కూలులో చదువుకుని, హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో కొంతకాలం అధ్యయనం సాగించి, ఆతర్వాత లండనులో వైద్యశాస్త్రాన్నభ్యసించాడు. ఆ తర్వాత, కాదు, అప్పటినుంచీ దేశయాత్రలు చేస్తూనే ఉన్నాడు. భారత దేశం, బర్మా, సయామ్, మలయా, చైనా, దక్షిణ సముద్ర ద్వీపాలు, రష్యా, అమెరికా దేశాలు, ఇలా సర్వప్రపంచాన్నీ, ప్రజల జీవన విధానాన్నీ, అందులోని వైవిధ్యాన్నీ, వారి వారి మతాలను, సంప్రదాయాలను, మూఢ నమ్మకాలనూ, సంస్కారాలనూ అన్నిటినీ ఆకళింపు చేసుకుని, ఈ విజ్ఞానంతో తన ఊహాలోకాలను మరింత విస్తృత పఱచుకున్నాడు. లండన్, ప్యారిస్, న్యూయార్క్, ఫ్రెంచి రైవీరియా ఈ నాల్గింటినీ తన కథా కథనానికి కేంద్రాలుగా చేసుకున్నాడు. లండన్‌లో సెయింట్ థామస్ హాస్పిటల్‌లో వైద్య విద్య నభ్యసించి తన రచనల ద్వారా జగత్ప్రసిద్ధి పొందిన సామర్సెట్ మామ్‌కు, సన్మానాలు, గౌరవ పతకాలు అసంఖ్యాకంగా లభించాయి. రాయల్ కాలేజి ఆవ్ సర్జన్స్‌లో అతను శాశ్వత సభ్యుడు. రాయల్ కాలేజీ ఆవ్ ఫిజిషియన్స్‌లో అతను గౌరవ పట్టభద్రుడు. కాలన్ విశ్వవిద్యాలయం అతనికి 'డాక్టర్ ఆవ్ లాస్' నిచ్చి తనను తాను సన్మానించుకుంది. వీటన్నింటికి తోడు ఫ్రెంచివారిచేత 'కమాండర్ ఆవ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్' అని గౌరవింపబడిన ఒకే ఒక ఆంగ్ల రచయిత సామర్సెట్ మామ్. ఇట్లా మూడు సాహిత్య తరాలలో అవిచ్ఛిన్నంగా సాగిన మామ్ జీవితం, ఒక్క కవిత్వాన్ని మినహాయించి, తదితర సాహిత్య శాఖల నన్నింటినీ తనవిగా చేసుకొన్నది. ఒక్క వర్గానికి చెందిన పాఠకులనే గాక, ఇంగ్లండులోనూ, అమెరికాలోనూ, వారు మేథావులైనా లేక సామాన్యులైన చదువరుల



సామర్సెట్ మామ్

తరగతికి చెందినా, అన్ని వర్గాలనూ ఆకర్షించాడు. పాశ్చాత్య ప్రపంచంలో ఒక రచయిత మేధావులవర్గానికి చెందిన వాడూ అనగానే అతనిని మామూలు పత్రికలు చదివే సామాన్యులు తమకు చెందినవాడు కాదంటూ వెలి వేసేవారు. అట్లాగే మామూలు పాఠకులలో మంచిపేరు సంపాయించుకున్న ఒక రచయితను తక్కువచేసి చూచేవారు మేధావులు. 'హై బ్రోస్' 'లో బ్రోస్' అంటూ సమాజమంతా రెండు విభాలుగా తనను తాను కృత్రిమంగా విభాగించుకున్న తరుణంలో, ఈ అఖాతానికి నేర్పుగా వారధిని కట్టినవాడు సామర్సెట్ మామ్. మేధావులు, సామాన్యులూ కూడా నిన్నటికి చెందిన డిక్కన్స్, థేకరీ, హార్డీలను ఎలా సమానంగా గౌరవిస్తున్నారో, అలాగే ఈనాడు 'నేటికి చెందిన' మామ్‌ను గౌరవిస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో బెర్నార్డ్షా లాంటివారు, సాహితీ ప్రపంచాన్ని బెదిరించి మచ్చిక చేసుకొన్నవా రొక రిద్దరెక్కడో ఉన్నా, ఇలా సామర్సెట్ మామ్ లాగా సమాజాన్ని దాని గుణదోషాలలో తన రచనలలో ప్రతిబింబింపజేసి దగ్గరకు తీసుకున్నవారు చాలా తక్కువ. పైగా ఆధునిక యుగంలో ప్రతి రచయితా తనను కథకుడుగానో, కవిగానో, నాటకకర్తగానో మాత్రమే వూహించుకునీ తన శక్తినంతటినీ అలా కుంచించబడిన కృత్రిమమార్గంలోకి మళ్లిస్తున్న సమయంలో, అనేక రకాల 'ప్యాషన్లకు', అనేక విధములైన రచనా పద్ధతులకు నీరుపోసిన సామర్సెట్ మామ్ నిజంగా ప్రాతఃస్మరణీయుడు.

ఈ కారణంగానే మామ్ రచనలలో ప్రథమార్థానికి చెందిన వాటికీ ద్వితీయార్థానికి చెందిన వాటికీ ఎంతో తేడా కన్పిస్తుంది. ఈ తేడా శైలిలో కన్పిస్తుంది. వస్తు సేకరణలో కన్పిస్తుంది. జీవితాన్నిగూర్చి అతను ప్రకటించిన అభిప్రాయాలలో కన్పిస్తుంది. 'లిజా ఆవ్ లాంబెత్' విక్టోరియా యుగంలో చిట్టచివ్వరి దశకు చెందిన నవల అయితే 'లేడీ ఫ్రెడరిక్' ప్రవర్తనలకు చెందిన నాటకంగా ఎడ్వర్డ్ యుగానికి చెందినదిగా పేరుపొందింది. 1920 ఆ ప్రాంతాల్లో, అంతా మిథ్య అన్న తత్వంలో 'ది సర్కిల్', 'అవర్ బెటర్స్' అనే నాటకాలను వ్రాసిన మామ్ 1930 ప్రాంతం వచ్చేసరికి ఆధి భౌతిక వాదానికి చెందిన ది రేజర్స్ ఎడ్జ్ వంటి నవలలను వ్రాయడం ప్రారంభించాడు. ఈ నవల సినీమా రూపాన్ని కూడా పొందింది.

మామ్‌మీద ప్రసరించిన ప్రభావాలు

సామర్సెట్ మామ్‌కు ఫ్రెంచి దేశమూ, ఫ్రెంచి నాగరిత అంటే ఎంతో యిష్టం. ఎప్పుడూ వాటిని గురించే ఆలోచిస్తూండేవాడు. అతని కథల్లో చాలావాటికి రంగస్థలం ఫ్రాంసు దేశం. అతని రచనలలో సంభాషణా పద్ధతి ఫ్రెంచి వారి ననుకరిస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి అతను ఇంగ్లీషులోనే వ్రాసినా, అది ఏ ఫ్రెంచి జాతీయానికో అనువాదమో, అనుసరణమో అనిపించేది. అంతగా ఆకర్షించినవి ఫ్రెంచి భాషా, ఫ్రెంచి జీవనవిధానమూ అతనిని. మామ్ తనమీద ప్రసరించిన ఈ కాంతి కిరణాన్ని అందరికీ సగర్వంగా చూపించాడు. ఫ్రెంచిరచయితలనుండి ముఖ్యంగా మొపాసా దగ్గర నుండి తాను ఎంతో నేర్చుకున్నా నంటాడు మామ్.

ఒకచోట యిలా వ్రాస్తాడు కూడానూ. "ఫ్రెంచి దేశం నాకు చదువు చెప్పింది. ఫ్రెంచి దేశం నాకు దివ్యమైన అందాన్ని, అలౌకికమైన అనుభూతులనూ, మంచి తనాన్నీ, మనిషిలోని ప్రత్యేకతలను ప్రేమించడం నేర్పింది. చివ్వరకు ఫ్రెంచి దేశమే ఎట్లా వ్రాయాలో గూడా నాకు నేర్పింది."

ఫ్రెంచిపద్ధతులు తెలియని అనేకమందలి ఆంగ్ల అమెరికను పాఠకులకు సామర్సెట్ మామ్ మొట్టమొదటి సారిగా ఆ సంస్కృతి ఎంతటి మహత్తరమైనదో తెలియజెప్పాడు. ఈ కారణంచేతనే ఫ్రెంచివారికి 'మామ్' అంటే 'మేనల్లుడు' లాంటివాడు.

మామ్ వైద్య విద్య నభ్యసించాడని పైన చెప్పాను. ఈ వైద్య విజ్ఞానం ప్రతిదానినీ పరిశీలించి చూచే గుణం అతనికి అలవాటు చేసింది. స్వాభావికంగానూ కన్పిస్తుం దతని రచనలలో ఇది. ఈ కారణం చేతనే ఫ్లాబర్ట్‌చేత ఆకర్షింపబడిన మొపాసాచేత మామ్ ఆకర్షింపబడ్డాడు.

మామ్ చేసిన దేశ యాత్రలే అతని రచనలకు ప్రాణవాయువు వంటివి. సమాజవర్తనం సమస్తమూ యాంత్రికం కావడం మూలాన, 'కాస్మొపాలిటన్' స్వభావం ఉన్న నగరాలు, అందలి ప్రజలూ మాత్రమే అతని నాటకాల్లోగానీ, నవలల్లో గానీ చోటు చేసుకో గలిగారు. అయితే మాత్రమేమి ? బ్రిటిషు, ఫ్రెంచి వలసలు, అక్కడ క్రైస్తవ మిషనరీలు చేసిన ఆగడాలు, అతను వర్ణించవే వర్ణించాడు. ఉదాహరణకు రెయిన్ అన్న అతని పెద్ద కథ చదివిం తర్వాతనే చాలామంది పాశ్చాత్యులకు తమ తమ వలసలలో మిషనరీ వ్యవస్థ ఎలా పనిచేస్తున్నదీ తెలిసింది.

కాస్మొపాలిటన్ వ్యవస్థ ప్రభావమూ, ఫ్రెంచి సంస్కృతి అంటే మామ్‌కు గల గౌరవాభిమానాలూ, తూర్పు దేశాలలో అతని పర్యటనమూ,—ఇవే అతని రచనలను తీర్చి దిద్దినవని నా అభిప్రాయం కాదు. అతనిమీద ఎన్ని రకాల ప్రభావాలు కన్పించినా, ఆంగ్లదేశం అతని స్వర్గఖండం. కావడం మూలాన, మానసికంగా అతను ఇంగ్లీషువాడుగానే ఉండగలుగుతునా డు. ది రేజర్స్ ఎడ్జ్ అన్న రచనలో—దీనిలో కాకతాళీయంగా కథానాయకుని పేరు మిస్టర్ మామ్—అమెరికన్ ప్రజల స్వభావాన్ని ఇంగ్లీషువారి రంగుటద్దాలనుండి పరిశీలించడం అంటూ ఒక ప్రక్కన చెప్తూనే, ఇట్లా ఒక దేశపు వ్యక్తి మరొక దేశపు ప్రజల జీవనవిధానాన్ని పరిశీలించి అర్థం చేసుకోడం అస్వాభావికమే కాదు, అసంబద్ధం కూడాను. అంటూ తనను తాను తెలియబరచుకొంటాడు సామర్సెట్ మామ్.

'ఎ రైటర్స్ నోట్‌బుక్' అన్న పుస్తకంలో ఇలా వ్రాస్తాడు:

కథకచక్రవర్తి సామర్సెట్ మామ్

"దేశంకాని దేశంలో, ఆ ప్రజలను అర్థం చేసుకోవడం ఒక మామూలు విద్యార్థికి సాధ్యపడేది కాదు. కారణం భాష, సంస్కృతి ఈ రెండింటినీ ఆకళింపుకు తెచ్చుకోడానికి కొన్ని దశాబ్దాల సన్నిహిత పరిచయం అవసరం. ఆంగ్ల, అమెరికన్ దేశాలను కూడా ....., అర్థం చేసుకోడం అంత సులభం కాదు.

ఈ పుస్తకంలోనే, విద్యార్థికీ, రచయితకూ కూడా దేశయాత్రలు ఎంతో విజ్ఞానదాయకాలు అంటాడు మామ్. ఉదాహరణకు; ఆంగ్లదేశంలోనే బయటి ప్రపంచం మొహం చూడకుండా రచనలు చేసినవారు కొన్ని వందలమంది ఉండగా, అంతమందిలోనూ ఒక్క జేన్ ఆస్టిన్ తప్ప మరొకరు మనకు చెప్పుకోడానికి కనబడడంలేదు అంటాడు నిర్మొహమాటంగా మామ్.

అందుచేతనే తను సృష్టించిన పాత్రలను చూచి తనే ఆశ్చర్యపడతాడు. తాను తన నవలలలో నివేదించే యథార్థ విషయాలను గూర్చి నిష్కర్షగా తన అభిప్రాయాలు ప్రకటిస్తాడు. కానీ అవి తిరుగులేని నిర్ణయాల వంటివి కావు. క్రైస్తవులు, పాశ్చాత్య ప్రపంచంలో కాక తూర్పు దేశాల్లో పుట్టి పెరిగినవా రయితే వారిలో క్రీస్తు ప్రభావం కన్నా మహమ్మదు, గౌతమబుద్ధ, హిందూ ప్రవక్తల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది అని చెప్పడానికి కూడా సంశయించడు సోమర్సెట్ మామ్స్ ది రేజర్స్ ఎడ్జ్ లో భారతీయుల నమ్మకాలు క్రైస్తవమతబోధనల కన్నా ఉన్నతమైనవి అని కూడా అంటాడు ఒకచోట.

దీని నంతటినీ పరిశీలిస్తే, మానవస్వభావమూ,అనుభవమూ కూడా వైవిధ్యం కల్గినటువంటివనీ,' ఈ కారణంచేతనే జగద్రహస్య సిద్ధాంతాలను గూర్చి కొన్ని కొన్ని మూఢమైన నిర్ణయాలకు రావడం అవివేకమనీ మామ్ భావిస్తున ట్లర్థమవుతోంది. 'జర్నీ విత్ అవుట్ మ్యాప్స్' అన్న పుస్తకంలో గ్రాహమ్ గ్రీన్ మామ్‌ను గురించి "మానవ మేధ, యుగయుగాలుగా భగవంతుడు సృష్టించా డనుకున్న ఈ మానవుణ్ణి గూర్చి ఎటువంటి పిచ్చి నిర్ణయాలు చేసిందీ నగ్నంగా బయట పెట్టిన మహా రచయిత" అంటూ వర్ణిస్తాడు.

ర చ న లు

పైన చెప్పిన దానికి ఉదాహరణగా రెయిన్ అన్న పెద్ద కథనే పరిశీలించండి. అందులో మిస్టర్ డేవిడ్సన్ కథానాయకుడు. పసిఫిక్ ద్వీపాల్లో ప్రావృట్కాల నీల జలదాలూ, ఏనుగు తొండాల ద్వారా చిమ్మబడినట్లున్న వర్షపు ధారలూ, గడ్డకట్టించే చలికి ఎదురు నిల్చి పోరాడే జీవరాశీ, ప్రళయంలో ప్రశాంతత, అతన్ని ఎంతో ఆకర్షించినవి. డేవిడ్సన్ యిలా అంటాడు : "మే మక్కడకు వెళ్లేవరకూ ఆ ప్రజలకు పాపమంటే ఏమిటో తెలీదు. భగవంతు డిచ్చిన పది ఆజ్ఞలనూ యథేచ్ఛగా నిర్లక్ష్యిస్తూ పాపభూయిష్ఠమైన జీవితాలు గడపుతుండేవారు. పాపం! వాళ్లకు తప్పు చేస్తున్నామని తెలియనే తెలియదుకదా. నేను సాధించిన ఘనకార్యాల్లోకల్లా నా కత్యంతమూ తృప్తినిచ్చేది. ఈ అమాయకుల్లో పాపమన్న భావన, తప్పు చేస్తున్నామన లగ్నిని రగిల్చానుకదా అని." ఇలా తనను గూర్చి ఎంతో పవిత్రంగా చెప్పుకున్న మిస్టర్ డేవిడ్సన్, సేడీ థాంప్సన్ అనే వేశ్యతో ప్రణయకలాపాలకు దిగి ఒకరాత్రి రాత్రంతా పాశవికంగా ప్రవర్తించి, చివరకు ఆత్మహత్య చేసుకుంటాడు. ఈవిధంగా మిషనరీలే కాదు, మత బోధకులు కూడా, ఆత్మసంయమనమూ, ఋజువర్తనమూ లేనివారు మామ్‌చేత అతి తీవ్రంగా విమర్శింప బడ్డారు.

ఆఫ్ హ్యూమన్ బాండేజ్

ఈ నవల 1915 వ సంవత్సరంలో ప్రచురింపబడింది. అతని రచనల కన్నింటికీ తలమానికం వంటిదనీ దీన్ని విమర్శకులు ప్రశంసించారు. ఫిలిప్‌కారే అనే ఒకని జీవితం బాల్యంనుంచి ముప్ఫయ్యోపడి దాటేదాకా ఇందులో అతి సహజంగా వర్ణించబడింది. నవల ప్రారంభింపబడడంతోనే ఒక వైలక్షణ్యం, ఒకానొక విషాదరేఖ మనకు కన్పిస్తుంది. కారే తల్లి చనిపోయిన ఘట్టంలో ఈ మహోత్తమమైన సృష్టి మొదలవుతుంది. అంతకు కొద్ది సంవత్సరాల క్రితమే కారే తండ్రిని కూడా పోగొట్టుకున్నాడు. బ్లాక్‌స్టేబుల్‌కు వికార్‌గా ఉన్న అతని మేనమామ, సిగ్గు సిగ్గుగా అమాయకంగా కన్పించే చిన్నారి కారేను చూచి జాలిపడి తీసుకువెళ్లి పెంచుతాడు. సమాజంలోని అత్యున్నత వర్గాలకు చెందిన పిల్లలు చదువుకునే పాఠశాలలో చేర్పించి చదువు చెప్పించి, కారేను ఒక క్రైస్తవ మత బోధకుడుగా మార్చాలని కలలు గంటాడు. కానీ ఇది ఆ పిల్లవాడికి ఇష్టంలేదు. ప్యారిస్‌కు వెళ్లి చిత్రకళ నేర్చుకోవా లనుకుంటాడు. కానీ త్వరలోనే అందుకు తాను పనికిరానని అతనికే తెలిసివస్తుంది. అప్పుడప్పుడే యౌవనం బలీయమై అతనిలో నిద్రిస్తున్న కోర్కెలను కాటువేస్తున్నది. ఒకప్రక్కన భరింపరాని బీదరికం. మరొకప్రక్కన సువ్యక్తాంగాల పాశవిక ప్రణయ విలయవిలాస లాస్యం. ఏం చేయడం ? చేసేదిలేక ఒకచోట డాక్టరుగా స్థిరపడతాడు. అనుకొన్న అమ్మాయిని కాక, వేరొక వనితను వివాహ మాడతాడు. తనకన్నా చిన్నదైన ఆ చిన్నదాన్ని ప్రేమిస్తాడు. కానీ వలపెరుంగని ఆ ఉవిద అతని ప్రేమకు ప్రతిస్పందన నల్పలేక పోతుంది. ఈ నవలలో అడుగడుగునా కరుణ విషాదాలు మనల నలముకుంటాయి. వికార్ జీవితం నిర్దాక్షిణ్యంగా చిత్రింపబడింది. అతనికి తన మత విధు లక్కరలేదు. పిసినిగొట్టుతనం, నికృష్టమైన జీవన లాలస మనకీ పాత్రలో కన్పిస్తాయి. మూఢ నమ్మకాలు అతనికి పెట్టని సొమ్ములు. భగవంతుని పేరు అతనికి విన్పడకుండా ఉంటే అదే చాలు. అతని రక్తగుణం స్వార్థం. ఈ స్వార్థమే అతని ద్వారా ఫిలిప్‌ను హింసిస్తుంది. భార్యకు అడుగులకు మడుగులొత్తిస్తుంది. చివరకు ఈ నవలలో యౌవనవంతుడై, వేదాంతిగా మారిన ఫిలిప్ కళ్ళముందే వికార్ చనిపోతాడు. ఇదొక విచిత్రమైన కథా సంవిధానం. బహుశా, సామర్సెట్ మామ్ తనకుగల మత నమ్మకాలను, ఇందులో అవహేళన పూర్వకంగా విమర్శించాడేమో అనిపిస్తుంది. శామ్యుయల్

బట్లర్ అన్న రచయిత ది వే ఆఫ్ ఆల్ ఫ్లెష్ అన్న పుస్తకంలో అనుసరించిన రచనా పద్ధతికి, ప్రకటించిన అభిప్రాయాలకు సామర్సెట్ మామ్ ఇందులో చాలా దగ్గరగా వస్తాడు. అయితే మాత్రం ?—బట్లర్‌కూ, మామ్‌కూ హస్తిమ శకాంతరం ఉంది. ఏ మతమైనా మంచిదే. దాన్ని అనుసరించిన వ్యక్తులు దుష్టులైనంత మాత్రాన, మతధర్మం దోష భూయిష్ఠం కాదు గదా ! ఇదే "ఆఫ్ హ్యూమన్ బాండేజ్"లో కూడా వివరింపబడుతుంటది.

కేక్స్ అండ్ ఏల్

మామ్ రచనలతో పాఠకుకు అన్ని విధాలా సంతృప్తిని కల్గించేది ఈ నవల. కలంపురుషుడుచేతిలోని కరకు కరవాలానికి ఎదురొగ్గి ఠీవించేది ఈ నవలేనని నా అభిప్రాయం. సాంకేతికమైన విలువలు దీనికంతగా లేకపోవచ్చుగాక. ప్రారంభమైంది లగాయితు నవలలో గల జీవితంలోని సంఘటనల వివరణమే ప్రాధాన్యం వహించి వుండవచ్చుగాక. కానీ ఇందులోని శైలి ! ఆంగ్లభాషాభిమానులకు అదొక విందు వంటిది. ఆధునికులలో ఇంతటి రమ్యమైన శైలి మరల ఒక్క హెన్రీ జేమ్స్‌లోనే కన్పిస్తుంది మనకు. కానీ జేమ్స్, మామ్ ఇద్దరూ ఉత్తర, దక్షిణ ధ్రువాలు. ఈ నవలలోఉన్న విశేషమల్లా ఇది. ఇందులోని నాల్గు ముఖ్యమైన పాత్రలలో మూడు పాత్రలు రచయితలవి. వారి జీవిత వ్యాసంగం రచనలు చేయడం, అందుమీద బ్రతకడమే. ఈ ముగ్గురులో ఒకడు—లషెండన్‌మామ్ అన్న రచయిత—కథ చెప్తున్నట్లుగా సాగుతుంది. రచన యావత్తూ, తన వార్ధక్యంలో అమితమైన కీర్తిని ఒక్కసారిగా సంపాయించుకున్న ఎడ్వర్డ్ డ్రిఫీల్డ్ చనిపోయింతర్వాత, అతని భార్య, డ్రిఫీల్డ్ జీవితాన్ని ఒక కథగా వ్రాయమని, ఆ భారాన్ని మరొక యువరచయిత అల్రాయ్ కేర్ అనే అతనికి అప్పగిస్తుంది. కేర్, డ్రిఫీల్డ్‌కు సంబంధించిన భోగట్టా కోసమని అషెండన్ దగ్గరకు వెళ్తాడు. అషెండన్ తన బాల్యంలోనూ, వైద్య విద్యార్థిగా వున్నప్పుడూ డ్రిఫీల్డ్‌తో పరిచయం వున్నవాడు. పైగా డ్రిఫీల్డ్ మొదటి భార్యను గురించిన సమాచారం గూడా అషెన్‌డన్‌కు తెలుసు. కేర్, తనకు కావలసిన యావత్తు సమాచారమూ తెలుసుకుని గ్రంథరచనకు కూర్చోబోయే సరికల్లా, రనకు, ఇట్లా తన భర్తను గురించి గుణ దోషాదులతో ఓ పుస్తకం వ్రాయడం యిష్టంలేదని, డ్రిఫీల్డ్ భార్య చెప్తుంది.

ది మూన్ అండ్ సిక్స్ పెన్స్

ఆఫ్ హ్యూమన్ బాండేజ్'లాంటి నవలలను గురించి ముచ్చటించిన తరువాత, మరొక నవలనుగూర్చి చెప్పడం—అది మామ్ రచన అయినప్పటికిన్నీ—సాహసమూ—దుష్కరమే అవుతుంది. అయితే 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' నవలను వదిలిపెట్టి, మిగిలిన మామ్ నవలలతో పోలిస్తే "ది మూన్ అండ్ ది సిక్స్ పెన్స్" ఒక సమున్నత స్థానంలో నిలుస్తుంది. ఈ నవలను గురించి హైనెమన్ ప్రకాశకులు సగర్వంగా ఇలా అంటారు:

"The Moon and Six Pence, soon after its pudlication achived immidiate popularity. The Novel has also been adopted for the stage and film." అసలు ఈ నవల ప్రచురింపబడింది 1919 వ సంవత్సరంలో. అప్పటినుంచి ఇప్పటికి దాదాపు ఏ ఇరవై ముద్రణాలకుపైగానో పొందింది. ఈ నవల ఇంతటి ప్రాచుర్యం సంపాయించుకోడానికో కారణం కూడావుంది. సుప్రసిద్ధ ఫ్రెంచి చిత్రకారుడు పాల్ గోగిన్ జీవితం, మామ్ మీద ఒక విచిత్రమైన ప్రభావాన్ని చూపింది. ఈపాల్ గొగిన్ కళ అంటే గంగవెర్రులెత్తిపోయే మనిషి. కళ కోసమని ఇంటినీ, ఇల్లాలును కూడ వదిలిపెట్టి పసిఫిక్ ప్రాంతాలకువెళ్ళి, తపస్సులో మునిగిపోయిన ఆదర్శవాది. 'ది మూన్ అండ్ సిక్స్ పెన్స్' నవల కూడా అదే మూసలో పోసినట్లు కన్పిస్తుంది. ఇందులో సామర్సెట్ మామ్ మనకు స్ట్రిక్‌లాండ్‌రూపంలో కన్పిస్తాడు. భావుకతలోనూ, జీవితాన్ని ఒక విధమైన గుడ్డి ఆవేశంలో నాశనం చేసుకోడంలోనూ, ఈస్ట్రిక్‌లాండ్ గూడా, చిత్రకారుడు గోగిన్ కేమీ తీసిపోడు. ఫలానా పద్ధతిలో ప్రవర్తిస్తాడని ఈ కథా నాయకునిగూర్చి చెప్పడం కష్టం. ఇందులో పాత్రలు ఛార్లెస్ స్ట్రిక్‌లాండ్, అతని భార్య, రోజువాటర్ ఫోర్డ్, మిసెస్ జే, రిచర్డ్ ట్వినింగ్, జార్జ్ రోడ్ అన్నీ విచిత్రమైనటువంటివి. మరీ చిత్రచిత్రం ఈ వ్యక్తులందరూ రచయితలు కావడం. రోజు వాటర్ ఫోర్డ్ గురించి రచయితే ఇలా అంటాడు—ప్రథమ పురుషలో రచన సాగుతుంది కాబట్టి. She combined a masculinc intelligence with a faminine perversity."

ఈమెను స్త్రీత్వంలోని మూర్ఖత్వమేకాదు, జీవితం అంటే నిరాశ కూడా ఎంతో క్రుంగదీస్తాయి. కథాకాలం నాటికి శ్రీమతి స్ట్రిక్‌లాండ్‌కు ముప్పైఆరు వెళ్ళి ముప్పైఏడు ప్రవేశిస్తుంది. ప్రశాంతంగా, నిమ్మకు నీరెత్తినట్లుగా కన్పించే ఈ పాత్ర, ఈ నవలలో సర్వత్ర మనసు ఆకర్షిస్తుంది. ఉద్రేకాన్నే జీవితాన్ని ఎదుర్కొని భంగపడినపుడల్లా మనకు కరిగే జాలితో కూడిన నవ్వు ఎడారితనం పోదుపు కొన్న ఈనవలలో విచిత్రమైన 'రిలీఫ్'. అబ్రహాం, ఆలెర్‌కార్మికెయిల్, నిజంగా విచిత్ర వ్యక్తులే. అనుభవం ఎట్టిదయినా సరే దాన్ని అసహ్యించుకోకపోవడం, అదృష్టం ఎక్కడున్నాసరే దాన్ని తమ దగ్గరకు రప్పించుకొని స్వంతం చేసుకొనడం వీరి వ్యక్తిత్వ లక్షణాలు.


ఈ నవలలో వైవిధ్యంకల ఇంతటి పాత్ర చిత్రణం వున్నా, చక్కని రచనాశిల్పం కన్పిస్తున్నా, దీని ప్రాచుర్యానికి సమకాలీన చిత్రకారుని చిత్రాన్ని, చిత్ర చిత్ర అక్షర చిత్రాల్లో చిత్రించడమే కారణం. పైగా మామ్ వ్రాసిన తొలిపలుకులు కూడా ఇందుకు బాగా దోహదం చేసింది. తొలిపలుకులో మామ్ తనే స్వయంగా చెప్పుకుంటాడు. ఫ్రెంచి ప్రభావం తనమీద ఏ విధంగా పని చేసిందీ, తాను పొట్ట చేత బట్టుకుని ఎలా పూరూ, వాడా తిరిగిందీ, తిరుగుతున్న ఆ రోజుల్లో ఏ విధంగా కళాకారులతో పరిచయం అధికమయిందీ,

సెజన్, వాన్‌గో, గోగిన్ ఎలా తనకు పునరుజ్జీవనం, ప్రసాదించిందీ, 1904లోనే తనకిది వ్రాయవలెననిపించినా ఎలా పరిస్థితులకు వారసుడై ఒక దశాబ్దానికిపైగా దీని రచనకు తను నిర్లక్ష్యించవలసి వచ్చిందీ, అన్నీ అందులో కూలంకషంగా చర్చిస్తాడు. ఏమైనా ఈ నవలలోనూ, అతని తదితర నవలల వలెనే, మామ్ వ్యక్తిత్వం, మామ్‌కు జీవితంమీదగల ప్రగాఢమైన వాంఛ, జనత పారిపోయినా మానవత్వానికి దూరం కాలేకపోవడం, అలతి అలతి మాటలతో అనల్పమైన అర్థదీప్తి, చక్కని చిత్రిక పట్టిన పాత్రలు—బ్రతుకుబాటమీద సమానార్థమై పయనించే యథార్థగాథ— అన్నీ దీని గొప్పతనానికి, అన్నీ దీని మనుగడకు కారణములైనాయి. సందేహం లేదు, మామ్ రచనలలో ఇది సర్వోత్కృష్టమయినది. అయినా కాకపోయినా, ఇది ఉత్కృష్టమయినది. జీవచైతన్యాన్ని నింపుకున్న అమృత పాత్ర.

దీని కథనంలో ఒక్కొక్క ఘట్టమే విడిపడుతున్నకొద్దీ అంతా తెలుస్తుంది, తెలియవలసినదానికన్నా గూడా ఎక్కువగా. మామ్ రచనలలోకల్లా దీనిలోనే కథ ప్రవాహవేగంతో నడుస్తుంది. శైలి, మాండలిక మైనప్పటికీ ఏమీ బాధించదు. మన ముందు కూచుని మామ్ పిచ్చాపాటీ మాట్లాడుతూ ఏవో తన అనుభవాలను నెమరుకు తెచ్చుకుంటున్నట్లే వుంటుంది నవల అంతా. ఇందులో విషాదం కన్నా, జీవితంఅంటే ఒక విధమైన మోజు, వెచ్చని ఆనందప్రదమైన శాంతి కావాలన్న మనుష్యుల ఆరాటం మనకు కన్పిస్తుంది. క్షమించాలి. ఇందులోగల ఒక పాత్ర సంగతి ఇంత వరకూ మీకు చెప్పలేదు. ఆమె ''రోజీ'' డ్రిఫీల్డ్ మొదటి భార్య. భోగవాంఛ ఈమెలో చాలా ఎక్కువ. అలా అని ఆమె స్వైరిణికాదు. ఆమెలో ఒక విధమైన పశుత్వం మనకు కన్పిస్తుంది. అయినా శరీరంతోబాటు ఆత్మను కూడా ఆమె తను నమ్మిన వానికి సమర్పిస్తుంది. ఆమెకు మానవతమీద ఏ అభిప్రాయమూ అంత బలంగా లేదు. అయినా ఉన్న ఆ అభిప్రాయం మాత్రం చాలా మంచిది. భౌతికమైన విలువలకే ఆమె ప్రాధాన్యం ఇస్తుంది. ''కేక్స్ అండ్ ఏల్''లో రోజీ, ''లిజా ఆఫ్ లాంబెతులో'' లిజా'' ఈ ఇద్దరే మామ్ సృష్టించిన సజీవమైన స్త్రీ మూర్తులు. ''కేక్స్ అండ్ ఏల్'' నవల 1930 లో ప్రచురింపబడింది. ప్రచురింపబడిన ఆ సమయంలో ఈ నవలనుగూర్చి అనేక రకాల పుకార్లు బయలుదేరాయి. ''సుప్రసిద్ధ నవలాకారుడు థామస్ హార్డీన్, డ్రిఫీల్డ్‌గా మామ్ చిత్రించాడు'' అన్నారు కొందరు. అప్పుడే హార్డీ మరణించాడు. ఆ మరణవార్త ఈ పుకార్లకు కారణమయింది. ఎక్కడో ఒకచోట తప్పిజారి మనకు పోలిక కన్పించవచ్చు. అంత మాత్రాన ''వాడే వీడు'' అనడం అతి సాహసమేకాదు అనాలోచితం కూడాను. ఈ పుకార్లు అంతటితో ఆగలేదు. ఆల్డ్రాయ్‌కేర్‌కూ ''హ్యూవాల్పోల్'' అన్న రచయితకూ పోలికలు కనిపెట్టారు. కానీ ఈ నవల ప్రచురింపబడిన నాటికి వాల్పోల్ బ్రతికేవున్నాడు. ఒక్కొక్కసారి యదార్థం కల్పన కన్నా విచిత్రంగా వుంటుంది. అదే ఇక్కడా జరిసింది. అంతే.

రచనా విధానం

మామ్ తన నవల అన్నింటిలోనూ వేదాంతిలా వాదం చేయడంకానీ, రాజకీయవాదిలా నిషయనివేదిక పద్ధతి ననుసరించడంకానీ, చేయడు. అతని నవలలో ఈ విధమైన ఉత్కంఠ ఉండదు. గంగాప్రవంతివంటి దతని రచన. మామ్, మానవుడు అనాదిగా అనుసరిస్తున్న కష్ట పరంపరకు శస్త్ర చికిత్స చేయవచ్చిన వైద్యుడుకాదు. ''ఫలానా రోగానికి ఫలానా చికిత్స'' అన్న పద్ధతి అతనికి రుచించదు. తన వాదంలోని బొమ్మా—బొరుసును పాఠకుడి ముందు పెడతాడు. అతనికే మంచీ—చెడూ నిర్ణయించుకోమంటూరు. వైద్యుడుగా ప్రతి దానినీ నిశితంగా పరిశీలిస్తాడు. రచయితగా ప్రతి దానినీ ప్రతిభావంతంగా వ్యక్తీకరిస్తాడు. మామ్ ఒక 'అమెచ్యూర్ డాక్టర్. ఒక ప్రొఫెషనల్ రైటర్' ఎప్పుడూ మామ్ తన శైలినిగురించి తాను గొప్పగా చెప్పుకోలేదు, అనేక మంది విమర్శకులు ఏక కంఠంతో అతని నీ విషయంలో హిమాలయ పర్వత శిఖరంమీద కూర్చోపెట్టినప్పటికీని. పైగా తన శైలిని అందరికీ అర్థమయేలా మలచడానికి తానెన్ని భగీరథ యత్నాలు సాగించిందీ ఒకచోట పరమ కరుణాత్మకంగా వివరిస్తాడు. 1901 లో గామోసు వ్రాస్తాడు ''నా



నిర్మల   నాగభూషణం

శేషశాయి బ్రదర్సు ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టరు శ్రీ హెచ్. కె. రామస్వామి గారి కుమార్తె కుమారి ఆర్. నిర్మలకును, శాన్‌ఫ్రాన్సిస్కోయందలి యూనివర్సిటి ఆఫ్ కాలిఫోర్నియా మెడికల్ స్కూల్ యందు పనిచేయుచున్న డాక్టర్ ఎ. నాగభూషణం, ఎం. ఎస్ సి., పి హెచ్. డి., గారికిని తిరుచిరాపల్లిలో వివాహం జరిగెను.

శైలిలో గాఢత, భావ శబలత, ఆవేశమూ లేవే, ఎట్లా నేను ఆకర్షించను జనతను ?" ఆ తర్వాత మహాకవి మిల్టనునూ, జెరిమీ టైలరునూ, ఆస్కార్‌వైల్డ్‌నూ, చదివి ఆ మార్గాన తన ప్రయాణం కొనసాగించాడు. అతని శైలిలో రూపకాలంకారములూ, ఉపమాలంకారములూ లేవు. ఏదైనా ఒక వర్ణన ఎక్కడైనా కన్పిస్తే అలంకారగుణం దానికి లేదనుకుంటూనే దాని క్రొత్తదనానికి దాన్ని మెచ్చుకుంటాము. కట్టిన పదాలు, శ్లేష, అలంకార పద భూయిష్ఠంకాక, అతని శైలి నిరాభరణయై, అమాయకంగా, పరమ రమణీయంగా, ఓకులమింటిపిల్లలా కన్పిస్తూంటుంది. వాక్యాలు చిన్నవిగా వుంటాయి. శ్లేషార్థాలు కన్పించవు. "అండ్" "బట్" లాంటి మాటలు వాక్యానికీ, వాక్యానికీ మధ్య వంతెనలా వుంటాయి. సమకాలీన రచయితలైన ఎవ్లిన్ వా, హెన్రీజేమ్సు వీరిలో మనకీ, భాషానైర్మల్యం గోచరించదు. వ్యవహారికంలోంచి గ్రాంధిక భాష వచ్చినదన్న వాదన సర్వ జనాదరణీయమైనా, కాకున్నా, మామ్ విషయంలో మాత్రం ఇది సార్వకాలిక సత్యం. సాధారణంగా మామ్ తన కథల్లో చివరకు ఏం జరిగిందో ముందే చెప్పేసి, ఆ తర్వాత అలా ఎందుకు జరగవలసి వచ్చిందో వివరిస్తాడు. దీనిలో ఒక విధమైన ఏకపాత్రాభినయం వుంటుంది. "మొదలు, మధ్య చివర" అన్న మూడు దశలను ఒక క్రమ పద్ధతిలోకాక, రచయితే ఒక అక్రమ పద్ధతిలో రసాత్మకంగా నిర్వహిస్తాడు.

చి న్న క థ లు

ది లయన్స్‌స్కిన్ అన్న కథ ఇట్లా ప్రారంభమౌతుంది. "కేప్టెన్ ఫారెస్టియర్, తన భార్య పెంపుడుకుక్క, కార్చిచ్చు చెలరేగిన ఆ అడవిలో ఒక యింట్లో బంధింపబడిపోవడం చూచి, దాన్ని రక్షించడానికని తానూ ఆ కార్చిచ్చు మధ్యకు ప్రవేశించి ఘోరంగా కాలిపోయి మరణించాడన్నవార్త వినగానే అనేకమంది మంచివాళ్ళు అనుకోకుండానే అయ్యో అంటూ సానుభూతి ప్రకటించారు."

ఈ విధమైన ప్రారంభం కొంచెంగా వింతగావుంది కదూ. అవును. ఒక వ్యక్తి మంటల్లోబడి మరణించడం, అందులోనూ అడవిలో చెలరేగిన మంటల్లో, అందునా, తన భార్య, పెంపుడు కుక్కను రక్షించడానికి—ఇది వింతగానేవుంది. వున్న వింత అల్లా "అనేకమంది మంచివాళ్ళు అనుకోకుండానే అయ్యో అంటూ సానుభూతి ప్రకటించారు" అన్న వ్యంగ్యంలో వుంది. కేప్టెన్ ఫారెస్టియరెవరో మనకు తెలీదు. అతని భార్య సంగతి అంతకన్నా తెలీదు. ఆ ఆవిడగారి పెంపుడుకుక్క ఏవిటో మొదటే తెలీదు. ఈ విధమైన తెలియకపోవడంతో కథ తెలియడం మొదలవుతుంది. కథ చివరకు వచ్చేసరికల్లా మొదట్లో ఏం జెప్పాడో, తిరిగి అదే చెప్తాడు మామ్ మరింత వ్యంగ్యంతో. ఫారెస్టియర్, ఈ మాటలో ఒక వైచిత్రివుంది. ఫారెస్ట్ + ఫైర్—ఫారెస్ట్‌ఫైర్ ఫారెస్టియర్—ఇట్లా కొన్ని కొన్ని కథలు తమాషాగా వుంటాయి. ఒక్కొక్కసారి కథ అంతా ప్రథమ పురుషలోనే సాగుతుంది. "నేను—" అంటూ జాయిస్‌కారీ ది హార్సెస్‌మౌతులో కథ మొదలు పెడతాడు. ఇటువంటి "నేనులు" ఎక్కడబడితే అక్కడ కన్పిస్తారు మామ్ కథల్లో. సుప్రసిద్ధమైన రీతిని రెయిన్ కథ కూడా ఇట్లా ప్రథమ పురుషలోనే సాగిపోతుంది. పైగా చాలా కథల్లో కథా నాయకులకు మామ్ అన్న పేరు వుంటుంది. ఉదాహరణకు ది రేజర్స్ ఎడ్జ్‌లో ఒక మామ్, కేక్స్ అండ్ ఏల్‌లో ఒక మామ్, "శానిటోరియమ్" అన్న కథలో ఒక మామ్, ఆఫ్‌హ్యూమన్ బాండేజ్ లో ఒక మామ్, ఇట్లా అతని కథల నిండా పదులు, వందలు సంఖ్యలో మామ్‌లు నవ్వుతూ, నవ్విస్తూ విషాదంగా, వేదాంతులుగా, క్రోధమూర్తులుగా, బాటసారులుగా, గూఢచారులుగా, వైద్య విద్యార్థులుగా, రచయితలుగా, కథా కారులుగా, శాస్త్రజ్ఞులుగా, అనేక రూపాల్లో, అనేక ముఖాలతో మనకు కన్పిస్తారు. క్వార్టెట్ అన్న చిన్న కథలో మామ్ కథా కథనం పరాకాష్ఠను పొందింది. ఆమధ్య దీన్ని సినిమాగా కూడా తీశారు. కథకుడు, ఒక పరిశీలకుడు వీ రిద్దరే ఈ కథలో ముఖ్యం. కథానికా రచయితగా మామ్‌ను గనుక డాస్టొవ్‌స్కీ, చెకోవ్, హెన్రీజేమ్స్, షేకరీలాంటి వారితో పోలిస్తే "ఇదేమీ, ఇతని పాత్రలు కొంత కృత్రిమంగా కనిపిస్తున్నాయి" అనిపించవచ్చు. కారణం మరేమీలేదు. ఇతని పాత్రలన్నీ ఒకే దారానికి గ్రుచ్చబడినాయి. ఒకే రంగు పూనుకున్న సుందర పుష్పాలివి.

నా ట కా లు

ఒకప్రశ్న వేసుకోడం, దానికొక సంతృప్తికరమైన సమాధానంకోసం అన్వేషించడం, చివరకు జయమో, అపజయమో ఈ పద్ధతే మామ్ తన నాటకాల్లోనూ అనుసరించాడు. ఇట్లా ప్రశ్న—జవాబుల పద్ధతికి చెందిన నాటకాలు విజయవంతం కావడం చాలా కష్టం. దీన్ని అనుల్లంఘనీయమైనదిగా లేడీ ఫ్రెడరిక్ అన్న నాటకంలో అనుసరిస్తాడు. ఒక యువకుడు, నడి వయసు దాటిన లేడీ ఫ్రెడరిక్, పరస్పరాకర్షణం, లేడీ ఫ్రెడరిక్ ఆ అమాయకుడికి మరుల మాయలెంతటి దుష్కరములో చెప్పడానికి యత్నించడం, తనమీది మోహం నుండి అతనిని తన కృత్రిమ సౌందర్యాన్ని తొలగించి చూపి తప్పించడం—పాత్రల్లో వైవిధ్యంకానీ, పోషణగానీ లేదు. లేడీ ఫ్రెడరిక్ పాత్ర నిజానికి దుఃఖాంతం కావాలి. కానీ ఈ నాటకాన్ని మానవస్వభావంలోని బలహీనతల్ని ఎత్తిచూపేదర్పణంగానే, మామ్ రచించాడు. మామ్ తన నాటకాలనుగూర్చి తనే ఇలా చెప్పుకుంటాడు.

"నే రచించిన ఒకటి రెండు సుఖాంత నాటకాలు కొంతకాలం బతికితే బ్రతకవచ్చు, రెస్టొరేషన్ నాటకాల పద్ధతిలో. సుఖాంతంగానే, వీటిని నేను రూపొందించాను. నోవెల్ కవర్డ్ కూడా నే ననుసరించా నీ రచనలో."

మామ్‌కు తన నాటకాలమీద ఇంతటి అపనమ్మకమున్నా, రంగస్థలంమీద అతని నాటకాలన్నీ విజయవంతం కావడం ఒక విధంగా ఆశ్చర్యమే. హోమ్ అండ్ బ్యూటీ అన్న నాటకంలో 1914—18 మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో అందరూ చనిపోయాడనుకున్న ఒక సైనికుడు తిరిగివచ్చి,

తన భార్య తన స్నేహితుణ్నే పెళ్ళి చేసుకుని వుండడం, చూడడం హృదయదఘ్నంగా చిత్రింపబడింది.

లోవ్స్ అండ్ ఫిషెస్ అనే నాటకం భౌతికమైన వాసనలను విదళించుకోలేని ఒక మత బోధకుడి కథను చిత్రిస్తుంది. ఈ చిత్రణంలో కర్తవ్యాన్ని, యథార్థాన్ని తప్పించుకుందామని ప్రవర్తించే మనుషుల నైజాన్ని నగ్నంగా చూపించడంవలన హాస్యరసం ఉత్పన్నమయింది. అయితే ఈ హాస్యం వ్యంగ్యాత్మకమైనటువంటిది. ది సర్కిల్, అవర్ బెటర్స్ అన్న నాటకాలు రెండూ నాగరికు లనుకొనేవారి నడతను, ధనవంతుల మతిహీనతను అవహేళన చేస్తూ వ్రాయబడినాయి. ఈ రెండూ నిజమైన సుఖాంత నాటకాలు. కల్పనలోకానీ, కథా సంవిధానంలోగానీ ఈ రచనలు వియన్నాకు చెందిన ష్నిట్జ్లర్‌ను స్ఫురణకు తెస్తూంటాయి. ది బ్రెడ్ విన్నర్ ఒక స్టాక్‌బ్రోకరుకు సంబంధించిన యథార్థ జీవిత చిత్రణం. విలాసాలకేళిలో కర్తవ్యాన్ని మరచిన తన భార్యనూ, కుటుంబాన్నీ చూచిన అతనికి అసహ్యం వేస్తుంది. ఆ అసహ్యంలో ఆర్థికంగా కావాలని తనను నాశనం చేసుకుంటాడు. ఈ నాటకాలన్నీ విచిత్రములైన పాత్రలచుట్టూ అల్లబడినటువంటివి. సంభాషణలు హాస్య ధోరణిలో వుంటాయి. ఈ కారణాలచేత సామర్సెట్ మామ్ ఇంకా కొన్ని దశాబ్దాలపాటు ఆంగ్ల రంగస్థలాన్ని యథేచ్ఛగా పరిపాలింపగలడని మనం ఆశించవచ్చును.

మామ్ రచనలలో "పంక్చుయేషన్" పద్ధతి విచిత్రంగా వుంటుంది. ఒక ప్రయోజనాన్నాశించినట్లనిపించదు. వాక్యాలు చాలాచాలా చిన్నవిగా వుంటాయి. ఎక్కడైనా రెండు వాక్యాలు కలిసి కనిపిస్తే వాటిని విడదీస్తూ ఒక "కామా" సామాన్యంగా వుంటుంది. ఇలా ఎందుకు వుండాలీఅంటే, సమాధానం. మనుషులు ఇలాగే చిన్న చిన్న మాటలతో, వాక్యాలతో తమ భావాలను వ్యక్తీకరిస్తారు కాబట్టి అనవలసి వస్తుంది స్వరంతో మార్పులు, మాటనుపట్టి పలకడం, ఈ విధానాలన్నీ మాటల గొలుసును కట్టుదిట్టంగా అల్లడానికి మనం చేసే ప్రయత్నమే.

సామర్సెట్ మామ్ తన వాక్యసరళినిగూర్చి ఇలా అంటాడు. "కథలోగానీ, నాటకంలోగానీ ఏం జెప్పదల్చుకుంటున్నావో అది ముందుగా గాఢంగా మనం నిర్ణయించుకోవాలి. ఆ తర్వాత జీవితానికీ, మరణానికీవున్న విడరాని భయంకరమైన అనుబంధం లాంటిది భావానికీ, భాషకూ మధ్య వుండాలి ఈ విధంగా శైలికీ, మరణానికీ సామ్యాన్ని కల్పించడం కొంత అగమ్యంగానేవుంది. అయితే ఇదీ మామ్ వైచిత్ర్యాలలో ఒకటి

కాబోలు! ఇట్లా అసంబద్ధంగా తన పరిధులేమిటో చెప్పుకోడం మూలాన, ఏకవచనానికీ, ఏక వాక్యానికీ మామ్ ఎంతటి ప్రాముఖ్యమిచ్చాడో మనకు స్పష్టంగా తెలుస్తున్నది. సంగీతానికి అనేకములైన స్వరము లున్నట్లే, ఒక విషయాన్ని సూటిగా చెప్పదల్చిన ఇటువంటి రచనా పద్ధతిలో కూడా అనేకములైన సూక్ష్మ విషయాలు అంతర్లీనములై వుంటాయి. తను అనుకున్నట్లుగాగాక, తమ చిత్త మొచ్చినట్లు పాత్రలు నడుస్తుంటాయని బెర్నార్డ్‌షా ఒకచోట అన్నాడు. ఈ యధార్థమే మామ్‌కు కూడా వర్తిస్తుంది. పాత్రలను సృష్టించడం వరకే రచయిత వంతు. ఆ తర్వాత ఆ పాత్రతే తమ గతిని తాను నిర్ణయించుకుంటాయి. 1947 వ సంవత్సరంలో ననుకుంటాను; క్రీచర్స్ ఆఫ్ సర్కంస్టెన్స్ అన్న పుస్తకానికి పీఠిక వ్రాస్తూ, కథక చక్రవర్తి ఇలా వ్రాసుకుంటాడు. "విమర్శకులు ఎప్పుడు పొరపాటు పడుతారంటే, కొన్ని కథలను ఏవో అణాకానీ పత్రికలకు వ్రాసారన్న అపోహతో నిర్లక్ష్యంతో చెత్తబుట్టలోకి తీసినప్పుడు. ఇటువంటి వాటిలోనే కథా కథనమూ, నాటకీయత, ఆశ్చర్య స్ఫోరకమైన ముగింపు నాకు కన్పిస్తుంటాయి." కథలో కథ లేకపోయినా, వోట్టివర్ణ నాత్మకంగా రచన సాగినా, అంతా మంచిదేనంటాడు మామ్. ఇందుకు ఉదాహరణగా చెకోవ్‌ను చూపిస్తాడు. అసంఖ్యాకంగా వెలువడే ఈనాటి కథలకు సాహిత్య గౌరవం ఇవ్వడం మామ్ చేయవలసిన పనికాదు. ఇటువంటి తలంపు కూడా మామ్ వంటి రచయితకు కలగకూడదు. కానీ ఆయనే "చెకోవ్, మొపాసా ఇద్దరూ కూడా బ్రతుకుతెరువుకోసమే కథలు వ్రాశారు. . ... అన్ని కథలూ కూడా ఏదో ఒక రూపంలో, వార పత్రికలకో, వార్తా పత్రికలకో సంబంధించినవే" అని వ్రాయడం విచారించదగిన విషయం. మామ్‌లో ఒకవిధంగా పరిణతిలేదు. మరి పరిణతిలేనివాడు కథక చక్రవర్తి ఏమిటి ? అతని మాటల్లోనే అతనేమిటో వివరిస్తాను. "నాకు సహజ పాండిత్యం అంతగాలేదు. అయితే నాలోని బలహీనతలన్నింటినీ నా పాత్ర చిత్రణం క్రమ్ముకు వస్తున్నది. నాకు ఏది యుక్తమో, ఏది అయుక్తమో బాగా తెలుసు. అనేక మందికి తమ కండ్ల యెదుట జరిగేదే తెలీదు. కానీ నాకు మాత్రం ఆ ఒక్క శక్తి ప్రసాదించబడింది. కొందరు గొప్ప గొప్ప రచయితలే తమ ఎదుట ఇటుక గోడలను అడ్డుగా నిర్మించుకుంటే, నాకు అడ్డుగా అదృష్టవశాత్తూ మామూలు తెరలు కూడా లేవు." ఇదీ సామర్సెట్‌మామ్; భౌతికవాదిగా, వేదాంతిగా, మానవతావాదిగా నవ్వుతూ కన్పించే మామ్. నవలా రచయితగా, నాటక కర్తగా, కథకుడుగా సర్వకాలాలనూ, సర్వ దేశాలనూ ఆకర్షిస్తున్న, ఆకర్షించే సోమర్సెట్ మామ్.

తెలుగులో మామ్

ఈ మహా రచయితనుగురించి ఇంతగా వ్రాసిన నేను, తెలుగు రచయితలమీద ఇతని ప్రభావాన్నిగురించి తలస్పర్శగానైనా తడవకపోతే, అన్యాయ్యం చేసినవాడనే అవుతాను. ఈమధ్య తెనుగునాట ఒక వింత ప్రకృతి విపరీతంగా ప్రబలుతోంది. అది పాశ్చాత్య రచయితలను ఒకవేపు చదువుతూనే, మరొకవేపున దొంగచాటుగా, పేరు చెప్పకుండా వారిననువదించి ప్రకటించడం. ఈ దోషానికి కొంతవరకు పత్రికా లోకం కూడా కారణమే. ఇలా అన్యాయ్యం చేయబడిన పాశ్చాత్య రచయితలలో నాకు మొట్ట మొదట జ్ఞాపకం వచ్చేది సామర్సెట్ మామ్. అధునిక తెనుగు రచయితలలో మామ్‌ను చదువనివారూ, ప్రాభావితులు కానివారూ అరుదుగా కన్పిస్తారు. స్వర్గీయ డాక్టర్ శ్రీదేవి తన "కాలాతీత వ్యక్తులు"లో మామ్ సంభాషణా చాతురి ననుకరిస్తుంది. బుచ్చిబాబు తన అసంఖ్యాకమైన కథానికలలో మామ్‌ను ఎంత సుందరంగా అనుసరించిందీ సర్వులకూ విదితమే. ఇలా చెదరు మదురుగా ఒకటీ—అరా కథను తెనిగించడమో, అనుసరించడమో, అనువాదం చేయడమో కన్నా సాహిత్య అకాడమీవంటి సంస్థ పూనుకుని సమకాలీన పాశ్చాత్య రచయితలలో కథక చక్రవర్తిగా వున్న మామ్‌వంటివారిని తెలుగులోకి సగర్వంగా ఆహ్వానించడం తక్షణ కర్తవ్యమేకాదు. నేటి యువరచయితలకు వరప్రసాదం కూడా అవుతుంది.

రంగమార్తాండులు

శ్రీ బలిజేపల్లి రాఘవరావు

పాత్రలు:

ప్రొడ్యూసర్	డైరెక్టర్
మాధవయ్య	శాంతయ్య
కుమార్	రంజన.

కవి

మొదటి రంగం

[కాలం : వర్తమానం.

స్థలం :—ఒక నాటకశాలలోని రిహార్సల్ గది. గోడలకి కొన్ని గ్రూప్‌ఫోటోలున్నాయి. ఎదురుగావున్న గోడమీద ఒక పెద్ద ఫోటో బహుశా ఆ నాటకశాల స్థాపకునిది వుంది. గోడలమీద కేలెండర్, వెనుక ఒక బల్లమీద బహుమతులుగా లభించిన కొన్ని కప్పులు, షీల్డ్సు వున్నాయి.

తెర లేచేసరికి ఒక వ్యక్తి దర్జాగా కూర్చొని ఏదో పత్రిక చదువుతూ వుంటాడు. అతని వెనుక ఒకడు చేతులు కట్టుకొని నిలబడివుంటాడు. ఎదురుగావున్న ఒక వ్యక్తి దీనంగా ఏదో మొరపెట్టుకుంటున్నాడు. కూర్చున్నవ్యక్తి ప్రొడ్యూసర్, మొరపెట్టుకుంటున్నవాడు డైరెక్టర్. మిగిలిన వాడు కవి.]

డైరె : (దీనంగా) అయ్యా ! కాస్త కనికరించండి. పిల్లలుగలవాణ్ని. అన్యాయంగా నా కడుపు కొట్టకండి ! ఈ చిన్న తప్పిదాన్ని మన్నించండి ! ఇంకెప్పుడూ అలా చెయ్యను. ఈ ఉద్యోగం వూడితే మరొక గతిలేదు ! . . . . . నా పిల్లల్ని దిక్కులేనివాళ్ళని చెయ్యకండి బాబూ !

ప్రొడ్యూ : లాభంలేదు ! మాది ఒక్కటేమాట !. . . . . . పలు మాటలు పలకడం మా పద్ధతికాదు !

డైరె : ఆమాటమాత్రం అనకండి. . . . . .కనీసం నోరులేని నా పిల్లల ముఖంచూసైనా దయతలచండి ! వాళ్ళు మీకేం అన్యాయం చేశారు ? నా రక్తమాంసాలన్నీ మీ సేవలోనే హరించుకుపోయాయి ! విశ్వాసంతో యిన్నేళ్ళు మీ సేవచేసినందు కిదా ప్రతిఫలం ?. . . . . . నేనలాంటి స్వామిద్రోహం కలనైనా తలపెట్టలేదే ? నా కెందుకీ శిక్ష ! మాట్లాడండి బాబూ ! నా జీవితాన్ని నాశనం చెయ్యకండి ! మీ పాదాలు పట్టుకుంటాను ! కనికరించండి !

ప్రొడ్యూ : పదిసార్లు నాచేత కాదని అనిపిస్తా వెందుకు ? ఇంక నీ సర్వీసు అవసరంలేదు.

డైరె : బాబూ !. . . . .బాబూ !. . . . . .కాస్త కనికరించండి !

కవి : వీల్లేదని చెప్పడం లేదుటయ్యా ? . . . . . ఎందుకలా గొంతుచించుకుంటావ్ ?

డైరె : (ఉక్రోషంగా) అవును ! గుండె కోతతో నే వేడినవన్నీ పొల్లులే !. . . . . .నీలాంటి స్వామిద్రోహివే హితవాక్యాలు !

కవి : ఏమన్నావ్ ?. . . . . . .నేను స్వామిద్రోహినా ?

డైరె : అవును ! ముమ్మాటికీ నువ్వు ద్రోహివే !. . . . . నీసుండే నా కీ గతి !

కవి : విన్నారా బాబూ విన్నారా ? చూశారా వాడి పొగరు ?

డైరె : పొగరు నాదికాదు ! నీది !. . . . .నీలాంటి నమ్మకద్రోహి ముఖం చూడ్డమే పాపం !. . . .కాని ఒకటి మాత్రం గుర్తుంచుకో ! పేదల కడుపుగొట్టి కాజేసిన డబ్బు కలకాలం నిలుస్తుందనుకోకు !. . . . .నడిమంత్రాన సిరి, నరాలమీది కురుపు మానవుణ్ని వానరుణ్ని చేస్తుందని తెలుసుకో !

కవి : ఒళ్ళు దగ్గరపెట్టుకు మాట్లాడు !

డైరె : కళ్ళు తెరుచుకునేకాలం కూడా త్వరలోనే వస్తుంది ! కండకావరంతో కళ్ళు మూసుకుపోయి యేడుస్తున్నారు ! . . . . .దిక్కులేని నావంటి పేదల ఉసురు వూరికేపోదు !. . . . . .కాలం బండిచక్రంలాంటిది ! ఇవాళ నా వంతు అయింది. రేపో యెల్లుండో నీ వంతు కూడా వస్తుంది ! అనుభవించడానికి సిద్ధంగా వుండు!

కవి : విన్నారాబాబూ ఆ కూతలు ?

ప్రొడ్యూ : వింటున్నాం ! దాసూ ! ఎంతోకాలం నౌఖరీ చేశావని పస్తాయించాం ! మితిమీరితే పోలీసుల్ని పిలవాల్సి వుంటుంది !

డైరె : పిలవండి !. . . . . .ఈ జడిపింపులకి బెదిరే కాలం పోయింది ! మీ అనుగ్రహంకోసం అడ్డమైన చాకిరీ చేశాను ! చివరికి బంధువులందరికీ దూరం అయాను. ప్రజలందరూ నన్ను నీచుడని నిందించారు !. . . . . ఇంతకంటే వేరే శిక్ష అవసరంలేదు !. . . . .నా కళ్ళు తెరిపించినందుకు కృతజ్ఞుణ్ని !. . . . . .మీ సేవ కలలో కూడా కోరను !. . . . .మీరంతా దేశద్రోహులు ! మీ ద్రోహాలకి తగిన ప్రాయశ్చిత్తం త్వరలోనే అనుభవిస్తారు ! తప్పదు ! పేదలగోడు భగవంతుడు వినకపోడు ! మీ ఆటకట్టేకాలం త్వరలోనే వస్తుంది !

ప్రొడ్యూ : దాసూ !. . . . . .మితిమీరుతున్నావ్ !

డైరె : లేదు ! గతి చూపుతున్నాను !

కవి : దీని ఫలితం పూరికేపోదు తెలుసా ?

డైరె : అదే నేనూ చెప్తున్నాను !

ప్రొడ్యూ : (కోపంగా) ఫో బయటికి !. . . . ..మళ్ళా యీ ఛాయల్లో కనిపిస్తే, కటకటాల్లో తోయిస్తాను ! . . . ఫో ! మదీన్ ! వీణ్ణి బయటికి గెంటెయ్ !

కవి : పదరా ! (అని డైరెక్టర్‌మీదికి వస్తాడు)

డైరె : ఏయ్ !. . . . .ఒంటిమీద చెయ్యిపడితే జాగ్రత్త !

కవి : ఏం చేస్తావోయ్ ? (ఇద్దరూ కలబడతారు)

ప్రొడ్యూ : (అరుస్తూ) స్టాప్ ! ఆగండి ! (ఇద్దరూ విడిపోతారు) (ఒక్కక్షణం నిశ్శబ్దం)

డైరె : (రుమాలుతో మూతి తుడుచుకుంటూ) ఎలావుంది సీక్వెన్స్ ?

ప్రొడ్యూ : ఫరవాలేదు ! ప్రారంభం మంచి సస్పెన్స్‌తోనే వుంది !. . . . .కాని చివరివరకూ యిలా వుంటుందో వుండదో చెప్పలేం !

కవి : ప్రొడ్యూసర్‌గారూ ! . . . . . .ఒక్క సంగతి చెప్తాను వింటారా ?

ప్రొడ్యూ : చెప్పండి !

కవి : డైరెక్టర్‌గారి వుద్దేశ్యం బాగానేవుంది ! . . . . .కాని నాటకం ఆదినుండి అంత్యందాకా యిలాగేవుంటే విసుగెత్తుతుంది !

డైరె : ఎందుకు విసుగెత్తుతుందండీ ?

కవి : అలా అడగండి ! చెప్తాను ! . . . . .ఏదో కాస్త వినోదంకోసం నాటకానికి వస్తారుగాని, ఈ యేడుపులూ, మొర్రలూ వినడానికి కాదుగదా !

ప్రొడ్యూ : కావచ్చు ! . . . . . .ఇప్పుడేమైంది ?

కవి : అయింది కాబట్టే యీగోల !

డైరె : (కవితో) మీరు చెప్పేది గ్రహించాను ! . . . . . వినోదం పాలు కాస్త తక్కువైందనేకదా మీ అభిప్రాయం ?

ప్రొడ్యూ ! అవును. అదీ నిజమే ! . . . . .మరీ అంత విషాదభరితమైతే ప్రేక్షకులు భరించలేరు !

కవి : అదీగాక. . . . . .నా ఉద్దేశంలో — నాటకం నవరస భరితంగా వుండాలి. అలా కాకపోయిననాడు ఏదో ఒకటి ప్రధానరసంగావుండి, మిగిలినవి అంగ రసాలుగా వుండాలి !

డైరె : మీరు చెప్పేదీ నిజమే ! . . . . .కాని ప్రస్తుతం దాన్నెవరూ పాటించడంలేదు. అసలు నటులు సరైన వారు కాకపోతే, ఏ రసమైనాసరే 'నీరసం' అయి పూరుకుంటుంది ! . . . . అందులోనూ మనకసలే నటుల్లేరు !

కవి : అందుకేగదండీ కొత్త ముఖాలకోసం ప్రకటన కూడా చేసేం !

ప్రొడ్యూ : నటులు వచ్చినా మనకి నాటకం యేదండీ ?. . . అదిగో యిదిగో అంటూనే కాలం గడిపేస్తున్నారు గాని, ఒక్క నాటకం తెచ్చారా ?

డైరె : తేవడానికేం ? తెచ్చారు ! చెత్త నాటకాలు ! ఎప్పటివో బీ. సీ. నాటి నాటకాలు పట్టుకుంటారు !

కవి : (డైరెక్టర్‌తో) ఆమాటే అనొద్దన్నాను. నాలాంటి అధునాతనభావాలుగల కవి లేడంటే అతిశయోక్తికాదు ! మచ్చుకోటి చూడండి ! "హా ప్రేయసీ ! మందయానా ! కుందరదనా ! . . . . నీ ప్రియుడు విరహవేదనాదోదూయమానసుండై పెనంమీది పెసరట్టులా మాడిపోతున్నాడు ! కనికరించు ! . . . . .లేకుంటే నీమీది ప్రేమచే కుంగి, కుమిలి, బుట్టలో మామిడి పండులా మగ్గిపోతాడు ! నీవే నా ప్రాణం ! సర్వం నువ్వేనే హో నళినీ !"

ప్రొడ్యూ : (అరుస్తూ) చాల్చాలు !. . . . .ఇహ చాలు !. . . . పూర్తిచేస్తే దాన్లో రవ్వ లేదు మరి !

డైరె : (కూల్‌గా) కవిగారూ ! . . . . . .నాటకం చివరివరకూ యిలాగే వుంటుందా ?

కవి : అహా ! ఇంతకన్నా బ్రహ్మాండమైన డైలాగులున్నాయి మరి శృంగార రసప్రధానం గదండీ మన నాటకం !

డైరె : అలాగా ! . . . . అయితే ఒక పని చేస్తారా ?

కవి : చెప్పండి !

డైరె : ఇంత పెట్రోలుపోసి నిప్పంటించండి ! తీరిపోతుంది !

కవి : ఆఁ ! ఆఁ ! చూశారా ఆ పొగరు ?

ప్రొడ్యూ : ఆఁ ! చూస్తూనేవున్నా !

డైరె : అది చాలదుటండీ !

కవి : ఏమండోయ్ ! దర్శకాగ్రణీ ! . . . . .మీరాట్టే నోరు పారేసుకోడం మంచిదికాదు ! కాస్త వెనుకా ముందూ చూసుకు మాట్లాడండి !

డైరె : ఆ మాటే మీకూ చెప్తున్నా ! . . . . . లేకపోతే చిక్కులొస్తాయి !

కవి : వో యబ్బో ! అప్పుడే కళ్ళు మసకలుకమ్మాయే ? ఎవడికి తెలియదండీ మన గొప్పదనం !

డైరె : అవేనండీ ! . . . . .ఈ మధ్య మీ మెదడుకి మేత లేక తుప్పు పట్టింది ! . . . . .ఆ దుమ్ము కాస్త దులపండి!

కవి : మీ మెదడే పని చెయ్యలేదు పని లేక!. . . . .మీ బతుక్కి నన్నంటారేం ?

డైరె : (విరసంగా) ఫోవయ్యా డబ్బా ! అట్టే వాగక !

కవి : (కోపంగా) ఆరి దుర్మదాంధా ! . . . . .ఏమని కూసితివి?

ప్రొడ్యూ : (కోపంగా) సైలెన్స్ ! . . . .మిమ్మల్నిద్దర్నీ డిస్‌మిస్ చేస్తున్నా ! పోండి. వెంటనే వెళ్ళండి !. . . . . ఏం ? వినిపించడంలేదా ? వెళ్ళండి !

కవి : (ప్రాధేయపడుతూ) ఈసారికి క్షమించండి !. . . . . ఇంకెప్పుడూ అలా ప్రవర్తించం !

ప్రొడ్యూ : పనీ పాటూ లేక గున్నల్లామేసి, కొవ్వెక్కిపోయారు! కళ్ళు నెత్తికెక్కి మీ యిష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు ! నేనిక సహించలేను ! . . .వెళ్ళండి !

కవి : బాబ్బాబు ! ఆమాట మాత్రం అనకండి ! .... మమ్మల్ని నిరాధారుల్ని చెయ్యకండి ! (డైరెక్టర్‌తో) నువ్వు కూడా చెప్పవయ్యా !

రంగమార్తాండులు

డైరె : (దీనంగా) ఈసారికి క్షమించండి ! .... మళ్లా యిలా ప్రవర్తిస్తే మీరు వేసిన శిక్ష అనుభవిస్తాం.!

ప్రొడ్యూ : సరే ! .... ప్రథమ తప్పిదం క్రింద క్షమిస్తున్నాం!

కవి : రక్షించారు ! (లెంపలు వేసుకుంటూ) ఇంకెప్పుడూ అలా ప్రవర్తించం !

ప్రొడ్యూ : (ఒక్క క్షణం వూరుకుని) ఎలావుంది మన నటన ?

డైరె : ఆఁ .... ఓ! చాలా వాస్తవికంగా వుంది !

కవి : (ఆశ్చర్యంగా) ఏమిటీ ! .... ఇదంతా నటనా ! .... నిజమే ననుకొని హడిలి చస్తున్నా న్నేను ! .... కాని బ్రహ్మాండంగా ఉంది ! దివ్యంగా ఉంది ! ......

ప్రొడ్యూ : ఇహ ఆపండీ ! మీ భట్రాజు పొగడ్తలు.

కవి : పొగడ్త కాదండీ యిది, కటికసత్యం !

డైరె : అది సరేనండీ ! తరవాత ఏం చెయ్యాలి ? ఆలోచించండీ!

(ఒక్క క్షణం నిశ్శబ్దం)

ప్రొడ్యూ : సరే ! డైరెక్టరుగారూ ! .... నాటకంలో మంచి సన్నివేశం చెప్పండి).

డైరె : చెప్తాను ! .... కాని నాదొక సలహా ! .... ఈ సన్నివేశాలన్నిటినీ సంకలించి వ్రాస్తే ఒక నాటకం తయారవుతుందిగా !

కవి : అది నా పని ! .... మీ వంతు సన్నివేశాలు విడమర్చి చెప్పుకుపోవడమే !

ప్రొడ్యూ : అలా చెయ్యండి సరిపోతుంది. డైరెక్టరుగారు చెప్పిన సన్నివేశాలు గుర్తుంచుకొని సంభాషణలు వ్రాయండి !

కవి : అవశ్యం ! .... మరి కానివ్వండి. ఆ సన్నివేశం ఏదో కాస్త వివరించండి !

డైరె : (గొంతు సవరించుకొని) వినండి ! .... ఒక వ్యక్తి ప్రవేశించాడు అప్పుడు !

కవి : ఎవరా వ్యక్తి ? .... ఏమా కథ ?

ప్రొడ్యూ : (కవితో) తమరు నోరు మూసుకోండి ముందు !... మీరు కానియ్యండి !

డైరె : అతడొక సామాన్య వ్యక్తిలా ఉన్నాడు. ఆట్టే పొడవూ కాదు, అలాగనీ పొట్టీ కాదు .... లావుగానూ లేడు, బొత్తిగా పీలగానూ లేడు ! .... కాని ప్రత్యేకత ఏమిటంటే అతనొక నల్లద్దాల కళ్లజోడు పెట్టుకున్నాడు. చేతిలో ఒక రివాల్వర్ ఉంది.

కవి : రివాల్వర్ ! .... అంటే విలన్ !?

ప్రొడ్యూ : ఉశ్ ! .... వూఁ ! వచ్చి అతనేం చేశాడు ?

డైరె : అలాంటి వ్యక్తి హఠాత్తుగా ప్రవేశించి ఏమన్నాడంటే..

(డైరెక్టర్ మాట పూర్తికాకుండానే "హేండ్సప్" అన్న గర్జన వినిపిస్తుంది. అంతా అటువైపు తిరిగారు ఆశ్చర్యంగా. డైరెక్టర్ వర్ణించిన వ్యక్తిలా ఒకరు గుమ్మంలో కనిపిస్తాడు. అతని చేతిలో రివాల్వర్ ఉంది.)

ప్రొడ్యూ : (ఆశ్చర్యంగా) అరె ! అతనే !

డైరె : అదే ఆశ్చర్యంగా వుంది !

కవి : దివినుండి భువికి దిగిన వో దివ్యపురుషా! ఎవ్వడవు నీవు?

వ్యక్తి : (కోపంగా) సైలెన్స్ ! .... నోరు మెదిపితే పుచ్చె లెగురుతాయి! నే నెవరో కావాలా ? (ప్రొడ్యూసర్‌ని చూపిస్తూ) ఎవరు నువ్వు ?

ప్రొడ్యూ : (భయంగా) నె .... నేను .... నేనూ ....

వ్యక్తి : అవును నువ్వే !

కవి : అతను మా ప్రొడ్యూసర్‌గారండి ! ఈ హాలు ఆయనదే! చాల మంచివారు !

వ్యక్తి : అలాగా ! .... మరి నువ్వు ?

డైర : ఆయన మా ఆస్థానకవిగారండీ !

వ్యక్తి : మిగిలిపోయిననువ్వు దర్శకుడివి ! .... అవునా ?

డైరె : అవునండి !

వ్యక్తి : ఏం చేస్తున్నా రిక్కడ ?

ప్రొడ్యూ : ఏదో నాటకం గురించి ఆలోచిస్తున్నాం !

వ్యక్తి : ఏమిటా నాటకం ?

డైరె : అదే తేలలేదు ! ఆ నాటకంలో గూడా మీలాటి వ్యక్తి వస్తాడు. సరిగ్గా సమయానికి తమ ప్రవేశం జరిగింది!

వ్యక్తి : (కోపంగా) ఆయ్ ! నన్ను నటుడనుకుంటున్నారా ? .... మాట్లాడరేం ? నా సంగతి మీకు తెలీదు ! .... నా పేరు వింటే గుండె లదరి చస్తారు, తెలుసా!

కవి : ఒబ్బా ! .... అంత గొప్పవారా !

వ్యక్తి : షటప్ ! .... అనవసరంగా వాగితే తల తీస్తాను ! ఏం? తమాషా చేస్తున్నారా ? .... మళ్లా నేను చెప్పేవరకూ అలా వరసగా నిలబడండి ! .... వూఁ ! క్విక్ ! (అంతా వరసగా నిలబడతారు. వ్యక్తి లోనికి చూసి) కమిన్ ప్లీజ్ ! .... అంతా రండి! (డైరెక్టర్ మాట్లాడబోతాడు). సైలెన్స్ ! ....

కవి : (భయంతో) చిత్తం ! .... మరి మాట్లాడం !

(వీధిలోంచి ఒక ముసలి వ్యక్తి, అతని వెనుకనే 25 సంవత్సరాల యువకుడు, ఆ వెనుక 20 సంవత్సరాల మైన అమ్మాయి వస్తారు.)

వ్యక్తి : (వాళ్లకి చూపుతూ) వీరు ప్రొడ్యూసరు, వీరు డైరెక్టర్ మిగిలిపోయిన ఆ పక్షి కవిగారు !

కవి : ఆఁ! ఆఁ!

వ్యక్తి : సైలెన్స్ ! .... ఇక మావార్ని మీకు పరిచయం చేస్తాను. .... ఆ ముసలి వ్యక్తి శాంతయ్యగారు. ఆ యువకుడు అతని కుమారుడు కుమార్, ఆ యువతి అతని కుమార్తె రంజన ! (అంతా "నమస్తే" అంటారు).

డైరె : ఇంక తమరెవరు స్వామీ !

శాంత : అతను మా స్నేహితుడు మాధవస్వామి !

వ్యక్తి : (కళ్లజోడు తీసి) నమస్తే ! .... నేనూ ఒక నటుణ్ణే

కవి : ఏమిటీ ! మీరూ నటులే ! .... ఆహా ! ఆహాహా ! ఏమి నటన ! అమోఘం ! అద్భుతం ! అచింత్యం !

"మంచి నటకుండవయ్యా వో మాధవయ్యా !
ఉర్వీ యాంధ్రులలో కెల్ల నుత్తముండ !"

మీవంటి నట పితామహుణ్ణి గన్న యీ ఆంధ్ర కళామతల్లి భాగ్య మేమనవచ్చును ? .... హే ! నట శార్దూలమా !

కుమార్ : అబ్బా ! అబ్బా ! ! చాలు !

డైరె : మా కవిగారికి ఆవేశం కలిగినప్పుడు, భాషకి బలాత్కారం జరగడం మామూలే !

మాధవ : అయ్యా కపిశ్రీ ! ఇక ఆపండి ! .... ప్రస్తుత విషయాని కొద్దాం ! మా అందరికీ పెద్ద శాంతయ్య ! అతడు మా సంగతి చెప్తాడు వినండి.

శాంత : అయ్యా ! మా సంగతి మనవిచేస్తాను .... ఒకప్పుడు సిరిపురం రాజావారి ఆస్థాననటకులం మేం !

డైరె : (గుర్తించినట్టు) సిరిపురం రాజాస్థానంలోనా ! .... అంటే మీరు మంగళగిరి శాంతయ్యగారు. అవునా ?

శాంత : అవును.

ప్రొడ్యూ : మీ రెరుగుదురా ?

డైరె : (తడబడి) ఓఁ! .... లేదు. పేరు మాత్రం విన్నాను.

శాంత : కావచ్చు .... ఒకప్పుడు దివ్యంగా వెలిగిన మా జ్యోతి ఆరిపోయింది. రాజులు, రాజ్యాలూ పోవడంతో మాకు కూడా దాతలు కరువైపోయారు.కొన్నాళ్లపాటు సొంత కంపెనీ నడిపినా తగిన లాభాలు కనిపించలేదు. మీ ప్రకటన చూసి యిలా వచ్చాం !

కవి : అదా సంగతి ! .... ఆ అబ్బాయీ, అమ్మాయీ కూడా నటులేనా ?

కుమార్ : కాకపోతే యిక్కడి కెందు కొస్తామండీ ?

రంజన : ముందే చెప్పాంగా ! అంతా అందులోనివారమే అని!

ప్రొడ్యూ : అయితే మీరు ఏయే పాత్రలు ధరిస్తారు ?

మాధవ : అదీ యిదీ అన్న భేదం నాస్తి ! .... ఏ రకం పాత్రనైనా నిర్వహించగలం !

కవి : ఆ అమ్మాయి కూడానా ?

శాంత : ఆహా ! .... అయినా అనుమాన మెందుకు ? మీరు వెయ్యబోయే నాటకం లెండి ! .... మా చేతనైనట్టు చేసి చూపుతాం !

మాధవ : పసందైనమాట !

రంజన : అవును అదే మా అందరి ఉద్దేశం !

డైరె : (కవితో) ఏమంటారు ?

కవి : (నానుస్తూ) ఏముంది ? .... ఏం లేదు!

ప్రొడ్యూ : (శాంతయ్యతో) అయ్యా ! .... అసలు విషయం చెప్తా వినండి ! నాటకం యింకా తయారుగా లేదు. మరో విషయం ! దాని కెలాంటి కథావస్తువు తీసుకోవాలో కూడా తేలలేదు.

శాంత : చిక్కేనే ! .... మరెలాగయితే ? (ఆలోచిస్తూ) ఒక పని చేస్తే ?

కవి : ఏమిటి ?

శాంత : (ఒక నిశ్చయానికొచ్చి) మాదొక కథావస్తువుంది! .... వింటారా !

కుమార్ : ఏది ? .... మనదేనా ?

శాంత : అవును .... అయ్యా ! .... నిజానికి .... వ్రాసే రచయితగాని ఉంటే మా జీవితమే ఒక నాటకంగా వ్రాయవచ్చు.

కవి : అందుకు సిద్ధంగా నే ఉన్నాగా ! .... చెప్పండి.

డైరె : (అనుమానంగా) అంటే మీరనేది .... మీ జీవితచరిత్ర...

మాధవ : ఒక నాటకం లాంటిదని వారి భావం ! .... నిజం కూడా అంతే. ఒకప్పుడు నలుగురిచేతా అవుననిపించుకున్న పెద్దమనిషి నేడీ స్థితికి ఎలా దిగజారేడో నలుగురూ తెలుసుకోవాల్సిందే !

ప్రొడ్యూ : ఏవైనా గృహచ్ఛిద్రా లున్నాయా ?

శాంత : అన్నీ ఉన్నాయి !

కవి : అయితే యిబ్బందే లేదు. నవరసభరితమైన నాటకం ఒకటి తయారవుతుంది.....మరి ఉపక్రమించండి!

డైరె : నాదొక చిన్న సూచన! .... అది మీ జీవిత చరిత్ర, మీరంతా అందులో పాత్రలు! అందుచేత దాన్నే ఒక నాటకంలా నటించి చూపితే యింకా బాగుంటుం దేమో !

ప్రొడ్యూ : నిజమే ! .... అలాగే చెయ్యొచ్చు.

రంజన : కాని ......

డైరె : మీకేమైనా అభ్యంతరమా ?

రంజన : అబ్బే! అదికాదు .... మరి సంభాషణలో ?

కవి : మీ నోటికి వచ్చినవి చెప్పండి! .... ఆపైన నే ఉన్నాగా! ఆ డిపార్టుమెంటు నాది....మరి దీనికేమైనా ఆముఖం ఉండొద్దా ?

కుమా : ఆముఖంలేదు, మీ ముఖంలేదు ! అంతా ఒకటే స్థలం ! శాంతయ్యగారి యిల్లు !

ప్రొడ్యూ : అయితే సెట్ ఖర్చు కూడా తగ్గుతుంది ! . . . . మరి కానివ్వండి !

మాధవ : అయ్యా ! రంగస్థలం యిలావుంటే చాలు. నాటకం ప్రారంభమవుతుంది !. . . . .కథలో శాంతయ్యగారొక మధ్యతరగతి గృహస్థు ! కుమార్, రంజన వారి పిల్లలు. వాళ్ళ వృత్తి నాటకాలు ఆడడమే !. . . . .ముందుగా వారిదైనందిక జీవితం కాస్త చూపి నాటకం ప్రారంభిస్తాం ! ఆఁ ! . . . . . .మరో రెండు చిన్న పాత్రలున్నాయి. అవి మీరు ధరించండి !

డైరె : అలాగే !. . . . .మరి మీ పాత్ర ?

శాంత : అతడు మా స్నేహితుడు, సన్నిహితుడు ! నిత్యం మా యింటికి వస్తూ పోతూ వుంటాడు ! పేరు మాధవయ్య.

కవి : మీది దుష్టపాత్ర అనుకోవచ్చా మాధవయ్యగారూ ?

రంజన : మీ యిష్టంవచ్చినట్టనుకోండి ! . . . . . ముందు పదండి !

డైరె : అంతా రెడీ ! . . . . . . .నాటకం ! శాంతయ్యగారి జీవిత నాటకం ప్రారంభం కాబోతూంది ! . . . . రెడీస్టేజ్ !

(అంతా లోనికి వెళ్తారు. లైట్లన్నీ ఒక్కసారి ఆరిపోయాయి. కాసేపటికి తిరిగి ఒక్కొక్కటే వెలుగుతాయి. వెనుకనుండి వాద్య సంగీతం వినిపిస్తుంది. లోనుండి కుమార్, రంజనలు వాదించుకుంటూ వస్తారు.)

కుమార్ : నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు ! అడ్డమైన వాళ్ళతోనూ అలా తిరుగుతూవుంటే చూస్తూ వూరుకోడానికి నేనేం దద్దమ్మననుకున్నావా ?

రంజన : (హేళనగా) అహా ! దద్దమ్మ వెలాగవుతావ్ ? ధీరుడివే అవుతావు ! అయినా నాయిష్టం నాది ! మధ్య నువ్వెవరు అడగడానికి ?

కుమా : ఎవర్నా ? . . . . . నాన్న రానియ్ ! అయన్నే అడుగుతాను !

రంజ : అడుగు ! . . . . . .నాకేం భయం అనుకున్నావా ?

కుమా : లేదు కాబట్టే కళ్ళు నెత్తికెళ్ళాయి ! . . . . . కాస్త చూసుకు ప్రవర్తించు !కలకాలం నీ ఆట ఇలా సాగుతాయనుకున్నావా ?

రంజ : ఎందుకనుకుంటాను ? . . . . . అయినా నా యిష్టం.

కుమా : మాట్లాడితే నా యిష్టం, నా యిష్టం అంటున్నావ్!. ఎందుకని వూరుకుంటూ వుంటే సరి ! . . . . . మితి మీరితే తగిన శాస్తి చేస్తాను, తెలుసా !

(వీధిలోంచి మాధవయ్య వస్తాడు)

రంజ : ఓం ! యిలాంటివి చాలా చూశాను ! . . . . అయినా నువ్వెవరివి అడగడానికి ? ఈ యింట్లో నీకెంత హక్కుందో నాకూ అంతే హక్కు వుంది !

కుమా : వూరుకుంటే సరి ! ఉండదూ ?

మాధవ : అరెరె ! . . . . . .అలా పోట్లాడుకుంటున్నారేం ? ఆగం డాగండి !

రంజ : నువ్వుండు మావయ్యా !

కుమా : అవును నువ్వూరుకో ! ముందు దీని సంగతి తేల్చాలి !

మాధవ : అరె ! ఆగండ్రా ! మీ నోళ్ళు మండిపోనూ ! ఆగండి !

కుమా : చూడది ! తన యిష్టం వచ్చినట్టు వూరుమీద తిరుగుతుందిట! మనమేమో చూస్తూ వూరుకోవాలట!

రంజ : వూరుకోక చేసేదేమిటో ? . . . . . నన్నేం చెయ్యలేరు !

కుమా : ఎందుకని ఉపేక్షిస్తూవుంటే. . . . . చూశావా దాని పొగరు !

రంజ : ఆమాటే అనొద్దన్నాను !. . . . .మళ్ళా అంటే చూడు !

కుమా : ఏం చేస్తావ్ ?

రంజ : పళ్ళు రాలగొడతాను !

కుమా : ఎలా రాలగొడతావో నేనూ చూస్తాను !

మాధవ : అయ్యయ్యో ! మీ గోల మండిపోనూ ! నా గోల వినిపించుకోరేం ?

కుమా : నువ్వూరుకో ! దీని పొగరు కట్టిస్తాను.

రంజ : మళ్ళా అను ఆ మాట !

కుమా : ఒకసారికాదు ! పదిసారలంటాను ! పొగరుబోతా ! పొగరుబోతా!

మాధవ : అయ్యో రామా ! (అని ఇద్దరిమధ్యకీ వెళ్తాడు. ఇద్దరూ కలిసి మాధవయ్యని కొడతారు.)

మాధవ : (గోలగా) అయ్యో ! అయ్యో ! మీ చేతులు చట్టుబండలుగానూ ! . . . . . .నన్ను కొడతారేమ్రా ! గయ్యాళిగంపల్లారా !

రంజ : (నవ్వుని ఆపుకుంటూ) అయ్యో ! నీకు తగిలిందా మామయ్యా !

కుమా : (నవ్వుని అపుకుంటూ) అయినా నువ్వెందుకు రావాలి చెప్పు మధ్య ?

మాధవ : (ఉక్రోషంగా) అబ్బా ! . . . . .అయితే కొట్టుకుంటూ చస్తూవుంటే విడిపించాలనుకోడం కూడా తప్పే నట్రా ?

రంజ : ఇప్పుడెవరు పోట్లాడుకున్నారు ?

మాధవ : హొరాసి వగలమారి వంకాయ ! మరిప్పుడేం చేస్తున్నారే మీ రిద్దరూను ? కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారా ?

కుమా : అదికాదు మామయ్యా ! . . . . .మేం రిహార్సల్ వేసుకుంటున్నాం ! . . . . .రేపటి నాటకంలో యిదొక సన్నివేశం !

మాధవ : ఏమిటీ ! ఇది నాటకంలో సన్నివేశమా ?

రంజ : అవును. రేపు మేం వెయ్యబోయే "సంఘర్షణ" నాటకంలో ఒక సన్నివేశం అది ! అందులో కూడా మేం పోట్లాడుకుంటూవుంటే నీలాంటి వ్యక్తి వస్తాడు ! విడిపించబోయి దెబ్బలు తింటాడు !

మాధవ : అయితే ! అందుకని నన్ను కొడతారట్రా!

కుమా : మరేం చెయ్యమంటావ్ ? సరిగ్గా సమయానికి నువ్వు వచ్చావు ! అంతే కాక నాటకంలో మాటలే అన్నావ్ ! . . . . అంచేత నాటకంలోలాగే నిన్ను కొట్టాల్సి వచ్చింది.

మాధవ : అయ్యో! అయ్యో! ఎంత దెబ్బకొట్టార్రా ! (వీపు తడుముకుంటూ) మన్లో మనమాట. . . .మా యింటిది కూడా యింత దెబ్బ వెయ్యలేదు !

రంజ : (ఎగతాళిగా) అయితే మామయ్యా ! . . . అప్పుడప్పుడు అత్తయ్య గుణమర్దనం చేస్తూవుంటుం దన్నమాట !

మాధవ : ఉష్ ! అది మీ కనవసరం ! . . . అవన్నీ యింటి వ్యవహారాలు !

కుమా : అవునవును ! అవన్నీ ప్రైవేటు వ్యవహారాలు ! స్వగతం ! మేం వినకూడదు.

(వీధిలోంచి శాంతయ్య ప్రవేశం)

మాధవ : రావయ్యా బావా రా ! . . . . నీ కోసమే చూస్తున్నాను !

శాం : నువ్వు చూడని దెప్పుడులేగాని ! . . . . .ఏమిటిసంగతి?

రంజ : అదికాదు నాన్నా ! . . . . .ఇవాళ మేం రిహార్సల్స్ వేసుకుంటూవుంటే మామయ్య వచ్చాడు! నాటకంలో ప్రకారం మామయ్యని కొట్టాల్సి వచ్చింది !

మాధవ : (వీపు తడుముకుంటూ) ఎంత దెబ్బ కొట్టారనుకున్నావ్ ?

కుమా : మన్లో మనమాట, పాపం ! అత్తయ్య కూడా అంత దెబ్బ వెయ్యలేదుట !

మాధవ : టూట్ ! ఆ మాట నే నన్నానా ?

రంజన : అవునవును ! అవన్నీ ప్రైవేటు వ్యవహారాలు ! స్వగతం !

మాధవ : చూశావయ్యా వీళ్ళ ప్రతాపం ! . . . . అరగంట నుంచి చూస్తున్నా ! తెగ విరగబడిపోతున్నారు !

కుమా : అహా ! విరిగి పడలేదండీ !

శాంత : చాల్లే(రా ! . . . . . .ఇంక లోనికి వెళ్ళండి !

రంజన : రా ! అన్నయ్యా ! (రంజన, కుమార్ లోనికి వెళ్తారు)

మాధవ : (కూర్చుంటూ) అమ్మయ్య ! ఆనాడు ఆ శ్రీ మహా విష్ణువు గజేంద్రుణ్ణి రక్షించినట్టు కాపాడవయ్యా !... అరగంటయి తెగ యేడిపిస్తున్నారు !

శాంత : పిల్లలతో నీకేమిటయ్యా ! . . . . .ఆవేం పట్టించు కోకు !

మాధవ : ఛ ఛ ! అదేంమాట ! అలాగైతే మన స్నేహం యిన్నాళ్ళు సాగేదేనా ?

శాంత : అవునవును ! నాకు తెలీదూ ?

మాధవ : మన్లో మనమాట. నే నొకటి చెప్తాను వింటా ?...... ఎంత నాటకాలు వేసినా ప్రతిక్షణం అదేపనా ? . . . కాస్త పట్టూ విడుపూ వుండాలి !

శాంత : ఎలా చెప్పు ? కష్టపడి రిహార్సల్స్ వెయ్యకపోతే నాటకం బాగుండదు !. . . . . అది కాస్తా చెడిం దంటే మనవోట్లో మన్నేకదా ?

మాధవ : అవుననుకో ! . . . . . . అయినా మాంసం తింటాం కదా అని దుమ్ములు మెళ్లో వేలాడదీసుకుంటామా ? మన్లో మనమాట. కోపం తెచ్చుకోకుమీ !

శాంత : నాకెందుకయ్యా కోపం ? పెద్దవాడివి, శ్రేయోభి లాషినిగదా ! నీ మాట పాటించనూ ?

మాధవ : బాగుంది మరి ! . . . .అయినా ఏవో సంబంధాలు చూసి ఆ పిల్ల లిద్దరికీ మూడు ముళ్ళు వేయించి, అయిందనిపిస్తే మంచిది ! ఇలా ఎంతకాలమని చెప్పు ?

శాంత : చెయ్యాలనేవుంది : . . . .కాని కలిసిరాందే కార్యాలు జరుగుతాయా ?

మాధవ : సరే ! మన్లో మనమాట. నువ్వు "ఊఁ !" అనాలి గాని, పిల్లలిద్దరికీ ఘనమైన సంబంధా లున్నాయి ! ఏమంటావ్ ?

శాంత : సరే ! చూద్దాంలే ! . . . . . ఈ నాటకం ఏదో కానియ్ ముందు !

మాధవ : అలాగేలే ! . . . . .కాని మన్లో మనమాట. జమీం దారుగారి వ్యవహారం ఎలా వుంది ?

శాంత : వారి ఆర్థిక పరిస్థితి యేమీ బాగులేదుట ! . . . . అంతా చూస్తూవుంటే మనతోవ మనం చూసు కోడమే మంచిదిలావుంది ! . . . . . అసలు రేపు నాటకం పడేవరకూ అనుమానమే !

మాధవ : ఇది మరీ బాగుంది ! . . . . .ఒకవేళ మన్లో మన మాట. నువ్వన్నంత పనీ జరిగితే యేం చెయ్యాలని ?

శాంత : అదేదో జరగనియ్ ! . . . . . అప్పుడే ఆలోచిద్దాం)
(వీధిలోంచి "శాంతయ్యగారూ !" అని పిలుపు వినిపిస్తుంది!

మాధవ : ఎవరది ?

శాంత : ఎవరో చూసి వస్తానుండు ! (అని వీధిలోకి వెళ్తాడు. లోనుండి కుమార్ వస్తాడు)

కుమా : నాన్న ఎటు వెళ్తున్నారు ?

మాధవ : ఎవరో పిలిస్తే వెళ్ళాడు చూసిరావడానికి !
(వీధిలోంచి ఒక కవరు చేత్తో పట్టుకొని శాంతయ్య వస్తాడు)

కుమా : ఎవరు నాన్నా ?

శాంత : జమీందారుగారి జమాదారు ! . . . . .ఈ కవరు యిచ్చి వెళ్లాడు !

మాధవ : ఏమిటది ?

శాంత : ఇదిగో ! (అని చదివి నిట్టూరుస్తూ) శ్రీరామ చంద్రా ! !

కుమా, మాధవ : ఏమిటంది ?

శాంత : చూడు ! (అని ఉత్తరం కుమార్‌కిస్తాడు.)

కుమార్ : (చదువుతాడు) "ఇందుమూలంగా తెలియజేయు నది ఏమనగా సంస్థానం ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నాటక సమాజ నిర్వహణ నిలిపి వేయడమైనది. ఇందుకు శ్రీ శ్రీ శ్రీవారు ఎంతో చింతిస్తూ యీ వార్త నటులందరికీ తెలియజేస్తున్నారు.
ఏడు చింతల చిన్నదొర
దివాన్ బహదూర్."

మాధవ : (ఆశ్చర్యంగా) అయ్యయ్యో ! . . . . .ఎంత పని జరిగింది. . . . .ఏమిటీ అవాంతరం ?

కుమార్ : (ఉత్తరం మడుస్తూ) ఊఁ ! . . . . .దీనికి విచారం దేనికో ?

మాధవ : ఒక్కక్షణం క్రిందటే అనుకున్నాం !. . . . . . అప్పుడే కబురు !

శాంత : (నిట్టూరుస్తూ) ఇంతకీ ఖర్మ ! . . . .ఇలా జరుగు తుందని తెలిసినా, ఇంత త్వరగా అవుతుందనుకోలేదు !

కుమా : మిగిలిన వాళ్ళకి కూడా యీ వార్త అందజేసే వుంటారు ?

శాంత : తెలిసేవుంటుంది ! . . . .కనీసం యీ నాటకం అయే వరకైనా సమాజం వుంచితే బాగుండును ! . . . . . కాని మనమేం చేస్తాం ? ప్రభువుల చిత్తం !

మాధవ : అదేనయ్యా చిక్కు ! . . . .మన్లో మనమాట. ఆ యేడుచింతలుగాడున్నాడు చూశావ్ ? వాడో ఉద్దం డుడు ! . . . . అసలు వాడే యిదంతా చేసివుంటా డని నా అనుమానం !

శాంత : మనఖర్మ యిలా వున్నప్పుడు ఒకర్నని యేం లాభ మయ్యా !

మాధవ : అదీ నిజమే ! . . . . .మరి నే వస్తా !

శాంత : మంచిది వెళ్ళి రా! (మాధవయ్య వెళ్ళిపోతాడు. లోనుంచి రంజన వస్తుంది)

రంజ : (నిశ్శబ్దంగా కూచున్న కుమార్, శాంతయ్యలని చూసి) అలా కూచున్నారేం ?

కుమా : ఏం లేదు.

రంజ : ఏం జరిగిందసలు ?

కుమా : జమీందారుగారు మనందరికీ శ్రీముఖాలు పంపారు !

రంజ : ఆఁ !

శాంత : అంతగా ఆశ్చర్యపోతే యెలా తల్లీ !. . . . .అయినా యింత హఠాత్తుగా జరుగుతుందనుకోలేదు !

కుమా : కనీసం యీ నాటకం ప్రదర్శించేవరకూ అయినా సమాజం వుంచాల్సింది.

రంజ : అదీకాదా ? అయితే యీ శ్రమంతా దండుగే !

శాంత : అంతేనమ్మా ! రాజుల మనస్సుల కెంత తోచితే అంత ! మన జీవిక పోతుందని వాళ్ళకేం భయమా ? . . . . సొంత లాభం ఎవరు మానుకుంటారు చెప్పు ?

రంజ : పోనీ. . . . .ఏదో విధంగా యీ నాటకాన్ని ప్రదర్శిస్తే ?

కుమా : ఎలా ? . . . .మిగిలిన వాళ్ళంతా అంగీకరించవద్దూ ? ఒకవేళ అంగీకరించినా ఖర్చు లెవరు భరిస్తారు ?

శాంత : అంతా సమష్టిగా భరిస్తేనే యిది సాగుతుంది ! లేనినాడు వ్యర్థం !

రంజ : ఎందుకైనా మంచిది ! మీరోసారి ప్రభాకరంగారిని కలవరాదూ ?

శాంత : (ఆలోచించి) ఊఁ ! సరే . . . . .వెళ్ళివస్తాను.

కుమా : ఈ యెండలో మీ రెందుకు నాన్నా తిరగడం ? నేను వెళ్ళివస్తాను. వీలైతే అతన్నే తీసుకు వస్తాను !

శాంత : అదేమంత మంచిదికాదురా ! . . . . . అవసరం మనది. అంచేత మనం వెళ్ళడమే మంచిది !

రంజ : ఎవరు వెళ్ళినా ఒకటేకదా నాన్నా ! అన్నయ్యని వెళ్ళనియ్యండి !

శాంత : సరే వెళ్ళిరా !

కుమా : ఇక్కడున్నట్టు వస్తా ! (అని వీధిలోకి వెళ్తాడు)

రంజ : ఎంతలో యెంత మార్పు ! . . . .ఒక్క క్షణం క్రింద ఈ నాటకం గురించి ఎంతగానో వూహించాం !. . . . ఇప్పుడా ప్రదర్శనే అనుమానం !

శాంత : అంతేనమ్మా ! దైవలీల తెలుసుకోడం కష్టం !. . . కళ్ళకి కనిపించినట్టు అనిపించి మాయమవుతాయన్నీ !

రంజ : ఈ నటులందరూ కప్పల తక్కెడ మేళం ! . . . . ఇహ చూడండి ఎన్ని సమాజాలు వెలుస్తాయో !

శాంత : అదీ నిజమే ! . . . . .ఏమైనా యిక మీదట యీ ఒక్కదాన్నీ నమ్ముకోకూడదు. పొట్ట గడవడానికి వేరొక మార్గం చూసుకోడం మంచిది !

(వీధిలోంచి "శాంతయ్యగారూ !" అంటూ ఒక వ్యక్తి వస్తాడు. అతను మొదట కనిపించిన డైరెక్టర్. కాని కొత్తగా కళ్ళజోడు తలిగించుకున్నాడు)

శాంత : రండి రండి ప్రభాకరంగారూ ! . . . . .మీ దగ్గరికే పంపాను అబ్బాయిని.

ప్రభా : తోవలో యెదురయాడు. అలా కవిగారి దగ్గరికి పంపి నే నిలా వచ్చాను.

శాంత : మరేంలేదు. ఆ కబురు కాస్త నన్ను తలక్రిందులు చేసింది ! మీరు . . . . . .

ప్రభా : ఏది ? . . . . .ఓఁ ! అసలు ఆ కబురు మొదట నాకే అందింది. ఇలాంటిది జరుగుతుందని ముందే వూహించాను. కాని గమ్మత్తేమిటంటే యిలా జరుగుతుందని తెలిసినా అంతా ఉపేక్షగా వూరుకున్నారు !

రంజ : ఇంత హఠాత్తుగా వస్తుందనుకోలేదుగా ! . . . . అయినా మన ప్రభువుల ధీమావే మనకీ వచ్చింది.

ప్రభా : బాగా చెప్పారు ! (శాంతయ్యతో) మరి మీరేం ఆలోచించారు ? మనమేం చెయ్యాలిప్పుడు ?

శాంత : నాకేం తోచడంలేదు !

ప్రభా : అందరిలో పెద్దలు మీరు ! . . . .మీ ఆలోచన లేందే ఏ పనీ చెయ్యడం నా కిష్టంలేదు ! . . . .ఏదో ఒకటి చెయ్యాలి మనం ! . . . .ఏంచేస్తే బాగుంటుందో మీరు చెప్పండి !

రంజ : ఎలాగూ కష్టపడి తయారయేం కాబట్టి ఆ సంఘర్షణ నాటకాన్ని ప్రదర్శిస్తే మంచిదేమో ?

శాంత : అది బాగానే వుంటుంది. . . . .కాని ముందుగా కొన్ని చిక్కులు ఎదుర్కోవలసి వుంటుంది.

ప్రభా : ఏమిటవి ?

శాంత : ఆ ప్రదర్శన కయ్యే ఖర్చులు ఎవరు భరిస్తారు ?

ప్రభా : ఇది నిజంగా గడ్డు ప్రశ్నే ! . . . . .ఎవరూ అంత స్తోమతు గలవారు కారు !

రంజ : పోనీ ఒకలా చెయ్యొచ్చుగా !

శాంత : ఎలా ?

రంజ : ఖర్చులు అంతా సమష్టిగా భరిస్తారు ! . . . . లాభాన్ని కూడా అంతా సమంగా పంచుకుంటారు!..... మీరేమంటారు ?

ప్రభా : చాలా బాగుంది. దీనివల్ల అందరికీ సమాన బాధ్యతలు కూడా ఉంటాయి. నా మట్టుకు నాకీ పద్ధతి బాగా నచ్చింది !

శాంత : కాని దానివల్ల కొన్ని చిక్కులున్నాయి. కొందరీపద్ధతిని తమ స్వార్థాని కుపయోగించుకునే అవకాశం వుంది. నా ఉద్దేశం. . . . . .ప్రస్తుతం అయే ఖర్చుని ఎవరో ఒకరు భరించడం, ఆ లాభాన్ని కూడా పూర్తిగా అతనే పొందడం సమంజసం ! . . . . .మీరీ విషయం గురించి ఆలోచించండి. ఏం తొందరలేదు !

ప్రభా : సరే! ఆలోచించి చెప్తా!....నాకు టైం అయింది అలా మా షాప్‌కి వెళ్లి వస్తాను.

శాంత : మంచిది. వెళ్లిరండి ! (ప్రభాకరం వెళ్లిపోతాడు).

రంజ : అలా అనేశావేం నాన్నా !

శాంత : నీకు తెలీదమ్మా !....అందరూ పెట్టుబడిదారులే అయితే చాలా ప్రమాదా లున్నాయి. అసలు కలెక్షనే కనిపించకుండాపోయే ప్రమాదం ఉంది.

రంజ : అంత నీచంగా ప్రవర్తిస్తారా ఎవరైనా ?

శాంత : అలాగనకు!......డబ్బెవరికి చేదు ?....పదిమందితో కలిసినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి.

రంజ నిజమే !....ఈ అన్నయ్యేం చెప్మి యింకా రాడు.

శాంత : ఒస్తాడు!....ఇంకా ఎవరి దగ్గరికైనా వెళ్ళాడో యేమో ?

రంజ : కవిగారి దగ్గరికి పంపానని చెప్పారుగా!

శాంత : అవునుగా ! అమాటే మరిచాను.

(వీధిలోంచి కుమార్, ఆ వెనుకనే కవి వస్తారు. ఇతను పూర్వపు కవిగారే. కొత్తగా వేస్ట్‌కోట్ మాత్రం వేసుకున్నాడు.)

కుమార్ : కవిగారిని తీసుకొచ్చాను నాన్నా!

శాంత : దయచేయండి !....మీరొస్తారని చెప్పారు ప్రభాకరం గారు.

కవి : ఆయనేరి ? .... ఆఁ! కొంచెం మంచితీర్థం యిప్పిస్తారా?

శాంత : అలాగే ! .... అమ్మాయ్ ! ......

రంజ : తెస్తున్నా! (అని లోనికి వెళ్తుంది)

కుమార్ : రాజావారి దగ్గరినుండి కవిగారికేమీ వర్తమానం రాలేదుట నాన్నా! వారి నింకా ఆస్థానకవులుగానే ఉంచుకున్నారు.

శాంత : అలాగా ! .... సంతోషమే. తమతో ఒక ముఖ్య విషయం మనవిచెయ్యాలని ....

కవి : అలాగే .... కాని నిజంగా నాకెంతో చింతగా ఉంది. ఇలా సంభవిస్తుందని నేను కలలోనైనా అనుకోలేదు... కాని ఏంచేస్తాం! అంతా వాడి లీల.

కుమార్ : ప్రభాకరంగారేం చెప్పారు ? .... అసలు వారుంటారని చెప్పి తీసుకొచ్చాను కవిగారిని.

శాంత : ఆయన వాళ్ల షాప్‌కి వెళ్లారు .... మరో పావు గంటలో రావచ్చు.

(రంజన గ్లాసుతో మంచినీళ్ళు తెస్తుంది.)

రంజ : ఇవిగో మంచినీళ్లు !

కవి : ఇలా తెండి. (అని గ్లాసు అందుకోబోతాడు. కాని రంజన శాంతయ్య చేతి కిస్తుంది. అతను దాన్ని కవికి అందిస్తాడు).

కవి : (నీరుత్రాగి) ఆహా! ఏమి చల్లదనం, ఏం తియ్యదనం! ప్రాణం లేచివచ్చిందిగదా! ఆహాహా ! (అని గ్లాసుని బల్లపై పెడతాడు.)

శాంత : మనం అసలు విషయంలోకి వద్దామా ?

(రంజన్ గ్లాసు తీసుకొని లోనికి వెళ్తుంది).

కవి : నిరభ్యంతరంగానూ ! .... కానివ్వండి.

శాంత : మరేంలేదు. ఎలాగో కష్టపడి తయారయేం కాబట్టి "సంఘర్షణ" నాటకాన్ని ప్రదర్శించాలని సంకల్పం.

కవి : శుభం ! .... మరింకేం ? కానివ్వండి.

కుమార్ : అలాగంటే చాలదండీ ...... దాని నిర్వహణ బాధ్యత మీరు కూడా కొంత వహించాలి.

కవి : దానికేం కొదవ ? .... నామాట, సాయం ఎల్లప్పుడూ ఉంటుంది.

కుమా : అదొక్కటే చాలదండీ.

శాంత : ఇది కొంచెం క్లిష్టమైన పనండీ. అందరం సమిష్టి బాధ్యత వహిస్తేనే యిది సాధ్యపడుతుంది.

కవి : సరే! అలాగే చెయ్యొచ్చు.... కాని ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నాను.

కుమా : ఏమిటి ?

కవి : నా నాటకం ప్రదర్శించే సమయంలో రాజావారు నూట పదహార్లు కట్నం ఇచ్చేవారు.

కుమా : కావచ్చు.

కవి : ఆనవాయితీ తప్పించకూడదనీ నా ఉద్దేశం. ఆపైన మీ యిష్టం.

శాంత : అంటే మీరనేది ఆ సొమ్ము మేం యిచ్చుకోవాలనా?

కవి : మీరెందు కిచ్చుకోవాలండీ ? .... ఎవరు ప్రదర్శిస్తే వారే యిచ్చుకుంటారు.

కుమా : కవిగారూ ! కొంచెం ఆలోచించండి. ఇది ధర్మంగాదు. అసలే కష్టాల్లో ఉన్న నటవర్గం నెత్తిన ఈ అదనపు సుంకం విధించడం న్యాయంకాదు.

కవి : న్యాయం ఎక్కడేడిసింది ? .... ఇన్నిపన్నులున్నా భారత దేశం లాంటిదే అదనపు సుంకం విధిస్తోంది .... నేననగా యెంత ? కేవలం నిమిత్తమాత్రుణ్ణి.

శాంత : అయితే మీమాట మీదేగాని మా మొర వినరన్న మాట. ఇంతమంది ఆకలిచావులకు కారకు లవడం శ్రేయస్కరం కాదుసుమండీ! (వీధిలోంచి ఈమాట వింటూ మాధవయ్య వస్తాడు).

మాధవ : ఏమిటయ్యోయ్! శ్రేయస్కరం అంటున్నావ్! .... వోహెూ ! కవిగారా ! ఏమిటి సంగతి.

కుమా : ఈయనగారి నాటకం వెయ్యాలంటే నూటపదహార్లు కట్నం యిచ్చుకోవాలిట.

కవి : అవసరం ఉన్నప్పుడు యిచ్చుకోరండీ మరీ ?

శాంత : అలా అనడం ధర్మం కాదనే మొరపెట్టుకుంటున్నాం.

మాధవ : అవునండీ! .... అంతపెద్ద మనిషి చెప్తూవుంటే వినిపించుకోరేం ?

కుమా : ఒకవేళ ఆ డబ్బు యివ్వకపోతే ?

కవి : నా నాటకం వెయ్యడం మానేస్తారు .... దానికో బ్రహ్మండమేమిటి ?

కుమా : అయితే దయచెయ్యండి. బోడి నాటకం మీ దొక్కరిదే ఉందా యీ లోకంలో.

కవి : అయితే మానెయ్యండి. మీ రొక్కరే ఉన్నారా బోడి నటులు.

శాంత : కుమార్! నువ్వూరుకో! .... ఆమాటలేం పట్టించుకోకండి కవిగారూ!

కవి : నేను బోడి కవిని, నాది బోడి నాటకం! .... మరెందుకు మీరు దాన్ని ప్రదర్శించాలి ! .... సవా లక్షమంది సిద్ధంగా ఉన్నారు దానికోసం! .... ఎవరైనా కళ్ల కద్దుకొని వేసుకుంటారు ! మీరే ఉన్నారా బోడి నటులు !

(అని వెళ్లబోతాడు).

మాధవ : (ఆపి) ఆగండాగండి కవిగారూ! మన్లో మనమాట, వాళ్లు బోడి నటులూ కారు, మీరు బోడి కవులూకారు.

కుమా : నువ్వూరుకో మామయ్యా! .... నీ కెందుకు.

మాధవ : నువ్వుండవోయ్! .... మన్లో మనమాట కవిగారూ! ...... వీళ్ళు కాకపోతే వీళ్ల బాబులు మరో నట వర్గం వస్తుంది.

కవి : బాగా చెప్పారు.

మాధవ : ఆగండాగండి. మీరు కాకపోతే మీ తాత మరోకవి దొరుకుతాడు వీళ్లకీను.

కవి : ఆఁ!

కుమా : బాగా చెప్పావ్ మామయ్యా!

శాంత నువ్వాగరా! .... అయ్యా కవిగారూ! ఈనాటిది కాదు మన సంబంధం! సుమారు యిరవయ్యేళ్లయి ఒక సమాజంలో కలసి పనిచేశాం! .... అన్నదమ్ముల్లా మెలిగాం. ఆ సంబంధాన్ని యీ ఒక్క రోజుతో తెంపేస్తారా ?

మాధవ : అద్గదీ మాట! .... అదే చెప్పబోయాన్నేనూను. మన్లో మనమాట—మీకు వేరే నటులు దొరికినా, ఇంత శిక్షణ ఉన్నవాళ్ళూ ఈ ఆప్యాయత, ఆదరణ లభిస్తాయా ? చెప్పండి.

కవి : అది నిజమే.

కుమా : అయ్యా! ఇవాళ మమ్మల్ని పొమ్మన్నట్టే రేపో యెల్లుండో మిమ్మల్నీ పొమ్మంటారు గానీ, ముద్దిం చరు గదా !

శాంత : అదేం మాటరా !

మాధవ : నిజమే ! మన్లో మనమాట. ఆపని కాస్త జరిగి పోయిందేమో యీపాటికి.

కవి : నాకేం తోచకుండా ఉంది.

శాంత : కవిగారూ! .... ఏదోవిధంగా మీ ఋణం తీర్చు కుంటాం గాని, రిక్తహస్తాలతో పంపం! ఆనాటి కలెక్షన్‌లో ఖర్చులు పోను మిగిలినదాన్లో వాటా యిస్తాం! ఈసారి కిలా కానివ్వండి! .... వచ్చేసారి నుండీ ఏదో మార్గం ఆలోచిద్దాం!

కవి : సరే కానివ్వండి! .... మీ రంతగా చెప్తున్నప్పుడు కాద నడం ఉత్తమ లక్షణం కూడా కాదు.

కుమా : అలా తోవకు రండి .... నిజంగా మీ మనసు ఐస్ లాంటిదండీ కవిగారూ !

మాధవ : అందుకే గడ్డకట్టుకుపోతుంది! .... మన్లో మన మాట. అంతేగదండీ కవిగారూ !

కవి : పామరులు అలాగే అనుకుంటారు.

శాంత : బాగా శలవిచ్చారు! .... నే నెరుగుదునుగా ! నాకన్నా అర్థం చేసుకోగలరా ? మిమ్మల్ని ?

కవి : బాగా చెప్పారు .... అయినా మిమ్మల్నీ, మీ అమ్మాయినీ చూసి యిచ్చాను గాని అహ ! మరేంలేదు, మీరు పెద్దలు, యోగ్యులు, నా కష్టం ఉంచుకోరని తెలిసి యిచ్చాను గాని, మరొకరి కిస్తానా నా నాటకం ?

కుమా : మాకు మాత్రం తెలీదండీ ? .... మనం అంతా ఒక తెగలోవాళ్లమేగా !

కవి : మరి నాకు శలవిప్పించండి! మళ్ళా దర్శించుకుంటాను.

శాంత : అవసరమైతే నేనే వస్తాన్లెండి! (కవి వీధిలోనికి నిష్క్రమిస్తాడు).

మాధవ : ఆశపోతుగాడిద కొడుకు! మన్లో మనమాట. ఈ బోడిగాడు తప్ప వరెవడూ దొరకడా బావా ?

శాంత : ఎందుకు దొరకరు ? .... కావలసినంత మంది కవు లున్నారు .... కాని ప్రస్తుతం సిద్ధంగా ఉన్న నాట కాన్ని మానుకోడం దేనికి చెప్పు ?

కుమా : మరి ఖర్చులమాట యేమిటి ? ....అసలు ప్రభా కరంగారితో యేం మాట్లాడారు?

శాంత : ప్రస్తుతానికి అంతా సమష్టిగా భరించడం ఉత్తమం అన్నా రాయన. కాని నేను మాత్రం మొత్తం అంతా ఒకరే భరించడం, ఆ వచ్చే లాభాన్ని కూడా అతనే పొందడం సమంజసం అని చెప్పాను. ఆయన ఆలో చిస్తా మన్నారు.

మాధవ : నా ఉద్దేశం కూడా అదే సుమా ! ప్రస్తుతానికి నువ్వో, అతనో భరించడం మంచిది.

శాంత : నాకంత స్తోమ తెక్కడిది ? .... ఉంటే వీళ్ళందర్నీ బతిమాలుతానా ?

మాధవ : అవును. నాకు తెలీదూ ? (వీధిలోంచి "పోస్ట్" అన్నకేక వినిపిస్తుంది).

శాంత : చూడు నాయనా! (కుమార్ వెళ్లి, ఒక ఉత్తరం తెచ్చి శాంతయ్య కిస్తాడు).

కుమా : మీకే వచ్చింది.

శాంత : ఏదీ ? (చించి చదువుతాడు. అతని ముఖంలో రంగులు మారతాయి).

మాధవ : ఎక్కడినుంచి ?

శాంత : మా తమ్ముడు వ్రాశాడు. (లోనుండి రంజన ప్రవేశం).

రంజ : అదేమిటి ?

కుమా : బాబయ్య ఉత్తరం వ్రాశాడు.

రంజ : అలాగా !

శాంత : (చదవడం పూర్తిచేసి నిట్టూరుస్తూ) ఊఁ! .... బాగుంది!

మాధవ : ఏం ? మళ్ళా యేం ఒచ్చింది ? .... అహాఁ! మన్లో మనమాట అంతా క్షేమమే గదా ?

కుమా : పిన్ని ఒంట్లో ఎలా ఉంది ?

శాంత : ఒంట్లో బాగానే ఉంది. కాని ఇంట్లోనే బాగులేదు.

రంజ : అదేమిటి ? ఏం జరిగింది ?

శాంత : నోటు బాకీ తీర్చమని ఋణదాతలు నోటీసిచ్చారట!

కుమా : ఎప్పుడు ?

శాంత : నెలరోజుల కిందట ! .... ఆ తరువాత డిక్రీ కూడా అయిపోయిందిట. ఎల్లుండి యిల్లు వేలం!

రంజ, కుమా : (ఆశ్చర్యంగా) ఆఁ!

మాధవ : అన్నా ! ఎంతపని జరిగింది ? మరీసంగతి ముందు తెలుసా నీకు ?

శాంత : లేదు. ఇంతవరకూ తెలీదు. ఇప్పుడు కూడా తెలియ జెయ్యకూడదనే అనుకున్నాడట! .... తప్పనిసరి కాబట్టి వ్రాశాడు.

కుమా : దుర్భిక్షంలో అధికమాసంలా ఈ సందట్లో యిదొకటి.

రంజ : ఈ బాబయ్య ఎప్పుడూ యింతే! .... కాస్త ముందుగా వ్రాస్తే కొంపేం పోయిందో! .... సరిగ్గా సమయానికి పెళ్ళి(గాం లాంటి ఉత్తరం ఒకటి పడేస్తాడు.

శాంత : వాడు మాత్రం ఏంజేస్తాడు ? .... కష్టాలు ముందుగా మనతో చెప్పి వస్తాయా ? .... మునుపటిలాగే మన దగ్గర పైకం సిద్ధంగా ఉంటుందనుకున్నాడు కాబోలు! .... ఇక్కడి సంగతులు వాడికేం తెలుసు ?

మాధవ : మరిప్పుడేం చేస్తావ్ ? .... మన్లో మనమాట .... ఈ పరిస్థితి వ్రాసి, నీ అశక్తతని తెలియజేస్తే యెలా ఉంటుందంటావ్ ?

శాంత : అదేం బాగుంటుంది ? ఎంతో ఆశతో వాడు వ్రాసినప్పుడు, మనం కూడా మొండిచెయ్యి చూపడం ఏం బాగు?

రంజ : ఉన్నప్పుడు దాచుకున్నామా నాన్నా ?

శాంత : ఆపదల్లో ఆదుకోనప్పుడు ఈ బంధుత్వా లెందుకు చెప్పు ?

మాధవ : అదీ నిజమే ! .... ఎలాగో వోలాగ నువ్వే ఆదుకోవాలిప్పుడు !

కుమా : ఎలా ఆదుకుంటామండీ ? మా పరిస్థితి మీకు తెలియనిదా ?

మాధవ : అదీ నిజమే !

శాంత : అలాగంటే యెలారా ? అప్పో సప్పో చేసి ఆ బాకీ తీర్చకపోతే పదిమందిలో పరువు పోదూ ?

కుమా : సరే ! అలాగైనప్పుడు ఈ తర్జనభర్జన లెందుకు ?.... మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి. మరోనాడు మేం కాదన్నామా ? రా చెల్లాయ్ ! నాకు ఆకలవుతోంది ! (కుమార్, రంజన లోనికి వెళ్తారు).

మాధవ : అన్నా! గట్టి తంటా వచ్చిపడిందే ! .... మన్లో మన మాట బావా ! ఎలా డబ్బు పంపుతావ్ ? మాట అనగానే సరా ?

శాంత : వెధవడబ్బు ! డబ్బుదేముందయ్యా ? .... ఎవర్నడిగితే యివ్వరు ? .... మాటవరసకి నువ్వే యిస్తావు !

మాధవ : అమాటా రైటే ! ఒప్పుకున్నా ! కాని నా దగ్గర కూడా ప్రస్తుతం పైసా లేదే ! ఏం సాధనం ?

శాంత : ఏదోవిధంగా సాధించాలి ! ఆ భారం నీది !

మాధవ : అన్నా ! ముందే చెప్పానుగా ! నాదగ్గరేం లేదని ?

శాంత : మరో దగ్గర తెచ్చి అయినా సరే యివ్వాలి. తప్పదు. కాకపోతే మరో అయిదో పదో వడ్డీ తీసుకో !

మాధవ : వెధవది వడ్డీకేం పోయింది ? అసలుకే చిక్కుగాని! .... సరే. నువ్వింతగా అడుగుతున్నావు కాబట్టి మరో దగ్గర తేవాలి !

శాంత : ఏదోవిధంగా డబ్బు రేపు సాయంకాలంలోగా నాకు కావాలి! లేకుంటే యిల్లు వేలం పడిపోతుంది ! .... పైన నీ దయ !

మాధవ : సరే ! నా దయకే మొచ్చింది మధ్య ! .... ఆ రామయ్యసెట్టిని అడిగి తెస్తాను ! కాని మన్లో మనమాట. వడ్డీ మాత్రం కాస్త ఎక్కువే సుమా!

శాంత : అయితే అవనీ ! ఆర్నెల్లలో తీర్చిపారేస్తాను గాని ఉంచుకోనుగా !

మాధవ : అవునవును. నాకు తెలీదూ ?

(లోనుండి "మీరు కూడా రండి నాన్నా !" అన్న రంజన పిలుపు వినిపిస్తుంది).

శాంత : ఒస్తున్నానమ్మా ! .... ఒస్తానోయ్ మరి !

మాధవ : వెళ్ళు ! (శాంతయ్య లోనికి వెళ్తాడు. మాధవయ్య ఒక్క క్షణం చూసి వెళ్ళబోతాడు. వీధిలోంచి ప్రభాకరం ప్రవేశిస్తాడు).

మాధవ : (ఆగి) మీరా ! .... దయచేయండి.

ప్రభా : శాంతయ్యగారేరీ ?

మాధవ : లోపలున్నాడు. మన్లో మనమాట. భోజనం అయిందా?

ప్రభా : ఇంకా లేదండీ ! .... ఇందాక ప్రదర్శన గురించి ఏవో మాట్లాడేం ! నా నిశ్చయం చెప్పిపోవాలని వచ్చాను.

మాధవ : మన్లో మనమాట. మీరేం నిశ్చయించారు ?

ప్రభా : శాంతయ్యగారికి సాయపడాలనే నా నిశ్చయం.

మాధవ : అదే, ఏవిధంగా సాయపడతారు? .... అంగబలమా ? అర్థ బలమా ?

ప్రభా : రెండు విధాలుగా కూడాను .... పూర్వంలా నాటకంలో నా పాత్ర నేను నిర్వహిస్తాను ! అంతేగాక డబ్బు కూడా పెడతాను.

మాధవ : బాగుంది .... మరేం అనుకోకండి గాని, ఎవర్ని చూసి యీ నిశ్చయాని కొచ్చినట్టు ? (మెల్లగా) ముసిలాణ్ణి చూసా ? ముదితనిచూసా ?

ప్రభా : (తెల్లబోయి) అంటే ? .... అబ్బే ! అలాంటిదేం లేదు సుమండీ !

మాధవ : వోస్ ! కొయ్యకండి ! .... మీసంగతి నాకు తెలీదూ? మన్లో మనమాట. ఏమైనా కుదురుతుందేమో అని ఆశ! అవునా ? ఒప్పుకోండి మరి !

ప్రభా : (మెత్తబడి) ఆ ఉద్దేశం కూడా లేకపోలేదులెండి !

మాధవ : అద్గదీ! అలా దారికిరండి .... మన్లో మనమాట. చాలా జాగ్రత్తగా నడపాలి వ్యవహారం ! ఏమాత్రం పొక్కినా మీ పని క్లోస్ .... ఎలా నడుపుతారో మరి !

ప్రభా : నాకుమాత్రం తెలీదుటండీ ? .... కాంతకోసమే కనకాన్ని వెదజల్లుతున్నాం. ఆ కొంత దక్కదని తోచిన మరుక్షణం కనకం కూడా దాగిపోతుంది. (ఈ చివరి మాట అంటూవుండగా కుమార్ ప్రవేశిస్తాడు లోనుండి).

కుమా : ఏమిటి కనకం అంటున్నారు ? .... ఇప్పుడు దాని అవసరం ఏమొచ్చింది ?

మాధవ : ప్రభాకరంగారు కనకంతో ప్రజల్ని శునకాల్లా తిప్పుకోవచ్చని అంటున్నారు ! మన్లో మనమాట. నిజం కూడా అంతేగా ?

కుమా : అంతేనా యేమైనా మందు పోస్తున్నారా ?

మాధవ : చూశారా, చూశారా ! .... మన్లో మనమాట. అలా అనొచ్చా పెద్దమనిషిని !

కుమా : ఏం ఫరవాలేదు. ఎవరికి తెలియుంది మీ పెద్దమనిషి తరహా ?

ప్రభా : సరేగాని .... నాన్నగారేరీ ?

కుమా : ఒస్తారు. కూర్చోండి .... కవిగారి సంగతి తెలుసా మీకు ?

ప్రభా : ఏం ? అతన్నీ పీకేశారుగా !

కుమా : అదెప్పుడు ?

మాధవ : అయిందీ ? .... ఈమాత్రానికేనా అంత విరగబడిపోయాడు ! .... ఎవరికైనా అంత గర్వం కూడదు సుమండీ !

ప్రభా : ఏమన్నాడేమిటి ?

కుమార్ : నూటపదహార్లు కట్నం యివ్వందే ప్రదర్శనకి అంగీకరించనన్నాడు.

ప్రభా : పొమ్మనలేక పోయారా డొక్కు ముండాకొడుకు! .... ఇతని నాటకం ఒక్కటే ఉందా ?

మాధవ : ఆమాటే చెప్పాడు మన వాడూను! కాని చెప్పొద్దూ? .... మన్లో మనమాట. నేనూ శాంతయ్యా కలిసి బేరం కుదిర్చాం ! .... చివరికి ఒప్పుకున్నాడు.

ప్రభా : వూరికే వెయ్యడానికి ఒప్పుకున్నాడా ? .... కట్నం ఒక్క దమ్మిడీ కూడా యివ్వం అని చెప్పలేదూ ?

కుమా : ఆమాటే చెప్పాను. కాని నాన్నగారు మాత్రం ఏదో విధంగా సత్కరించి పంపుతా మన్నారు.

మాధవ : ఆ కవి ఒక ఆశపోతుగాడిద కొడుకు ! .... మన్లో మనమాట. ఇప్పుడు టైం ఎంతయింది ?

ప్రభా : పదకొండున్నర.

మాధవ : అయ్యయ్యో ! .... అయితే వస్తానోయ్. అవతల నాకోసం ఒక పెద్దమనిషి కాచుకొని ఉంటాడు! .... వస్తానోయ్. (అని వీధిలోనికి నిష్క్రమిస్తాడు).

ప్రభా : గమ్మత్తయిన మనిషి.

కుమా : ఉత్త స్వార్థపరుడు. కానీ లాభం కనిపించనిదే పైసా పెట్టుబడి పెట్టడు.

ప్రభా : లేకుంటే అంత ఆస్తి యెలా సంపాదించగలడు ?

(లోనుండి శాంతయ్య ప్రవేశిస్తాడు).

శాంత : ఎంతసేపయింది వచ్చి ?

ప్రభా : ఇప్పుడే .... మీరు చెప్పిన విషయం ఆలోచించాను.

కుమా : ఏం నిశ్చయించారు ?

ప్రభా : చెప్తున్నా. ఖర్చులో సగం భరించడానికి నాకేం అభ్యంతరం లేదు.

కుమా : మరి మిగిలిన సగం ? దానిమాటేమిటి ?

శాంత : అదీ యెవరో ఒకరు భరిస్తారు. అంతగా అయితే నేనే భరిస్తాను.

ప్రభా : నా ఉద్దేశం కూడా అదే. మన యిద్దరం అయితే యిబ్బంది లేదు. మరొకళ్లతో వాటా ఉండటం నా కిష్టంలేదు.

శాంత : అలాగే. ఎన్ని ఖర్చులు పెట్టడంలేదు? నాటిలో యిదొకటి! కాని ఒకటిమాత్రం గుర్తుంచుకోండి. నాటక సమాజ నిర్వహణ నిలిపివెయ్యకుండా చూడండి! అదే నా లక్ష్యం !

కుమా : అదెలా ? కొందరు నటులు మనం చెప్పినట్టు వినరు. వాళ్లనేం చేస్తాం ?

ప్రభా : పీకేసి కొత్తవాళ్లని వేసుకుంటాం ! ప్రపంచం గొడ్డుపోలేదు కదా ? ఆలోచించు కుమార్ ! నాన్నగారు చెప్పింది కరెక్ట్.

(వీధిలోంచి తొందరగా కవి ప్రవేశిస్తాడు).

కుమా : దయచేయండి కవిశ్రీ !

కవి : (ఆవేదనతో) విన్నారా యీ ఘోరం ? కన్నారా యీ వింత ? .... పాతికేళ్లు రక్తమాంసాలు ధారపోసి చేసిన సేవనైనా గడించక, అనూచానంగా వస్తూన్న ఆచారాన్నయినా గుర్తించక నేటి మూర్ఖరాజ శ్రేష్ఠుడు ఆస్థానకవి పదవినే తొలగించివేశాడు. అపచారం ! ఇది కవికులానికే తీరని అపచారం ! రాజ వంశానికి మాయని మచ్చ !

శాంత : శాంతించండి కవిగారూ ! .... మేం మాత్రం యేం చేశాం చెప్పండి ? .... వాళ్లుండమంటే ఉండడం, పొమ్మంటే పోవడం. అంతే !

కవి : అంతేనా ? .... కాని, ఇది ఈనాటి సంబంధం కాదే ?.... మా తాత వారితాత కాలంవాడు. వీరి తండ్రిగారి కాలంలో మా తండ్రిగారూ, వీరి కాలంలో నేనూ ఆ పవిత్ర స్థానంలో విరాజిల్లాం. తాతలనాటి యీ సంబంధాన్ని కూకటివేళ్లతో పీకేశాడు ఆ యేడు చింతల రాక్షసుడు! వాడినేం అనాలి ? దౌర్భాగ్యుడు!

ప్రభా : వూరుకోండి కవిగారూ ! మన ఖర్మం యిది. ఏనాటి నటులు చెప్పండి శాంతయ్యగారు ? వారి జీవితం అంతా కళాసేవతోనే గడిచిపోయింది. వారి వల్ల రాజావారికీ ఆయన సమాజానికీ కూడా పేరు వచ్చింది. అయినా ఆఖరికి ఏంచేశాడో చూడండి.

కుమా : నేను మొదటే చెప్పాను. ఆ రాజు తప్పి తలకెత్తుతాడని ఆశపడ్డారు మీరు. నామాట విన్నారా ?

శాంత : ఇది మనకి పరీక్షా సమయం.. నిలిచి గెలిచామా ఫరవాలేదు.

కవి : (ఉద్రేకంగా) గెలుస్తాం ! తప్పక విజయం మనదే. మనమంతా ఒకే కుటుంబం. ఒకే తాడుపై నడవాలి. రంగస్థలంపై మార్తాండ తేజంతో విరాజిల్లి, నాటక రంగంలో నూత్నతేజం ప్రసరింపజేసి రంగమార్తాండులమై భాసించాలి ! అదే మన లక్ష్యం ! .... అదే మన పరమార్థం !

కుమా : హియర్, హియర్ ! .... అద్భుతం ! అమోఘం ! ఇంత గొప్పగా మాట్లాడతారని కలలో కూడా అనుకోలేదండీ కవిగారూ !

ప్రభా : మనసు బాధపడితే మాణిక్యాల్లాంటి మాటలు వస్తాయట కవనంలో.

శాంత : యిప్పుడు మనం ఒక కొత్త సమాజం స్థాపించు కున్నాం.

ప్రభా : దానికి అధిపతులు శ్రీ శాంతయ్యగారే !

కవి : విజయోస్తు ! విజయోస్తు శ్రీ మహా నటులకు ! .... తప్పక ధనకనక వాహన లాభం కలుగుతుంది.

కుమా : మీ నోటి వాక్యాన !

కవి : ఏదీ ఆనందంగా అంతా ఒక్కసారి జేజేలు చెప్పండి.

(అంతా "శాంతయ్యగారికీ జై !" అంటూ ఉండగా లైట్లు ఆరిపోతాయి. కొద్ది క్షణాల అనంతరం లైట్లు వెలుగుతాయి. లోనుండి ప్రొడ్యూసర్, మాధవయ్య, రంజన వస్తారు).

ప్రొడ్యూ : అయితే యిప్పటికి ఒక భాగం పూర్తయిందన్న మాట !

మాధవ : మరేం ! .... కొత్తవారయినా, డైరెక్టరుగారు, కవిగారు కూడా తమ పాత్రలు బాగానే నిర్వహించారు.

కవి : అది మాకు ఉగ్గుపాలతో పట్టిన విద్య.

రంజ : అలాగా ! .... మాకు తెలీదులెండి.

కవి : మరేమి టనుకున్నారు ? .... పూజా పునస్కారాలు లేక బూజులుపట్టేం కాని ....

కుమా : నైవేద్యాలు పెడితే మీ మహిమలు చూపుతారన్న మాట.

డైరె : కాదు మరీ ? .... అందులోనూ వారు కవులు.

ప్రొడ్యూ : ఆగండాగండి! .... అవన్నీ తర్వాత చూసుకోవచ్చు! .... తరువాత కార్యక్రమం ?

శాంత : ప్రస్తుతానికి ఏదో యెత్తు పడాలి ! లేకుంటే లాభం లేదు.

మాధవ : అవును. ఆత్మారాముడు తెగ గోల చేస్తున్నాడు. వాడి గోల కాస్త వినిపించుకోవాలి.

ప్రొడ్యూ : సరే ! అలాగే చేద్దాం! .... కవిగారూ ! ఆ డిపార్టు మెంటు మీది.

కుమా : ఏ డిపార్టుమెంటు ?

డైరె : కందా డిపార్టుమెంటు.

కవి : ఇదిగో ఆమాటే అనొద్దన్నాను.

ప్రొడ్యూ : వాళ్లతో నేమిటి ? వెళ్లిరండి.

కవి : ఇదిగో! (అని నిష్క్రమిస్తాడు).

ప్రొడ్యూ : మనం కూడా వెళ్లి ఆ పక్క గదిలో కూర్చుందాం. అక్కడ ఫేనూ అవీ ఉన్నాయి.

శాంత : అలాగే ! పదండి.

(ప్రొడ్యూసర్, శాంతయ్య, మాధవయ్య ముందు వెళ్తారు. కుమార్, రంజన, డైరెక్టర్ నడుస్తూ ఉంటారు. కుమార్ వెళ్లగానే డైరెక్టర్ ఏదో నిశ్చయానికి వస్తాడు.)

డైరె : (మెల్లగా) చిట్టీ ! .... చిట్టీ !

రంజ : (తుళ్లిపడి) ఎవరు ? .... ఏమిటి ?

డైరె : (తమాయించుకొని) ఏంలేదు .... క్షమించండి ! నాకు తెలిసిన అమ్మాయి ఒకతె అచ్చంగా మీలాగే ఉండేది. మిమ్మల్ని చూస్తే ఆ అమ్మాయి జ్ఞాపకం వచ్చింది.

రంజ : అంతేకదా ? .... ఆ పిలుపుకి ఏదో .... హాఁ! .... నే చెప్పలేను.

డైరె : అవును. నాకు తెలుసు.

రంజ : ఏమిటి ?

డైరె : అదే ! మరేం అనుకోకపోతే ఒక చిన్న సంగతి .....

రంజ : అడగండి.

డైరె : ఇంతకాలం పెళ్లిచేసుకోకుండా మీరెందు కున్నారు?.... మరోలా అనుకోకండి !

(లోనుండి కుమార్ వస్తాడు).

రంజ : మా అన్నయ్యని అడగండి.

కుమా : ఏమిటి ?

డైరె : మరేంలేదు .... మీ రంజన యింతకాలం అవివాహితగా ఉండడానికి కారణం ?

కుమా : అదో పెద్ద గాథ ! మునుపు మా బావ మా యింట్లోనే ఉండేవాడు. వాడికిచ్చి పెళ్లిచేస్తానని నాన్న వాగ్దానం చేశారు. వీళ్లు కూడా పరస్పరం ప్రేమించు కున్నారు.

డైరె : అయితే మరింకేం ?

కుమా : కాని పెళ్లి జరగలేదు. అకస్మాత్తుగా మా బావ మాయమయాడు యింట్లోంచి.

డైరె : ఎందుచేత ?

కుమా : బాగా డబ్బు సంపాదించి తిరిగి వస్తానని వ్రాశాడు. వాడికోసం ఎదురుచూస్తున్నాం.

డైరె : ఇలా ఎంతకాలం ఎదురు చూస్తారు ?

కుమా : ఓపిక ఉన్నంత వరకూను ! .... ఆఁ! అన్నట్టు వాళ్లంతా మనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. వెళ్దామా ?

డైరె : అలాగే ! .... కాని మనం వచ్చేవరకూ ఈ రంగస్థలాన్నిలా ఖాళీగా ఉంచడం ఎందుకు ?

రంజ : మరేం చేస్తారు ?

డైరె : ఇదిగో ! .... కర్టెన్ ప్లీజ్! .... కర్టెన్.

(తెర జలజల వ్రాలుతుంది.)

రెండవ రంగం

[స్థలం : అదే. నాటకశాలలోని రిహర్సల్ గది.అలంకరణ అంతా మొదటి రంగంలో వలెనే ఉంటుంది.

తెరలోపల కొన్ని కంఠస్వరాలు వినిపిస్తాయి.

"ఇంక ప్రారంభిద్దామా ?" అంటాడు ప్రొడ్యూసరు.]

కవి : రంగం?

డైరె : ఇది రెండో రంగం ! కర్టెన్!

(తెర తొలుగుతుంది. రంగస్థలంపై ప్రొడ్యూసర్, డైరెక్టర్, కవి, శాంతయ్య, మాధవయ్య ఉంటారు).

ప్రొడ్యూ : ఆల్‌రైట్ ! .... మరి ఈ రెండోరంగం ఎక్కడ జరుగుతుంది ?

మాధవ : ముందే చెప్పాంగా శాంతయ్యగారింట్లోనే అని.

ప్రొడ్యూ : ఓ! అవునుకదూ! .... అయితే ఈ రంగంలో జరిగే ముఖ్యాంశం ?

డైరె : మొదటి రంగంలో వారొక సొంత కంపెనీ స్థాపించి నట్టు చెప్పారు. మరి యిందులో ?

మాధవ : ఇందులో ఆ కంపెనీలో జరిగిన కొన్ని సంఘటనలు చూపుతాం.

శాంత : మా సొంత కంపెనీ ఎలా నడిచేదో, అందులో ఎలాంటి స్పర్ధలు రేకెత్తేయో, అవన్నీ యీ రంగంలో చెప్తాం!

కవి : అన్నట్టు యీ ఒక్క సందేహం తీర్చండి! .... ఈ రంగంలో కూడా మాకు పాత్ర లున్నాయా ?

మాధవ : ఆహా! యథాప్రకారంగా మీరు, డైరెక్టర్‌గారు కవి, ప్రభాకరం పాత్రలు ధరిస్తారు. అసలు మీతోనే వుంది ఈ రంగంలో కథంతాను. రండి. మీ పాత్రలు చెప్తాను.

ప్రొడ్యూ : అయితే మరి కానివ్వండి .... ఆల్ రెడీ ప్లీజ్! రెండో రంగం ప్రారంభం.

(అంతా లోనికి వెళ్తారు. లైట్లన్నీ ఆరిపోతాయి. వాద్యసంగీతం ప్రారంభం. ఒక్క క్షణంలో లైట్లు వెలుగుతాయి. రంగస్థలం ఖాళీగా ఉంది. వీధిలోంచి దూకుడుగా ప్రభాకరం ప్రవేశిస్తాడు).

ప్రభా : శాంతయ్యగారూ! .... శాంతయ్యగారూ!

(లోనుండి "ఎవరది ?" అంటూ రంజ వస్తుంది).

రంజ : ఓః! మీరా

ప్రభా : మీ నాన్నగా రున్నారా ?

రంజ : ఉన్నారు.

ప్రభా : పిలవండి. జరూరుగా మాట్లాడాలి.

రంజ : అలాగే. కూర్చోండి. (అని లోనికి వెళ్తుంది.)

(కొద్ది క్షణాల్లో శాంతయ్య, వెనుకనే రంజన వస్తారు.)

ప్రభా : నమస్కారమండి.

శాంత : నమస్తే! .... పొద్దున్నే వచ్చారు .... ఏం సంగతి ?

రంజ : కూర్చోండి.

ప్రభా : కూర్చోడానికి రాలేదు.

రంజ : (హాస్యంగా) అయితే నిలబడేవుండండి.

ప్రభా : (సీరియస్‌గా) హాస్యానికీకూడా సమయాసమయాలున్నాయి.

శాంత : నువ్వూరుకో అమ్మా! .... మీరు కూర్చోండి ముందు. ఏం జరిగింది ? అలా ఉన్నారేం ?

ప్రభా : ఒక విషయం తేల్చుకోవాలని వచ్చాను .... నాటక సమాజం యికముందు కూడా అలాగే నిర్వహిస్తారా ?

రంజ : అంటే మీ ఉద్దేశం ?

ప్రభా : ముందీ సంగతి చెప్పండి .... ఇది వ్యక్తిగత సంస్థా ? లేక అందరూ సమభాగస్థులా ? .... భాగస్థులే అయితే, వారికి ఎంతవరకూ న్యాయం చేకూరుతుంది? .... లేదా వ్యక్తిగతమైనదే నంటారా ? చెప్పండి. ఆమాటే అడగను.

శాంత : అసలు మీకెందుకీ అనుమానం వచ్చింది ? .... ఎవరికైనా అన్యాయాలు జరుగుతున్నాయా ?

ప్రభా : మరో సంగతి. నాటక సమాజం అన్న తరువాత అందులోని వ్యక్తు లందరికీ సమాన బాధ్యతలు, హక్కులూ ఉండాలంటారా ?

శాంత : నిజమే! జరిగిందేమిటో చెప్పండి. సాధ్యమైనంత వరకూ సర్దుతాను.

ప్రభా : అది లాభంలేదు .... ఇంకో సంగతి—సమాజంలో వ్యక్తి అధికారం, ఆరాధన అధికమైపోయింది.

రంజ : ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో చెప్పకుండా తప్పించుకుంటున్నారు.

ప్రభా : చెప్తాను. కాని చెప్పేముందే హెచ్చరిస్తున్నాను. మీరు ఆశ్చర్యపోవద్దు. ఇంక ముందు నేనో అతనో ఎవరో ఒక్కరే ఆ సమాజంలో ఉండాలి.

శాంత : సరే! దాని సంగతి తాపీగా ఆలోచించవచ్చు. ఆ వ్యక్తి ఎవరో చెప్పండి ముందు. సమాజానికి చీడ పురుగులా ఉన్న ఆ వ్యక్తిని వెంటనే బయటికి నెడతాను! .... నామాట నమ్మండి!

ప్రభా : ఎలా నమ్మడం ? .... మీరా పని చెయ్యలేరు.

శాంత : లేదు. చెప్పండి .... కట్టుబాట్లకు విరుద్ధంగా సంచరిస్తున్నవాళ్లని పంపేస్తాను.

ప్రభా : లాభంలేదు. మీరాపని చెయ్యలేరు.

రంజ : అడిగి చూడరాదా ? .... అనుమానం దేనికి ?

శాంత : ప్రభాకరంగారూ! .... మీరు తప్పించుకోవాలని చూస్తున్నారేమో ? అదేం లాభంలేదు. తప్పక చెప్పాల్సిందే! .... లేకుంటే నామీద ఒట్టు!

ప్రభా : సరే! వినండి .... మీ మనస్సు నొప్పిస్తే క్షమించండి. ఇంత అశాంతికి కారకుడు మీ అబ్బాయి కుమార్.

శాంత, రంజ : ఆః! కుమార్ ?

ప్రభా : అవును. విశృంఖలంగా ప్రవర్తించి నా మనస్సు నొప్పించాడు. ఎన్నోసార్లు సహించాను .... మితిమీరింది! .... నేనింక సహించలేను.

రంజ : నే నిది నమ్మలేను.

ప్రభా : ఆమాట ముందే చెప్పాను .... మీకు బాధ కలిగిస్తే మన్నించండి.

శాంత : కాని, ఒక్కవిషయం గుర్తుంచుకోండి! .... సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఎవర్నీ శిక్షించడానికైనా వెనుదియ్యను!

ప్రభా : క్షమించండి. దానివల్ల కార్యం చక్కబడదు ...... మనసు విరిగిన తరువాత మరి అతకదు .... ఈ విషయాలన్నీ ఆలోచించి నేనొక నిర్ణయాని కొచ్చాను.... నే నింక ఆ సమాజంలో పనిచెయ్యలేను.

రంజ : అయితే మీ పట్టు విడవరా ?

ప్రభా : మీ మనస్సు నొప్పించినందుకు మన్నించండి.

శాంత : నా కెందుకూ బాధ కలుగదు. కాని నా అజమాయిషీలో, నా సమాజంలో ఒక నటుడు అన్యాయంగా బాధపడి విడిపోవడం నాకెంతో తలవంపు .... నిజానికది నా ప్రాణఘాతం !

ప్రభా : ఎంతో బాధకలిగి మీకీ విషయం తెలియజేశాను. సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని మీ రెరుగంది కాదు. నేను విసిగిపోయాను.

శాంత : అంత బాధపడితే నేనూ మిమ్మల్ని బలవంతంపెట్టను .... మనం ఆ లెక్కలు సరిచూసుకోడం మంచిదేమో ?

ప్రభా : దానికేం తొందరొచ్చింది ? ,.... తాపీగా చూసుకోవచ్చు.

శాంత : అలాక్కాదు. మొత్తం ఎంత ఖర్చయిందో, ఎవరికెంత తగిలిందో తేల్చుకోవాలి! .... అది చాలా ముఖ్యం.

ప్రభా : సరే ! అదీ తేల్చి చెప్తాను .... కాని మిమ్మల్నందర్నీ విడిచిపోవడం నా కెంతో చింతగా ఉంది.

రంజ : ఇప్పు డివన్నీ యెందుకులెండి ? .... ఈ స్నేహితుల్ని మాత్రం మరిచిపోకండి !

ప్రభా : ఎంతమాట ? .... మీ ఆదరణ, ఆప్యాయత మరిచిపోగలనా ? .... మళ్ళా కలుస్తాను ! .... మరి శలవ్!

శాంత : మంచిది. వెళ్ళిరండి. (ప్రభాకరం వీధిలోకి నిష్క్రమిస్తాడు.)

రంజ : ఎంత అహంభావం ! .... తానొక మహావ్యక్తిననీ, మహా నటుణ్ణనీ అనుకుంటాడు. అది పడదు అన్నయ్యకి.

శాంత : అయినా వీడి ప్రవర్తన కూడా బాగులేదు .... వీడిలాగే ప్రవర్తిస్తే సమాజ నిర్వహణ దుస్సాధ్యమవుతుంది.

రంజ : ఈ జీవితం యింక లాభంలేదు నాన్నా ! .... దీనికి మంగళంపాడి మరో జీవితం ప్రారంభించడం మంచిదేమో ?

శాంత : నాకూ అలాగేవుంది. (వీధిలోంచి కుమార్ వచ్చి లోనికి వెళ్ళబోతాడు)

శాంత : (గంభీరంగా) కుమార్ !

కుమా : (ఆగి) ఏం నాన్నా ?

శాంత : నాటకసమాజంలో కొన్ని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనుకుంటున్నాను.

కుమా : అది చాలా అవసరం !

శాంత : సమాజాన్ని తమ స్వార్థానికి వినియోగించుకొనేవాళ్ళని ఎలా శిక్షించాలి ? (కుమార్, రంజన ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటారు.)

కుమా : (గ్రహించి) ప్రభాకరం వచ్చాడా ?

రంజ : ఇప్పుడే వెళ్ళాడు.

కుమా : సమాజాన్ని స్వార్థాని కుపయోగించుకునే అలాంటి చీడపురుగుల్ని వెలికితీసి నలిపెయ్యాల్సిందే ! .... అతను చెప్పినవన్నీ అతనికే వర్తిస్తాయి.

శాంత : నేరం ఆరోపించే ముందు, దాన్ని ఋజువు చెయ్యవలసిన బాధ్యత కూడా ఉంటుందని గుర్తించాలి.

కుమా : సమూలంగా అన్నీ నిరూపిస్తాను. ఒక్క విషయం చెప్తే చాలు. అత నెంత నీచంగా ప్రవర్తించాడో మీకే తెలుస్తుంది.

శాంత : ఏమిటది ?

కుమా : నటుల కిరాయి యిచ్చేముందు, ఆ కష్టజీవుల కడుపు కొట్టి కాజేసిన డబ్బు గురించి మీకు తెలుసా ?

శాంత : (ఆశ్చర్యంతో) ఏమిటీ ?

కుమా : అవును. అలా కమీషన్లు కొట్టేవాడు. అంతేకాదు. ఆ అప్రతిష్ఠ మీకూ అంటించా లనుకున్నాడు. ఆ ప్రయత్నాలకి అడ్డు తగిలి విదిర్చాను.

శాంత : ఇది నిజమేనా అని ?

రంజ : నిజమే నాన్నా ! .... విమల కూడా చెప్పింది .... అలా యివ్వనివాళ్ళని ఏదో నెపం పెట్టి బయటికి గెంటేవాడట.

కుమా : ఇది వింటే మీరు మరీ ఆశ్చర్యపోతారు .... క్రిందటి ప్రదర్శనాంతరం అతడు మన రంజన వెంటబడ్డాడు.

శాంత : ఆఁ !

రంజన : అవున్నాన్నా ! నన్నే నిర్బంధించబోయాడు. సమయానికి అన్నయ్య రాబట్టి సరిపోయింది.

శాంత : మరి నాకీ సంగతులేవీ చెప్పలేదేం ?

రంజ : అనవసరంగా మీక్కూడా బాధ కలిగించడం దేనికి నాన్నా ? .... అదీగాక యిది నలుగురికీ తెలిస్తే మనకే మరింత పరువు తక్కువ అని వూరుకున్నాం.

కుమా : లెక్కలు అడిగితే ఎప్పటికప్పుడు ఏదో చెప్పి తప్పించుకుంటున్నాడు ఇవాళ నిలదీసి అడిగేశాను. దాంతో నసాళానికి అంటుకొని మీ దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు.

శాంత : పోనీలే ! .... మనం చెప్పకుండా తనంతట తానే నిష్క్రమించడం చాలా తెలివైన పని .... ఇలాంటి చీడపురుగు లున్నంతకాలం నాటక సమాజాలు బాగుపడవు.

రంజ : కళాసేవ పేరుతో ఎన్ని అక్రమాలు జరుగుతున్నాయో చూశారా ?

కుమా : వీళ్ళంతా కళారాధకులు ! .... అందుకే నటులన్నా, నాటకసమాజాలన్నా సద్భావంలేదు ప్రజలకి.

శాంత : (ఒక నిశ్చయానికొచ్చి) ఇదంతా విన్న తరువాత నాకీ జీవితమంటే అసహ్యం వేస్తోంది. ! .... ఆలెక్కల్లో ఎన్ని అవకతవక లున్నాయో ? .... ఏమైనా వాటన్నిటినీ సహించాల్సిందే ! .... నేటితో యీ జీవితానికి స్వస్తి. ఇప్పుడే పోయి నాలుగు దుకాణాల్లో లెక్కలు వ్రాయడానికైనా కుదురుకుంటాను .... మీరూ అంతే ! ఇహ నా సమాజానికి పోవద్దు !

రంజ : అలాగే నాన్నా !

శాంత : నేనలా వెళ్ళి, వాళ్ళందరికీ యిది చెప్పివస్తాను.

(శాంతయ్య వీధిలోకి నిష్క్రమిస్తాడు.)

కుమా : నాకు మాత్రం అతనిమీద విపరీతమైన కోసం వచ్చింది సుమా ! ఎంత పెట్టిబడిదారైనా అంత అహంకారం కూడదు.

రంజ : నీమీదున్న అక్కసంతా వెళ్లగక్కాడు నాన్నదగ్గర. మరింక యీ సమాజంలో ఉండలేనని చెప్పి శలవు పుచ్చుకున్నాడు.

కుమా : ఉద్ధరించాడు. అయినా మనమే మానేస్తున్నాంగా ! .... ఇంక తనిష్టం వచ్చినట్టు మార్చుకోమంటే సరి ఆ సమాజాన్ని !

రంజ : ఏదో ఒకటి చేసుకుంటాడు .... మనకెందు కింక ?

కుమా : నేనూ ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నిస్తాను .... లేకపోతే ఏదైనా షాప్‌లో కుదురుకుంటాను. ఏం చిన్న తనం లేదు !

రంజ : కష్టపడి పనిచేసేందుకు చిన్నతనం ఎందుకు ?

కుమా : (వీధివంక చూసి) ఎవరూ వస్తున్నది ? .... కవిగా రేమిటి ?

రంజ : (చూసి) ఆఁ ! ఆయనే ! .... మనింటికే వస్తున్న ట్టుంది.

కుమా : ఎందుకు .... ఏమైనా డబ్బివ్వాలా అతనికి ?

రంజ : అబ్బే ! ఈమధ్య యితనికి పైత్యవికారం కొంచెం హెచ్చయింది. నా దగ్గరికొచ్చి ఏవో వల్లించాడు.

కుమా : ఈయనకీ యీ జబ్బు ప్రవేశించిందన్నమాట ! .... మరి నాకు చెప్పలేదేం ?

రంజ : ఇదేం అంత ప్రమాదకరమైన ఘటం కాదు. పిరికిసన్నాసి ! నీడ చూసి జడుసుకుంటాడు పక్షి !

కుమా : ఇలాంటివాళ్లకే తెగింపు జాస్తి (...... జాగ్రత్తగా ఉండాలి.)

రంజ : అయితే ఒకటి చేద్దాం! .... నువ్విలా లోనికి వెళ్ళు.... ఈయనచేత కాస్త కవిత్వం చెప్పిస్తాను! .... సమయం చూసి నువ్వు రా !

కుమా : ఎందుకు ?

రంజ : ముందు నువ్వు వెళ్లు! .... ఆయన ఒచ్చేస్తున్నాడు. (కుమార్ తొందరగా లోనికి వెళ్తాడు. రంజన ఒక పుస్తకం పట్టుకొని కుర్చీలో కూర్చుంటుంది. వీధిలోంచి మెల్లగా కవి ప్రవేశిస్తాడు.)

కవి : శాంతయ్యగారూ !

రంజన : లేరండీ.

కవి : లేరా ? పోనీలెండి .... ఎవరూ లేరా ?

రంజ : ఊహుఁ! (అని తల తిప్పుతుంది.)

కవి : అందుకే చాలా ప్రశాంతంగా ఉంది వాతావరణం ! .... చల్లని మంద మలయానిలం, చక్కని సరోవరం, కోయిల కలస్వనం లేకపోయినా, మీ దివ్యరూపం దీని కెంతో నిండుతనం చేకూర్చింది.

రంజ : అలా కూర్చోండి. (అని లేవబోతుంది).

కవి : (ఆపుతూ) ఒద్దు ఒద్దు ! లేవకండి ! .... కదిలితే ఆ భంగిమ చెడుతుంది. ఆహా ! .... ఏమి ఆ మోహనరూపం ! .... దివినుండి భువికి దిగిన దివ్య తరుణీమణీ ! నాకనులు....

రంజ : పొరలు కమ్మినవా ?

కవి : అలాగే ఉంది! .... కాని అజంతా శిల్ప సౌందర్యాన్ని కాల దన్నే మీ దివ్యదేహ సౌందర్యం, రంభోర్వశీ మేనకాది దేవతా స్త్రీలనే కించపరుస్తోంది. భళిరా ! ఎన్నడు జారెనీ భువికి ! రంభా ......"

రంజ : ఆగండాగండి ! .... ఎవరైనా వినగలరు!

కవి : వింటే విననీ ! .... మనకేం భయమా ! .... వాక్ స్వాతంత్ర్యం మన జన్మహక్కు. సౌందర్యశ్లాఘన చెయ్యని నోరెందుకు ? సౌందర్యవర్ణన చెయ్యని ఈ కవన మెందుకు ?

రంజ : సరిసరి ! .... ఇది మరీ బాగుంది. మధ్య నేనా దొరి కాను ?.

కవి : దొరకలేదే చిలక ! .... నీ నడక రాయంచ బుడిడించు!.... నీవేణి ఫణిరాణి దోచు!....నీ చూపు మన్మథుడి వాడి తూపు ....నీ పలుకు కోయిలల సంగీతస్వర మాధురిని మరపించు. నీ సౌందర్య విన్యాస మా దేవతాస్త్రీలకే సిగ్గు కలి గించు' .... నీ కనుల నీలినింగిమలు నా బ్రతుకు వెలుగు! ..... బాలా ! .... పలుకవేల ?

రంజ : ఏమిటి పలకడం ? .... మీరు నన్ను మాట్లాడనిస్తేనా?

కవి : ఎందుకు మాట్లాడనివ్వను దేవీ ! .... కాని నీ దివ్య సౌందర్యమూర్తిని కనులార గాంచి, సౌందర్య రసా స్వాదన గావించు వేడుకతో తపించు ఈ దీనుని కనికరిం పుమో బాల! .... ఈ బాలి నే సై పజాల ! .... కనికరిం పుమో కమలనేత్రీ!

రంజ : అదా సంగతి ! .... మీరు నన్ను ప్రేమించారా ?

కవి : అని అంత చప్పగా అనేశావేం దేవీ ? .... నా ప్రేమ శంకరునివలపుకన్న, నలకూబరుని ప్రేమకన్న మిన్న ! .... శివుడు పార్వతిని అర్ధదేహంలో దాచుకున్నాడు ! .... కాని నేను మాత్రం నిన్ను నెత్తిన ధరిస్తాను.

రంజ : అబ్బే ! అవన్నీ పాత ప్రేమ కథలు. అన్నీ కల్పనలు. నేను నమ్మను!

కవి : అయితే అప్టుడేటుగా చెబుతా నాలించుము ! .... నా ప్రేమ నీటిపై ఆవిరిలా, ఐస్‌ఫ్రూట్‌లా కరిగి ప్రవ హిస్తోంది నీపైపు ! .... నీవూ, నేనూ డికాక్షన్ పాలులా కలిసి మెలిసి ఉందాం నేను పాలు, నీవు పంచదారలమై కాఫీ లాంటి కమ్మని జీవితాన్ని సృష్టించుకుందాం ! .... పూలవనాల విహరింపరానిచో ఇదే చెప్పన్నా ....

రంజ : ఆగండాగండి ! .... మీవంతు ప్రేమించగానే అయి పోయిందా ?

కవి : ఇంకేం చెయ్యమన్నావ్ ? .... అగ్నిలో ఉరకమన్నావా? ....బావిలో దుముకమన్నావా ? మన్ను పిండి వెండి తెమ్మన్నావా ? కుందేటి కొమ్ము సాధించమన్నావా ?

రంజ : అవేవీ చెయ్యక్కర్లేదు.

కవి : మరేం చెయ్యాలో చెప్పు.

రంజ : మా పెద్దల్ని ఒప్పించండి ! చాలు !

కవి : పెద్దలు ! .... పెద్ద లెవరు మన ప్రేమ కాదనడానికి? .... నాది పవిత్ర ప్రేమ !

రంజ : మరి వా ళ్లంగీకరించకపోతే యెలాగండీ ?

కవి : అయితే ప్రేమించవా ? .... చూశావా ఆ రివర్ సైడ్? .... చేసుకుంటాను సుమా సుపీసైడ్ !

రంజ : అయ్యయ్యో ఏమిటీ గోల ! (అని వెళ్లబోతుంది.)

కవి : (అడ్డువెళ్లి) గోలకాదే బేల ! నా స్వప్నరాశీ ! .... నన్ను కరుణించు ! బాలా ! నీవులేని జీవిత మదేల ! (మోకరిల్లి) అహా ! ఇలా నా దేవి ముందు ప్రాధేయపడినా కరుణించదేం? ఇంత పాషాణహృదవేం నువ్వు?...బెల్లపు టచ్చులా తియ్యగా ఉన్నా అంత గట్టిపడిపోయిందేం నీ హృదయం ? కరగి నావైపు ప్రసరించు ! (కళ్ళు మూసి) రంజనా ! .... రసికరంజనా ! మనోరంజనా ! నువ్వే నా ప్రాణం ! .... నేనే నువ్వు నువ్వే నేను!

(రంజన మెల్లగా లోనికి వెళ్తుంది. కుమార్ వచ్చి ఆ స్థలంలో నిలుస్తాడు.)

కుమా : (మెల్లగా) అలాగే !

కవి : ఆహా ! ఏదీ మరోసారి నీ బంగారు నోటంట ఆమాట చెప్పు ! ఇద్దరం కలిసి పిట్టల్లా ఆకాశంలో విహరిద్దాం!

కుమా : అలాగే విహరిద్దాం గాని ! లేవండి ! (అని ఒక్కటి చరుస్తాడు.)

కవి : అబ్బ ! ఏమిటీ మోటుతనం ! (కుమార్‌ని చూసి నివ్వెరబోతాడు.)

కుమా : ఆపేశారేం ? .... కవితాధోరణి. అలా అలా ప్రవాహమై ప్రవహించాల్సిందే ! .... ఆనకట్ట పడితే రసం చెడుతుంది ! .... ఊఁ! .... కానివ్వండి !

కవి : (తేరుకొని) ఒస్తానండి.

కుమా : అసలు మీరెందు కొచ్చారు ?

కవి : అవును. ఎందుకొచ్చాను ? .... అబ్బే. ఏం లేదు. పూరికే! మరి వస్తా !

కుమా : ఆగండి !

కవి : (భయంగా) ఎందుకూ ? .... అవసరంలేదు ! వస్తా! (అని వెళ్ళబోతాడు.)

కుమా : (చొక్కా పట్టుకొని) ఆగు! ఏం ? వినిపించలేదూ ?

కవి : అదేమిటి ? అలా మోటుగా ప్రవర్తిస్తున్నారు ? చొక్కా వదలండి !

కుమా : ఏం? .... పిట్టల్లా విహరించడానికి ఆటంకంగా ఉందా ? మాట్లాడవేం ?

కవి : లేదు. ముందు కాస్త ......

కుమా : షటప్ ! తాట వొలుస్తా ! తెలుసా ! (అని చొక్కా గుంజుతాడు.)

కవి : (భయంగా) అమ్మ బాబోయ్ !

కుమా : ఏం ? .... పెద్ద ప్రేమికుడివేం ? .... ఆమాత్రం సాహసం చెయ్యలేవ్ ? రా. నాతో యుద్ధానికి రా! .... ముష్టి యుద్ధంలో నీ దుమ్ము లేరేస్తాను ! కాసుకో!

కవి : అమ్మ బాబోయ్ ! (అని పారిపోబోయి వస్తూన్న మాధవయ్యని గుద్దుకొని పడతాడు.) చచ్చాన్రా బాబు!

మాధవ : వోరి నీ పిగ తరగ ! చచ్చేటట్టు నన్ను గుద్ది నువ్వు చచ్చే నంటావేం ? ఛంపేస్తా ! (అని కొట్టబోతాడు.)

కవి : బాబోయ్ ! (అని పారిపోతాడు. లోనుండి నవ్వుతూ రంజన వస్తుంది.)

మాధవ : కవిగా రలా పుంజా ల్తెంపుకు పరుగెడుతున్నారేం ?

కుమా : పెళ్లికోసం ! .... ఆయనకి ప్రేమపిచ్చి పట్టుకుంది.

మాధవ : ఏమిటీ ! .... వీడికి ప్రేమా !

రంజన : అవును మామయ్యా ! .... నా దగ్గరకొచ్చి ఏదో ప్రేమ కవిత్వం చెప్పాడు. అన్నయ్య వచ్చి జడిపించాడు.

మాధవ : వోరి వీడి పిండం పిల్లల్తినా ! .... మన్లో మన మాట. వీడికేం పోయేకాలం ?

కుమా : చెడిపోయేకాలం.

మాధవ : బాగా చెప్పావు .... అయినా మన్లో మనమాట. మీ నాన్నని అనాలి ! .... ఈ నాటకాల పేరుతో అడ్డమైన వెధవల్నీ యింటికి రానిస్తాడు. ఆ వెధవలు కొవ్వెక్కి అడ్డమైన కూతలూ కూస్తారు.

రంజ : ఇహను ఆ బాధ లేదులే మామయ్యా ! మేం సమాజం నుండి విరమించాం ?

మాధవ : ఏమిటీ ! .... మన్లో మనమాట. ఇది మీ నిర్ణయమా? లేక మీ నాన్నదా ?

కుమా : అంతా కలిసే నిర్ణయించేం !

మాధవ : శుభం ! .... ఈమాట ఏనాడో చెప్పాను. మన్లో మనమాట. వింటేనా ? .... అయితే నువ్వేం చేస్తావోయ్ అల్లుడువాడా ?

రంజ : స్కూల్ ఫైనల్ పాసైనవాడు ఏం చేస్తాడు ? .... ఏదైనా గుమాస్తాగిరీ చేస్తాడు.

కుమా : నీ యెరికని ఏమైనా ఖాళీ లున్నాయా ?

మాధవ : ఉన్నాయి .... కాని గట్టి ప్రయత్నం చెయ్యాలి !

రంజ : చేస్తాం. మరి అవసరం వచ్చినప్పుడు చెయ్యకుండా మానేస్తామా ?

మాధవ : అలాంటి ప్రయత్నాలేం లాభంలేదమ్మా ! .... మన్లో మనమాట. ఎవడో ఒక పెద్దవాడిచేత స్ట్రాంగు రికమండేషన్ చేయించాలి !

కుమా : మన కెవడు రికమండ్ చేస్తాడు ?

మాధవ : అలా లేనప్పుడు .... మన్లో మనమాట. ఆ హెడ్ గుమాస్తా చెయ్యి కాస్త తడి చెయ్యాలి.

రంజన : అంటే !

కుమా : అంటే లంచం యివ్వాలన్నమాట.

మాధవ : మన్లో మనమాట. దాన్ని లంచం అనకూడదు .... ఏదో బహుమతిగా యిచ్చెయ్యాలి! అంతే.

రంజ : ఇంత అన్యాయమా !

మాధవ : అయ్యో పిచ్చితల్లీ ! నువ్వింకా పాతకాలంలోనే ఉన్నావ్ ? .... మన్లో మనమాట—ఈ రోజుల్లో లంచం పుచ్చుకోనివాడు ఒఠ్ఠి చవటకింద లెక్క ! .... ఆఫీసరు నుండి, బంట్రోతు దాకా వాటాల ప్రకారం పంచితేనే పనవుతుంది.

కుమా : సరే ! .... ఇంతకీ ఆ ఖాళీ యెక్కడుందో చెప్పు.

మాధవ : ఆ కోపరేటివ్ సొస్సైటీకి వెళ్లి వాకబ్ చెయ్యి. అన్నీ తెలుస్తాయి. మన్లో మనమాట! అక్కడ మాత్రం నాపే రెత్తకుమా ?

కుమార్ : చెప్తే యేం ?

మాధవ : ఏంలేదు. నా కిష్టంలేదు.

కుమా : అంతేగదా !

మాధవ : అన్నా ! నీమాట నీదేగాని నాగోల వినవుకదా మరి !

కుమా : అలాగే చెప్పన్లే మామయ్యా ! .... వస్తా మరి ! (కుమార్ వీధిలోకి వెళ్తాడు.)

రంజ : ఉద్యోగాలు దొరకడం కూడా అదృష్టమే !

మాధవ : కాదుమరీ ! .... మరి నువ్వేం చేస్తావ్ కోడలా ?

రంజ : హాయిగా యింట్లోనే ఉంటాను.

మాధవ : అయితే పెళ్లి గిళ్లీ లేకుండా యిలాగే ఉంటావా? ....మన్లో మనమాట. మావాడు అలా అన్యాయం చేశాడాయె ! .... మరేం చేస్తావ్ ?

రంజ : చెయ్యడాని కేముంది ?

మాధవ : మరి వా డెలాగూ రాడమ్మాయ్ ! .... ఈపాటికి ఏ క్రిస్టియన్‌దాన్నో పెళ్లాడేసే ఉంటాడు. నా కను మానమే ? .... అంచేత మరి వాడికోసం ఎదురు చూడ్డం అనవసరం.

రంజ : సర్లెండి ! .... చూద్దాం !

మాధవ : ఈ సంగతి చెప్పాలనే వచ్చా !

(వీధిలోంచి శాంతయ్య ప్రవేశం.)

శాంత : అబ్బబ్బ ! .... ఏం ఎండగా ఉంది ? .... మంచినీళ్లు తే తల్లీ !

రంజ : అలాగే ! (అని లోనికి వెళ్తుంది.)

మాధవ : అవునుగాని, మన్లో మనమాట—సమాజం మూసే శారుట ?

శాంత : ఎవరన్నారు ? .... నేనూ నా పిల్లలూ మానేశాం ! అంతే !

మాధవ : మీరు మానేసిన తరువాత మరెందుకా సమాజం ? ....మన్లో మనమాట. మంచిపని చేశారుసుమా! .... నాకు నచ్చింది.

శాంత : మరి లాభంలేదయ్యా ! (రంజన మంచినీళ్ల గ్లాస్‌తో ప్రవేశం.)

రంజ : ఇదిగో నాన్నా మంచినీళ్లు !

శాంత : తే ! (నీరు త్రాగి గ్లాస్ యిచ్చి) కుమార్ ఏడీ ?

రంజ : కోపరేటివ్ సొస్సైటీలో ఖాళీ ఉందని తెలిస్తే అడగ డానికి వెళ్లాడు.

శాంత : ఊఁ! బాగుంది ! .... అప్పుడే ప్రారంభమైందన్న మాట .... నిన్నటి వరకూ ఉద్యోగాలు దానం చేసేవాళ్లం ఇవాళ ఉద్యోగాలు యాచిస్తున్నాం ! ఎంత తమాషాగా ఉంది ?

మాధవ : అదేనయ్యా గమ్మత్తు ! మన్లో మనమాట. అది తెలిస్తే మరెందుకీ పాట్లు ? (రంజన ఖాళీ గ్లాస్ తీసు కొని లోనికి నిష్క్రమిస్తుంది.)

శాంత : నిజమే ! దైవలీల తెలుసుకోడం చాలా కష్టం ! .... ఈ క్షణాన మహారాజు మరో క్షణానికి మామూలు మనిషికన్నా హీనుడైపోతాడు.

మాధవ : చెప్పడానికేం ? .... చాలా బాగుంటుంది వేదాంతం! ....మన్లో మనమాట. ఏ అవకాశమూ లేనప్పుడు మనిషి చెయ్యగలిగింది అంతే గదా !

శాంత : అంతకన్నా మనమేం చెయ్యగలం చెప్పు ? సామాన్య మానవులం !

మాధవ : అది సరేగాని, యిలా వేదాంతం చెప్పడమేనా ? లేక ఆ పిల్లలిద్దరికీ ఏనో సంబంధాలు చూసి ముడి వెయ్యడం ఉందా చెప్పు ? .... అహఁ! మన్లో మన మాట, ఇలా ఎంతకాలం గడపాలని చెప్పు !

శాంత : ఇదిగో ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. కాని కాలం కలిసి రాందే?.... ఎన్నడైనా వాడలా పారిపోతా డనుకున్నామా?

మాధవ : వాడొక్కడే ఉన్నాడేమిటి ? .... నిక్షేపంలాంటి కుర్రాళ్లు లక్షమంది ఉన్నారు ! మన్లో మనమాట. నువ్వు ఊఁ ! అనాలిగాని !

శాంత : అదెలా కుదురుతుందయ్యా ? వాళ్లమ్మ పోతున్న ప్పుడు దానికి మాటిచ్చాను. ఇప్పుడు మరొకవిధంగా జరిగితే దాని ఆత్మ యెంత ఘోషిస్తుందో యోచిం చావా ? .... అందుకే యింతకాలం చూడ్డం ! అంతే గాని, సంబంధాలు రాకా కాదు, పెళ్లి చెయ్యలేకాకాదు.

మాధవ : అలాగైనప్పుడు వాడికా బుద్ధుండాలా ? .... మన్లో మనమాట—పారిపోయి ఎక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ ఒక్క కార్డుముక్క గీకి పడెయ్యొచ్చుగా ! అలాగా చెయ్యలేదు ! .... మరలాంటప్పుడు మనం మరో సంబంధం చూసుకోడంలో తప్పేమిటి చెప్పు ? అదీ నా పాయింటు ! .... విన్నావా ?

శాంత : అదీ నిజమే ! .... కాని మరొకణ్ని పెళ్లాడడానికి అమ్మాయి అంగీకరించలేదు.

మాధవ : సరే ! దీని కీ ఆటంకం ! మరి అబ్బాయికేమొచ్చింది? .... ఏదో ఒక సంబంధం చూసి పెళ్లి అయిం దనిపించ వచ్చుగా !

శాంత : చెల్లి పెళ్లి కానిదే తనూ పెళ్లాడనని భీష్మించు క్కూచున్నాడు.

మాధవ : వారెవ ! .... ఇది మరీ బ్రహ్మాండంగా ఉంది ! .... ఎలా ఉందంటే .... కర్ర దొరికితే కుక్క దొరకదు, కుక్క దొరికితే కర్ర దొరకదు ! .... రెండూ ఉంటే తీరా అది రాజుగారి కుక్క అయిపోయిందిట ! అలా ఉంది ! .... మరెలా ?

శాంత : అంతే ! .... ఇంతకీ ఆ పోయినవాడు తిరిగి రానిదే యీ వ్యవహారం కుదరదయ్యా !

మాధవ : అరె ! అది కాదు గనకే యీ బాధంతాను ! విన్నావా ?

శాంత : అంటే ?

మాధవ : వాడు సవ్యంగా బతకడం లేదయ్యా ! .... మొన్న మద్రాసులో మన అచ్చన్నగారి బుచ్చన్నకి కనిపించాట్ట !

శాంత : (సంతోషంలో) ఏమిటీ ? .... మా మూర్తి మద్రాసులో కనిపించాడా ?

మాధవ : ఆఁ! కనిపించాట్ట. అక్కడేదో ఆఫీసు తుడుస్తూ !

శాంత : ఏమిటీ ? .... మా మూర్తి ఆఫీసు తుడుస్తున్నాడా ? .... అబద్ధం ! నేను నమ్మను !

మాధవ : అయ్యో ! నేను మాత్రం చూశానా ? చూసిన వాళ్ళు చెప్పగా వినడమే గాని !

శాంత : అయ్యో ! ఏం ఖర్మం పట్టిందిరా నీకు ! .... హాయిగా తిని ఉండలేక అలా పారిపోవడమేం ? ....ఇంతకీ బుద్ధిః కర్మానుసారిణీ అని— నీకాఫీసులు చిమ్మాల్సిన రాతఉంటే యిక్కడ నీ కాలు ఎలానిలుస్తుంది.

మాధవ : అంతేనయ్యా ! .... అంతే ! .... అందుకే మన్నో మనమాట. కనీసం అబ్బాయికైనా అయిందనిపిస్తే ఆ వొచ్చే కట్నం డబ్బుంతో ఈ బాకీలు కాస్తా .....

శాంత : అదేమిటి ?

మాధవ : అవును ! మన్నో మనమాట. నువ్వు 'ఊఁ!' అంటే పసందయిన సంబంధం ఉంది అబ్బాయికి ! .... రెండు ఆస్తులకి ఒక్కతే వారసురాలు ! .... అబ్బాయిని ఒప్పిస్తివా ఆపైన నేను నడుపుతాను !

శాంత : అలాగే చూద్దాంలే !

మాధవ : చూడ్డం కాదు! పని చెయ్యాలి ! .... అన్నట్టుమన్నో మనమాట. వాడు నన్ను తినేస్తున్నాడు బాకీగురించి!

శాంత : ఏదోవిధంగా సర్దుతాను మరి!.... చూశావుగా నాస్థితి?

మాధవ : అవున్లే ! .... అందుకే అబ్బాయితో మాట్లాడు !.... కుదిరిందా అన్నీ మబ్బుల్లా విడిపోతాయి.

శాంత : సరే ! .... చెప్తాను!

మాధవ : మరి నేను వస్తాను !

(మాధవయ్య వీధిలోకి వెళ్తాడు. లోనుండి రంజన ప్రవేశిస్తుంది.)

శాంత : విన్నావా తల్లీ మాధవయ్య మాటలు ?

రంజ : విన్నాను నాన్నా !

శాంత : ఆఖరికి వాడి బతుకు ఎలా తెల్లవారిందో చూడు !..... స్కూల్‌ఫైనల్ చదివినా ఆఫీసులు తుడుస్తున్నాడుట!

రంజన : మాధవయ్య మాటలు నిజమని నమ్మేరా నాన్నా ? ....నా కెందుకో వాటిలో కపటం కనిపిస్తోంది ! .... తన లాభం కోసం ఏదో ప్రణాళిక వేసుకున్నట్టుంది.

శాంత : ఏమో ? .... నాకేం తోచడంలేదు.

రంజన : అదంతా మొసలి కన్నీరు నాన్నా ? .... ఆ పెళ్లి సంబంధాల పేరుతో ఏదో కమీషన్ కొడ్తాడు వాళ్ల దగ్గర ! .... దానికి మనల్ని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టుంది.

శాంత : నిజమే.

(వీధిలోంచి కుమార్ ప్రవేశం.)

రంజన : ఏం అన్నయ్యా ! .... ఏమైంది ?

కుమా : ఏం కావాలో అదే జరిగింది .... ఆ హోలు మేనేజరు అంత నీచంగా మాట్లాడతాడని అనుకోలేదు.

శాంత : ఏమన్నాడు ?

కుమా : నోటి కొచ్చినట్టు కూశాడు .... నాకు ఒళ్లు మండింది .... నాలుగు తన్నాలనిపించింది.

రంజ : కొంపదీసి ఆపని చెయ్యలేదుకదా ?

కుమా : లేదులే. కాస్త మితిమీరితే ఆపని చేసేవాణ్నే !

శాంత : ఇంతకీ అసలేం జరిగింది ?

కుమా : అతనికి డబ్బు బాకీట !

శాంత : అదేమిటి ? అన్నీ యిచ్చేశా నన్నాడు ప్రభాకరం. లేకుంటే నేనూరుకుంటానా ?

కుమా : ఏమో ? .... దీనంతటికీ మీరే కారకులని వాగితే నాకు ఒళ్లు మండింది. వాటితో మనకి ఏ సంబంధమూ లేదని చెప్పేశాను.

రంజన : మంచిపనే చేశావ్.

కుమా : అందుకే అతని కంత కోపం వచ్చింది .... నేనూ ఊరుకోలేదులే. నోటి కొచ్చినట్టు తిట్టేశాను.

శాంత : చాలా తొందరపడ్డావ్ నాయనా ! .... కటికసత్యం ఎప్పుడైనా మనసుకి కష్టాన్నే కలుగజేస్తుంది.

కుమా : నానుముచ్చుగా మాట్లాడ్డం నాకు చేతగాదు.

శాంత : నేర్చుకోవాలయ్యా ! .... లేకుంటే బతకడం కష్టం.

రంజ : సరే ! ప్రస్తుతం ఏం చెయ్యాలి ? .... ఒకవేళ అత నొస్తే ఏం సమాధానం చెప్పాలో అది ఆలోచించండి.

కుమా : ఆలోచించడానికేముంది ? .... దాన్తో మనకి సంబంధంలేదు పొమ్మండమే !

శాంత : అదేం అంత సులువైనపని కాదురా!....నే నలాచెప్పలేను.

కుమా : నేనైతే అంతే చేస్తాను.

శాంత : అదే మనిద్దరికీ భేదం !

(వీధిలోంచి "శాంతయ్యగారూ!" అని పిలుపు వినిపిస్తుంది.)

రంజన : ఆ హోలు మేనేజరుగారే వచ్చారు.

శాంత : దయచెయ్యండి !

(మేనేజర్ వస్తాడు. ఇతను మొదటి రంగంలో కనిపించిన ప్రొడ్యూసర్. కాస్త వేషం మార్చాడు. రంజన లోనికి నిష్క్రమిస్తుంది.)

మేనే : నమస్కారమండి!

శాంత : నమస్తే ! కూర్చోండి!

మేనే : కూర్చోడానికేం గాని, ఒక ముఖ్య విషయం తేల్చుకుందికి వచ్చాను.

శాంత : ఏమిటో చెప్పండి.

మేనే : మీరు పూర్తిగా సమాజం నుండి విరమించినట్టేనా?

శాంత : ఇప్పటికి అదే నిశ్చయం.

మేనే : మరి ఆ సమాజ నిర్వహణ బాధ్యత ఎవరిది ?

కుమా : అదో పెద్ద ప్రశ్నేమిటండీ ? .... ఎవరు పూనుకుంటే వారిదే అవుతుంది.

మేనే : అంటే ప్రభాకరం గారిది కావచ్చా ?

శాంత : అతను తీసుకుంటే అతనిదే !

మేనే : మరి ఆ పాత బాకీలు తీర్చవలసిన బాధ్యత ఎవరిది ?.... పూర్వం ఎవరు నిర్వాహకులైతే వారిదేకదా ?

శాంత : అవును. ఇప్పుడేమైంది.

మేనే : అదే చెప్తున్నా .... నిన్నటివరకూ మీరే నిర్వాహకులు. అంచేత ఆ అప్పులు తీర్చవలసిన బాధ్యత కూడా మీదేగదా?
శాంత : ఆ లెక్కలన్నీ ప్రభాకరంగారే చూసేవారు. ఆయన్ని అడగండి.
మేనే : మరి ఆయన అలా చెప్తారేం ?
కుమా : ఏం చెప్పాడు ?
మేనే : ఆ పాత బాకీలు తీర్చవలసిన బాధ్యత తనది కాదంటాడు.
కుమా : అంటాడు. అనడు మరీ ! .... బాగా తినమరిగిన వాడు ఇంకేం అంటాడు ?
శాంత : నువ్వాగరా ! .... అయ్యా మేనేజరుగారూ ! .... ఆ లెక్కలేవీ మేం సరిచూసుకోలేదండీ యింకా !
మేనే : అవన్నీ ఎప్పుడో తేలిపోయాయట .... అదీగాక నిర్వాహకులు మీరు ....మరి ఆ బాధ్యతలన్నీ మీవి కాకమరెవరివి?
శాంత : ఇంతకీ మీ రనేదేమిటి ?
మేనే : క్రిందటి రెండు ప్రదర్శనలకీ హాలు అద్దె కాదుగదా, ఆ ఖర్చులు కూడా ముట్టలేదు.
శాంత : అదేమిటండీ అద్దె యిచ్చేసినట్టు చెప్పాడే నాకు ?
మేనే : అయితే నేను అబద్ధం చెప్తున్నాననా మీ ఉద్దేశం ?
శాంత : అయితే నేనే అబద్ధం ఆడుతున్నా నంటారా ?
మేనే : అహు! కాదు. మీ ఉద్దేశం అలాగే ఉంది. అబద్దాలాడి, అన్యాయంగా డబ్బు గడించాల్సిన స్థితిలో నేను లేను..... ఇందాకా మీ అబ్బాయి కూడా అలాగే మాట్లాడాడు!
కుమా : నేను మాత్రం ఏమన్నానండీ ? .... ఇష్టం వచ్చి నట్టు నోరు పారేసుకుంటూ రెందుకు ?
మేనే : (ఉక్రోషంగా) ఏమైనా అంటే అదొకటి దొరికింది.... నేనేమన్నాను ? .... మర్యాదగా నాకు రావలసిన బాకీ సొమ్ము అడిగాను. అంతేగాని ఎవరి డబ్బూ పడేసుకో డానికి ప్రయత్నించలేదే ? .... దీనికింత రాద్ధాంత మెందుకూ ?
కుమా : ఎవరండీ రాద్ధాంతం చేశారు ? .... మీరే సాగ దీస్తున్నారు గాని.
శాంత : నువ్వాగరా ! .... అయ్యా ! శాంతించండి. ప్రభాకరంతో మాట్లాడి అన్నీ నేను సరిదిద్దుతాను. అసలేం జరిగిందో నాకేం తెలీదు.
మేనే : తెలియకపోవడ మేమిటండీ ? .... అసలు ఇంతకాలం వూరుకోడం నాది తప్పు .... ఇలాగ చేస్తారని తెలిస్తే అప్పుడే నిలదీద్దును.
కుమా : ఇప్పుడు మాత్రం మా పరువేం నిలిపారు ? .... కాలు కోసుకుని కాబూలీవాడిలా కూర్చున్నారు.
మేనే : (కోపంగా) ఏమిటీ ? .... నేను కాబూలీవాడినా ? .... సరే కానివ్వండి. వచ్చినపేరు ఎలాగా వచ్చింది ...... నా బాకీ తీర్చందే కదల్ను ! .... అంతే !
కుమా : ఇప్పుడు దమ్మిడీ కూడా యివ్వం! .... వెళ్లండి.
శాంత : కుమార్ ! ఏమిటది ? .... పెద్దా చిన్నా లేకుండా మాట్లాడుతున్నావ్ ! .... ఆఖరికి నా వంశ గౌరవం నాశనం చేస్తావా ?
కుమా : (బాధగా) నాన్నా ! .... ఏమిటా మాటలు !
మేనే : ఇందాక రోడ్డుమీద కూడా అడ్డమైన మాటలూ అన్నాడు. ఆఖరికి తన్నడానిక్కూడా సిద్ధపడ్డాడు! ..... అంతకన్నా అన్యాయం ఉందా ?
కుమా : నిజంగా తన్నాలనే అనుకున్నాను. కాని పదిమందిలో పరువు పోతుందికదా అని వస్తాయించాను.
మేనే : విన్నారా శాంతయ్యగారూ ! .... ఇంకా వినండి ...... నా బాకీ నే నడగడం తప్పా ? చెప్పండి .... అదీగాక, ... ఎవర్నిచూసి యిచ్చానండీ ? .... మిమ్మల్ని చూసి .... మీ పెద్దమనిషితరహాని విశ్వసించి యిచ్చాను .... మీరిలా ముఖం తప్పిస్తారని తెలిస్తే ఆనాడే జాగ్రత్త పడేవాణ్ణి!
కుమా : (కోపంగా) మాటలు తిన్నగా రానివ్వండి ! .... మీ యిష్టం వచ్చినట్టు వాగితే సహించేది లేదు.
మేనే : లేకపోతే యేం ? .... తలకొట్టి మొలేస్తావా ?
కుమా : మరోసారి నోరు జారితే అపనే జరుగుతుంది.
మేనే : అయితే నేనే చేతకానివాణ్ణా ? .... కానియ్ అదికూడా చూసేస్తాను ?
కుమా : గెటవుట్ !
శాంత : (కోపంగా) కుమార్!....నే నిలా బతకడం నీకిష్టంలేదా?
కుమా : (బాధగా) నాన్నా !
శాంత : అవును. ఆఖరికి నీవల్ల నేను నాశనం కావలసి వస్తుందేమో !
కుమా : నాన్నా !

(లోనుండి రంజన "అన్నయ్యా !" అని పిలుస్తుంది. కుమార్ వెళ్తాడు. ఒక్క క్షణం నిశ్శబ్దం.)

శాంత : అయ్యా మేనేజరుగారూ ! .... ఒక్క పది రోజులు వస్తాయిస్తే అన్నీ సర్దుబాటు చేస్తాను. నామాట నమ్మండి. నా పరువు కాపాడండి !
మేనే : నా పరువు మీరు తీశాక మిమ్మల్నెందుకు ఉపేక్షించాలండీ ? .... రేపు కోర్టులోనే తేల్చుకుంటాను. వడ్డీతో సహా కక్కిస్తాను.
శాంత : మేనేజర్ ! .... కళ్లు నెత్తికెళ్లాయేం ? .... కాస్త చూసుకు ప్రవర్తించు.
మేనే : పౌరుషం ఎక్కడుకండీ ? . . . . నాడబ్బు నాకుపారేయండి. పోతాను.

(లోనుండి తొందరగా ఒక వస్తువు చేతిలో ఉంచుకొని కుమార్ ప్రవేశిస్తాడు.)

కుమా : రావయ్యా ! రా! ....నీ బాకీ నీ మొహాన పారేస్తాను.
మేనే : పదండి.
శాంత : కుమార్ ! .... ఏమిటది ?
కుమా : (తల దించి నెమ్మదిగా) జిగినీ !
శాంత : (ఉద్వేగంతో) ఆఁ ! .... ఎవరిచ్చా రది ? .... వీల్లేదు. అది అమ్మడానికి వీల్లేదు. వెళ్లు లోపలికి ! .... ఊఁ! వినిపించలేదా ? .... వెళ్లవేం ?

(గుమ్మంలో రంజన కనిపిస్తుంది.)

రంజ : నేనే యిచ్చాను నాన్నా ! .... నువ్వెళ్లు అన్నయ్యా !
శాంత : కుమార్ !
రంజ : అన్నయ్యా !

(కుమార్ తొందరగా ప్రొడ్యూసర్‌ని లాక్కుని వీధిలోకి నిష్క్రమిస్తాడు.)

శాంత : (బాధగా) ఎంతపని చేశావు తల్లీ ! ఉన్న నగలన్నీ యిలాగే అమ్ముడుపోయాయి. ఆఖరికి మిగిలిందది. .... అది మీ అమ్మది. నా ప్రాణంతో సమానం. నీ వివాహ సమయంలో నీ మెడ నలంకరించాలని ఎంతో మక్కువతో దాచాను. ఆఖరికి దాన్ని కూడా అమ్ముకోవలసిన దౌర్భాగ్యుణ్ణయానా ?

రంజ : పూరుకోండి నాన్నా ! .... అది పోతే మరో నగ వస్తుంది. కలిగినప్పుడు సంపాదించుకోవచ్చు నగలు. పరువు పోతే తిరిగి తెచ్చుకోగలమా ?

శాంత : అదీ నిజమే ! .... కాని ఒకప్పుడు డబ్బంటే మంచి నీళ్లలా ఖర్చుచేసేను. ఎంతోమంది స్నేహితుల అప్పులు తీర్చిన నేను, నా సొంత బాకీ తీర్చలేక, తల్లి కూతురుకిచ్చిన నగని కూడా అమ్ముకున్నాను ! .... ఎంత నిర్భాగ్యుణ్ణి !

రంజ : శాంతించండి నాన్నా ! .... ఈవిధంగా ఆనగ సద్వినియోగం అయింది. పరువు నిలిచింది! అదే చాలు.

శాంత : అవును. పరువు నిల్చింది ! .... ఇలా సంతోషపడాల్సిందేగదా ! .... అంతకన్నా మరేం చెయ్యగలం ? .... ఎలాగైతేనేం ? .... పరువు నిలబెట్టుకున్న పౌరుషశాలిని!

రంజ : (బాధగా) నాన్నా ! .... ఏం మాటలివి ? .... మీరలా అంటే నా కేడుపొస్తుంది.

శాంత : (తేరుకొని) లేదమ్మా లేదు .... నువ్వు లోనికి పోయి పని చూసుకో !

రంజ : ఏమో ? .... నాకేదో భయంగా ఉంది.

శాంత : భయం దేనికమ్మా ! .... నేనున్నాగా !

(వీధిలోంచి తొందరగా మాధవయ్య ప్రవేశం.)

మాధ : ఏం బావా ! .... మాటవరసకైనా ఆ సంగతి నాతో చెప్తే తప్పా ?

శాంత : ఏ సంగతి ?

మాధవ : అదేనయ్యా ! ఆ పోలువాడి సంగతి ! .... మన్లో మన మాట. నాతో చెప్తే ఏదోవిధంగా సర్దనూ ?

రంజ : ఇప్పుడంతా సర్దుబా టయిపోయిందిలెండి.

మాధవ : అయిందా ? .... అయితే ఫరవాలేదు.

శాంత : ఇంక వెళ్లమ్మా!.... మామయ్య ఉన్నాడుగా నాకుతోడు.

రంజ : జాగర్త సుమండీ.

మాధవ : మరేం ఫరవాలేదులే కోడలా ! .... మీనాన్న ఎటూ పారిపోకుండా నేను కాపలా ఉంటాన్లే ! .... నువ్వెళ్లు.

(రంజన లోనికి నిష్క్రమిస్తుంది.)

శాంత : పిచ్చిపిల్ల ! .... నేనంటే వెర్రి అభిమానం !

మాధవ : ఉండదుటయ్యా ! .... అందులోనూ ఆడపిల్ల ! .... మన్లో మనమాట. ఆడపిల్లలకే అభిమానం ఎక్కువసుమా!

శాంత : రేపు పెళ్లయిన తరువాత యెలాగో మరి ?

మాధవ : అలాగని పెళ్లి చెయ్యడం మానేసి ఇంట్లో ఉంచేస్తానా ?

శాంత : బాగుంది ! .... అపనెలా చెయ్యగలం ?

మాధవ : అన్నట్టు మన్లో మనమాట. ఆ సంగతేం ఆలోచించావ్ ?

శాంత : ఏ సంగతి ?

మాధవ : అదేనయ్యా ! .... సంబంధాల గురించి.

శాంత : అబ్బాయి గురించా ? .... అమ్మాయి గురించా ?

మాధవ : ఇద్దరిని గురించీను.

శాంత చెప్పానుగా! .... వాళ్ల ఉద్దేశా లేమిటో గాని దేనికీ సమాధానం సరిగ్గా చెప్పకుండా ఉన్నారు.

మాధవ : అయితే ఏం చెయ్యాలని నీ వూహ చెప్పు, మన్లో మనమాట.

శాంత : నాకు చేతనైనసదల్లా ఒక్కటే అనిపిస్తోంది .... ఆ పారిపోయిన మామూర్తి తిరిగి వచ్చే వరకూ వేచి ఉండడం .... ఎందుకోగాని వాడు తిరిగి తప్పక వస్తాడని ఘోషిస్తోంది నా అంతరాత్మ !

మాధవ : అయితే నీ కింకా ఆ ఆశ పోలేదన్నమాట ! .... మన్లో మనమాట. నాడింక తిరిగి రాడయ్యా ! .... అదీగాక అమ్మాయికి మరో సంబంధం కుదరడం కూడా కష్టమే!

శాంత : ఎందుకని ? .... మా అమ్మాయికేం అందం తక్కువా? గుణం తక్కువా ?

మాధవ : అదెవడికావాలి ? .... నిన్న మొన్నటిదాకా అమ్మాయి రంగు పూసుకు రంగ మెక్కినదే కదా ?

శాంత : కావచ్చు. అంతమాత్రాన ఆత్మగౌరవం, కులశీలాలు నాశనం అయిపోతాయా ?

మాధవ : అవన్నీ యెవడాలోచిస్తాడు ? ....మన్లో మనమాట ఆ ప్రభాకరంతో తిరుగుతూవుందని యిప్పటికే గోలగా ఉంది! .... అయినా పదిమందితో కలిసి రంగ మెక్కాక పరువు మర్యాదలు ఎలా నిలుస్తాయి ?

శాంత : (కోపంతో) మాధవయ్యా ! .... ఒళ్లు తెలిసే మాట్లాడుతున్నావా ?

మాధవ : అదేమిటయ్యోయ్ ! మధ్య నామీద విరుచుకుపడతావేం?

శాంత : (కోపంతో వణికిపోతూ) మా అమ్మాయి అగ్నిహోత్రంలాంటిది. దాన్ననుకున్న వాళ్ల నోళ్లు పడిపోతాయి. వాళ్లకి పుట్టగతు లుండవు తెలుసా ?

మాధవ : కావచ్చు. అది పైవాళ్ల కేం తెలుసు ? .... మన్లో మనమాట. వాళ్లంతా చెడిపోయిందనే అనుకుంటున్నారు.

శాంత : (ఆవేశంతో) నోర్ముయ్ ! .... నీ యిష్టం వచ్చినట్టు పేలకు ! .... అసలు నువ్వే యివన్నీ పుట్టిస్తున్నావ్ ! ....నాకేం తెలీదనుకున్నావా ? .... స్నేహితుడివికదా అని సహిస్తూయించాను.

మాధవ : లేకపోతే ?

శాంత : లేకపోతే నువ్వన్న మాటకి నీ కళ్లు పెరికించేవాణ్ణి !... ఇకముం దిలాంటి వెధవ కబుర్లు చెబితే మన స్నేహం సాగదు ! జాగ్రత్త !

(రంజన ప్రవేశం.)

రంజ : ఏమిటి నాన్నా అది ?

మాధవ : మీ నాన్నని జాగ్రత్తగా కాసుకో అమ్మాయ్ ! .... లేకపోతే యేదో ఘోరం చేసేస్తాడు. తప్పదు ! ఆఁ!

శాంత : నువ్వు పో ముందు ! .... ఫూ ! .... వెళ్లవేం ? (అని కూలబడతాడు.)

మాధవ : మధ్య నేనేం చేశానయ్యా ?

రంజన : మామయ్యా ! నిన్ను బతిమాలుకుంటాను .... నాన్న మనసేం బాగులేదు. మరోనాడు మాట్లాడుకోవచ్చు ! ఇప్పటికి వెళ్లు !

మాధవ : సరే ! .... అయినా నాకెందుకీ గొడవ ! .... మన్లో మనమాట అమ్మాయ్ ! ఆ నాలుగు వందల గురించీ మీ నాన్నకి చెప్పమ్మా!....వాడు తొందర పెడుతున్నాడు నన్ను!

రంజ : అలాగేలెండి ! (మాధవయ్య వీధిలోకి వెళ్లిపోతాడు.)

శాంత : శనిగ్రహం ! .... ఈ దరిద్రపు వెధవని ఇంటికి రానివ్వకూడదు.

రంజ : ఏమన్నాడు ?

శాంత : అడ్డమైన కూతలూ కూస్తున్నాడు ! .... ఈ వెధవ కబుర్లకి జడిసిపోయి వీడు చెప్పినట్టు చేస్తే నను కున్నాడు గాబోలు .... పెళ్లిళ్లు కాకపోతే నా పిల్లలు బ్రహ్మచారులుగా ఉండిపోతారు !

రంజ : పోనీ వూరుకుందురూ !

శాంత : వూరుకోక చేసేదేమిటి ? .... ఉరి పోసుకోవాలి !

రంజ : (బాధగా) నాన్నా !

శాంత : అవునమ్మా ! .... ధనం పోయింది, పరువు పోయింది! ఇంకేం మిగిలింది ? ....

(వీధిలోంచి కుమార్ ప్రవేశం.)

రంజ : ఏం అన్నయ్యా ! .... అయిపోయిందా ?

కుమా : ఆఁ! .... వాడి బాకీ తీర్చేశాను.

శాంత : (బాధగా) అయితే ఆనగ కూడా అమ్మేశావా ? నీవి పాపిష్ఠి చేతులురా ! ఆ చేత్తో అమ్మడమే . గాని, కొనడం జరగదు !

రంజ, కుమా : నాన్నా !

శాంత : ఉన్నమాట చెప్పాను. అంతే ! .... ఇహ మీ జాతకాల్లో మంచి రోజులు రావు. మీవి వెధవ మొహాలు! .... పాపిష్ఠి జాతకాలు.

కుమా : ఏం మాటలు నాన్నా అవి !

రంజ : ఎందుకలా బాధపడతావ్ నాన్నా ! .... విశ్రాంతి తీసుకో ! నీ మనసేం బాగులేదు.

శాంత : అవును. విశ్రాంతి ! .... ఆఖరికి చెయ్యగలిగింది అదేగా!

(శాంతయ్య లోనికి వెళ్తాడు.)

కుమా : అలా ఉన్నారేం నాన్నా !

రంజ : ఆ నగ అమ్మడం ఆయన కిష్టంలేదు. అది మొదటిది ...... ఇంక ఆ మాధవయ్య వచ్చి ఏదో వాగాడు. దాంతో వెర్రెత్తిపోయి నానామాటలూ అన్నారు.

కుమా : ఆ మాధవయ్యని పాతేసినా పాపంలేదు. మళ్లీ రానియ్ చెప్తాను !

రంజ : ఏదో జరిగిపోయింది పోనిద్దూ ! .... అందువల్ల ఆయన మనస్సేం బాగులేదు.

కుమా : ఇంతకీ ఖర్మ ! .... మన మిలా కష్టపడాలని ఉంది.

రంజ : పద లోనికి. లోపల నాన్న ఏం చేస్తున్నారో ? .... ఇవాళంతా నాన్నని కనిపెట్టి ఉండాలి !

కుమా : పద ! (ఇద్దరూ లోనికి నిష్క్రమిస్తారు.)

(లైట్లు ఆరిపోతాయి. కొద్ది క్షణాల్లో తిరిగి వెలుగుతాయి లైట్లు. ప్రొడ్యూసర్, డైరెక్టర్, కవి, మాధవయ్య, శాంతయ్య వస్తారు.)

ప్రొడ్యూ : అయితే యిది రెండో భాగం అన్నమాట !

మాధవ : మరేం ! .... రెండోభాగం పూర్తయింది.

కవి : (మాధవయ్యతో) అయ్యా ! .... నాకు తెలీక అడుగుతాను .... ఆ నాలుగు వందలూ .... ఏది ? .... మీరు తీర్చమని శాంతయ్యగారిని పదేపదే హెచ్చరించారే ? అది యే బాపతుది ?

శాంత : మొదటి రంగంలో నాకొక ఉత్తరం వచ్చింది. గుర్తుందా ?

కవి : అవును.

మాధవ : మరేం అయితే ! .... అందులో శాంతయ్యగారి తమ్ముడు ఏదో ఆపదలో ఉన్నట్టూ, అతని సహాయార్థం కొంత సొమ్ము పంపమని ఉంది. అతనికి సహాయపడే నిమిత్తం శాంతయ్యగారు నా ద్వారా ఆ అప్పు చేశారు.

ప్రొడ్యూ : ఆ అప్పుచేసి ఎంతకాలం అయింది ?

శాంత : ఆరు నెలలు దాటింది.

డైరె : అంటే యీ రెండు రంగాల మధ్య కాలవ్యవధి ఆరు నెలలు దాటిందన్నమాట !

మాధవ : మరేం !

(లోనుండి కుమార్ వస్తాడు.)

కుమార్ : ఏమిటింకా చర్చిస్తున్నారు ?

డైరె : మరేంలేదు.

కుమార్ : మరి ఆలశ్యం దేనికి ? .... వేగం పూర్తిచేస్తే ....

మాధవ : అలాగే చెయ్యొచ్చు !

ప్రొడ్యూ : అయితే రెండోరంగం ముగిసినట్టేనా ?

కుమార్ : ఆహా ! .... మరింకా సందేహం దేనికి ?

డైరె : దట్సాల్ ! .... పదండి ! .... అంతా పదండి ! ....
Yes please! Curtain please...curtain.

(అంతా వెళ్తూఉండగా తెర వ్రాలుతుంది.)

స శే షం

వర్షావిలాసము

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

పచ్చికపట్టుం బుట్టము
కుచ్చెళ్లు నటింప చూపుకొసరింపులలో
పచ్చదనము సారించుచు
వచ్చితి వత్సరవిధాన వర్షాలక్ష్మీ!

కన్నెగేదంగి రేకుల కమ్మదనము
పైరు పంటల చక్కని పచ్చదనము
పిల్లగాడ్పుల మెత్తని చల్లదనము
విశ్వమునకు నీరాకను విశదపరచె.

నీ కనునీడలో మొలుచు నీలిమొయిళ్ళు పవళ్ళయందె క్రొం
జీకటి రేకులన్ విరిసి, చిక్కని చిన్కువరాలు రాల్చె నా
జూకుగ నీ పదాంకములు సోకిన శుష్కవనాంతరంబులన్
ప్రాకెను సాంద్రమై తరుణపల్లవ రాగవిలాస భోగముల్

కోటివెలుగురవలు కుంచాల గొలిపించి,
మించుదివ్వెలు వికసించినట్టి
నీలరత్నచంద్రశాలలో నివసించు
నీ విభవము మాకు జీవనమ్ము

అడరి గ్రీష్మాతపజ్వాలలంటు కొనగ
వేడి పొగలను జిమ్ముచు వాడువారు
ప్రకృతి నేత్రాంచలముల నేర్పరచినావు
శీత కర్పూర కజ్జల స్నిగ్ధరేఖ

నును సిగ్గుమొగ్గలు కనిపించునట్లుగా విరజాజియెదను కవ్వించినావు
భూమిగుండె ద్రవించి, పులకింప చల్లని చేతులతోడ స్పృశించినావు
నృత్యకేళీ కళాశ్రీకి వన్నెలుదిద్దు కేకి కంఠమును పల్కించినావు
బక్కచిక్కినకొండ వాగునెమ్మేను పొంగించి కలకల నవ్వించినావు

ఆకృతియె లేని శూన్యన భోంతరమున ఏడురంగులధనువు సృష్టించినావు
సలిలధారావళీ సూత్రబలముచేత దివిని, భువిని ఏకముగ బంధించినావు!

విశ్వనాథ - ప్రయోగ వైలక్షణ్యము

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

గత సంచిక తరువాయి

(గ.) వింతప్రయోగములు

రచనలో వాక్యవైచిత్రియని వైయాకరణులు పేర్కొన్న ఒక యంశమున్నది. 'అతఁడు తిన్న విస్తరి పాఱవైచి'— తిన్నది విస్తరికాదు; విస్తరిలోని పదార్థమును. ఏ విస్తరిలో పదార్థములు తినెనో ఆ విస్తరిని బాఱవైచి యని వాక్యార్థము. ఇట్టి వైచిత్రి బొత్తిగాఁ గానరాక 'కారకము'లో తెలుఁగుఁదనమును దూరీకరించినవి చర్వితచర్వణముగా అర్థమును స్ఫురింపఁజేయునవి జాతీయమును వక్రింపఁజేయునవి యగు పెక్కు ప్రయోగములు— ఈ కల్పవృక్షకవితలో, కాదు కాదు; ఈ విశ్వనాథవారి రచనలోఁ గానవచ్చును.

1. చీఁకట్లుపడి రాత్రి సమీపించె — అయోధ్య 210 పేజి

   చీఁకటి పడినదనఁగా రాత్రి వచ్చెనని అర్థము కాదా !

2. నాస్తికులును వైతండికుల్ నగ్నమతులు ,, 213

   నగ్న శబ్దమునను మతిశబ్దమునకు అర్థము లున్నవిగాని ఈ సమస్త పదమున కర్థమేమో భాష్యము చెప్పవలెను.

3. లెస్స మొగాలఁ జింతయను లేశము తోఁచఁగరాదు దేహళీ నిస్సరణంబునందుననె నిల్చిన వానిని నిల్చినట్లు వర్చస్సము పేతుఁ దీసికొనిరమ్మని నాదు నాజ్ఞగాఁగ.... ,, 214

   చింతయను — అచ్చు తప్పు కావచ్చు. చింతయును అన్నచో సముచ్చయమునకు అర్థములేదు. లెస్సను చింత లోనికిఁ జేర్చెదమా లేశముతో పనిలేదు ఇఁక 'లెస్స మొగాల'కు చెప్పఁదగిన అర్థమేలేదు. 'దేహళీ. . . . . .నిల్చినట్లు' — ఇది కల్ప వృక్షము మనకు ప్రసాదించిన ఒకానొక తెలుఁగు జాతీయమునకు నకలు. 'వాకిట్లో ఉన్నవానిని ఆపళంగా పట్టుకరా. ఎక్కడఉంటే అక్కడ వాడిని లాక్కురా' ఇత్యాదులను పురుడించు 'గో—కం—బర్డ్' వాక్యము వంటి వాక్య మీ 'దేహళీ' వాక్యము. నిల్చిన వానిని నిల్చినట్లు తీసికొని రమ్మని అన్న ప్రయోగము నడుమ ప్రాసకోసము 'వర్చస్సముపేతు' అన్న పదము వచ్చిపడినది.

4. ఏదియో యవసరంబైనట్టి పని. ,, 215

   అవసరమనఁగా సంస్కృత భాషలో వేళ యని అర్థము. సూర్యోదయావసరమున–ఇత్యాది. సంస్కృతపదములు పెక్కింటికి దేశ్యభాషలలో అర్థములు మాఱినట్లే 'అవసరమునకు'ఁగూడ అక్కఱయన్న అర్థము వ్యవహారములో రావచ్చునుగాని సంప్రదాయ శుద్ధములైన ప్రాచీన కావ్యములలో ఈ ప్రయోగము ఈ యర్థములో అంతగాఁ గానరాదు.

5. ఇంతదాఁక ననుఁజెప్పరు మంచి వివేకులంచునున్. . . . . . ,, 219

   రాత్రియనఁగావచ్చి ఈ వార్త నాతోఁ జెప్పరే. అవురా ! మంచివివేకులేసుమా మీరు ! అని భరతుఁడు **చారులతో** అన్న మాట. ననుఁజెప్పరు—వింతైన తెలుఁగు కారకము. ఆ భాషలో 'మా ముహాచ' ఉన్నదిగదాయని ఈ భాషలో ఇట్లనుట బొత్తిగా సహింపరాదు. 'అంచునున్' లోని సముచ్చయ సారస్యము కల్ప వృక్ష పాఠకులకు క్రొత్తగాదుగదా !

6. పుంత్రతోవన్, గణగణరథనేమి నిస్వనంబులు సెలఁగన్ ,, 220

   అనుకరణ శబ్దములను సమాసములలో దూర్చుటలో అందమేలేదు. గణగణమని గంట మ్రోగెనని యనుటయే తెలుఁగు సంప్రదాయము.

7. చలియుఁజప్పుడు లేక నిశ్చలముగాఁగ ,, 222

   ''సడీ చప్పుడు లేకుండ'' అని లోక వ్యవహారము. దశరథుఁడులేని అయోధ్య బావురుమన్నదన్న ఈ ఘట్టములో

'చలి'తో పనియేముండును ? యతి ప్రాసలకోసముగాని.

8. ప్రొద్దు బారెక్కె గడపల ముగ్గుకట్టి ,, 224
'బారెడెక్కె' అన్న ప్రసిద్ధ పదము లకు గణము అడ్డమువచ్చి మన కొక నింతప్రయోగము ప్రసాదించినది.

9. ఆమె పదమండలి శీర్షము చేర్చ ,, 225
కైక పాదాలమీఁద భరతుఁడు తలనుఆనించె నఁట. ఆమె కున్నవే రెండు పాదాలు గదా ! మండలి, యతికోసమా మరి !

10. ఓయి యోయి నాయన ! నినుఁజెప్ప రెవ్వరును. ,, 226
నీకు ఇక్కడి వార్త లెవ్వరును జెప్పరు నాయనా! నేనే చెప్పవలెను గాఁబోలు— అన్న అర్థము ఈ 'కల్పవృక్ష కారక ములో' ధ్వనింపవలెను.

11. పది దినంబులుచేసి దశాహకర్మ శాస్త్ర విధిగ సల్పి. . . . ,, 242
దశాహకర్మలోని 'తంతు' అంతయు ఒకటి రెండు నాళ్ళలోనే జరుపుకొనక, శాస్త్రప్రకారము పది దినములును 'నిత్యకర్మ'గా జరుపుకొనెనని సార స్యములాగవలెఁ గాఁబోలు! లేనిచో 'దశాహకర్మ' పది దినములన్న మాట ఎందులకు ? పైగా, 'చేసి—సల్పి' ఈ రెండింటికి సమన్వయమేది ?

12. అంతఃపురీ సర్వకాంతా గుచ్ఛంబులుచేర ,, 244
గుచ్ఛమనఁగా పూలగుత్తి. నెమిలి, పొద. సమూహార్థములో కాంతలకు ఈ గుచ్ఛ మిచ్చిరి. పైగా 'ప్రాసను' గాపాడుకో వలసిన పని ఉన్నదాయె ! ఆవువెంట దూడ నడచునట్లు మహాకవులకు యతి ప్రాసలు — గణములు, అనువుగావెంటఁ బడివచ్చునని శాస్త్రము చెప్పును.

13. గారుడ. . . . . . ప్రోష్ఠీ శిరస్సింహపీ, శిడోసంగైచనమోడ్చి ,, 253
ప్రాసలోపడిన ఈ 'డోసంగు'నకు అర్థ మేమున్నదో ఆలోచింపవలెను.

14. సం, కేతము దానిలోఁగలదొ గెబ్బున ,, 262
యతికోసము అతికింపఁబడిన ఈ 'గెబ్బు' నిఘంటువులో ఉండవచ్చుఁ గాక! కవులకు దూరమైనదే యగును.

15. ప్రేయోభావము కల్గియుంటకు మతి శ్రీ లేదు. . . . . . . ,, 266
మతిశ్రీలోని 'శ్రీ' కి అర్థమేలేదు. ఇఁక, కరుణశ్రీ విజయశ్రీ—ఇత్యాది శ్రేణిలో దీనిని గూడఁ జేర్చుకోవలెను.

16. సూచిపుచ్ఛోత్తములైన చల్ల మిరి యాలు లవంగములాది వస్తువుల్ ,, 276
ఇవి యొక క్రొత్త దినుసు మిరియాలు కాఁబోలు ! 'సూచి' ఇకారాంతమున్నది కాఁబోలు !

17. సర్వ దైవత ఋషిసంతాన కార్యసం, ఘాతశ్రీ సంధాన కర్త్రితాను. ,, 282
ఏకాక్షరములకు హ్రస్వములేదని తెలుఁ గు వ్యాకరణములు చెప్పినంతమాత్రాన ఆ మాట ఈ కల్పము వినవలెనని ఉన్నదా యేమి ? గణము కోసమై శ్రీ శబ్దమున కిట్టి హ్రస్వము దాపరించెనా! లేక ఈ హ్రస్వము సమాసాంతకార్యమా ?

18. పత్నీ సంసర్గ భయములేక ,, 286
శ్రీ—శ్రి కాఁగా, పత్న శబ్దము పత్నీ యగుటలో అశ్చర్య మేమున్నది ?

(జ) నిరర్థకము

'కం. ఇలఁబదపూరణ' మాత్రం
బలవడిన పదంబు, కృతి నిరర్థకమయ్యెన్,
దలఁపఁగ, వెలయుచు లలి, ను
జ్జ్వలమగు నీతనివిలాససౌష్ఠవ మనఁగన్'
కావ్యాలంకార సంగ్రహము 446 పేజి

ఏదైన పదము పాదపూరణార్థము ప్రయోగించినచో 'నిర ర్థక'మన్న దోషము తగిలినట్లే. ఈ నిరర్థకమునే అనర్థక మనియుఁ బిలుతురు. వెలయుచు—లలి, ఉజ్జ్వలము, ఇట్టి వన్నియు నిరర్థకమునకు లక్ష్యములు. యతిప్రాసల నిర్బంధము హెచ్చుగాఁగల తెలఁగులో ప్రసిద్ధులగు కవులే యతి ప్రాసలలో ఈ నిరర్థక పదములను ప్రయోగించుట జగత్ప్రసిద్ధమే. మానుగ— లలి, ఇత్యాదులు నన్నయాదుల కవితలో సైతము కన్పింపవచ్చును. కొన్ని అర్థరహితములైనను వాక్యాలంకార ముగా గణింపవచ్చును. కాని కేవలము పాదపూరణ మాత్ర ప్రయోజకములై కొట్టవచ్చినట్లు కన్పించు వానిని 'నిరర్థక దోషము' క్రింద జమకట్టక తప్పదు.

1. కడఁగి తొండలికల రాజకార్యమేమి తాను జతగూడెనో చెప్పనైనలేదు. అయో 219
ఈ 'తాను' న కేమైన అర్థమున్నదా! ప్రాసకుఁదప్ప. పైగా రాజకార్యమునకు తాను విశేషణమువంటిది. జడవాచక

ముల కీ 'తాను' ఎట్లు జతగూడునో విద్వజ్జనులు పరిశీలింపవలెను.

2. ఘంటికారవం బొరసి శకుంతరావముల నూదుట తా వినరాదు నేటికిన్ ,, 223

3. వ్యోమైడూకము నూడిపడ్డదనఁ దా నుద్విగ్నకౌసల్య ,, 233

4. తాఁబెద తల్లి యెంచిన విధంబున నీవును నెంచినావొ ,, 239
ఇచ్చట తాను కేవలము యతి సంరక్షణార్థమే గదా !

5. తా శత్రుఘ్నుఁడు రక్తనేత్రములఁ గాంతాపాళి వీక్షింప నా. . . . . . .
కోపవివశుండై తాను శత్రుఘ్నుఁడున్ ,, 245
ఈ పద్యములో సైతానుల వంటివి రెండు తానులు.

6. తాను గౌసల్య వచ్చెడులోన మఱల ,, 269

7. ఏ, మనుమనేదా ధరాపతియుఁ బ్రాణము లన్ ద్యజియించె నెప్పుడో ,, 295

8. తాదృశంబగు నయోధ్యాపురిఁ దాను భరతుఁడు ప్రవేశించెను. ,, 331
ఏమి సొగసుచూచి, ఏమి సారస్యము పరికించి ఈ వృత్తములో మూఁడు తానులు వాడిరో చదువరులు చదివి చూడఁగోరుదును.

9. రఘువంశ మహేశ్వరమూర్తి తా జగత్పట్టపు రాణికిన్ ,, 339

10. ఒక కథయేమి యెల్ల కథలున్నవి తా శిబి మేనుదూచు మచ్చికయు ,, 345

11. తావై దేహియు నెంత కొంచెము పర ధ్యానమ్మగా ,, 349

12. ముక్కునన్ దానై జీరును ,, 349

13. కాకము, తా మనుజులపైకివచ్చి తాకునె యిదియేదో ,, 350

14. గ్రాహనన్ దాఁ బొలిమేర కోరడుల చాయన్ వచ్చు. ,, 356

15. నీవును దల్లి ! తానయిన నీసతి తన్నును బోలువాఁడు ,, 362

16. దహరాకాశములోన వెల్గువెలుఁగై తా రాముచంద్రుండు ,, 364
ఆవహ్మొని తా నిట్లనెన్ (నాలుగు పాదములలో రెండు తానులు) ,, 364

(డ) అప్రయుక్తము

'కం. కవులు ప్రయోగింపని పద
మవనిందగ నప్రయుక్త మగునెట్లన్నన్
ద్రవిణో లబిలుం, డల దు
శ్చ్యవన మహాభోగి. ఖేట సంస్తుతుఁడనఁగన్'
(కావ్యాలంకార సంగ్రహము 445)

రచన హృద్యముగా ఉండవలెనన్న సుప్రసిద్ధములైన పదములనే ప్రయోగింపవలయును. ఏ కవులు ప్రయోగింపనివియు, ప్రయోగించినను ఝటిత్యర్థస్ఫూర్తిని గలిగింపనివియు నగు పదములను, కావ్యములలో ప్రయోగింపరాదని శాస్త్రము, అట్టి పదముల అర్థము వెంటనే స్ఫురింపదు కావున రసగ్రహణమున కష్టము తగిలినట్లే, కావ్యములలో రసము ప్రధానముగావున *రసభంగము గావించుదోషములను బొత్తిగా* సహింపరాదు. ఈ పద్యములోని 'ఐలబిల—దుశ్చ్యవన—ఖేట' శబ్దములు అప్రయుక్తదోషమునకు లక్ష్యములు.

సంస్కృతములో కనిపించు పదములన్నియు తత్సమములుగా ప్రయోగించు పద్ధతియు సరసముగాదు. వాగనుశాసనుతే అన్నమాట ఇది :

'శ్లో. విరళాన్ పేచోషాదిక శబ్దాన్ ప్రవ్యాహరన్తు శబ్దజ్ఞాః
ఇహతు ప్రవ్యాహార్యం సంకేతిత సుప్రసిద్ధమేవ పదమ్'

సంస్కృతములో ప్రచారప్రయోగములేని 'పేచ — ఊష' మున్నగుశబ్దములను సంస్కృత శబ్దశాస్త్రపండితులు ప్రయోగించిన ప్రయోగింతురుగాక! ఈ యాంధ్రభాషలో మాత్రము (ఇహతు) వివక్షితార్థ బోధనశక్తిమంతమగు సుప్రసిద్ధ శబ్దములను మాత్రమే ప్రయోగింపవలెను. కోశములో ఉన్నవిగదా యని వ్యాకరణసమ్మతములుగదా యని సంస్కృతభాషలోని మాఱుమూల శబ్దములను ఆంధ్ర కావ్యములలో వ్యవహరింపరాదని భావము. రసస్ఫూర్తికి ప్రతిబంధకములయిన పదములను పరిహరింపవలెనని పిండితార్థము.

ఈ దోషము కల్పవృక్షములోనేకాదు, విశ్వనాథ రచనలలో సర్వత్ర దండిగా నిండియుండును. ఇది ఒకానొక ప్రౌఢత్వమనియు— ఈ కవి సమ్రాట్టు కవితలో ఇది యొకానొక విశిష్టతయనియు భ్రాంతిపడి ప్రచారముచేయు ప్రబుద్ధులు లేకపోలేదు. శాస్త్రీయముగాఁ జూచినను కాళిదాస నన్నయాది కవీశ్వరుల కవితాప్రాభవమును లక్ష్యముగానెంచి పరీక్షించినను దీని సత్యము తెలిసికొనఁగలము. నానావిధ నిఘంటువులను దగ్గఱఁ బెట్టుకొని ఏవేవో మాఱుమూల పదముల నేర్చి కూర్చి ప్రాసలలోదూర్చి క్రిందిభాగమున లఘుటీకలు వంటివి వ్రాసినను ఆ దోషము రసప్రతిబంధకముకాకతప్పదు. ఈ దృష్టితో కల్పవృక్షమును బరీక్షించితిమేని లక్ష్యముల కోసమే ఈ కవి ఈ పదములను వాడుకొనెనా యన్నట్లు స్పష్టమగును.

1. వియద్వల్లిఁగాచిన చంద్రబాలకాయ బాల 36పేజీ
చంద్రబాల యనఁగా పెద్ద యేలకు

లని క్రింది టీక. కాచిన యేలకుల వైఖరికి చంద్రబింబమునకు సామ్యము నైతము క్రొంగ్రొత్తది. కాఁగా 'చంద్రబాల'లో చంద్రకు 'చంద్రబింబము'లో చంద్రకు అక్షరసామ్యము మాత్రము ఉండవచ్చును.

2. మింటిగట్టు నైలావాలుకంబు పండు ,, 36

ఏలావాలుకము—నూగు దోసయఁట. ఇట్లే ఈ పద్యములో చంద్రునకు, మాఱుమూలనుండు చెట్టు చేమ లన్నియు పోలికలుగా వర్ణింపఁబడినవి. సోమవల్కము=వెలచంద్ర; అమృత = ఉసిరిక ఇత్యాదులు.

3. కాశ్యపిభర్త యజ్ఞపరికల్పితవాటిఁ బురోవశిష్ఠుఁడై ఋశ్యవిషాణమౌని విహరింపఁగ ,, 54

ఈకారాంత స్త్రీలింగమైన కాశ్యపికి భూమి అనియు, ఇకారాంత పుంలింగమైన కాశ్యపికి అనూరుఁడనియు అర్థములు. భూపతి యనుటకు కల్పవృక్షము 'కాశ్యపి భర్త'ను సృష్టించి యిచ్చినది. భూమికి పతియన్న అర్థములో సంస్కృతవాఙ్మయమున ప్రసిద్ధములైన పదములు పదులుగాదు; వందలు దొరకును. ప్రాసకోసము —అందును తక్కువరకములో లెక్కకువచ్చు 'శ స' ప్రాసము కోసము ఇక్కడ 'కాశ్యపిభర్త' కావలసివచ్చెను. ఆపై నాలవ పాదమున 'ఋశ్యవిషాణమౌని'యు ప్రత్యక్షమయ్యెను. 'ఋష్యశృంగ'కు పేరు తగిలించిన 'నకలు ముక్క'. శృంగ—విషాణములు పర్యాయములైనంత మాత్రాన సంజ్ఞావాచకముల నిట్లు తాఱుమాఱు చేయుట భావ్యమా! హస్తిపురిని 'కరిపురి' అన్నారుగదా అని ఏమఁగు పట్టణమని మనము క్రొత్తగా వ్రాయఁగలమా ! ఋష్యశృంగుఁడు గణముకోసమై ఋశ్యవిషాణమౌనిగా అవతరించుచు 'నేయార్థము'ను కావ్య దోషమును గూడ సంపాదించి యిచ్చెను.

4. ఒగిఁగార్య విధా ఫక్కిక పోనీ ! ,, 85

విధా—ఏర్పాటు; ఫక్కిక — ఏకగ్రంథము; ఫక్కి—రీతి; ప్రకారము, ఫక్కియర్థములోనే 'ఫక్కిక' ప్రయోగించెనని అనుకొన్నను అర్థము చక్కఁగారాదు.

5. ధురామహా ఉగ్రప్రచండ; తవ ఊర్జితున్; తవ ఉదాత్త తవాబ్ధి, ఓంకారసర్వశ ఆద్యావృతులై—ఈ సంస్కృత సంధులు వ్యాకరణ సమ్మతములైనను పట్టి బలవంతముగ వేసినట్లే యుండి తెలుఁగు రచనకు అంద చందములు కూర్పవు. ,, 176

6. అగాథ సకలంబుతో సంబోధించిరి ,, 184

ఆ కథ సమస్తమును బోధించిరన్న అర్థములో ఈ ప్రయోగము. సంబోధనము—పిలుపు, ఆహ్వానము; బోధనము—బోధించుట కఱపుట.

7. నీ రంధ్ర కాంతార వీథీ కైడర్య విశాల పత్రముల నిద్రింపంగ అయోధ్య 80

కైడర్యము—పేకుచెట్టు. ప్రాసకు పనికి వచ్చిన మారుమూలపదము

8. క్ష్వేడాక్రూర మానేత ,, 173

క్ష్వేడ—విషము. ఆ చేష్ట విషము వంటిది. యతికోసమై ఈక్ష్వేడ దాపరించినది.

9. నిన్బడి వచ్చినను దప్పులేదు ,, 179

బడి—క్రమము; పాఠశాల; దిట్టము; వెంబడి. నిన్బడి—నీవెంటఁబడి. ఇది మూఁడు బంతుల వచనము. ఈ'బడి' శబ్దము కల్పవృక్షము కాచిన కాయలలో ఒకటి. అల్లూరు బెల్లముగ ఈ కవి వాడుకొను బంగారువంటి పదములలో ఇది యొక పదమని భావము. ఒకవేళ పద్య రచనలో ఇది వేయక తప్పదను కొన్నను వచనములో దీనిజోలిమాని నీవెంట వచ్చినను లేక నీ వెంబడి వచ్చినను దప్పులేదన్న ధోరణిలో తప్పులేదు గదా !

10. అహేడమౌనులు చని సన్న చీఁకటులు నూల్కొనువేళకు ,, 217

హేడుఁడు-అంతఃపురపు కావలివాఁడు. మూర్ఖుఁడు. ఇక్కడ మూర్ఖులుకాని మౌనులని భావము కాఁబోలు. అవిధవా భవ అన్నట్లు ఇట్టి ప్రయోగములు ఈ కవి కభిప్రేతములు

11. శ్రీరాముఁ డాగూపయో ముక్తమాకృతి ,, 219

శ్రీరామునకు విశేషణమైన ఈ మాఱుమూల పదముల సమాసమునకు అర్థము

విచారించుటలో కాలహరణము కావలసి నంత.

12. నారికేరంబునా వ్యోమైడూకము నూడి పడ్డదన ,, 233
వ్యోమ + ఏడూకము = వ్యోమైడూకము. ఏడూకము—మెత్తిన గోడ

13. చేతో రీఘా విధా విశేషములు ,, 234
కల్పవృక్షకర్త కథిప్రేతములయిన శబ్దములలో 'రీఘ' ఒకటి. రీఘ—తిరస్కారము. చేతో. . . . .ములు=మనస్సునకు కషము కలిగించు వార్తలు అన్న భావములో ఈ కృత్రిమ సమాసము కూర్చిరి.

14. రాజపరిషత్ప్రేష్ఠి శిరస్సింహపీఠి ,, 253

15. భార్య పృష్ఠవంశోర్ధ్వమ్మన ,, 341

16. పాణి పాదోరు దుర్గడ కాభీల విధూతి ,, 342
దుర్ + గడక + ఆభీల=గడము =గండె చేప; దీనికే 'క' ప్రత్యయము చేర్చి యుందురు. సంస్కృతములో కాన వచ్చు 'క' ప్రత్యయము విలువ బొత్తిగా తెలియనిది విశ్వనాథరచన అనుట కెన్నో తార్కాణము లున్నవి.

17. చంచదపతోక ,, 231
అపతోక—ఊచుకపోయిన అను

18. చిన్ని సుకర పాలజున్ను గడ్డ (సుకర=మంచియావు) బాల 37

19. తరుణాజూ వినివారణ (ఆజూః = నరక ప్రాప్తియుట) ,, 127

(ద) క్లిష్టము

కం. 'దూరార్థము క్లిష్టంబగు
ధారుణి బవనాశ నేంద్రధరమకుటాలం
కారమణి జనక వరపుత్త్రీరమణ
కుమారరూపదీపితుఁడనగన్'

(కావ్యాలంకార సంగ్రహము 454)

క్లిష్టమనునది కావ్యమం దుండరాని పదదోషములలో నొకటి. అర్థము నిర్ణయించునప్పుడు క్లేశము కలిగినచో అందు ఈ దోషము ఉన్నదన్నమాట. పవన + అశన + ఇంద్ర, ధర—అనఁగా శివుఁడు. మకుటాలంకారమణియనఁగా చంద్రుఁడు (చంద్రమౌళి) వానితండ్రి సముద్రుఁడు. అతని పెద్దబిడ్డ లక్ష్మి. ఆమెరమణుఁడు విష్ణువు. ఆయన కుమారుఁడు మన్మథుఁడు. ఆత ని రూపమువంటి రూపముతో ప్రకాశించువాఁడు. ఇట్టి డొంక తిరుగుడుగా అర్థము చెప్పుకొనవలసిన ఘట్టములు చిన్నవి పెద్దవి ఎన్నో కల్పవృక్షము మనకు ప్రసాదించును. చిత్తగింపుఁడు :—

1. జలేజహితవంశపు శేండ్లకు నీవు నచ్చు సారథివి. బాల 5వ పేజి
జలే—జ—**హిత వంశము—శేండ్ల**—సూర్యవంశ్యరాజులు.

2. శ్రీయుత వజ్రిమహాశ్మ గరిష్ఠ సుసౌధము పై క్ష్మాత్రయువతీ సుమనోహరుఁ గాంచె సుమంత్రుఁడొగిన్ ,, 6
శ్రీయుతలో అంతగా అర్థములేదు. వజ్రి—మహాశ్మ—ఇంద్రనీలమణులు కాఁబోలు! క్ష్మాత్ర—యువతీ—సు—మనోహరు = భూపతి

3. గాఢ శుక్కద్రూసంభవదష్టులై ,, 6
గాఢ, శుక్=శోకమనెడి, కద్రూ సంభవ = పాములచే

4. నీవా యక్షుద్రాత్ముండవు ,, 6
దశరథునితో మంత్రి యన్నమాట ఇది. క్షుద్ర = నీచమైన, ఆత్ముఁడు= ఆత్మగలవాఁడు—నీచమైన ఆత్మకల వాఁడుగానివాఁడు—అక్షుద్రాత్ముఁడు—ఇదియు 'అవిధవాభవ' జాబితా లోనిది.

5. తతమహిమంపుఁ బ్రోవయిన తాత ! వశిష్ఠ ! ,, 18

6. విద్యాతరుణీ ప్రాణనాథులు ,, 19
గొప్ప విద్యావంతు లనుటకు వచ్చిన తిప్పలు.

7. రంగనాథవ్రతంబు లోరంపు బిడ్డకు ,, 124

8. ఓ పరమంపునారి ! (ఓ గంగానదీ ! అనుటకు) ,, 193

9. తాటకాప్రాణహరణ పుణ్యావాహినీ భగీరథ ! శ్రీరామచంద్ర ! ,, 221
(తాటకప్రాణమును దీయుటయను గంగానదికి భగీరథుఁడైనవాఁడా !)

10. తమ్మిపువుచుట్టపు వంగసపింటి దివ్వియ అయోధ్య 6
(సూర్యవంశమునకు దీపమైనవాఁడు) వంగసము + ఇంటి= వంగసపు నింటి యని కావలెను. ఇట్టి 'షోకులు' ఇందు కావలసి నన్ని కలవు

11. ఆసన్నతగల్గు 'వారసుఁడు' ,, 18
(ఔరసులలో సన్నిహితుఁడనుటకు)

12. మోకాళ్ళందికి జాఱుకేలుఁగవయున్ ,, 163
(ఆజానుబాహువు అనుటకు)
13. శ్రీరాముఁ డా గూపయోముక్క్రమాకృతి ,, 219
ఇది విచిత్రమైన ముక్క
14. వైదేహీ మనోంబుజాంగజుఁడు ,, 263
మనస్సను అంబుజమునకు మన్మథుఁ డఁట. క్రొత్త త్రోవ
15. విదేహ రాజ తనయాపతి ,, 305
విదేహరాజుయొక్క తనయకు భర్త
16. పుండ్రేక్షుప్రదరాసనాభతనుసంభూత ద్యుతి ప్రేంఖణుల్ ,, 199

(బ) పరుషము

కం. శ్రుతి కటువులైన పదములు
కృతిఁబరుషము లనఁగఁ జెలఁగు నిలుఁ గ్రుద్ధేడ్డా
పతి మూర్ధ ధృతార్ద్రోద్వధి
పతిఁగొల్తు నభీష్టసిద్ధి ఫలమున కనఁగన్'
(కావ్యాలంకార సంగ్రహము)

చెవులకు కటువుగా వినఁబడు పదము పరుషము, 'క్రుద్ధేడ్డా' ఇత్యాది. రౌద్రాదిరసములనుబట్టి ఒక్కొక్క చోట పరుషరూపదోషము దోషముగాఁగాక గుణముగా ఉండవచ్చును. కాని, రసము—గిసము మాటయే చూడక ఈ కల్పవృక్షము పద్యములోనేగాదు గద్యములో సైతము విచ్చలవిడిగా పరుషదోషమును పదిలముగా దాఁచుకొన్నమాట కాదనలేము. కాఁగా కొందఱు కావ్యసౌందర్యము గుర్తింపనేరనివారు 'అమ్మో! మురారి కవిహోతె కల్ప వృక్ష కర్తయు ప్రౌఢకవి' యని భ్రాంతిపడి అగ్గించువారును గలరు.

1. ధర్మానుబంధ్యద్భుతోత్ప్రేక్షలకు రాజు (గద్యము) బాల 12
2. శాంతార్ష్యశృంగులకు (గ) శాంతా+ఋష్యశృంగ ,, 35
3. భ్రశ్యచ్ఛోకము ,, 36
4. ప్రేషమ్ముల్—బృందిష్ఠమ్ముల్—బంహిష్ఠమ్మైమ్మ—క్షేపిష్ఠశ్వంబులు సాధిష్ఠము. ,, 37
5. ఆ యశ్వరాడ్వపాస్థానీయంబు ,, 63
6. ధునీ వేణ్యుష్ణీషవత్ప్రణీత కిరీటా ,, 74
7. ధర్షణ్యాశర కామినీ ,, 115
8. ముగ్గురొకెత్తు వాఁడొకెత్తు ముని! ,, 156
9. ససమిత్కుసుమోచ్చయయు సర్త్విజయు (గద్యము) ,, 179
10. అన్నుకన్నవశ్యతలేనిదై ,, 179
11. దుష్టధీనివిష్టాఘహో! ,, 227
12. అబ్బిక్కుఁడై లీనవహ్న్యశ్వత్థాకృతియై ,, 253
13. ససుహృత్సశిష్యక సర్త్విజముగ ,, 256
14. వినదత్పికి ,, 271
15. స్ఫేష్మేరమ్మద—ద్రాఘిష్ఠంబై—నిష్ఠావర ,, 286
ఈ కఠోర పదములుగల కూర్పు ఈ కవికి కర్ణరసాయనముగుటఁ జేసికాఁబోలు—అచ్చముగా ఈ పదములే నిండారఁజేసిన ఒకే పద్యము రెండు చోట్ల (286—302 పేజి) వాడుకొనిరి. ఆ రెండింట భేదించిన పదములు రెండేరెండు. ఛిన్న చాపంబునన్—వాకిటన్ ఘోరమై. అని.
16. ఇల్మంగిలం దడుగుల్ ,, 297
17. శిశ్వాశిస్సులు శ్వోవసీయముగఁదా సృష్టించి ,, 336
18. ప్రథక్ష్వేడాన్విష్ట వచోనిగుంఫనులు అయోధ్య 120
19. దీప్తాచ్ఛహాసోజ్జ్వల ద్దృగ్భ్రేషం బుగఁజూచి ,, 143
20. సవ్యగ్ర్యాకుంసునిహోతె ,, 143
21. కనిరి దృక్తైక్ష్ణ్య మది క్రమక్రమము ,, 201
22. అగూపయోముక్క్రమాకృతి ,, 219
23. నతానత ప్రాగ్గనావలంబిసాంద్రాప్లుతి నీరదప్రథమ ,, 337

ప్రకీర్ణము : గ్రామ్యము

'కం. పామరుల భాష గ్రామ్యము
భామిని కటిగల్లములు విభాసిల్లుననన్
గోమలి చన్నులుఁ గన్నులుఁ
గాముని పండువు లొనర్చెఁ గడువడిననఁగన్'
(కావ్యాలంకార సంగ్రహము)

ఇచ్చటి గ్రామ్యమనఁగా వ్యావహారికభాషయని కాదు. నాగరకవ్యవహారము గుర్తింపక శ్రోతలకు జుగుప్స కలుగునట్లు పలికెడుభాష గ్రామ్యము. అట్టిది కావ్యభాషలో అసభ్యముగా పరిగణింపఁబడును. విద్వద్గోష్ఠులలో పలుకరాని కటి, గల్ల ప్రభృతి శబ్దములను కావ్యదోషములుగా నిర్ణయించి నిషేధించిరి. 'కాళ్లు' పదము సైతము గ్రామ్యమని తెలుఁగు లాక్షణికులు చెప్పిరి. కాని కవీశ్వరులు పెక్కుమంది ఇట్టివి వాడుకొనుట నిజమైనను—ఈ దోషములు దోషములుగానే విద్వజ్జనులు భావింతురు. కల్పవృక్షము వీనిని గైకొన్నది.

1. చిబుకంబును గల్లమునల్లఁదాకి — బాల 24
2. మీసలు గడ్డముల్ మీ ముఖ చిబుక
గల్లముల మెలఁగనే మెలంగవు — ,, 32
3. సదా త్రేచుసట్లు తినంగా (ఈ శబ్ద
మునకు మాండలికముగా అసభ్యత
కలదు) — ,, 50
4. శ్రీసతి ఫుల్ల గల్ల పరిచిహ్నిత — ,, 267
5. అని బాష్పస్నపితాక్షి గల్లయును — ,, 364
6. ధరణి కుమారి బుగ్గలుగఁదాల్చె సమాదర — అయోధ్య 294

ప్రక్రమ భంగము

ప్రారంభించిన మార్గమును విడిచినచో ప్రక్రమ భంగమన్న కావ్యదోషము కలుగును. చేయితిరిగిన కవుల రచనలలో ఈ దోషము రానేరాదు. ఆ కూర్పులో ఒకవిధమైన రోఁత కలుగకుండుటకే ఇట్టిది ఉండరాదని లాక్ష ణికులు కట్టడ చేసిరి. విశ్వనాథ రచనలో ఈ దోషమును ఒకదోషముగా పాటించని ఘట్టములే పెక్కులున్నవి.

1. ప. దారిఁజనినంతవఱకు నందఱు విశాలమెచ్చి కొనుటయు
సుమతిని మెచ్చికొనుట యాదరము మెట్చుకొనుటయు
నంతిపురము మెచ్చుటయు సేవ కాళిని మెచ్చికొనుట
బాల 224

ఈ యైదింటిలో నాలుగు మెచ్చికొనుటలు—ఒక్కటి మెచ్చుటయు మెచ్చఁదగిన రచన కాదు.

2. సీ. దేవాలయంబులు. . . . . .శిఖి రహితంబులయ్యె
యజ్ఞగోష్ఠులు. . . . . . విరహిత ధనములయ్యె
రత్నాపణములు. . . . . . .విఘటిత భోగమయ్యె
చైత్యంబులందు. . . . . . ఘనశకుంతలంబులఁగానరాదు

'అయ్యె'నని మూఁడు చరణములలో ఉపక్రమించిన రచన నాలవచరణములో 'కానరాదు'గా మాఱుటచే దోష ముగా మాఱినది.

వచన వ్యత్యాసము

1. మగిడి జనకాదులు రథాశ్వ. . . . . .వీధి
కానతంబుగ నడచెన్ — బాల 338
2. సౌధాగ్రభాగస్థసతులు. . . . . రాముఁ
గాంచి—సంతోష జలరాసులగుచు ప్రమ
దంబుఁగాంచు — ఆూాధ్య 44
3. కామినులు. . . . .పెన్మిటిన్ అవ్వి
యుఁగావలె నివ్వి కావలెన్ నా కనుచున్
భర్తను గాంచలేర ! — అయోధ్య 108

4. బగ్గెలకున్ నిలువఁబడియోఁ బరిచారకులున్ — ,, 203
5. పతియున్న యప్పుడెటులో దీపించు
నట్నే సతుల్ — ,, 210
6. శ్రీ వశిష్ఠులు మాతో నిన్ను నిర్చినవాని
నిర్చినయట్లగాఁగొంచురమ్మనియె — ,, 219
అన్నది వశిష్ఠులవారు కావున 'అనిరి' యనియు, మాతో కొంచురావలెనన్నారు గాన 'కొంచురండని'యు ప్రాథమిక పాఠశాలా విద్యార్థులు సైతము వ్రాసె దరు.
7. శ్రీ వశిష్ఠులును స్వామీ ! నిన్ను వే రమ్మ
నెన్ — ,, 219
8. మీరెల్లన్. . . . . .కంటే వశిష్ఠుల్‌సుఁడీ — ,, 272
(మీ రెల్లరు కంటిరే యన్న ధోరణిలో)

వైరి సమాసములు

ఇవి 'చ్యుతసంస్కార' దోషములలోఁ జూపవలసినవే అయ్యును చదువరులు ప్రత్యేకించి వీనిని గుర్తింతురని ఇచ్చట నిచ్చుచున్నాను.

1. ప్రతిమేడ 2. ప్రతి మల్లెపూవు 3. ప్రతిపూట 4. ప్రతినాఁటు 5. ప్రతి యంగుళము 6. ప్రతి చినుకు 7. ప్రతిదానికి 8 మూలకంబముల్ (బాల—19 పేజి) 9. మహారాణి (బాల—104 పేజీ) 10. మంగళహారతి (బాల—295) నీ కృతము (అయోధ్య 48 పేజి) కృతము—చేయు బడినది—నీచేఁ జేయఁబడినది. ఇట్టివి కల్పములో పదులు కాదు. వందలు, వేలు. 'ప్రతి' అవ్యయమును దెలుఁగులోఁ జేర్చి సరిపెట్టుకోవచ్చునని 'మూలస్తంభము' వికృతి 'మూల కంబ'మని—మహారాజ్ఞి వికృతిఁ 'మహారాణి'యని ఇత్యాది ధోర ణిలో సాధుత్వమునకు తంటాలు పడవచ్చునని భావించువారు లేకపోలేదు. పట్టించినట్లు చూపించు ఇట్టి అపశబ్దముల కక్కుర్తి కవి సమ్రాట్టులని కొందఱీ వాడుకలోఉన్న విద్వ త్కవికి తగియుండునా ! ఇట్టి ప్రయోగములతో సాగిన కావ్యము మహా కావ్యశ్రేణిలోఁ జేరుగలదా !

విరుద్ధము

కం. 'క్రమ మెడలి దేశకాలా
సముచితము విరుద్ధమయ్యె! 'సముదవిలోల
భ్రమరము చంపకవన' మన
'సముదంచిత కైతకంబు చైత్రంబునఁగన్.'

కావ్యాలంకార సంగ్రహము

దేశకాలాదుల కుచితముగానిది విరుద్ధమను కావ్య దోష మగును. చంపకవనమున భ్రమరము సంచరించుచున్నదని వ్రాసినచో ఈ దోషము సంక్రమించును. మొగిలిపువ్వు చైత్ర

వాసముతో ఉన్నదన్నచో కాల విరుద్ధము. ఇట్లే కొన్నింటిని కవి సమయములని వ్యవహారమున్నది. వానిని పాటింపని కవిత రాణింపదు.

1. బుస్సుమన్న త్రాచు పొలతివోలె అయోధ్య 23 పేజి

త్రాచు పొలతియనఁగా ఆఁడుత్రాచని యర్థమా! అసలు త్రాచు ఆడుదియనియు, జెఱ్ఱి మగదియనియు శాస్త్రమేమోగాని దేశమున వాడుకయున్నది. ఈ పక్షములో 'అప్సరస్సతి—అప్సరో వనిత' వంటి పదములనువలె 'ఆఁడుత్రాచును' గూడఁ గాపాడుకోవచ్చును. అప్సరసలు—అందరు స్త్రీలే గదా! ఇట్టివి సంప్రదాయము శాస్త్రము గుర్తించి మఱి వ్రాయవలెను.

విపరీతధీప్రదము

కం. 'జగతిన్ విరుద్ధ మతికర
మగునది విపరీత ధీప్రదాఖ్యంబనఁగాఁ
దగుఁగృతుల; నకుల హీనుం డగు
నితఁ డననంబికా విటానక్తుఁడనన్'

(కావ్యాలంకార సంగ్రహము)

అనుకొన్నఅర్థమునకు విరుద్ధమైన అర్థమును గలి గించు పదమును విపరీత ధీప్రదమని అందురు. ఈ కావ్య దోషమునకే 'విరుద్ధమతి కృత్తు' అని సాహిత్య దర్పణము—కావ్యప్రకాశము మున్నగునవి పేరు పెట్టినవి. అకులహీనుఁ డనఁగా కులహీనుఁడు కానివాఁడని ప్రయోక్త ఉద్దేశము. నవిద్యతే కులం యస్యసః అకులః నచాసౌహీనః అకులహీనః—'అనియువిగ్రహము చెప్పినచో 'కులములేని హీనుఁడన్న' అర్థము రావచ్చును. అంబికా విటుఁడనఁగా పార్వతీపతి కావచ్చు. తల్లికి మిండఁడన్న అపార్థమున్నైతము రావచ్చును. ఇట్లే, 'కల్ప ము'లో

1. గీ. ఇద్ది యభిషేకమయ్య! అహీన భూష!
హీనదోష! ముక్త్యాల మహీనపోష!

అయోధ్య—70

ముక్త్యాల భూపతికి ఈ రామాయణకల్పవృక్షమును వినిపించునట్లు వ్రాసికొన్న ఈ ఘట్టములో ఆ మహారాజును 'హీనదోష' అని పిలిచిరి. తగ్గిపోయిన దోషములు కలవాఁడా! అని కాఁబోలు కల్పవృక్షకర్త వివక్ష. అసలు—దోషస్ఫూర్తి ఎందులకు? 'అనఘు' అన్నట్లు దోషములేలేనివాఁడా! అను టకు — దోషములు తగ్గినవాఁడా యనుటకు భేదములేదా! 'అహీనభూష'లోఁగూడ ఇంత సంస్కృత వాఙ్మయ ముండఁగా 'హీన' శబ్దమే ఈ కవిసమ్రాట్టునకు దొరికెనా!

2. అనఁగ ధరణీవరాహ! నీ దైనబలము రథములందున్నమాట

బాల—14

ఇది సూతుఁడు దశరథ మహారాజులతో అన్నమాట. దశర థుఁడు ధరణీవరాహుఁడట! ఆదివరాహము మోసి నట్లుగా అతఁడు ధరణిని మోయవచ్చును (పాలించుట) సైంధవమానయు అన్నట్లు సరిపెట్టుకోవచ్చునుగదా అన వచ్చును. కాని 'ఊరఁబంది—అడవి పంది' అన్నట్లు విపరీ తార్థమునిచ్చు' ఈ 'వరాహము' కల్పవృక్షమునకేమి ఒలిగ బెట్టును?

3. చంచదపతోకకు స్వర్గవికైన .... అయోధ్యా 231

అపతోక యనఁగా ఈఁచుకపోయిన ఆవు కావచ్చును గాని 'తోక' వెక్కిరించినట్లు లేదా!

4. శతదాసీపరిసేవ్యమాన విభవస్వారాజ్యరాజ్ఞీత్వ భాసిత, యిక్ష్వాకుల పెద్ద కోడలు వనీసీమం బ్రవేశించి...అయో302

దాసీ జనముచే సేవింపఁబడిన తన రాజ్యమందలి రాజ్ఞీత్వ ముచే ప్రకాశించునది సీతయని కల్పవృక్షకర్త భావము కావచ్చు. కాని, 'స్వరాజ్య—స్వారాజ్య' శబ్దములకు కొండంత భేదమున్నది. స్వరాజ్యము—తన రాజ్యము. స్వారాజ్యము—స్వర్గలోకపు దొర తనము, స్వరాజ్యోద్భవ—స్వారాజ్య అని ఏదో తద్ధిత రూపము చేసి 'మాయూర—కాపోత—శౌక'ములు ప్రేమించు 'వైశ్వ నాథమును' మనస్సులో నుంచుకొని సమర్థించుకోవలెనా!

పతత్ప్రకర్షము

కం. 'క్షితి నుత్కర్షము తక్కినఁ
బతత్ప్రకర్షంబు; గవయ భల్లూక మృగీ
వితతి వి భేదన గర్వా
యతసింహాభీల మీమహాటవియనఁగన్'

(కావ్యాలంకార సంగ్రహము)

ప్రారంభించిన ఎత్తుగడ క్రమముగా పడిపోయినచో ఈ దోషము తగులును. ఈ లాక్షణిక దోషమును మనము పాటిం చినచో కల్పవృక్షము ముప్పాతిక మువ్వీసము దీనికి లక్ష్యము కావచ్చును. అయినను మచ్చున కొక్కటి :—

1. రిపుశతఘ్ని మహాగ్ని రీఘావినిర్గత్త
ధూమ సంపిహితమౌ దుర్గమట్లు
శిల్పి కృత శ్యామలాల్పమృన్నిర్మిత
క్రీడా గృహసమాజకేతువట్లు
ఝంఝావినిర్ఘాతి సంఛిన్న సర్వప
త్రాల్పశాఖమ్ము మహాగమట్లు

ఈ యెత్తుగడ చప్పున మాఱి, మఱి రాఁజి రాఁజి క్రమమ్ముగాఁ జల్లారి యసితమై చనునిటుకామమట్లుగా దిగ జాఱినది. ఈజబ్బులో మఱొక విచిత్రమైన దోష మిదిగో చిత్తగింపుఁడు :—

'ఇటు కామమట్లు'—అఁట 'చను విటుకామమేమో' అని మున్మొదట స్ఫురించినదికాని 'యతి' విటుని అడ్డగించినది. ఇటుక + ఆమము = ఇటుకామమైనది కాఁబోలు! ఆమమేమి స్వామి! మొదటి రెండు కాండములలోనే రెండు మూఁడు పర్యాయము లీ 'ఆమము'రాఁగా 'నల్లమేక—బ్రాహ్మణు'ని కథ జ్ఞప్తికివచ్చి నిఘంటువులు తిరుగవేయవలసి వచ్చినది. ఆమము = రోగము, అపక్వము; ఆవము = కుమ్మరి కుండలులోనగు

నవి కాల్చుట కేర్పరిచినకావు, ఆవాపము. ఒకసారి యైనచో అచ్చుతప్పు అనుకొనవచ్చును. ఇదిగో ఇంకొకచోట :— 'మున్నేయిడినట్టి యామముల యిట్టికలున్'—బాం—48 పే.

వ్యాకీర్ణము

కం. 'భ్రాంతికరంబగు నన్వయ
మెంతయు వ్యాకీర్ణమయ్యె నిడుఁడు తిలకముం,
గుంతలములఁ గాంతకును ల
తాంతంబులు పెరువుఁ డిప్పు డలరు ననంగన్'
(కావ్యాలంకార సంగ్రహము)

తిలకమిడుఁడు; కాంతకు కుంతలముల లతాంతములు పెరువుఁడు—అని యన్వయము. 'తిలకమును—కుంతలములు నిడుఁడు'— అని ఒకానొక భ్రాంతికరమైన అన్వయము కలుగుచున్నది. దీనినే దర్పణ కారాదులు 'అస్థాన పదదోషమ'ని పిలిచిరి. స్థానముగాని స్థానమున పదముసుంచుటలో కల్పవృక్ష కర్త అందెవేసిన చేయి.

''తెలియ రాజర్షి మండలి మౌళి వైదూర్య
మణి సమస్తాధ్యాత్మ మహిత భావ
వర్గ వినిష్కృష్టసార సంవిద్జ్ఞాన
నిభృతమంజూషిక, నిత్య యోగి
జనకునియల్లువాఁడని జానకీభర్తయని
చెప్పఁబడురాముఁ డడవిఁకేగె'
అయోధ్య—254

దేహళీదీపన్యాయముగ ఇందలి విశేషణములు మామ అల్లుండ్ర కిర్వురకును అన్వయింపవచ్చును. 'నిత్యయోగి' యను సన్నిహిత విశేషణమునకు భవత్యర్థకము అనుప్రయుక్తమైనచో 'నిత్యయోగియౌ జనకుని' అని చక్కఁగా అర్థము కుదురును. అట్టి వ్యాకరణపు మెలకువలు పాటింపని ఈ రచనలో 'వ్యాకీర్ణములకు' తరుగే కానరాదు.

సమాప్త పునరాత్తము

కం. 'క్రమముడిగి మగుడఁబూనిన
సమాప్త పున రాత్తమయ్యె; శాశ్వతునభవుం
గమలాక్షుఁ గమలనాభుం
గమలా పతిఁగొల్తు ముక్తికై విభుననఁగన్'
(కావ్యాలంకార సంగ్రహము)

సమాప్తమైనదానిని మఱల తెచ్చుట సమాప్త పునరాత్తమను దోషమగును. కొల్తుముక్తికై, అని వాక్యము సమాప్తముకాఁగా, మఱల 'విభున్' అని విశేషణాంతరము వేయుట దోషములోఁజేరును. యతిప్రాసల కక్కుర్తికై ఈ దోషమును బెక్కుచోట్ల కలవృక్షము స్వీకరించినది. ఇదిగో దిక్సూచి :—

1. 'అశనివచో దురంతకుఁడనాగసుఁబుత్త్రుని బంపెఁగానకున్, బ్రశమిత కాముఁడౌ కొడుకుఁ బండిత సత్తముఁడైన వానినిన్'—అయోధ్య 163.

కానకున్ పుత్త్రుని బంపెనని వ్రాసి నాల్గవచరణములో మఱల రెండు విశేషణములు—కొడుకు, రావలసిన పని యేమి? పుత్త్రుఁడు—కొడుకు, ఒక్కఁడేగదా!ఇట్టి చర్వితచర్వణములకు సమాప్తపునరాత్తమునకు ఈకల్పవృక్షము నిజముగా కల్పవృక్షమే.

2. 'శ్రీ రఘురామచంద్రునకు సేమమె యంచన సేమ మేయనన్, ధారణినేత సేమమటె తండ్రియటన్నను సేమమే యనన్' ధారణీనేత సేమమటె—వాక్యము ముగిసిన పిదప— అయోధ్య—219. అక్కఱలేని తండ్రిపదము వచ్చినది.

3. 'నవమణులున్ ధనంబులు ననంతములై చనునాల మందలున్ గొనకొనియిచ్చె, బ్రాహ్మణులకున్ మృదువాససముల్ మహార్ఘముల్' అయోధ్య—242

బ్రాహ్మణుల కిచ్చెనన్న తరువాత వాసనములు కూడ వచ్చిపడినవి.

వింతసంబోధనములు

విషయమునుబట్టి సార్థకమైన ఒక్క 'పిలుపు' పిలిపించి పాత్రలచే కథ నడపించుట ఉత్తమ కవితా సంప్రదాయము. పద్యములో ప్రాసకోసము యతికొఱకు గణములకయి పాదపూరణార్థమయి పదింబదిగ సంబోధనములు చూపుట కల్పవృక్షసంప్రదాయమయ్యె. ఏదో గొప్పయెత్తుగడలో పెద్ద సమాసముతో సంబోధించి చప్పున దిగజారిపోవుటయు కల్పమునకున్న సంకల్పము.

1. తతమహిమంపుఁ బ్రోవయిన తాత !
వశిష్ఠ ! — బాల 19పేజి
2. తా మమకారమే. . . . . .వాఁడొకెతో
ముని ! నాకు; చీఁకటి — ,, 156
కోణముల్ మునీ ! (నాలుగు పాదములతో రెండు 'మునులు')
3. పోవనెంచెదవేని నో మునిమహేంద్ర !
రానీవెనాథవౌని ! — ,, 156
4. అనిన వశిష్ఠుం డిట్లను మనుజాధిప !
ఇనకులమర్యాద యగునటే యిది — ,, 159
తాతా (వశిష్ఠుఁడు దశరథుని మనుజాధిప ! అనుటలో అందమున్నది. కాని, తాతా ! ఏమిటి ? ఇది తెలుఁగుతాతలోఁజేరునా ! సంస్కృత తాతలోఁ
గలియునా ! — ,, 159
5. దాని వికారమ్ము మేనుదాఁగని రాముం
డైనం దమ్మునిగని లచ్చి ! — ,, 169
లక్ష్మణుని 'లచ్చి' యనుటలో ఏమైన అందముగాని అర్థముగాని ఉన్నదా ! లక్ష్మి—లక్ష్మణశబ్దములకున్న భేదమైన గుర్తింపవలదా! నేఁడు కొందరు బిడ్డలకు 'మధుసూదనరావు' అని పేరుపెట్టుకొని ముద్దుగాభావించి 'మధూ' అనిపిలిచినట్లు. పైగా 'రాముండైనన్' లో 'ఐనన్' ప్రాసకోసమా !

6. ఓ పరమంపువారి ! (ఓ గంగానదీ ! అనుటకు) ,, బాల 193

7. ప్రభు ! ప్రభు ! యోరిమివంటిది ప్రభు! ప్రభు! గుణగణములందు ,, 221
విశ్వామిత్రుని శ్రీరాముఁడు సంబోధించుట. ఈ యామ్రేడిత ప్రభువులు — అధ్యాహారప్రభువులు — పౌనఃపున్య ప్రభువులు కల్పవృక్షములో కొమ కొమ్మకు, రెమ్మ రెమ్మకు వ్రేలాడుచు "యేసు" ప్రభువును జ్ఞప్తి కెలయించుచున్నారు.

8. ఓసి ! యోసి ! యహల్య ! యిట్లొక్కసారి రావె ! ,, 226
(వేసముగట్టి వచ్చిన దేవేంద్రులవారు పిలిచిన పిలుపు)

9. దుష్టధీనివిష్టఘోహో ! (ఇంద్రుని గూర్చి గౌతముఁడన్నమాట) ,, 227

10. ఓయి ! నా ప్రాణనాథ ! శివా ! (శోభనాద్రి గర్భంబు శివునిగూర్చిఅనుట) ,, 234

11. ఓసి ! తేజోభూతమా ! (తేజోభూతమునకు నీచామంత్రణము తగదు) ,, 236

12. బ్రహ్మకొడుకునోయి ! యోయివిశ్వామిత్ర ! యోయి ! ,, 245
అసలు—ఆ కథలో వశిష్ఠుఁడు అనెనో లేదో గాని, ఈ యిరువదవ శతాబ్దిలోని ఈ కల్పవృక్షకర్త విశ్వామిత్రునంత వానిని మూఁడు 'ఓయి'లు వాయిగాఁజేసి పద్యములో పిలిచినాఁడనుట మనము గుర్తింపవలెను.

13. తానును గాధేయుఁ డిదియుఁ దగునటవె ప్రభూ ! ,, 245
వశిష్ఠులవారి కితఁడు 'ఓయి' యా ! ఈతనికి వారు 'ప్రభు'వులా ! ఎంత వింతైన సంబోధనము !

14. ఓయమ్మ కల్మాషి ! నా యగ్నిహోత్రార్థ హవ్యసంపాదనీ ! ఓయమ్మ శబళ ! ,, 245
కూచిపూడి భాగవతులు జ్ఞప్తికి వచ్చుచున్నారు (వైశ్వనాథము ప్రకారము జ్ఞాపకము వచ్చుచున్నా రనవలెను గాఁబోలు !)

15. లంజియా ! యెంతక్రిందికి గుంజినావా ! (బ్రహ్మర్షియైన విశ్వామిత్రులవారినోట కవి సత్రమాట్లు అనిపించిన కమ్మని గీర్వాణము) ,, 269

16. పాదములయందుఁ గొట్టకు వాసుదేవ ! ,, 316
పరశురామావతారము శ్రీరామావతారమును బిలుచునప్పుడు ద్వాపరమందలి కృష్ణావతారము ఎట్లు అవతరించెనో ! 'లక్షణయా'లు అతిదేశములు ఆరోపణలు వ్యంగ్యములు ధ్వనులు బహిరంగోపన్యాసములలో ప్రకటించినఁగాని ఈ 'కాలవిరుద్ధమునకు' విరుగుడు కానరాదు.

17. హీనదోష ! ముక్త్యాల మహీనపోష ! (ముక్త్యాల 'రాజా'గారినిగూర్చి శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు పిలిచిన పిలుపు) అయోధ్య 70

18. కలువ పూమోము రాఘవ ! ,, 78

19. సంస్థాస్వరూప ! (జానకి శ్రీరామునితో అన్నమాట) ఈ సంస్థకు అర్థమేమో! ,, 78

20. శ్రీరాముండునునంతఁ దమ్ముఁగని లక్ష్మి ! యీ వనంబున్. . . . ,, 157
'లక్ష్మి' యన్న తమ్ముఁడు రామున కున్నాఁడన్న మాట నేఁటికి విన్నాము

21. హితతమురాల ! రామజననీ ! ,, 189

22. 'అసిధారావ్రతుఁడైన రాముఁ డిపుడే లారాఁడు తాతా ! సుమంత్ర ! సమూహ్యాఖిలవేత్ర్పారిషద తీర్థా ! మాకుఁ దండ్రీ ! వశిష్ఠ! సరే!' ఔరా ! ఏమి మనోహరమైన సంబోధనములు ! ! ,, 204
కౌసల్యకు సుమంత్రుఁడు 'తాత'యఁట, వశిష్ఠులవారు 'మాకుఁ దండ్రి'యఁట! ఆ నడుమ 'వల్లమాలిన' వేదాంతమును గుమ్మరించెడి పెద్ద సంబుద్ధి. సంబోధనములో 'మాతండ్రీ!' యని వాఙ్మయములో వింటిమిగాని నాకుఁగొడుకా మాకుఁదండ్రీ !' యని ఇంతదనుక వినమును, గానమును.

23. ఓయి యోయి నాయన! నినుఁ జెప్పరెవ్వరును ,, 226
అయ్యో ! నాయనా ! ఈ మాట నీ కెవ్వరు చెప్పలేదా! అన్న భావము

24. అహిత సమస్తజంతుతతి కర్మ పరిపాక సార్వభౌమ ! ,, 247
శ్రోతయైన ముక్త్యాల స్వామికి వక్తయైన 'సత్యకవి' చేసిన సంబోధనము. ఈ సంబుద్ధిలోని సారస్యమును గూర్చి శ్రోతయైన అస్వామి సమక్షమున వక్తయైన ఈ కల్పవృక్షకర్త ఆనాఁడేమని వెల్లడించెనోగాని

తక్కిన శ్రోతలకు మాత్రము ఈ సమాసమున కొక విగ్రహవాక్యముగాని భావముగాని అధ్యాత్మికవిశేషముగాని దురవగాహమని చెప్పక తప్పదు.

25. బిడియంపడి నిక్కము సామి! సామి! ,, 261
గుహుని నోటిమాట. అహో! ఏమి పాత్రౌచిత్యము!! మద్రాసు వీధిలోని అఱవవాని నోటిమాట జ్ఞప్తికి వచ్చును.

26. నా యేలిక! యేడువకే, నీ యెడఁ
బొరపొటుపడితి. ,, 262
కైకయీతనయుఁడు దుఃఖచలితమగు గుండియచేత డస్సినపుడు గుహుఁడు చూపిన 'సానుభూతి'లోని సంబుద్ధి

27. ఓ నాయాదరువ! యోసి! యోసి
సుమిత్రా! ,, 301
ఇది కౌసల్యమాట. ఆదరువఁట! సొగసైన సంబుద్ధి

28. నే నిందుండను బదవయ్యా! నంది
గ్రామమును ,, 333

29. మౌని, యమ్మీ! యెవరో యెఱుం
గుదువె యీ పసిదానిని సీత ,, 359
అది అత్రిమహర్షి యాశ్రమము. వచ్చినవారు సీతారాములు. లోపలనుండి ముసలిది వచ్చెనఁట. పండిన మొక్కజొన్న కణ్డిల తుది పొత్తుల జుత్తు కలదఁట. ఆ వచ్చిన ముసలిదానికి సీతమ్మనుజూపి అత్రిమహర్షులవారు పరిచయము చేయుట. సనాతనాచార సంరక్షకమ్మన్యులైన శ్రీమద్రామాయణ కల్పవృక్ష మహాకావ్యకర్తలు అనసూయమ్మను ముసలిదియనుట ఒకవింత; అపై 'అమ్మీ' యెవరో యెరుంగుదువె అని అత్రి మహర్షిచే అనసూయమ్మను సంబోధింపఁజేయుట ఇంకొక వింత. నాఁటి ఆశ్రమములలోఁగూడ నేఁటి 'అమ్మీ' ఇత్యాదిగ 'అలగా' సంబోధనములు ఉండెడివి కాఁబోలు! లేక కవితలో ఇదియొక 'వాస్తవికత' అందురేమో తచ్ఛిష్య ప్రశిష్యులు!!

30. ఓ వడిలు తపమ! నీదియు సావిత్రి
దరుంధతియు సర్వానేహోభావనికష
ములు నామములు ,, అయోధ్య 360
ఈ సంబుద్ధి—అన్వయ సౌభాగ్యము—భావ సౌందర్యము చిత్తగింపవలెను. 'వడిలు'నకు తెలుఁగులో సరియైన అర్థమును ఇంకను బరిశీలింపవలెను. అది తపస్సునకు విశేషణమైనచో, 'నీదియు'తో అన్వయము కుదురదు. 'గంగాయాంఘోష'హోలె, లేక వంకాయలూ! వంకాయలూ!' అని వంకాయలమ్ముట వానిని పిలిచినట్లు వడిలు తపస్సు గల 'ఓ అనసూయమ్మతల్లీ!' అని అన్వయించుకొనవలెనేమో! సరే! ఆపైని—నీదియు—సావిత్రిది—అరుంధతియు, గణము కుదురదాయె. అచ్చులో వచ్చిన మచ్చకావచ్చు. ఆ పక్షమున, అరుంధతిదియు, నామములు సర్వానేహోభావ నికషములఁట. మీ ముగ్గురి పేరులు చెప్పుకొన్నచో సర్వ పాపములు పరిహారములగునన్న భావము కాఁబోలు!! నీదియు సావిత్రిది. అరుంధతిదియు—ఈ ధోరణి యెంత రోత పుట్టించునో సహృదయులు గుర్తింతురు.

3. ఎంత బంగారు తల్లివె! నీవేమి బెడంగు మాటలె! సుమా శీ
దంత మౌళిద్యుతీ! అయో 361
మొదటి 'బంగారు తల్లివె'లో అందమున్నది. నీవేమి యేమి! స్వామీ! వ్యాకరణమును గోకర్ణక్షేత్రమునకు సాగనంపెడి ఈ 'కల్ప'ములో ఈ గొడవ తడవనేల యందురేమో! అయినను 'విశ్వనాథ వైలక్షణ్యము' గుర్తింపను పాఠకులకే శ్రమ కలిగింపవలసి వచ్చినది 'నీవి—యేమి బెడంగు మాటలె' అని కల్ప వృక్ష కవి వివక్ష. నీవు ఎంత బంగారు తల్లివమ్మా! నీవి యెంత మంచి మాటలమ్మా! అని రావలసిన సొగసైన భావమునకు 'నీవేమి' మాట ప్రాణగొడ్డమయ్యెఁగదా! 'నీవి+ఏమి' ఇట్టి ఇకార సంధిని చక్కఁగా గుర్తింపనేరని ఈ కల్పవృక్షమను 'గొంగడి'లో ఈ తీరు వెంట్రుక లేరవలసి వచ్చినది. మూఁడవ సంబుద్ధిలోని 'మౌళి' కర్థ మేమున్నదో!!

భిన్నకర్తృకము

1. అంత విశ్వామిత్రుండు తక్కిన ఋషులను యథోచితం
బుగ మన్నించి యందఱును గలసి... ఉపవిష్టులైన
బాల—150 పేజి

ఇది రెండు నర పంక్తుల వచనపు ముక్క. ఇందు రెండు కర్తలు మూఁడు సమాపకాసమాపక క్రియలు. విశ్వామిత్రుండు ఋషులను మన్నించి—దీనికి సమాపక క్రియలేదు. ఉపవిష్టలైనవారు—అందఱును,

2. అనిన నందఱును భాగీరథిం దరించి యుత్తరపు–గట్టుచేరి
స్వర్లోకసమమ్ము దివ్యంబు రమ్యంబులైన యొక మహా నగ
రంబుఁగాంచి రామచంద్రుండు బాల—212

తరించినవారు చేరినవారు అందఱునఁట. నగరంబుఁ గాంచినది రామచంద్రుండఁట. ఏఁబది యక్షరముల ఈ చిన్న ముక్కలో ఈ తబ్బిబ్బు ఎందులకో!

3. గంగానదినిగాంచి యందఱును రథంబు డిగ్గి నమస్కరించి
శ్రీరామచంద్రుండు సుమంత్రునితో నిట్లనియె అయో—133

గంగానదిని గాంచినవారు రథంబు డిగ్గినవారు నమస్కరించినవారు అందఱును. ఇట్లనియె—దీనికి కర్త శ్రీరామచంద్రుండు మాత్రమే.

సంస్కృత పదములు

ముప్పాతిక మువ్వీసము సంస్కృతపదములన్నియు తెలుఁగు భాషలో వ్యవహరించుకొనవచ్చును. భవదాదులగు హలంత సర్వనామములును—శత్రురేఫాంతాదులును సరాసరి తెలుఁగునకు రాక సమాసములలోఁ గలసివచ్చును. సర్వదా—సర్వథా వంటివి సకృత్తుగ స్వీకరించిన తెలుఁగు కావ్యము లేక పోలేదు. ఇక—ఈ 'కల్పము'లోనో సంస్కృత క్రియలు—నామవాచకములు—అవ్యయములు—ఆశ్చర్యార్థకములు సంస్కృతమునందు ఉన్నవి యున్నట్లే సరాసరి దిగుమతియైనవి. వాని యందచందములకు అర్హతకు విద్వజ్జనమే ప్రమాణము :—

1. శిరసా చేసిన ప్రణతిగ.	బాల	299
2. ఏకత్రస్థితులకు సీతారాములకు	,,	340
3. శోకమంచనెద వద్ధా	అయోధ్య	28
4. వయసా కడువృద్ధులు	,,	294
5. నీవీయాశ్రయానర్హుండవు ధిక్కష్ట రామచంద్రునితో	,,	319
6. ప్రభు! జాగ్రత! భద్రమయ్యెడన్	,,	342

ఈ జాగ్రత, మన 'జాగ్రత్త'కాదు. 'తస్మాత్ జాగ్రత జాగ్రత'వంటి సంస్కృత జాగ్రత

7. రే! మృజావథమునెంచితి దృప్తిమతీ!	,,	351

ఈ 'రే' తెలుఁగు 'రే' కాదు. 'రేరే ఘూర్జర' వంటి గీర్వాణము 'రే'. బెంగాలీ 'రే' కాదు.

8. నీచేత వినాగ	,,	353

ఇవి యన్నియు ఒక యెత్తు. ఇదిగో ఈ సంస్కృత క్రియా రూపము ఒక యెత్తు.

9. పరమేశా! భుంక్ష్వ సత్కృపావారాశి	,,	301

రా శి శ బ్ద ము

రశ్మి—రాశి—పరదేశి—పేశి—ఇత్యాది శవర్ణ పూర్వ కేకారాంతములకు బహువచనము చేర్చినపుడు వాని 'శ' వర్ణము 'స' వర్ణ మగునని తెలుఁగులో ఒక రిర్వురు వ్యాఖ్యాతలు వ్రాసిరి. వారి పద్ధతిలో 'రస్ములు—రాసులు—పరదేసులు—పేసులు, ఇత్యాదిగ రూపములు సిద్ధించును. కాని, వీనికి కవి ప్రయోగసమ్మతిగాని ప్రామాణిక వైయాకరణిక సిద్ధాంతముగాని ఆధారములేదు. తెలుఁగు నిఘంటువులలో సైతము 'రాసి' ఇత్యాదులు వైకృతములని చూపిరి. శవర్ణము సవర్ణ మగుటయే నిజమైననాఁడు 'గతాశః—అశ్రయాశః—జితాశః ఇత్యాదులకు తెలుఁగు బహువచన రూపములు 'గతాసులు—అశ్రయాసులు—జితాసులు' ఇత్యాద్యనిష్టరూపములు కావలసి వచ్చును. కావున 'రాశి—రాశులు; కార్యదర్శి—కార్యదర్శులు; పరదేశి పరదేశులు' ఇత్యాది రూపములే శాస్త్ర సమ్మతము లనవలెను. రాశికి వికృతిగా 'రాసులు' అగుటలో ఆక్షేపము ేను. ఈ సంప్రదాయ మెరుఁగని కల్పవృక్షము అంధ పరం ా వాడినరూపము లివిగో! చూడుఁడు :—

1. మహాతేజో రాసులఁ బిల్వఁబంపవలె	బాల	46పేజి
2. సూపరాసులు గంధమ్ముతీసినట్లు	,,	57
3. భాగ్యరాసులఁ బొగడికల్ పట్టుచుండ	,,	106
4. సరమారూఢముదంబురాసులై	,,	223
5. గుణరత్నాంభోరాసులు	,,	327
6. మల్లికారాసుల్	,,	328
7. సంతోష జలరాసులగుచు	అయోధ్య	44
8. కృపావారాసుల్ చనుదెండు	,,	274

లోకములో కొందఱకు కొన్ని వస్తువులు ఆప్యాయమగు నట్టులు కొందఱ కవులకు కొన్ని కొన్ని పదములు ఇంపితముగా నుండును. 'చేని పంటలు కొయ్యలే చెప్పఁగాదె' అని శ్రీనాథుఁడు చెప్పినట్లు ఆకవి ప్రేమించి అభిమానించి ప్రయోగించుకొన్న ఆ పదముల అందచందములను బట్టియే తత్కవితాసౌభాగ్యము సైతము మ న కు స్ఫురించుచుండును. కల్పవృక్షకర్త అత్యంతము ప్రేమించి అల్లారుముద్దుగ పదింబదిగ వ్యవహరించుకొను పదములు కొన్ని ఉదాహరించి ప్రకృత మీ భాగమును జాలింతును :—

1. తనుకు 2. కోసలు 3. లాన్—లాసు 4 సద్దము 5. చముపు 6. మనిసులు 7. రంహః 8. విధా 9 సముల 10 అహో 11 శ్రీ 12 నీవుగాని 13 ప్రభు! ప్రభు! 14 పైనను (పైని) 15 గల్ల 16 వనీ (వన) 17 కరళ్ళ 18 ఇరమ్మద 19 కొంపతీసి—ఇత్యాదులు.

ఈ 'కల్పమున' బాలాయోధ్యలు రెండింటిలో మాత్రమే దిక్సూచిగ తెలిపిన అంశము లివి. రసాపకర్షకములైన కావ్య దోషములను మాత్రమే రవ్వంతగ ఇందుఁజూపితిని. కుంటితనము గ్రుడ్డితనము దేహమునకు రోఁత కలిగించి తన్మూలమున ఆ వ్యక్తికున్న సౌందర్యమును మాటు వఱుచునట్లు కావ్య శరీరములో సైతము ఈ చూపిన దోషము లన్నియు వికారమును బుట్టించి కావ్యమునకు ఆత్మభూతమైన రసమును బగ్గము పాడుచేయును. శాస్త్రవేత్తయయిన కవీశ్వరుఁడు పదములో పదాంశములో వాక్యములో అర్థములో రసములో ఇట్టి దోషములు పొరయకుండ కనుగలిగి కావ్యమును గాపాడుకొనును. కావ్యమనఁగా ఇన్ని పద్యములు—ఇంత గద్యము మాత్రమేగాదు. శబ్దశాస్త్రమును జదివి కవిసమయమును బాటించి రసమును పోషించుచు నిర్మించు కావ్యమే మహా కావ్యము. అట్టి కావ్యమును మనకిచ్చువాఁడే మహాకవి. తాను వ్రాసిన కావ్యములో సారస్యమిదియని ఊరూర—వాడ వాడల ప్రచారము చేయవలసిన దుర్గతి మహా కవులకు పట్టదు. నేను వ్రాసినదే నిజమనియు నా పోకడలు గుర్తింపఁగలవారు నావంటి వారెవ్వరో నూటికి కోటికి ఎక్కడనో ఎప్పుడో అవతరింతురని ఎంచుటయు సత్కావ్యకర్తకు లక్షణముగాదు. ఇప్పటి కిది చాలును.

"తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన
స్యాద్వపు స్సుందర మపి శ్విత్రేణైకేన దుర్భగమ్'

మేఘమెక్కడుమిగిలెను మింటు నింటు

శ్రీ మానాప్రగడ శేషశాయి

తెలిపూల నవ్వులు చిలుకుచు నేతీవ
కదలిన నూర్వశి కానుపించు
కొనగోటి తా కెఱుంగని ఏకిసాల
యమును చూచినను మునితనయ తోచు
మింట నే మేఘమ్ము మెదలిన జెలి,
బాసి శోకించు దీనయక్షుండు తోచు
హేలాభినయలీల నే బాల జూచిన
లాలిత్యమధుర మాళవిక తోచు

నెచటచూచిన నీయూహలే కనబడు,
నెచటచూచిన నీశబ్దమే వినబడు
కాళిదాస మయమ్మయి కానుపించు
జగతి సర్వమ్ము! నీ కళా సదనమేమొ?

నీవు నగాధిరాజువలె నిల్తువు నీ కవితా సమున్నతిన్
భావుకలోకమందు; ఋషిపాదములంటిన కావ్యమాధురుల్
పావనజాహ్నవీ సలిలభంగ మనోజ్ఞములై, భవద్యశః
శ్రీ వినయాది కమ్మలను, చెప్పక చెప్పెడు నో మహాకవీ!

నిత్య నవీనముల్, రసధునీ! సరసైక నిషేవ్యమాణసా
హిత్యనిధుల్ త్వదీయము: లహీనవచోవిభవాభిరాముముల్
స్తుత్య పురాణసత్య శివసుందరముల్ సకల ప్రపంచ సా
హిత్యజలేజ భాస్కరము లెవ్వరు నీకు సముల్ మహాకవీ!

నలినము, చక్రవాకమిథునంబులు, మావిచిగుళ్ళు మత్తకో
కిలకలకూజితం బలిపికీశుకనాదములే, అపూర్వమం
జుల పరమార్థబోధన వినూత్నములై, నినుమేలుకొల్పి, తే
నెలచవులూరు మేల్కవిత నిన్ పలికింపగజేసె సత్కవీ!

విరహమునందు జీవిపడు వేదన నిగ్గరగించి కావ్యమై
విరిసిన దేమొ! జాతి కనువిప్పులు నీమధురోహ మార్గముల్;
సరస హృదంతరాంతర విలాస విభిన్న విచిత్రభావమం
దిరములు, తేట వెన్నెలలు, నీ కమనీయ కృతుల్ మహాకవీ!

జీవి నిరంత రోల్లసన శీలుడు; ప్రేముడి వానినై జహా
భావము; దానికింత ఎడబాటు సహింప, డటన్న విశ్వశో
భావహ సత్యమెల్లర కుపాస్య మొనర్పఁ దలంచి, దూతగా
జీవనదాత నెన్ని విరచించితివా కృతి శాశ్వతంబుగా!

హారశిరశ్చంద్రికా పరిధౌత హర్మ్యమా
"అలక" కన్పడదు కన్నులకు నేడు!
సుతనిర్విశేషవర్ధిత పుష్పసంభార
నమిత మందార మీనాడు లేదు!
వాపీ సువర్ణాబ్జపాళీవిలాస సం
చరణ మానసహంసచయము లేదు!
వాసయష్టినిబద్ధ వరమణీమయపీఠ
మధివసించిన నెమ్మి యరిది నేడు!

పంజరశుకమ్ముతో ప్రియభాషలాడు
శీర్ణకుంతల, దీనయక్షిణియు లేదు!
విద్యుదుజ్జ్వల భావనా విశదమైన
మేఘు డొక్కడు మిగిలెను మింట, నింట!

మన చిత్రకళ పరిస్థితి

శ్రీ యస్. వి. రామారావు

నేటి ఆంధ్రులకు లలితకళలకన్న సినిమా, రాజకీయా లంటే అభిలాష ఎక్కువ అని ఎందరో అనగా విన్నాను. ఎంత ఆలోచించినా ఇందులో సత్యం కనిపిస్తూనేఉంది. తెలుగువారిధనం ఎన్నికోట్లు మద్రాసుకు తరలివస్తున్నదో సినిమా ప్రపంచంలోకి ! శాసన సభలు, పురపాలక సంఘాలు, పంచాయతీల ఎన్నికలకు గుమ్మరించే ధనం లెక్క కట్టిచూస్తే ఈ పరమసత్యం బయటపడుతుంది. ధనాశ, కీర్తిదాహాలకు దారితీసే ఈ రెండూ బాగా ఆకర్షించాయి మన యువకుల్ని. ఈ మార్గాలనుండి మరలడానికి ఎంతకాలం పడుతుందో మరి. అయినా ఇలాగ ఎంతోకాలం సాగదు. తప్ప కుండా ఆంధ్రులలో అంతర్గతమైఉన్న రసజ్ఞత, కళారాధన మరల విజృంభిస్తాయి.



పూజారిణులు

శ్రీ వేలూరి రాధాకృష్ణ

నిజానికి ఆనాటి ఆంధ్రులకు శిల్ప చిత్రకళలంటే ఎంత ప్రేమో, లేపాక్షి, అజంతా, అమరావతి, నాగార్జునకొండ, గోలి, సాంచి చెపుతాయి బలంగా. ఆంధ్రత్వము నూటికి నూరు పాళ్లు నిండిన మన చిత్ర శిల్ప కళలలోని సునిశిత మయినపనితనం, సోయగం, లావణ్యం, రంగుల పొందిక, ఉన్నతభావాలు అమరత్వం పొందాయి వీనిలో. ఎందువల్ల ? ఈ ప్రశ్న వేసుకుంటే తెలుస్తుంది నేటి చిత్రకళ దుస్థితి. కళల ఔన్నత్యాన్ని, వాటి పూర్ణసృజనాత్మక రూపంలో చూచి ఆనందించగల రసజ్ఞత నాటి ప్రజలలో, ప్రభువులలో ఉండేది. ఆనాటి సంపన్నులు తమ ఇండ్ల గోడలపై చిత్రాలు వ్రాయించుకునేవారు. అంత ఆదరణ ఉన్నందువల్లనే లోక ప్రసిద్ధిపొంది, కాలానికి నిలువ గల్గినంతటి ఉన్నత కళ ప్రదర్శించారు తెలుగువారు. కళలలో ఆసక్తిలేని మనస్తత్వంగల నేటి తెలుగుప్రజల మధ్య సృజ నాత్మక చిత్రకళ ఎలా రాణిస్తుంది ? మూసిపోయిన మాచెర్ల కళాకేంద్రము, మచిలీపట్నం జాతీయ కళాశాల చిత్రకళా విభాగాలే నిదర్శనాలు మనవారి కళాభిలాషకు! కలాభిమానులకు ఇంతకంటే విచారకరమైన విషయం మరొకటి వుండదు.

ఆంగ్లేయ ప్రభావం

మన కళాతృష్ణ యిలా యిగిరిపోవడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. బ్రిటిషు పరిపాలన వచ్చిన నాటినుండి మన దృష్టి, ధ్యాస మరో ప్రపంచంవైపు మరలింది. మొక్క అసలు స్థానంనుండి పెరకబడి మరోక్రొత్తచోట, క్రొత్త గాలి పీలుస్తూ విభిన్నంగా పెరిగినట్లు ఇంగ్లీషువారి భాష, పద్ధతులు, భౌతికవాదం మనవారి నింకొక వేరుదారిలో ఆకర్షించాయి. ఏదైనా క్రొత్తది కన్పిస్తేచాలు ముందుగా స్వీకరించే మనస్తత్వం మన తెలుగువారిది. దక్షిణాదిన బౌద్ధమతం, బౌద్ధ కళ అమరత్వం పొందింది ఆంధ్రదేశంలోనే. బ్రహ్మ సమాజ మతాన్ని స్వీకరించింది మన తెలుగువారే. స్వదేశోద్యమంలో ముందడుగు మనదే. దీనివల్ల ఎంతో మంచీ, చెడూ రెండూ ఎదురయ్యాయి. ముఖ్యంగా చిత్రలేఖనాన్ని దృష్టిలో పెట్టుకొని తెలుగు ప్రజలలో కలిగిన మార్పును ఇక్కడ కొంత వివ రిస్తాను.

ఉదాహరణకు మన ప్రజలలో కీ. శే. రాజా రవివర్మ, కనూ దేశాయిల చిత్రాలు ఎంతగా హత్తుకుపోయి కదలక

నిలచిపోయినాయో చెపుతాను. వీరి తరువాత ఎంతోమంది చిత్రకారులు ప్రశంసాపూర్వకమైన కృషి చేశారు. ఎన్నో రకాల కళా ధోరణు లుద్భవించాయి. ఎంతో ముందుకుపోయింది నేటి భారతీయుల చిత్రకళ. కాని మన ప్రజలు యింకా రవి వర్మ, కనూ దేశాయిల మత్తులోనే వున్నారు. అసలు వీరికి చిత్రకళపై విభిన్నాభిప్రాయా లున్నాయి.

ర వి వ ర్మ

రాజపుత్ర, మొగలాయి చిత్రకళ ఔన్నత్యాన్ని, దేశీయ తను మరిచిన మనకు రవివర్మ చిత్రాలు ఒక్కసారి మిరుమిట్లు గొల్పాయి. ఆయన చిత్రకళ ఒక తుఫాను. అతని విజృంభణ నిరాఘాటంగా ప్రజల్లో చొచ్చుకుపోయింది. కొత్త చిత్ర కళ కావడం, అతని కాలంలో మరో పెద్ద చిత్రకారుడు లేక పోవడం, ఆబాలగోపాలానికి సులువుగా తెలిసేటట్లు సున్నగా చిత్రించడంవల్ల బాగా ఆకర్షణ పెరిగింది. దైవభక్తి, పుణ్యం, పురుషార్థం ఎక్కువగనున్న ఆనాటి ప్రజలకు అయన చిత్రించిన లక్ష్మి, సరస్వతి, శకుంతల మొదలగు చిత్రాలు ఎంత నచ్చుతాయో వూహించవచ్చును. రవివర్మ తమ చిత్రా లను జర్మనీలో అతి జాగ్రత్తగా ప్రింటు చేయించి తెప్పించే వారట. మైసూరు మహారాజా ప్రాపకం ఆయన కీర్తికి ఎంతో దోహదం కలిగించింది. ఒకందుకు రవివర్మను మెచ్చుకోవాలి. నిద్రాణమై ఉన్న జాతిలో ఒక్కసారి పిడుగులా అలజడితెచ్చి చిత్రకళవైపు ప్రజలను మరలించాడు. ఆ విధంగా ఆయన చిరస్మరణీయుడు. కాని ప్రజల్లోఉన్న పేరునుబట్టి ఏ చిత్రకారుని శక్తి నిర్ణయించలేరు. ప్రజలకు నచ్చేవిధంగా వేసిన క్యాలండర్లను, సినిమా బ్యానర్లను కళాఖండాలనలేము. భావాన్ని ఏవిధంగా చిత్రకారుడు రంగుల రూపంలో ప్రద ర్శిస్తున్నాడు అనేది అతని కళానైపుణ్యాన్నిబట్టి భావ విస్తృతినిబట్టి, సాధనను బట్టి ధ్వనిస్తుంది. ఇవి నిర్ణయించ వలసినవారు మామూలు ప్రజలుగాదు. చిత్రకళా మర్మములను ఎరిగిన విమర్శకులు, చిత్రకళలో సాధన చేస్తున్న చిత్రకారులు. ఈవిధంగాచూస్తే రవివర్మకు సృజనాత్మక చిత్రకారులస్థాయిలో చోటులేదు. ఆయన పాశ్చాత్య పద్ధతిలో నూటికి నూర్లు పాళ్లు చిత్రించినా ఆ చిత్రాలు పాశ్చాత్యుల చిత్రాలముందు దిగదుడుపు. రసజ్ఞత, కళాపటిమ లేని చిత్రకారుడని చాల మంది విమర్శకుల, చిత్రకారుల అభిప్రాయం. నేను తిరు వేంద్రం స్టేటుగ్యాలరీలోను, మద్రాసులోను రవివర్మ చిత్రాలు అనేకం చూశాను. ఆయన చిత్రాలలో రంగులలో మార్దవం లేదని పిస్తుంది. రంగుల మిశ్రణంలో అవి తమ సహజ కాంతిని కోల్పోయి మడ్డిగా తయారయినాయనిపిస్తుంది. ఇది నా స్వంత అభిప్రాయం. ఢిల్లీలో కీ. శే. అమృతషెహర్‌గిల్ చిత్రాలు చూచాను. స్తబ్ధుడనైనాను. ఆమె వాడిన విధానం రంగు లకు లేనిజీవాన్ని తెచ్చింది. ఆమె చిత్రాలు ప్రముఖ విదేశీ చిత్రకారుల ఏ చిత్రాలతోనైనాసరే తులతూగగలవు. ఒక ముఖ్య



దారిప్రక్క దుకాణం
శ్రీ మా. గోఖలే

విశేషమేమంటే పూర్తిగా పాశ్చాత్య పద్ధతిలో చిత్రించినా ఆమె భారతీయుల స్వభావాలను, అంతర్యాన్ని గ్రహించి వ్యక్తపర చింది తన చిత్రాలలో. అందుకే ఆచిత్రాలు చూస్తూంటే మనం మనవాళ్ళమధ్య వున్నట్లు భావిస్తాము. ఆ చిత్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ఆమె చిత్రాలు చూచినవారు, చిత్రాల విమర్శకులు అందరు మెచ్చుకున్నారేగాని వేరే ఇతరాభిప్రాయాలు వెలిబుచ్చలేదు. శ్రీమతి షేర్‌గిల్ చిత్రాలు చిత్రకారులకు, విమర్శకులకు కనుల పండుగలు. భారతప్రభుత్వం దాదాపు ఆమె చిత్రాల నన్నిటిని కొని దేశ ప్రజలందరు సదా చూచే అవకాశం కలుగచేసింది. రవివర్మ, షెహర్‌గిల్ ఇద్దరు పాశ్చాత్య పద్ధతులలో చిత్రించినవారే. వారివారి చిత్రాల విలువ అంత విరుద్ధంగా ఎందుకు వుంది ? ఇదే చిత్రకారుల పూర్ణత్వానికి నిదర్శనం. మరోమాట లనకుండా భారతీయు లందరు ఏకగ్రీవంగా అమృతషెహర్‌గిల్ చిత్రాలను వుత్తమ కళాఖండాలంటారు ఎల్లప్పుడూ. అవి కాలానికి నిలిచేవి. కాని రవివర్మ చిత్రాలు ప్రతి తెలుగువారింట పూజలందు కొన్నాయి. దానితో ఏ చిత్రాన్నయినా రవివర్మ చిత్రాలతో పోల్చిచూడడానికి అలవాటు పడ్డారు మనవాళ్ళు. ఇది అయిన తరువాత మరొక క్రొత్తగాలి బలంగా వీచింది.

వంగ చిత్రకారులు

బెంగాలీ చిత్రకారులు అవనీంద్రనాథ్ ఠాగూర్ గురుత్వాన చిత్ర రచన దేశీయపద్ధతిని సాగించారు. హేవెల్, పెర్సీబ్రౌన్, అనందకుమారస్వామి ఒక్కసారిగా భారతీయ చిత్రాల నిజ స్వరూపాన్ని, ఔన్నత్యాన్ని తెలియజెప్పి విశేషంగా ప్రచారం చేశారు. స్వాతంత్ర్య సమర రంగంలో అంతకుముందే ముందడుగు వేసిన ఆంధ్రులాపైన తటాలున బెంగాలీ చిత్ర కళ స్వీకరించారు. బందరు జాతీయ కళాశాల ప్రమోదకుమార్ చటర్జీ గురుత్వాన ఎంతోమంది సృజనాత్మక చిత్రకారులను తయారు చేసింది. ఆ చిత్రాలలో తెలుగుతనం తొణికిసలాడేది. "భారతి" పత్రిక త్రివర్ణ చిత్రాలు ప్రచురించి తెలుగువారికి చిత్రకళలో అభిరుచిని ఎంతగానో యినుమడింపచేసింది. జాతీయ కళాశాల, శాంతినికేతనము ఎంతోమంది తెలుగు ప్రముఖ చిత్రకారులను తయారు చేశాయి. వీరందరు జాతీయభావాలు గలవారు. ఎంతో కృషి చేశారు. నిత్య జీవితాన్ని ప్రతిబింబింపజేశారు తమ చిత్రాలలో. ఈ విధంగా కొంతకాలం సాగింది మన చిత్రకళ. జాతి మరల మేల్కొన్నది.

దేశీయ చిత్రకళయందు అభిమానం వుండవచ్చుగాని విదేశీ చిత్రకళను విసర్జించరాదు. క్షణ క్షణం మారుతున్న ఈ ప్రపంచం ఎంతో దగ్గరవుతున్నది. ఉన్నకొద్ది ఎన్నో విషయాలు మనం ఇతరులనుండి నేర్చుకొంటున్నాము. ఈ యాంత్రిక యుగంలో ఏవొక్కదేశం యితర దేశపు అవసరం లేకుండ మనలేదు. చుట్టుపక్కలఉన్న దేశాల్లో ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలి. మంచివుంటే తప్పక గ్రహించాలి. అన్ని రంగాలలో మాదిరిగాక మన చిత్రకారులు గూడ విదేశీ చిత్రకారులతో పోటీపడి కృషి చేస్తున్నారు. పశ్చిమదేశాలలో పుట్టిన అధునిక చిత్ర కళ ఒక ప్రళయాన్ని లేపింది. నేడు అన్ని దేశాలలోను ఆధునిక చిత్రకళలో కృషి చేస్తున్నారు. అతి తీవ్ర భావాలను వ్యక్తపరచడానికి ఈ కళ ఎంతో వుపకరిస్తుంది. "పికాసో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "గుర్నికా" చిత్రంలో యుద్ధం విలయతాండవాన్ని అతి ప్రతిభావంతంగా చిత్రీకరించాడు. అంత ఉద్రేకపూరితంగా, భావయుక్తంగా రణ భీభత్సాన్ని సృష్టించడం ఆధునిక చిత్రకళలోనే వీలుపడింది ఆ చిత్రకారుడికి. ఇలాంటివి ఎన్నో ప్రసిద్ధ చిత్రములు చిత్రించారు, రక రకాల పద్ధతుల్లో ఎందరో చిత్రకారులు. ఎందరో తెలుగు చిత్రకారులు ఆధునాతన చిత్రకళా రీతుల్లో కృషి చేస్తున్నారు. అయినా ఈ చిత్రకారులు, ఈ వద్ధతులు, వీటి వల్ల వ్యక్తమయ్యే భావాలు తెలుగు ప్రజలకు దూరంగానే వున్నాయి. తెలుగు ప్రజలస్థాయి యింకా రవివర్మ, జాతీయ



శరత్తరంగిణి

శ్రీ సంజీవదేవ్



విహంగంతో మహిళ

శ్రీ యస్. వి. రామారావు

కళాశాల, కనూదేశాయి చిత్రకారుల స్థాయిలోనే వుంది. మరొక విషయం.

ఒక ప్రసిద్ధ తెలుగు రచయిత యింట్లో నేను కనూదేశాయి చిత్రాల అల్బమ్ చూశాను. అయితే కళంటే అచ్చం అలా వుండాలని, అంతటి భావౌన్నత్యంగల చిత్రకారులు అరుదనిచెప్పి ప్రతి చిత్రకారుని చిత్రాల్ని వాటితో పోల్చడం నాకు విచారం కలిగించింది, ఇంత విజ్ఞానవంతులకు యింత తక్కువ అభిరుచి చిత్రకళలో వున్నందుకు. నిజానికి కనూదేశాయి చిత్రాలు రేఖామార్దవంలో, లేత రంగుల్లో చూడ ముచ్చటగా వుంటాయి. ఈయన చిత్రాలు ఆబాలగోపాలానికి సులువుగ అర్థం అవుతాయి. నిత్య జీవిత ఘట్టాలను, స్త్రీల లోని నాజూకుతనాన్ని, భావ చిత్రాల్ని ఎన్నో వయ్యారాలతో వంపులతో చిత్రిస్తాడు అందంగా. కాని నందలాల్‌బోసు, రెహమాన్ చౌగతాయ్, గుర్రం మల్లయ్యగార్ల చిత్రాలముందు నిలువగలవా? వారి చిత్రాలముందు కనూదేశాయి చిత్రాలు ఎంతో పేలవంగా వుంటాయి. పవకగా ఎక్కువ చిత్రాల ఆల్బమ్‌లు ప్రింట్ చేసినందువల్ల ప్రజలలోకి ఎక్కువగా వచ్చాయి అతని చిత్రాలు. ఒకరిని ఒకరితో పోల్చిచూడడమే నా ముఖ్యోద్దేశం గాదు. ఎంతోమంది ప్రజ్ఞగల చిత్రకారు లుంటే వీరందరిని గుర్తించక వేరొకరిచిత్రాలనే అంటి పెట్టుకొనివున్న ప్రజకు, ఎవరు ఎంత గొప్పో చూచాయగా తెలియచెప్పడం నా వుద్దేశ్యం. వివిధ చిత్రకారులు చిత్రించే పద్ధతులు బాగా అవగాహన కావడానికి, విరివిగా చిత్రకళా ప్రదర్శనలు చూడడం, విమర్శకుల చిత్రకారుల అభిప్రాయాలు తెలిసికోవడం చాలా లవసరం. అప్పుడు ఏ చిత్రకారులు సృజనాత్మక చిత్రకారులో ప్రజలే గ్రహిస్తారు. ఈ విషయంలో ముఖ్యంగా ఆంధ్రులు ఉత్తరాదివారికన్నా చాలా వెనుకబడి ఉన్నారు. అజంతా, రాజపుత్ర, మొగలాయి దక్కనీ శైలుల చిత్రాలు, లేపాక్షి, శాంతినికేతన పద్ధతి చిత్రాలు, బందరు జాతీయకళాశాలలో అభివృద్ధిఅయిన చిత్రపద్ధతులు క్రీ. శే. దామెర్ల రామారావుగారి చిత్రశైలి, పాశ్చాత్య పద్ధతిలో వేసిన వాస్తవ రూప చిత్రణలు, యిప్పుడు వస్తున్న ఆధునిక చిత్ర కళారీతులు, ప్రజలకు కొద్దిగానైనా తెలిసిన నాడు వారే ఏవి చవకబారు చిత్రాలో గ్రహించగలరు. దీనికి ముఖ్యంగా మన చిత్రకళా విమర్శకులు ఎంతైనా కృషి చెయ్య వలసి ఉన్నది. ఇప్పుడు చాలమంది ప్రముఖులు శ్రద్ధ తీసు కొంటున్నారు. కాని యిది చాలదు.

పాశ్చాత్యదేశాలు : చిత్రకళ

పాశ్చాత్య దేశాల్లో ఎన్నో విశ్వ విద్యాలయాలలో చిత్ర కళ ప్రత్యేకంగా నేర్పబడుచున్నది. విద్యార్థులు చదివే పాఠ్య గ్రంధాలలో చిత్రకళకు గూడ ప్రాముఖ్యత ఉన్నది. యూనివర్శిటీ విద్య పూర్తిఅయ్యేవరకు చిత్రకళ గురించి తెలుసుకుంటూనేవుంటారు. అందువల్లనే ప్రజలకు అక్కడ చిత్ర, శిల్ప కళలందు అభిరుచి మెండు. ప్రతియింట్లో ఒకటో రెండో చిత్రాలు వుంటాయట చిత్రకారుల వద్దనుండి కొన్నవి. అంటే చిత్రకారుని స్థితి ఇక్కడికంటె ఎంత మెరుగో బాగా అర్థం అవుతుంది. అక్కడ యూనివర్శిటీలు ఎంతో విలువైన చిత్ర శిల్ప కళలపై వచ్చే గ్రంథాలకు ధన సహాయం చేస్తాయి. యూనివర్శిటీలు ఎన్నో కళాఖండాలను కొని స్వంత అర్ట్‌గ్యాలరీలను ఏర్పాటుచేసి మ్యూజియములు, యితర ఆర్ట్‌గ్యాలరీలతో పోటీపడతాయి. పెద్ద చిత్రకారులకు పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలుయిచ్చి సహాయపడతాయి. స్కాలరుషిప్పులిచ్చి యితర దేశ విద్యార్థులకు ఆ యూనివర్శిటీలలో చదివి నేర్చుకునే అవకాశం కల్గిస్తాయి. ప్రముఖ విదేశీయ చిత్ర కళా విమర్శకులను పిలిచి తరచుగా

మన చిత్రకళ పరిస్థితి

కళలపై ఉపన్యాసాలిప్పించి, అవి పుస్తకరూపాన ప్రకటిస్తాయి. మన విశ్వ విద్యాలయాలు తలుచుకుంటే కళాభివృద్ధికి ఎంతో సహాయపడవచ్చును. ఈ విషయంలో మన రాష్ట్రంలోని మూడు ప్రముఖ విశ్వ విద్యాలయాలు కొంతైనా శ్రద్ధతీసుకొని ముందడుగు వేయాలని ప్రతి కళాభిమాని ఉద్దేశ్యం. అవి ఖర్చుపెట్టే డబ్బులో వీటిక్రింద అయేది ఏమంత లెక్కలో ఉండదు. మన యూనివర్శిటీలు చిత్రకళకు కనీసం యివ్వవలిసిన ప్రాధాన్యతయిచ్చి వస్తున్న యువతరం విద్యార్థులనైనా కళను ఆనందించేవిధంగా తయారు చెయ్యడం తమ విధిగా భావించాలి. దేశ గౌరవం శతాబ్దాలుగ నిలచేది కళాభివృద్ధి వలననే. ఈజిప్టు అంటే పిరమిడ్లు జ్ఞాపకం వస్తాయి. రోమ్ అంటే శిల్పాలు జ్ఞాపకం వస్తాయి. అలాగే మన దేశ సంస్కృతికి చిహ్నాలుగా నిలిచినవి అజంతా, తాజమహల్, ఎల్లోరా, ఎలిఫెంటా, అమరావతి, నాగార్జునకొండ, కోణార్క్, కుజురహో, మౌంట్ ఆబూ, హలిబీడ్, రాజపుత్ర, మొగలి, దక్కనీ చిత్రశిల్పకళలే,

ప్రసిద్ధ చిత్రకారులు ఎంతోమంది వున్నారు ఆంధ్ర దేశంలో. ఒక్కసారి వీరందరు నడుంకట్టి ప్రదర్శనాలు తరచుగా ఏర్పాటుచేసి, పత్రికా ముఖాన చిత్రకళపై వ్యాసాలను, చిత్రాలను ప్రచురించి ఉత్తేజాన్ని కలుగజేస్తే మన తెలుగుజాతి మేలుకుంటుంది. చిత్రకళకు మరలా ఒక నూత్న శకం ఆరంభం అవుతుంది. అది చెయ్యడానికి కళాభిమానులు, ప్రభుత్వం ఎంతో చేయూత నివ్వాలి. నిన్నగాక మొన్న ఉద్భవించిన ప్రభుత్వ లలిత కళ ఎకాడమీ ప్రభుత్వ సహకారాన్ని పూర్తిగ పొందగలదని భావిద్దాం.

మన లలితకళా అకాడమీ

ఎందువల్లనో మన లలితకళా ఎకాడమి అంత సంతృప్తికరంగాలేదు. ఇందలి సభ్యులను చూచి చాలమంది నిరుత్సాహపడ్డారు. ఇందులో సభ్యులు అసమర్థులనిగాదు, సమర్థులైనవారిని చాలమందిని వదలివేశారని. ఏవిధంగా ఈ సభ్యుల నిర్ణయం జరిగిందో ఎవరెవరి సలహాలతో సభ్యులుగా వారిని ఎన్నుకున్నారో ప్రభుత్వానికి, బహుశః ఆ సభ్యులకు తప్ప మరెవరికి తెలియదు. సభ్యులుగా ఉండడానికి ఏ ఏ అర్హతలు వుండాలో సభ్యుల పేర్లను చూచిన తరువాత అర్థం కాలేదు. సహజంగా చిత్ర, శిల్ప కళల్లో బాగా తెలిసిన వారిని, చిత్రకారులు గానీయండి, విమర్శకులు గానీయండి మరెవరైనా గానీయండి ఏకాడమీలో సభ్యులుగా వెయ్యడం జరుగుతుంది. ఇందలి ఇతర సభ్యుల ఎన్నిక వీరు చిత్రకారులో, విమర్శకులో, మరెవరో గూడా తెలియని పరిస్థితుల్లో జరిగింది. ఏ విశేషంవల్ల వారిని లలిత కళా ఎకాడమీలో సభ్యులుగ ఎన్నుకున్నది తెలియలేదు. ఇది నిజం. ఇద్దరు ముగ్గురు సభ్యులు నన్ను మిగిలిన మెంబర్లలో కొంతమందినిగురించి అడిగారు, వారు చిత్రకారులా? విమర్శకులా? ఎవరని. పేర్లు వినడం గూడ అదే మొదటిసారి. మన ప్రభుత్వ లలిత కళా ఎకాడమీనిగురించి ప్రచురింపబడిన విషయం (28 — 5 — 1961) లింక్ పత్రికలో చదివితే సిగ్గుపడవలసి వస్తుంది! ఇంతకాలం ఏదో బ్రహ్మాండంగా వెలువడుతుంది ఎకాడమీ అనుకొని కండ్లు కాయలుకాచి, ఎదురు చూచిన వారికి ఆశాభంగం అయింది. విచిత్రమే మరి. సహృదయులు, ఎంతో జ్ఞానసంపన్నులు, కళా విషయాలలో అపారమైన అనుభవమున్నవారు, కేంద్ర లలిత కళా ఎకాడమీలో సభ్యులు అయిన శ్రీ యం. ఆర్. అప్పారావు గారు, ఆంధ్రులు గర్వంగా చెప్పుకునే విఖ్యాత చిత్రకారులు శ్రీ కె. శ్రీనివాసులుగారు, ప్రముఖ రచయితగా, చిత్రకారులుగా ఎంతో పేరుపొందిన శ్రీ గోఖలేగారు ఎకాడమీలో సభ్యులుగా లేరు. కనీసం శ్రీ సంజీవదేవ్, శ్రీ గుర్రం మల్లయ్యగార్ని యింకా కొద్దిమంది హేమాహేమీలను ఈ సభ్యుల పట్టికలో చేర్చినందుకు ఎంతో ఆనందం కలిగింది. ఏది ఏమైనా మొత్తంమీద చాలమంది అసమర్థులను ఎకాడమీలో చేర్చడం జరిగింది. వీరితోబాటు కొంతమంది ప్రముఖ చిత్రకారులు, విమర్శకులు, సభ్యులుగా వున్నారు. ఇది ఎవరు కాదనలేని సత్యం. ఏవో లోపాలు కొద్దో గొప్పో వుండవచ్చు. మరచిపోవడం మంచిదని సర్దుకుపోవాలి. మన ఎకాడమీ చిత్రకారుల శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తుంది. సందేహంలేదు. మిగిలిన ప్రముఖ కళావేత్తలను గూడా జేర్చి సభ్యుల సంఖ్యను విస్తృతపరచి ప్రజా సహకారాన్ని, చిత్రకారుల సహకారాన్ని పూర్తిగాపొందేట్లు తప్పక చూడాలి. ఆ సుదినం అతి త్వరలోనే వస్తుందని ఆశిద్దాం. అలస్యమైనా అసలు ఎకాడమీ స్థాపించబడింది. ప్రభుత్వమే ఎకాడమీ పెట్టడంవల్ల ధన సహాయం పుష్కలంగా లభిస్తుంది. ముఖ్యంగా ఎకాడమీ ఆశయాలను ఆర్థిక బాధ అంతగా బాధించక పోవచ్చును. ఇక ఎకాడమీ చిత్ర, శిల్ప, కళా విషయాలను బహుళ ప్రచారంలోకి తేవాలి. ముందుగా యూనివర్శిటీలను కలుపుకొని చిత్రకారులకు సముచిత స్థానాల్ని యిచ్చేట్లు చూడాలి. ప్రజలకు, కళాకారులకు సన్నిహిత సంబంధం పెంపొందించాలి. అప్పుడే వారు తమ తమ భావాల్ని పంచుకోవడం జరుగుతుంది. ఇది ఇటు చిత్రకారులకు అటు ప్రజలకు దోహదం చేస్తుంది. కళాభివృద్ధికి ముఖ్యంగా అవకాశం కలుగచేయవలసింది ఎకాడమీ. ఇది చేయాలి, అది చేయాలి అని పదేపదే చెప్పనక్కర లేకుండానే జయప్రదంగా మన ఆంధ్ర లలితకళా ఎకాడమి సాగాలని భగవంతుని ప్రార్థిద్దాం.

ఏం చెప్పను నేస్తం?

శ్రీమతి నాయని కృష్ణకుమారి

ఆది మధ్యాంతాల కందకుండా
ఆవేశ కావేషాల రంగులు పట్టని
అచ్ఛాత్మ స్వరూపంగా మారిన నేస్తం
చెప్పమంటావా నిన్ను గురించి?

మమతలూ మత్సరాలూ దులుపుకుని
మాటల మరకలు అంటుకోలేని
ఊహాపథాల కెగసిపోయిన నేస్తం
ఏం చెప్పను నిన్ను గురించి?

నలుగురికీ మల్లే నువ్వూ కష్టాలకు కుంగి
సుఖాలకు పొంగావనీ,
అలముకొన్న అపవాదులకు
అనంత నైరాశ్యం వరించావనీ,

అందరు నీ రచనల్ని చదివి,
అబ్బో బాగా రాశావంటే
ఆకాశమంత ఎత్తు పెరిగావనీ,
చెప్పనా ?
నీలో మానవత్వం నిండుగా స్పందించేదని

చెప్పనా ?
నడుముచుట్టూ చీర చెఱగు
తిప్పికట్టే పద్ధతిలో
కార్యదీక్షా మనో బలమూ కనిపించేవని

చెప్పనా ?
నీపెదాల మీద వెలిగే
కనీ కనపడని నవ్వు
రోగాల చీకట్లమధ్య వెలిగించిన
రాగాల వెన్నెలవత్తి అని
చెప్పనా నేస్తం?

ఆపదల పడవలో ఎక్కి-యీ లోకపు
టంచుల్ని దాటబోయే అమ్మను
ఆపి, మళ్లీ మామధ్య వదిలిన, నిన్ను
మృత్యుంజయవని
చెప్పనా నేస్తం?
నీవు మామధ్య లేనందువల్ల మాకు వెలితి,
నీకలం కథలుగా మారనందువల్ల
తెలుగు కథలకే వెలితి
నీ అమృతహస్తం రోగుల వెన్ను
నిమరక పోవడంవల్ల
ఆరోగ్యానికే వెలితి!
అంతా వెలితిగా కనిపించే
యీ నిరాశలమించి
గొంతెత్తి గట్టిగా
ఏం చెప్పను నేస్తం నిన్ను గురించి?

నువ్వు అద్భుత కథాప్రపంచంలో
ఆకాశమంత ఎత్తు పెరుగుతావనీ,
నీ కలంలోని సిరా లక్ష ఇందిరల్ని
కోటి కల్యాణుల్ని కల్పిస్తుందనీ,
ఆశించిన నా గుండెకు జవాబు
ఏం చెప్పను నేస్తం?

ఎప్పుడో ఒకనాడు
రెండులోకాలు కలిసే పొలిమేర గీతమీద
నువ్వు నవ్వుతూ నాకెదురుగా వచ్చినపుడు
అంతరంగంలో నువ్వంటే నాకెంత యిష్టమో
అంతా నిజంగానే చెప్తానులే నేస్తం!

[ప్రఖ్యాత రచయిత్రి డాక్టరు పి. శ్రీదేవి మరణవార్త విని]

ఎందుకు?

శ్రీ పిరాజీ

అదృశ్య చిత్రకారు డెవరో తన కుంచెతో అలౌకికమైన వర్ణచిత్రాలను వేస్తున్నట్లు ఆకాశంమీద సంధ్య. కొన్ని క్షణాల్లో రాత్రి వస్తుందని కాదు గాని యింటికి పోవాలనీ, సినిమాకు అందుకోవాలనీ తహతహపడే నగరవాసులతో బాట రద్దీగా ఉంది. అన్ని దిక్కులా సందడిగా ఉంది.

రివ్వున సైకిలు దిగిన నన్ను చూస్తూనే అప్పన్న కిళ్ళీలు కడుతున్నవాడల్లా తలఎత్తి చూసి—"రాండి బాబూ! యిదో మీ కిళ్ళీయే కడుతున్నా" నన్నాడు—

"నాలుగు చార్మినార్ యియ్యవోయ్."

"ఒక, జింజరు కొట్టు .... జల్దీ .... పోవాలి."

"అప్పన్నా! మంచివాడివి గాని రెండు గోల్డ్ ఫ్లేకు యిచ్చి పద్దు రాసుకో ......"

"అదుగో .... అదే అప్పన్నా నీతో గొడవ .... కాస్త రాలనీ .... జర్దాతో మేడలు కట్టవుగా ...."—

అప్పన్న కొట్టు రద్దీగా ఉండే వేళ అదే. అప్పన్న అందరికీ సమాధానాలూ, వస్తువులు కలిపి యిస్తూనే నా కిళ్ళీ కడుతున్నాడు.

"కాస్త పిప్పరమెంటు పువ్వు వెయ్యి" నేను చెప్పాను.

"ఓ .... వేసేనుగా .... నాకు తెల్సు .... మీ కిళ్ళీ స్పెషల్" అంటూనే కిళ్ళీ అందించేశాడు.

కిళ్ళీలో పిప్పరమెంటు పువ్వు ఉండదని నాకు తెలుసు. ఎందుకులే వాడి పిల్లల ఆపత్రయం వాడిది. మరి యిలాంటి చిన్నమొత్తు లాభాలే కదా వ్యాపారం అనుకున్నాను.

"బాబూ! ఒక్క డబ్బిచ్చుకో .... నీ కడుపు చల్లగా .... చక్కని చుక్క వస్తాది"—నలిపేసిన కాగితంలా, ముడుతలు పడ్డ మొహం .... ముగ్గుబుట్టలాంటి మొహం ..... ఒకచేత కర్రా ..... రెండో చెయ్యి చాపింది ముష్టిది. అప్పుడే వెలిగిన మెర్క్యురీ ట్యూబులైటు సైలాసు కాంతులు దాని ముగ్గుబుట్ట తలలో దోబూచు లాడుకుంటున్నాయి.

"రోజా యిదో వాడుక ఏమిటి అప్పా నాకు" జేబులు తడుముకున్నాను నేను. అప్పన్న కొట్టుకేసి తిరిగేను. అప్పన్న ఆకులకి సున్నం రాస్తూనే .... "దానికాడ చిల్లరకేం కొదవ బాబూ! అయిదు రూపాయలకి కావాలంటే వయా పైసలు లెక్కెట్టి పోస్తాది" అన్నాడు నా అవసరం గుర్తించి.

"అప్పన్నబాబు మాటకేం గాని బాబయ్యా! కాని డబ్బు వొడెయ్యండి"—ముసిల్ది .... పాపం .... ఏ వయస్సులో యిది ముష్టెత్తుకోవల్సి వచ్చిందో? ఐనా అది ఎంతమందిని పోషించాలో? ఏమో? బహుశా పోలీసుల్ని తప్పించుకు తిరిగే పోకిరీ కొడుకూ .... దొరంట వారంట విటులను వెతుక్కొనే కూతురు, కన్నూ కాలూ లేని మనుమలు యేమో .... ఎన్ని కాని డబ్బులైతే దాని అవసరం తీరుతుంది.

బాధ్యతలు ముష్టివాళ్ళకైనా తప్పవా? ..... అసలవి బాధ్యత లేమిటి? అనుబంధాలు కాని. ఏమైతేనేం? నా చదువుకోసరం నేను సైకిలుమీద అవూళ్ళో రెండున్నర సంవత్సరాలుగా ఉంటున్నా. ముసిల్ది రోజా నన్ను పలకరిస్తుంది. రోజా కాస్తబ్బు అడుక్కుంటుంది.

నిత్యమూ నాకు చక్కని చుక్క వస్తదని శుభం చెబుతుంది. నేనీ సంగతే శ్యామలతో అందా మనుకుంటాను. "నీ గురించే రోజా ఆ ముష్టిది నాకు సోది చెబుతుంది. నీ అందం గురించే నాకు రోజూ ఆ ముసిల్ది డబ్బు తీసుకుని హామీ యిస్తుంద" ని. కాని చెప్పలేకపోయేను. శ్యామల దగ్గర భయమా? ముసిల్దానిమీద ప్రేమా? ఎందుకో?

అప్పన్న దుకాణంమీద రద్దీ ఎప్పుడూ ఉంటుంది. కాని ఆవేళ లేదు. వాన కురుస్తున్నది. మొన్న పట్టింది ముసురు. నిన్న ఆదివారం. ఇవాళ అప్పన్న కొట్టు మీద రద్దీ పల్చబడింది. రోడ్లు చితచిత లాడుతున్నాయి. ఈదుర గాలి వీస్తున్నది. దీపం చుట్టూరా ఒకటే అరా గుడ్డి యీగలు వాలుతున్నాయి. అప్పన్న కొట్లో రేడియో వెచ్చని కుంపటిలా వెలుగుతూ, ప్రియురాలి కౌగిలిలా సన్నగా పాడుతున్నది.

"ఈ ముసిల్ది పాపం .... ఎన్నాళ్ళనుంచో పాపం ముష్టి ఎత్తుకుంటోంది. ఏ చెట్టుక్రిందో ఉంటుంది"—రెండుసార్లు పాపం అన్నమాట మాత్రం విన్నాడు అప్పన్న.

"అదేంటి పాపం పాపం .... అంటారు బాబూ మీరు. డబ్బును చూస్తే పాపం ఏంటి? చాలి ఏంటి? అది యిస్తున్నదే గదా నాకాడ నోట్లు మార్చుకుపోయింది."—అప్పన్న మాటల

పట్న నాకు ఆశ్చర్యం ఎందుకు కలగాలో అప్పన్న గమనించలేదు.

"నోట్నా ?"

"అవుసుండి .... రోజు కది ఐదురూపాయి లార్జిస్తుంది .... నాకాడ చిల్లరంతా యిచ్చి నోటు తీసుకుంటాది" అప్పన్న కిళ్లీ కట్టి అందించి "ఛీ! ఏం ముసురో. బిజినెస్సు డల్లయిపోనాద" న్నాడు.

"బాబూ! ధర్మం .... దిక్కుమాలిందాన్ని"—ఆశ్చర్యం ముసిల్దే .... కుళ్ళు గోనెపట్టా కప్పుగుంది. అక్కడక్కడా కిరసనాయిలు డాగుల్లాగ దానిమీద మరకలున్నాయి.

"ఏయ్! ముసిలీ నీకు వానా, వరదా లేదూ ...... కొంపా గోడూ లేదూ ...." నేను దూరంగా జరిగి చీదరించుకున్నాను.

"కొంపేంటి నాయనా! నాలాంటి దిక్కుమాలిందానికి. అయన్నీ మీలాంటి మారాజులకి .... ఒక్కదాన్ని ...... మీరో కానీ ......, ఆరో కానీ యిస్తే చాలు బాబూ!"—చలి జ్వరం వచ్చిందో .... చలికే వణుకుతుందో .... అణాకాసు పడేసి అక్కణ్ణించి రిక్షా ఎక్కిపోయేను నేను. వాన వస్తే నా సైకిలు కూడా రాదు రోడ్డుమీదికి. బురద అంటే భయం నాకు. కాని యీ ముసిల్ది పాపం. అడుక్కోనిదే గడవదు కాబోలు .... ఐనా మన దేశంలో యీ ముష్టి "వృత్తి" లాగే పెరుగుతోందే ? ఎందుకు .... నన్ను యీ ముసిల్దాని ఆలోచనలు పీడలాగ ఆవహించి వదలకుండా ఉన్నాయి.

పాఠాలు చదువుకోవాలి .... చాకలిదాని దగ్గరకెళ్లి బట్టలు తెచ్చుకోవాలి. .... రాఘవతో చెప్పొడాలి .... శ్యామల రేపు కాలేజీకొస్తే ఆదివారం ప్రోగ్రాం మాట్లాడుకోవాలి. యివన్నీ ఆలోచనలే .... ముసురుపడితే అన్నీ ఉత్త ఆలోచనలే గాని యీ ముసిల్దాని ఆలోచన ఎందుకూ ? నాకు—

ఐదురూపాయ లార్జిస్తుందా అది రోజుకి ? మరేం చేస్తుంది. నా పరిశోధనమీద నాకు నమ్మకముంది. దానిమీద ఆధారపడేవాళ్లు చాలామంది ఉండొచ్చును.

"నాలాంటి మారాజులకా ? యిల్లు ? ఏవీ .... మా తాతగారిదీ అద్దెకొంపే .... మా నాన్నగారు అంటే మేం మా వూళ్లో ఉంటున్నది అద్దెకొంపే. దానికేం తెల్సు .... దాని బతుకే హాయి....

వానాకాలం వెళ్లింది. శీతాకాలం వచ్చింది. అదీ వెళ్లింది. అప్పన్న కొట్టుదగ్గర ముసిల్ది ఎండిపోయిన అరటి దొప్పలా అవుతున్నది. కాలేజీలలో, కోర్సులు ఎలాగో అవుతున్నాయి.

అప్పన్న బాకీ అడిగేడు. "పద్దు చెల్లించరా బాబూ?" అన్నాడు. నా మొహం కళావిహీనమైంది. "రేపు అప్పన్నా" అన్నాను. నాదగ్గర పావలా ఉంది. రాఘవేంద్రరావు పాతికకి తక్కువ కాకుండా ఏభైకి ఎక్కువ కాకుండా చూస్తా, రూముకి రా అన్నాడు. అప్పుచేయాలి. అప్పులు తీర్చాలి. ముసిల్ది మాత్రం మరింత ముసిలిగా "బాబూ!" అన్నది. "ఎందుకూ ?" అన్నాను నేను. "ఇంకెందుకు ? .... నీ పెళ్లాం సక్కని సుక్క అవ్వాలని నేను భగవంతుణ్ణి ప్రార్థించొద్దేంటి ?" నవ్వింది బొక్కిపళ్లలో డొక్కు దవడ లూగుతూవుంటే గాజుకాయల్లాంటి కళ్ళు కదిపి.

"ఏడిశావ్!" అని అణాకాసు పడేశాను నేను ......" "నాకు ఫస్టుక్లాసు రావాలని అడుగు, దేవుణ్ణి" యీ మాటలు మాత్రం లోపలే అనుకున్నాను.

అప్పు దొరికింది. అప్పు తీర్చాలని మిట్టమధ్యాహ్నం యింటర్వెల్లోనే అప్పన్న కొట్టుకి బయల్దేరాను నేను.

అప్పన్న ప్రసన్నంగా, పద్దు చెల్లు పెట్టుకొని పిప్పరమెంటు పువ్వు, ఏలకులు అవీ దట్టించి మరీ కిళ్లీ కడుతున్నాడు.

"అదుగోనయ్యా! ముసిల్దాని తస్సదియ్య. అంత దూరం చూపెలా ఆనతాదో .... చూసిందంటే చాలు మిమ్మల్ని గద్దలాగొస్తది"—అప్పన్న మాటలకి గభిక్కున నేను రోడ్డు మీదికి చూశాను.

ముసలమ్మ కర్ర సాయంతో అటువేపు పేవ్మెంట మీదనించి దిగి, అప్పన్న దుకాణంకేసి వస్తున్నది. అదే క్షణంలో అటు మలుపులో లారీ హారన్, యిటునించి ఒక స్కూటర్ హారన్ వేసేయి.

నేను ముసిల్దానిగురించి ఆగేటంత మూర్ఖుణ్ణి గాను. అవకాశ మయితే దాటేద్దా మన్నట్టు, చెంగున, (ఒక చేత కిళ్లీ నోటకుక్కుకునే)....నా సైకిలుమీద కెగిరిపోయేను.

లారీ వచ్చింది కుడివేపుకి. దాని తప్పేకాని, లారీలకది అలవాటు కూడాను. స్కూటర్ నన్ను ఢీకొనవల్సిందే.... లేకపోతే లారీ క్రిందకి దూరి పోతుంది. కాని మూడు వాహనాల మధ్యకి మూడుకాళ్ల ముసిల్ది వచ్చేసింది.

"బాబయ్యా"—లారీ వెంట్రుకవాసిలో తప్పింది కాని ముసల్దాని కర్ర పడిపోయింది దాని మడ్గార్డ్ తగిలి. నాకు ఏంచేయాలో తోచలేదు. హేండిల్బార్ గిర్రున తిరిగింది. నన్ను ఢీకొనే స్కూటర్ కర్రకోసం వంగిన ముసిల్దాన్ని మట్టేసింది.

"అమ్మో! భగమం ...." అంతే ముసల్దాని స్పృహపోయిఉంటుంది.

నా నాలి క్కర్చుకుంది. నోటంట తాంబూలం పండి కాదు నెత్తురు కారిపోతున్నది. స్కూటర్మీద కూడా యువ

కుడే ఉన్నాడు ...... కోటుతో సహా తడిసిపోయే డతగాడు. జనం గుమిగూడేలోపున మాకు నోరు పెగల్లేదు. ఆయాసంతో వగర్చి లేచాను. స్కూటర్‌వాలా పారిపోవడం చాత కాక "అరె ! అరె ! డాక్టర్ ! యిక్కడెవరేనా డాక్టర్" అంటున్నాడు. నాలిక తెగినట్లుంది ఉచ్చారణ.

ఇంతకీ లారీ పారిపోయింది. జనం లారీల దూకుడు గురించి, దౌర్జన్యఘోరణిగురించి చర్చలు సాగించుకొంటున్నారు.

నేను సైకిలు అక్కే వదిలి అంబులెన్సుకి ఫోను చేసేను.

స్కూటర్‌వాలా అంటున్నాడు .... "పాపం లారీ క్రింద పడిపోయింది. అసలు దీన్ని రక్షించగలమనే భ్రమలో మేం యిద్దరం తుక్కు తుక్కు అయిపోదుము."—

"అదేమయ్యా ! నీ బండికింద కాదూ.... పడతా" అన్నాడు ఒకడు. "నాన్‌సెన్సు .... " అన్నాడు స్కూటరు వాలా.

"పాపం ! ఆస్పత్రికి మొదట చేర్పిద్దాం ఉండండి" అన్నాను నేను.

అప్పన్న బడ్డీలోనుంచి చూసి ...... "లాభంలేదు బాబు ! ముసిల్దాయి.... నూకలు నిండుకున్నాయి" అన్నాడు.

ఒకరు జటకాను పిలిచేరు. నలుగురు నెత్తురుతో తడిసిన ముసలిదాన్ని అందులో పారేశారు.

"ఇస్తారులే ! యీ పెద్దమనుసులు అయిదు రూపాయిలు"—హామీ యిచ్చాడు జటకావాడికి ఆవారా వృత్తిలో ఉంటున్న 'బుష్‌కోటు' ఒకడు.

నేను స్కూటర్‌వాలా మొహం చూసేను. అతగాడు దీనంగా నా మొహంలోకి చూశాడు. ఇద్దరం దారుణమైన ప్రమాదానికి గురియైన ముసలిదాని ప్రాణాలను తీసిన హంతకుల మన్నట్లు జనం చూశారు.

"సరే ! .... ఆ లారీ దొరక్కపోదు....నేను రిపోరు యిస్తానన్నాడు" స్కూటర్‌వాలా. నన్నుచూసి "పదండి పాపం ! ఎడ్మిట్‌చేసి పోదాం" అన్నారు. మూగవాడిలా అనుసరించాను.

"ఇంతకీ పోలీసులు యిన్వెస్టిగేట్ చేసేది దిబ్బ ...... యింతసేపయ్యింది లారీవాడు పారిపోయి ఉంటాడు ......"— తోవలో అంటున్నాడు స్కూటర్‌వాలా.

ఎందుకో తెలీదు. కాని "అదేమయ్యా .... నీ స్కూటర్ మెట్టేసిందికదూ .... " అన్న మాటలు రానేలేదు నానోటి వెంట.

అసలు దాని తలకాయ రోడ్డుమీద రాయికి తగిలి కన్నంపడింది. "పాపం! బ్రతుకుతుం దంటారా"—స్కూటర్‌వాలా మొహమంతా చెమటలు పోసేయి. నాకు ముసల్ది—రక్తంల తడిసి ముద్దయిన ముసిల్ది .... ఆకుపచ్చగా ...... పసుపు పచ్చగా ...... తెల్లగా ఎండలో .... నల్లగా రకరకాలుగా అగుపిస్తోంది. కళ్ళు తిరుగుతున్నాయి.

* * *

ముసిల్ది బ్రతికితే ?.... ముసిల్ది చస్తే ?....ఏమో ..... మేం యిద్దరం, యువతల లోపల మా పెళ్ళాలు పురిటి నొప్పులు పడుతూంటే ఆందోళన పడుతున్నట్లు కూచున్నాం. ఎందుకు ? నా సైకిల్‌క్రింద పడి మనిషి చావదు. ఏమో ముసిల్దాని ప్రాణం ..... కొడిగట్టి ఆరిపోతూవున్న దీపం .... కాని అది నా సైకిల్ క్రింద పడలేదు. నా కాని డబ్బు కోసరం .... యీ దారుణమైన ప్రమాదానికి గురైంది. ఇక స్కూటర్‌వాలా .... తన చక్రాలక్రింద పడలేదని బుకాయించేసేడు. అందుకు సాక్ష్యం నన్ను నిలబెట్టేడు కూడాను. నాకు తెలుసు .... అతగాడికి తెలుసు....కాని ఎవరికీ తెలియదు. ముసిల్ది బ్రతుకుతుందని నా ఆశ.... ఎందుకు బ్రతకాలి? ఏమో ......

"ముసిల్ది .... యీపాటికి .... " అతగాడి మాటల మధ్యనే ఒక నర్సు వచ్చింది లోపల్నుంచి. చావాలని కాబోలు అతగాడి ఆశ !

"బ్రతకదుసార్ ...... ఒక్కసారి ప్లీజ్ .... " మమ్మల్ని లోపలికి రమ్మన్నది.

"ఇంపాజిబిల్" డాక్ట రంటున్నాడు.

"కాని తెలివి వచ్చింది .... " నర్సు.

"అదే ఆశ్చర్యం .... దాని వస్తువేదో అత్యంత ప్రాణ పదిలమైనది దానిక్కావాలి .... పాపం .... ఆశ ! తపన !! అలాంటిది ....ఐ డోంట్ థింక్ యూ బిలాంగ్ టు హర్"— డాక్టరు మాటలకి మే మిద్దరం తక్షణం "అదో ముష్టిది పాపం" అన్నాం.

"బా .... బ .... య్యా నా .... నా కా .... యి .. తం .... నో .... టు.... నా .... నా" వరుగులాంటి దాని నరాల్లో అంత నెత్తురే .... ?! కాని అంతా ప్రవహించిపోయింది. ఆశ ... చివరి శ్వాస .... అదే వుంది.

"కాని ఆ నోటు ఏమిటి .... ?"

"బహుశా, పదో ఐదో అయ్యుంటుంది—ముసిల్దానికి బ్యాంకా ? యినస్పెట్టా ? .... బొడ్డులో ఉందేమో .... " అన్నాను నేను.

'నో సర్ ! ఏమీలేదు .... " అప్పటికే వెతికింది నర్సు కాబోలు చెప్పేసింది.

నేను ఐదు కాయితం ఒకటి—అప్పుచేసిన అయిదు కాయితం నా జేబులోనించి—తీశాను. ముసిల్ది ప్రాణాలతో పోరాడుతున్నది....ఆశతో .... తన నోటు కోసరం మృత్యువుతో కుస్తీ పడుతున్నది—ఆ కాయితం, వంగి—సగం కళ్లు మూసు కుని—ఆ నెత్తురుకండను చూడలేక దాని కనులముందు ఉంచి "అన్నా ! నీ నోటు .... " అన్నాను.

ముసిల్దానికి నిద్ర, తెలివి వచ్చినట్లయ్యింది. దాని కళ్లు వెలిగించిన దీపాల్లా విచ్చాయి కాని నోటును తడుము కుందికి దాని చేతుల్లేవలేదు .... ఐదు కాయితం అట్టే చూసి..

"బాబయ్యా ! .... కాయితం .... " ఏగశ్వాసతో అంటున్నది.

నర్సు కొచ్చింది సమయస్ఫూర్తి. ఒక కాయితం మడత తెచ్చి దాని చేతిలో ఉంచి "ఏయ్ ! ముసిలీ! అదేనా నీ కాయితం" అన్నది.

నిస్సత్తువుగా దాని అరచెయ్యి ముడుచుకుంది. కాయితం చేతిలో తడుముకుంది .... ఏదో నమ్మకం కుదిరిం దల్లే ఉంది—అంతే .... చెయ్యి విడిపోయింది.

"నా పాణం .... నా పేనం .... నా కాయితం ... పో .... యిం .... " ముసిల్ది యిక ముసిల్ది కాదు. కళేబరం ..... కట్టె ....

మిగతా అంతా మామూలే .... చావులు అన్నీ ఒకటే .... పోతే దిక్కుమాలిన ప్రమాదమైన ఈచావుకీ, మిగిలిన చావులకీ జరిగే అంత్యక్రియలలో తేడా ఉంది—

నేను స్కూటర్‌వాలా యిద్దరం విచారించాం. లారీ వాణ్ణి పోలీసువాళ్ల దగ్గర తిట్టేం .... ఎందుకు ?

స్కూటర్‌వాలా నేను వెళ్లే దిక్కుకి అభిముఖంగా తన స్కూటర్ త్రిప్పి .... 'థాంక్స్ సార్ ! పాపం ముసిల్ది సుఖపడిం ద" న్నాడు .... మరో క్షణంలో మాయమయ్యాడు. ఎందుకు ? థాంక్స్ .... నా కెందుకు ....

నేను సైకిల్‌మీద అప్పన్న కొట్టు దగ్గరికి వెళ్లాను.... ఎందుకో తెలియదు. అక్కడ అప్పన్న అన్నాడు.... : "ఏం బాబూ! జెండా ఎత్తేసిందా ?" అని.

నేను ముసిల్ది పడ్డ జాగాలో నెత్తురు మరకల్ని చూస్తున్నాను. "ఎందుకు బాబూ ! 'నిత్తెమూ' ఏదో ఒకటి జరగాల్సిందే .... యిల్లాంటెయి మనకి అలవాటే" నన్నాడు కిల్లీ కడుతూనే అప్పన్న ......

కాయితం .... నోటు .... ముసిల్ది చెప్పినదాని ప్రాణం ... "చూడు అప్పన్నా ! దాని కాయితం కాని దొరికిందా ?" అన్నాను.

"అదేంటి బాబూ !" అప్పన్న ఉలిక్కిపడ్డాడు ..... "అంటే" అన్నాడు ఆశ్చర్యపడకండా. నేను వెతుకుతూనే అంతా చెప్పేను.

"అదా !" నవ్వేసేడు అప్పన్న .... "అది నోటయ్యుం టుందిలే బాబూ !" అన్నాడు.

"ఏం నోటు ?"

"ఇంకేంనోటు బాబూ ! ముసిల్ది ఐదువందల రూపాయి లొకడికి అప్పు యిచ్చింది .... ప్రాంసరీనోటు రాయించినాది."

"నేను కొయ్యబారి పోయినట్లయ్యాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను.

"అప్పు ? ప్రామిసరీ నోటు !"

"పాపం .... కానీ కానీ కూడెట్టింది .... " అప్పన్న దేవుడికేసి చూసి "అంతా ఆ భగవంతుడి మాయ" అన్నాడు లెంపలేసుకొని.

"ఎవరి కిచ్చిం దప్పన్నా .... "

"ఎవరికైతే ఎందుకు బాబూ యిక. ఎవరికో ఋణ ముండి యిచ్చింది. పోయింగి." అప్పన్న నా కుతూహలాన్ని గమనించడం మొదలుపెట్టేడు....

"నేను .... నేను..... "

"ఏం చేస్తారు బాబూ !"

"ఉహు .... కాలేజీకి వెళ్లాలి .... " సైకిలెక్కి పోయాను.

అప్పన్న నవ్వు నా చెవుల్లో వికటంగా ధ్వనించింది .... ఎందుకు ?

ముసిల్దాని ప్రాణం .... దాని నోటు .... ఏమిటీ ? నోటు .... ఎందుకు ? .... అన్న ప్రశ్నలే మిగిలిపోయేయి.

రాఘవరావు అగుపించాడు .... "ఏంరా ! బాబూ ! క్లాసుకి రాలేదు. అప్పుచేసి పప్పుకూడు అనీ .... చలో సినిమా కనీ పోయావనుకున్నా .... " అన్నాడు.

"లేదోయ్ ! .... అంత భయం ఎందుకోయ్ నీకు ?" నవ్వుతూ అడిగేను.

"ఎందుకూ ?.... డబ్బు యిచ్చుకున్నవాణ్ని నాయనా !.... అప్పు తీసుకున్నవాడికేం మజాగా ఉంటుంది ! .... కాని యిచ్చిన వాడికి .... ?" రాఘవరా వన్నాడు.


నేను నవ్వేను.

ఈ నవ్వు అచ్చం యిందాకల నా చెవులబడిన అప్పన్న ఆఖరి నవ్వులాగే ఉంది. ఎందుకు ?

ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

ప్రపంచ సాంస్కృతిక చరిత్రను పరిశీలించినపుడు మానవులందు అప్పుడప్పుడు అద్భుత మానసవికాసము తల చూపుట విలోకింతుము. పంకమున జనించి సలిలముమీదికి పెరుగు మృణాళిని స్వర్ణరశ్మి సంస్పర్శవలన ప్రఫుల్లముఖియై సుకరందభరిత హృదయమై జిజ్ఞాసువులైన ద్విరేఫముల నాకర్షించునట్లు నిహితాంతరంగమున ఎందో అడగియుండు ప్రతిభ ఒక్కొక్క శుభ సన్నివేశమున వృద్ధినంది, చైతన్య దిగ్వలయమున ప్రస్ఫుటించి నవనవోన్మేషశాలినియై నిశితదార్శనిక శక్తుల నాకర్షించును. గ్రీసులో పెరికిల్స్ కాలమందును, ఇట



ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయలు

లీలో ఆగస్టస్‌కాలమందును, ప్రాన్సులో పదునాలుగవ లూయీ కాలమందును, జర్మనీలో ఫ్రెడెరిక్ కాలములోను, ఇంగ్లాండులో మొదటి ఎలిజబెత్ కాలమందును, గజినీలో మహమ్మదుకాలమందును, భారతదేశములో ప్రాచీన, పౌరాణిక యుగములందు జనక, అశ్వపతిమున్నగు నృపమనీషుల కాలమందును పరిఢవిల్లిన మహోజ్జ్వల మానస వికాసమహోద్యమములట్లుండ చారిత్రక కాలమందు అశోక, కనిష్క, శ్రీహర్ష, భోజరాజ, విక్రమాదిత్య, చంద్రగుప్త, సముద్రగుప్త, విక్రమాంక, కృష్ణదేవరాయాది రాజర్షులేలుకాలమందు మనుష్య మానసము చైతన్యార్క మరీచిగుచ్ఛశిఖలతో తేజరిల్లినది. కడచిన శతాబ్దమున రామమోహనరాయలనాటినుండి ఇట్టి వైజ్ఞానిక మహోద్యమము దేశమందు తలయెత్తినది. స్థలకాల పరిస్థితుల ననుసరించి ఈ యుద్యమస్పందనము నడచును. రామమోహనుని దృక్పథమందలి అపూర్వభావశక్తి ననుసరించి, ప్రాచీనార్వాచీన ప్రాక్ప్రతీచీ సంస్కృతుల సమాఖ్య పొడసూప నారంభించినది. దీని దృక్పథము విశాలమై, విశ్వ విస్తృతమై యొప్పినది. కడచిన శతాబ్దమున ప్రభవించిన మహా పురుషులు, మత, సాంఘిక రాజకీయ వైజ్ఞానిక ప్రాంగణములలో, చేసియుండు పెరిగి పెంపొందినను, విశాల దృష్టి సమన్వితులై వెలసిరి. మతోద్యమమున శ్రీరామకృష్ణ వివేకానందకేశవచంద్ర ప్రభృతులు, న్యాయశాస్త్రమున రసవిహారీఘోష్, ఉమేశచంద్రవందోపాధ్యాయాదులును, సంఘసంస్కారోద్యమమున ఈశ్వరచంద్ర సీతానాథ తత్త్వ భూషణ రానడే ప్రభృతులను, రాజకీయములందు సురేంద్రనాథ, దాదాబాయ్‌నౌరోజీ, ఫిరోజుషా మెహతా మున్నగువారును, సాహిత్యమున బంకించంద్రద్విజేంద్ర రవీంద్రాదులును, భౌతికశాస్త్ర ప్రభావమున జగదీశచంద్రబోసు మేఘనాథ సాహా, ప్రఫుల్లచంద్ర, రామానుజ, రామను మున్నగువారును, తత్త్వశాస్త్రమున, రాధాకృష్ణ, బ్రజేంద్రలాల్‌సీల్, సురేంద్రనాథదాసుగుప్త ప్రభృతులును వేర్వేరు ప్రాంగణములందు తమ తమ ప్రతిభా డిండిమములను ప్రయోగించిరి. ఏకైకమైన ఆంతరంగిక వికాసోద్యమము (Renascence) బహుముఖముల విస్తరించినది. ఒకే నవజీవనోద్యమ భూరుహము వివిధ శాఖోపశాఖలతో విస్తృతమైనది.

శ్రీ ప్రఫుల్ల చంద్రరాయలు ఈ మహోద్యమమున వంగభూమియందు ప్రభవించి, సమస్త భారతదేశమందును వ్యాపించిన శుభకర ముహూర్తమున జన్మించి క్రమాభివృద్ధినందిన భారత సంస్కృతికిని, రసాయశాస్త్ర పరిశోధనకును, నవసారస్వతసృష్టికిని, రాసాయనిక పదార్థ పరిశ్రమకును, భారతజాతీయ గౌరవ చరితార్థతకును అనల్పభావ శబలతను అశీప్రక్రియా సఫలతను చేకూర్చెను. మహాపురుషుల చరిత్రలు దేశ చరిత్రలని వాకొనిన కార్లయిల్ మహాశయుని సిద్ధాంతమునకు దృష్టాంతముల నన్వేషించునపుడు శ్రీ ప్రఫుల్ల చంద్రరాయల జీవితాంశములు భారతీయ సాంస్కృతిక వాహినిలో ప్రభాకలిత ప్రకరణములై వెలయుచున్నవని నొక్కి చెప్పవచ్చును. విద్యావేత్తలందలి శమంతకమణిని, సారస్వత సేవకులందలి శిరోమణిని, పారిశ్రామికవేత్తలందలి చూడామణిని, దేశభక్తులందలి చింతామణిని సేకరించి స్వీయకంఠాభరణ సృష్టి జేసికొని సౌందర్యతిలకమై తేజరిల్లిన భారత జనయిత్రిని అనిమేషలోచనములతో వీక్షించితిమేని, శ్రీ ప్రఫుల్లచంద్రరాయ లీ కంఠాభరణమని గుర్తించి, పరమానందభరిత హృదయుల మయ్యెదము.

ఒక మహాపురుషుడు ఉదయించుటకును అస్తమించుటకును, నడుమ తలసూపిన జీవిత ఘట్టములను సింహావలోకమొనరించినపుడు ఏయే యాశయముల ననుసరించి ఆతడు సాధన మార్గమున అగ్రేసరుడై కృతార్థుడాయెనో గ్రహింపజాలుదుము. జీవనలక్ష్యమును దార్శనిక ప్రభావమువలన ముందే యూహించి, లక్ష్యసిద్ధికై ఆతడు తప సొనరించును. జయమునుండియు అపజయమునుండియు ఆతడు గుణపాఠముల నందగలడు. స్వీయానుభూతియందు శిక్షణ వ్యవస్థనవలోకింపజాలును.

జీ వి త ము

శ్రీ ప్రఫుల్లచంద్రుడిట్టివాడు. వంగరాష్ట్రమున 1861 ఆగస్టు 2 వ తేదీనాడు పల్లె వాతావరణమున ఈతడు పుట్టెను. హరిశ్చంద్రరాయలు తండ్రి. కొంతనేలగల వ్యక్తి. మొగల్ విద్యా సంప్రదాయము వంగసీమలో కడచిన శతాబ్దమున కొంతకాలము వరకు ప్రచలితమై యుండుటవలన పరిష్యన్ భాష మాతృభాషకు నెచ్చెలియై శిక్షణ వ్యవస్థయందు స్థిరపడుటవలన హరిశ్చంద్రుడు ఆ భాష నేరిగెను. ఆంగ్లము కూడ దానికి చేరుటవలన మూడు భాషలును ముగురమ్మలైనవి. సంగీతమునిన ఆతడు చెవిగోసికొనువాడు. పల్లె ప్రజలపై అతనికి ప్రీతిమెండు. సొంతయింటిపెరడున బడిపెట్టి ఎల్లరకు విద్యాదానము చేయువాడు. పల్లె సంప్రదాయము ప్రఫుల్లచంద్రునకు శైశవడోలికయైనది. ఇందుర్రూతలూగుచు ఆతడింటబుట్టిన విద్య నొంటబట్టించుకొనుచుండెను. గ్రామ సాంస్కృతిక స్తన్యమున పెరిగి, సరళపల్లెప్రభ యెడల మిక్కిలి మక్కువ జూపెను. ఇది అతని హృదయముపై చిరాంకితమై విలిచినది.

తొమ్మిదేళ్ళవరకు తండ్రియే ఈతనికి విద్యాగురువై యుండెను. గృహప్రాంగణమందలి పాఠశాలలోనే, పల్లె ధూళిలోనే ఆతడు వర్ణమాలను దిద్దెను. పల్లెపాంశుపటలమందే ఈతని తొలియంజలులు ముద్రితములైనవి.

తరువాతి చదువు కలకత్తాలో జరుగవలెను. కుటుంబమచటికి తరలిపోయినది. డేవిడ్ హేర్ అనునాతడు స్థాపించిన హైస్కూలు ఉద్వేగభరిత వాతావరణమున వృద్ధినంది విద్యార్థికుల శిశువుల నాకర్షించుచుండెను. ప్రఫుల్లచంద్రునందు తండ్రి చేర్పించెను. నాలుగేండ్లాతడు చరచర చదువు సాగించెను. పిదప ఆతని ఆరోగ్యము చెడుటవలన బడి చదువున కంతరాయము కలిగెను. కాని బాలుని అంతరంగమందలి జిజ్ఞాసానలము రవుల్కొనియేయున్నది. ప్రఫుల్ల పద్మపుష్కరిణిపై భ్రాలు రాయంచవలె ప్రఫుల్ల చంద్రుని మనసు గృహమందలి గ్రంథరాజిపై వ్రాలెను. మహాపురుషుల జీవిత చరిత్రల నీతడు విశేష శ్రద్ధతో పరిశీలించెను. ఛేంబర్స్ గెలీలియో, న్యూటన్, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ప్రభృతుల చరిత్రలందలి విశేషములు అతని మనసుపై హత్తుకొనినవి. ఆంగ్ల సాహితీ సౌందర్యమును చక్కగా ఆతడు గ్రహించెను. షేక్స్పియర్ మున్నగు మహాకవుల రచనలందలి మాధుర్యమును మనసార గ్రోలెను.

పదునేనవ సంవత్సరమున ఇతడు "అల్బర్ట్" స్కూలులో ఎన్ట్రెన్స్ పరీక్షయందు కృతార్థుడాయెను. మెట్రిక్యులేషన్ పరీక్షవరకు సంస్కృతము వంగదేశములో నిర్బంధ పాఠ్య ప్రణాళికలో జేరినది. సంస్కృతము రాని వంగవిద్యార్థి యుండడు. ప్రఫుల్లచంద్రుడు సంస్కృతముతోబాటు లేటిన్ భాషతో పరిచయమునందెను. ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు స్థాపించిన మెట్రొపొలిటన్ ఇన్స్టిట్యూట్‌లో ఈతడు తరువాత ప్రవేశించెను.*

సర్ అలెగ్జాండర్ పెడ్లర్, సర్ జాన్ ఇలియట్‌లను మేధావులు ప్రెసిడెన్సీకాలేజిలో అధ్యాపకులై యుండిరి. తరుచుగా వారి యుపన్యాసములను వినుటకై ప్రఫుల్లచంద్రుడు అవకాశములను గలిగించుకొనుచుండెను. రసాయన శాస్త్రముపై విశేష ప్రీతి అపుడే ఈతనికి గలిగెను.

1882 లో ప్రఫుల్లచంద్రునకు "గిల్‌క్రైస్ట్" ఉపకారవేతనము లభించినది. రసాయనశాస్త్ర పరిశోధనకై ఈతడు ఎడింబరో విశ్వవిద్యాలయమునకు పోయెను. కెమిస్ట్రీ, ఫిజిక్స్, బాటనీ, జియాలజీ లాతని కందు అభిమాన శాస్త్రములైనవి. అచటి రసాయనిక సంఘమున కుపాధ్యక్షుడుగా నెన్నుకొనబడెను.

అలగ్జాండరు స్మిత్, జేమ్స్‌వాకర్‌లు పోలు మేధావులు సహపాఠులు. వారికి దీటైనిలిచి, ప్రజ్ఞాధురీణుడని మెప్పువడసి ప్రఫుల్లచంద్రుడు డాక్టర్ బిరుదును వడసెను. "ప్రథమ భారత స్వాతంత్ర్య సమరము" మున్నగు విషయములను దృష్టిలో నిడికొని 1885 లో పోటీ వ్యాసమును రచించి, తన దృక్పథమందలి దేశభక్తిని వ్యక్తీకరించెను. 'హోప్' బహుమతి మున్నగు పసదనములు ప్రఫుల్లచంద్రుని చేతులందు పడినవి. అధ్యాపకుల మన్నన లాతనికి దక్కినవి.

1889 లో ఆతడు స్వదేశమునకు తిరిగి వచ్చెను. కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా నియోగింపబడి, 1911 లో అందే ఉన్నతోపాధ్యాయపీఠము నలంకరించెను. ఈతనికి ప్రశస్తి విజ్ఞానలోకమున విస్తరించుటచే పరిశోధనలో దీక్షితులైన విద్యార్థు లాతని యండజేరి విశేషాభ్యుదయము నందిరి. 1916 లో ఈ యుద్యోగము నీతడు విడిచి, కలకత్తాలో నూతనముగా నెలకొనిన సైన్స్ కాలేజిలో పాలిట్ అధ్యాపకపీఠము నలంకరించెను. శిష్యులతో కలసి ఈతడొనరించిన పరిశోధనాంశములు బహుళపత్రములందు ప్రకటింపబడినవి. 1936 లో పాలిట్ ప్రొఫెసర్ ఉద్యోగమునకు స్వస్తిచెప్పి ఎమిరిటస్ ప్రొఫెసరు (Emeritus professor) పదవిని వడసి, కొనయూపిరివరకు ఆ గౌరవమును నిలుపుకొనెను. ఈతని గభీర వైదుష్యమును గుర్తించిన విశ్వ విద్యాలయములు ఆద

* ఇది తరువాత మెట్రపాలిటన్ కాలేజీయైనది. కొంతకాల మిందు సురేంద్రనాథబెనర్జీ ఆంగ్లాధ్యాపకుడై యుండెను. ఈ కళాశాల తరువాత సంస్థాపకునిపేరుతో నొప్పుచు విద్యాసాగర కళాశాల యనబరగుచున్నది. నాలుగేళ్ళందు జదువు భాగ్యము నాకు కలిగెను.

రానురాగములతో బిరుదు లీతనికి ప్రసాదించుటకై ఒక దానితో నొకటి పందెములు వేసికొనినవి. ఢక్కా, కలకత్తా, కాశీ, డర్హాం, విశ్వకళాపరిషత్తు లీతనికి డాక్టర్ బిరులను ప్రసాదించి, తమ్ము దాము గౌరవించుకొనినవి. ప్రథమ ప్రపంచ యుద్ధానంతర మున బ్రిటిష్ ప్రభుత్వ మీతనికి 'సర్' బిరుదు నిచ్చి సత్క రించినది.

ప్రఫుల్లచంద్రుడు 1920 సైన్స్ కాంగ్రెసు అధ్యక్ష పీఠమున ఆసీనుడై యుండెను. 1934 లో లండన్ కెమికల్ సొసైటీలో గౌరవసభ్యుడైనపుడు ఈతని కీర్తిచంద్రికలు సాంద్రములై ఆంగ్లసాగరము (ఇంగ్లీష్ ఛానెల్) నధఃకరించి అన్య సీమయందు విస్తరించినది.

ప్రఫుల్లచంద్రుని ఉపన్యాసములను అనేక పర్యాయ ములు విను అవకాశములు నాకు లభించినవి. శ్రోతలను తారా పథమున నెగురవేయజాలు అద్భుత వక్తృత్వకౌశల మీతనికి గలదని తెలుపుట అతిశయోక్తి యగును. సరళ సుందరపద ప్రయోగమున పన్నీటి జల్లుబోలు తలపులను శ్రోతల హృద యములందు చల్లునేరిమి ఈతనికి వెన్నతో పెట్టిన విద్యయైనది.

తన భావనాశక్తిని దివ్యపుష్పక మొనరించుకొని పదు నాలుగు భువనములందు సంచార మొనరించు శక్తి కవులకు కలదు. దివ్య శకుంతములవలె అంబరవీధులం దెగయుటకై భౌతిక శాస్త్రవేత్తలు మక్కువ పడరు. కారణ కార్య సూత్రము నావిష్కరించుట వీరి ఆశయము. వీరి మేధ నిశితమైనది. వాక్కు స్పష్టమైనది. భావనమున రంగులను రంగరించి కుంచెయందు ముంచి పతిత మానసయవనికపై చిత్రములను చిత్రించు నేరుపు కళోపాసకునిది. ప్రఫుల్ల చంద్రుడు శాస్త్రవేత్త యైనను, ఈతని హృదయము రస భరితమైనది. మేధను హృదయమున పదిలపరచి హృదయ ముతో యోచించు యోగి కావున ఈతని శైలి స్పష్టమై, ప్రభాకలితమై వెలయును. కన్నున్న విమర్శకుడు నెమకుచో ఈతని రచనమున రతనాల రాసులను, ముత్తెపు జేరులను లభించును. ప్రపుల్లచంద్రు డావిష్కరించు భౌతిక సూత్ర ములు కళాసూత్రముల వలె కన్ను గుట్టును. బ్రహ్మసూత్ర ముల వలె భావ భరితములై యుండును. ఇంపైన జాతీ యము, సొంపైన సమాసము, 'ఓ హో!' అనిపించు శబ్ద ప్రయోగము, మేలి యలంకారము, సాహితీసీమంతిని వలచు సౌందర్య సందీపిత శయ్య ప్రఫుల్లచంద్రుని సృష్టియందు గోచరించును.

ప్రశంసించువాడును, ప్రశంస నందువాడును సైదో డులే, ఒకే వృంతము మీది జోడుపూలు పోలువా రీకవలలు. మహా వక్తల యెడల, మహాకవుల యెడల ప్రఫుల్లచంద్రునకు బాల్యమునుండి ప్రీతి మెండు. వంగదేశమందలి ఉపన్యాస చక్రవర్తులు కేశవచంద్రసేన్. ఆనంద మోహనబోసు, సురేంద్ర నాథ బెనర్జి, బిపిన్‌చంద్రపాల్‌లు ఈతనికి సన్నిహితులు. ఉత్తేజబంధురములైన వీరి యుపన్యాసములను వినుటకై ప్రఫుల్లచంద్రుడు చెవి కోసికొనువాడు. వి. ఎస్. శ్రీనివాస శాస్త్రి కలకత్తా విశ్వవిద్యాలయమున ప్రథమ కమలా మహో పన్యాసము ముగించిన పిదప ఆనందభరిత హృదయుడై ప్రఫుల్ల చంద్రుడు, తన మిత్రుడైన సి. వి. రామన్ వీపుపై చరచి, "మద్రాసు విద్యాభూషణులు వీరు" అని శాస్త్రిపై చూపుంచి, పలుకుట దగ్గర నున్న నే నెరుగుదును. బంకిం చంద్ర, రవీంద్ర, అరవింద, బ్రజేంద్రలాల్‌సీల్, ద్విజేంద్ర లాలు లీతని సహచరులు. వారి రచన లందలి సాహితీవిభూతి ఈతని యంతరంగమున విస్తరించినది.

గ్రంథ రచన

మాతృభాష యందును, ఆంగ్లమందును తరచుగా ప్రఫుల్ల చంద్రుడు వ్యాసములు వ్రాయువాడు. ఒక "వంగీయ రసా యన శాస్త్రవేత్త జీవితానుభవములు" "The Life and Experiences of a Bengali Chemist" అను ఈతని గ్రంథము స్వీయచరిత్రయనబెల్లును. "సాహిత్య మున భౌతిక శాస్త్రమునకు గల స్థానము" "The place of Science in Literature" అను నీతని గ్రంథము కళమీదను, శాస్త్రముమీదను నీతనికిగల నిస్తుల ప్రీతిని ధ్రువ పరచుచున్నది. ఈ రెండును పార్వతీ పరమేశ్వరులని గుర్తించి వాఙ్మయమందిరమున ఆనందోపాసనమొనరించు అల్పసంఖ్యాకు లైన అదృష్టవంతులలో ప్రఫుల్లచంద్రుడొకడు. ఈతడు రచిం చిన "హిందూ రసాయన శాస్త్ర చరిత్ర" "History of Hindu Chemistry" ఈతని గ్రంథములలో తలమాని కము. ఇది రెండు భాగముల ఉద్గ్రంథము. ఇది కేవలము రసాయన శాస్త్రగ్రంథము మాత్రమే కాదు. ఇందు మతశాస్త్ర తత్త్వ శాస్త్రాంశములు భారతీయచారిత్రక విశేషములు బహుళముగా గలవు. ప్రాచీనకాలమునుండి ఆధునిక యుగమువరకు, ఏ యే చారి త్రక ఘట్టములందు, ఏ యే మతోద్యమములందు, ఏ యే శాస్త్ర వేత్తలేయే పరిశోధనలుచేసి, ఏయే వస్తువుల నావిష్కరించిరో, ఏయే రసాయన పదార్థములు చేజిక్కి మనుష్యజీవితమున కెట్లుపయోగపడినవో విపుల దృష్టాంతములతో గ్రంథకర్త ఇందు వివరించెను. నాగార్జునుడు రచించిన రస రత్నాకరమును, భిక్షుగోవిందుని రసహృదయమును, సోమదేవుని రసేంద్ర చూడా మణిని, యశోధరవిరచిత రసప్రకాశ సుధాకరమును, మదనాంత దేవుని రసచింతామణిని, విష్ణుదేవుని రస రాజలక్ష్మిని, మాళ్వాధిప గ్వరుడైన మదనసింహుని రసనక్షత్రమాలికను, నిత్యానాథుని రసరత్నాకరమును, కాకచండేశ్వరీమాత తంత్రమును, రుద్రయ మాలతంత్రమును విశదీకరించు రసకల్పమును, ధాతురత్నమా లను, రసప్రదీపమును, రసరత్న సముచ్చయమును, రుద్రమాలా తంత్రమును వివరించు ధాతుక్రియ, ధాతుమంజరులను, సువర్ణ తంత్ర లేక స్వర్ణ తంత్రములను విపులీకరించు గ్రంథములను, నవరత్న విశేషముల నుల్లేఖించు మహాగ్రంథములను, న్యూటన్‌కు ముందు వరలిన భాస్కరాచార్యుడు తెలిపిన స్థలకాలగణనా విధానములను, బౌద్ధులును, జైనులును వివరించిన పరమాణు

సిద్ధాంతములను, నంది, స్వచ్ఛంద భైరవ, మంథనభైరవ, వాసుదేవ, దామోదర, భగవత్ గోవింద, చరక, సుశ్రుత, హారిత, వాగ్భట, విష్ణుదేవ, రత్నఘోష, మాండవ్య ప్రభృతుల గ్రంథములను, శాలివాహన నాగార్జునుల రసశాస్త్రసంభాషణ విశేషములను, యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ. శ. 172—202) మున్నగు ఆంధ్ర చక్రవర్తులు ప్రోత్సహించిన రసాయన పరిశోధనాంశములను పరిశీలించి ప్రఫుల్ల చంద్రుడు తనయుద్గ్రంథమును రచించెననిన అందలి వైదుష్య మహిమ ఎట్టిదో వ్యక్తమగుటలేదా ?

భారతీయులు కేవలము తత్త్వశాస్త్ర మతశాస్త్రములనే బాగుగా నెరుగుదురనియు, భౌతికశాస్త్ర పరిజ్ఞానమును పాశ్చాత్యులు వారికి ప్రసాదించిరనియు ఆధునికు లనేకులు తెలుపుచుందురు. రసాయనశాస్త్రాది భౌతిక శాస్త్రములందు సయితము భారతీయుల ప్రజ్ఞ తక్కువకాదని ఈరీతి గ్రంథములవలన మనము చక్కగా గ్రహింపగలము. జగతియందలి వృక్షశాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడని వాసిగాంచిన సర్ జగదీశచంద్రబోసు తన పరిశోధనకు వేదబీజములే ఆధారములని ముక్తకంఠముతో పలికెను.

ఈజిప్టులోని పిరమిడ్‌లకు సన్నిహితములై దేవాలయము లుండినట్లు మనదేశములో హూణశకము ఐదవ శతాబ్దము మొదలు పదునొకండవ శతాబ్దమువరకు పాటలీపుత్ర, నలంద, విక్రమశిల, ఉదండపుర మున్నగు మఠములనంటియుండిన కళాశాలలయందు రసాయనశాస్త్రము బోధింపబడినది. సామాన్య లోహములను స్వర్ణముగా మార్చు విద్య రసాయన పరిశోధనమున ప్రాముఖ్యము వహించినది. ఇది నాగార్జున సృష్టియని తెలుపు గ్రంథములు కలవు. ఏడు దినములే జీవింపవలసి ఏడేండ్లును, పిదప ఐదువందల డెబ్బది సంవత్సరములు మన జాలి, తదనంతరము భీష్మునివలె ఒక్కరునికై తన ప్రాణమును విసర్జించిన నాగార్జునుడు తన పరిశోధనవలన తన తపస్సువలన నెట్టి ప్రజ్ఞ నలవరుచుకొనెనో పఠితలు గ్రహింతురుగాక !

ఈ గ్రంథము విశ్వప్రశస్తిని వడసినది. "ప్రపంచ రసాయనచరిత్రకు ప్రఫుల్లచంద్రుడు ప్రస్తుత ప్రచురణవలన ఒక నూతనాధ్యాయమును చేర్చె"నని ఒక ప్రసిద్ధ ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు పలికెను. "రసాయన శాస్త్రములో పదమూడవ శతాబ్దమున హిందువులు ఐరోపా శాస్త్రవేత్తలకంటె ముందంజ వేసి"రని ఒక జర్మను అధ్యాపకుడు ఈ గ్రంథమును గురించి పలికెను.

రసాయనశాస్త్రమందలి తన వైదుష్యమును పురస్కరించుకొని, కొన్ని నూతన రసాయన వస్తువులను సృజించి ప్రఫుల్లచంద్రుడు లోకోపకారమునకు గడంగెను. "మెర్క్యురస్ నైట్రైట్" (Mercurous Nitrite) అను క్రొత్త పదార్థము నాతడు కనిపెట్టెను. నాగార్జునునికాలము నుండి పాదరసమును గురించిన పరిశోధన విశేషముగా జరిగెను. కాలక్రమమున ప్రాచీ ప్రతీచీ పండితు లీపరిశోధన నింకను సాగించిరి. పాదరసముపై నైట్రిక్ ఏసిడ్ చేయుపని (Action of Nitric Acid on Mercury) గురించి పరిశోధనలు జరగుచుండెను. ఇందు మెర్క్యురస్ నైట్రైట్‌అను పదార్థము ఏర్పడునని తెలిపి, దాని నాతడు చేసిచూపి ఇతరులకు మార్గదర్శకుడాయెను. పాదరసమునకువలసిన రసాయన పదార్థముల నన్నిటిని ఆతడు పూర్తిచేసెను. ఇంచుమించు 80 పదార్థముల నతడు కనుగొనెననియు, వీనిలో నైట్రైట్సు చాల కలవనియు, కావుననే ఆర్మ్‌స్ట్రాంగ్ అను అధ్యాపకుడు ప్రఫుల్ల చంద్రుని "మాస్టర్ ఆఫ్ నైట్రైట్స్" అని ప్రశంసించె ననియు తెలియవచ్చుచున్నది.

1924 లో ఇండియన్ కెమికల్ సొసైటీ నెలకొలుపబడెను. ఈ కర్తవ్య నిర్వహణమున ఆతనిపాలు విశేషముగా నుండెను. దాని కాతడు తొలియధ్యక్షుడుగా నెన్నుకొనబడెను. దాని పురోభివృద్ధికై ఆతడు విశేషధనమును ఏరాళముగా నిచ్చెను.

ఆకాశమును చుంబించు సౌధములు కలకత్తాలో నుండుట విలోకించి "వీనిలో నొక్కటియైనను నాదియని చెప్పుకొనగల వంగదేశీయుడు లే"డని ప్రఫుల్లచంద్రు డనువాడు. ఆ మహానగరమందలి అతులైశ్వర్యములో చిల్లిగవ్వయైనను వంగవాసిది కాదని ఆతడు పలుకుచు, వంగసీమ ఆర్థికపురోభివృద్ధి, భారత భూమి ఆర్థికాభివృద్ధి ఎట్లుసాధ్యమగునని ఆతడు ఆతురపాటుతో ఆలోచించువాడు. ఈ లక్ష్యమును దృష్టియం దిడికొనియే "బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మక్యూటికల్ వర్క్స్"అను రసాయన పరిశ్రమసంస్థ నాతడు స్థాపించి తనయొద్దనుండిన ఎనిమిది వందల రూకలనందులకై వెచ్చించెను. కలకత్తాలో అప్పర్ సర్క్యులర్ రోడ్‌లో ఒక శిథిల గృహమందది నెలకొనెను. ఈ యుద్యమమున ఆదిపురుషు డాతడే ! ఆతని ప్రజ్ఞను పరికించి, యూరపుఖండమందలి వివిధ రసాయన ప్రయోగసంస్థలందలి పరిశోధనలను తెలిసికొనుటకై బెంగాలు ప్రభుత్వ మాతనిని పంపినది. ప్రఫుల్ల చంద్రుడు స్థాపించిన పూర్వోక్తరసాయన వాణిజ్య సంస్థ క్రమాభివృద్ధినంది, భారతదేశమందు ప్రశస్తినందినది. బహు సంఖ్యాకులందలి వస్తువులను కొని, దైనందిన జీవితమున నుపయోగించుచున్నారు.

విద్యార్థులపై, యువకులపై ఆతని కెంతేని వాత్సల్యము కలదు. వారి పురోభివృద్ధికై ఆతడు బహుళ హితోపదేశములను నొసగువాడు. 1926 లో మైసూరు విశ్వవిద్యాలయములో నత డొసగిన స్నాతక మహోపన్యాసమునందును, పిదప ఆలిఘుర్ విశ్వవిద్యాలయమం దాతడొసగిన స్నాతక మహోపన్యాసమునందు నిట్టి హితవులు విశేషముగా నుండెను. విద్య ప్రాంతీయ భాషలలో గరపబడినపుడే అది సముచిత వ్యాప్తినందుననియు, విశ్వ విద్యాలయములందలి ప్రబోధ విధానములు మారవలెననియు ప్రయోగములు ప్రాముఖ్యమునందవలెననియు, విద్యార్థులు శారీరిక

మానసిక పరిశ్రమలను పెంపొందించవలెననియు అతడు వచించెను. హిందూ మహమ్మదీయుల సంస్కృతులందు తనకుగల ఘన పాండిత్యమును వ్యక్తీకరించుచు, భారతీయ పురోభివృద్ధికై వారు సంయుక్తకృషి సలుపవలెనని అలిఘర్ విశ్వకళా పరిషత్తులోని మహోపన్యాసములో అతడు వచించెను.

సంఘసేవ

వివిధ రీతుల సంఘసేవయందు ప్రఫుల్లచంద్రునకు విశేషప్రీతియుండెను. 1917 లో కలకత్తాలో జరిగిన రాష్ట్ర జాతీయ సాంఘిక మహాసభ కాధ్యక్షుడై, అస్పృశ్యత తొలగవలెననియు, అది తొలగినప్పుడు భారతదేశమున ఏకత సుసాధ్యమగుననియు అతడు పలికెను. దేశమందు సమర్థులైన శాస్త్రనేత్త లుండవలెననియు, అట్టివారు కొలదిమంది ఏబదుగురైనను గోచరించుచో ఎన్నికలందు దాను పాల్గొందుననియు వంగరాష్ట్రమందలి కవున్సిల్‌కు తన్ను పోటీ చేయుమని ఆ సభయందు ప్రజలు తన్ను ప్రార్థించినప్పు డాతడనెను.

దీనారవ మెందు వినవడినను చివాలున నచటికి ప్రఫుల్లచంద్రుడు హుటాహుటి బోవువాడు. 1922 లో వంగదేశములో తీవ్రమైన వరదలు విజృంభించినవి. విపత్తు ఎదుర్కొనిన తావులందు నడుముగట్టి, ఆతడు విశేష కృషి సలిపెను. ఆహారమును, ఔషధములను ఆ యా ప్రాంతములందు తాను పంచిపెట్టి ఆ పవిత్ర కర్తవ్యమును నిర్వహించుటకై పెక్కు తావులకు యువకులను పుత్తెంచెను. రాజకీయ ప్రబోధ పరంపరవలన సాధ్యముకాని హిందూమహమ్మదీయైక్యము విపత్తులో నిర్వహింపబడిన సేవాసందర్భమున సుసాధ్యమైనదని ప్రఫుల్లచంద్రుడు పలికెను. ఆతనివలెనే ఆ సమయమున పల్లెప్రాంతములందు సంచారము సలిపి ప్రజలకు ఏడుగడయై నిలిచిన దీనబంధు సి. ఎఫ్. ఏండ్రూస్ ప్రఫుల్లచంద్రుని కృషిని కన్నులార గాంచి ప్రశంసించెను.

1901 లో ప్రఫుల్లచంద్రుడు గాంధి గోఖలే మహాశయులను తొలుత దర్శించెను. వారి యుదారాశయములపై మనసు నిలిపెను. అప్పటినుండి గాంధిజీపై అతనికి విశేష గౌరవము కుదిరెను. కలకత్తాలో 1920 సెప్టెంబరుమాసమున అవసర కాంగ్రెస్ మహాసభ జరిగినపుడు గాంధిజీ శంఖారవము శ్రుతిగోచరమైనపుడు, మహాత్ముని అనుచరులలో తానొక్కడై, ఖద్దరు దీక్షావస్త్రములనే ధరించుచు, నిర్మాణాత్మక క్రియను విశేషోత్సాహముతో నాతడు నిర్వహింపదొడగెను.

ప్రఫుల్లచంద్రుడు భీష్మునివలె బ్రహ్మచర్యవ్రతమును నిర్వహించిన మహనీయుడు. మహావిద్వాంసుడైనను అధ్యాపకుడై విశేషార్థమును సంపాదించినను అతడు నిరుపేదవలెనే జీవితము గడపెను. తన మాసవేతనములో విశేషభాగము నాతడు బీదవిద్యార్థులకును వెచ్చించువాడు. జీవిత సంధ్యాసమయమున పదునేనేండ్ల సంపాదనాధనము నాతడు కలకత్తా విశ్వవిద్యాలయమున కొసగెను. దీనిమీది వడ్డీ విద్యార్థుల కుపకారవేతనముగా వినియోగమగుచున్నది. అతని వస్త్రములు మిగుల సామాన్యములు. ఆడంబరముల నాతడెన్నడు నెరుగడు. కలకత్తాలో అప్పర్ సర్క్యులరు రోడ్డులో బోస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆ మహాపురుషుని పెక్కుమారులు కలిసికొను భాగ్యము నాకు గలిగెను. గోయిగల నులకమంచ మాతని శయ్య. బాల్యకాలములో అతడు వ్యాయామమొనరించువాడనియు, ఈతనేర్చిన వాడనియు విందుము. కాని అతని శరీరమును చూచినపుడు ఈ వ్యాయామ చిహ్నము లేవియు గోచరింపవు. గాంధీని మెచ్చు ప్రఫుల్ల చంద్రుడు గాంధి సోదరునివలె అగపడువాడు.

జగతిపై విద్యాధికులెందరు లేరు ? కాని ప్రఫుల్లచంద్రునితో పోల్పదగినవా రెందరున్నారు ? తన జీవితమును ప్రజాకల్యాణమునకై అంకితమొనరించుకొని, నరులకు సుఖమును ప్రసాదించుటకై కష్టమును కవుగిలించుకొని, సేవాధర్మమునే అర్ధాంగలక్ష్మిగ జేసికొని, ముండ్లశయ్యయే మురిపెంపుపాన్పు గావించుకొని, నిర్దుష్టమై పరమపవిత్రమైన స్వీయ జీవనమును ఈశ్వరనైవేద్యమని ప్రజాప్రసాదమని భావించి భారత స్వరాజ్యసిద్ధికై తపించి, అదూరమున విజయభేరిని వినుచు "నిన్ను సృజించి నేను ధన్యుడనైతి"నని విధాత తెల్పు వాక్కును వినుచు "భగవాన్! ఈ జీవనము నీ ప్రసాదము. స్వీకరింపు"మని అతనికి దాని నాతడు 1944, జూన్ 16 వ తేదీనాడు సమర్పించెను.

ప్రఫుల్లచంద్రునితో పోల్పదగిన మరొక మహా వ్యక్తి ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు. ఇరువురును మహా విద్వాంసులే. సంఘసేవయందును, ఈశ్వరసేవయందును ఇరువురును బద్ధదీక్షితులే; భారతమాతను హిందూజనయిత్రిని ఆరాధించిన మహాత్ములే.

విద్యాసాగరుని విగ్రహము కలకత్తా విశ్వవిద్యాలయమున కెదుట కాలేజీ స్క్వేర్ ముఖద్వారమున వెలయుచున్నది. దీనికి కొలదిగజముల దూరమున వామపార్శ్వమున ఇటీవల ప్రఫుల్ల చంద్రరాయల విగ్రహము నిర్మింపబడినది.

ఈ స్క్వేరులో మరేమూర్తులును లేవు. కలకత్తా విశ్వ విద్యాలయ సమక్షమున ఈ మహాపురుషుల విగ్రహములు స్థాపింపబడుట ముదావహము. ఈ విగ్రహ వ్యవస్థలో గభీరాధ్యాత్మిక భావములు నిహితములై యున్నవి. విద్యార్థులు విశ్వవిద్యాలయములో ప్రవేశించుటకు ముందీమహాత్ముల మూర్తుల నవలోకించి, వారి జీవితాదర్శములను, మననమొనరించుకొని, వారివలె దీక్షాదీప్తులై ఉదాత్తభావ భాస్వద్రోచులపై తమ అంతరంగిక దృష్టిని సాధించి దివ్యజ్యోతిర్మూర్తులకు జేజేలుపాడి, ఆలోకసందీపితాంతరంగములతో విశ్వవిద్యాలయమున ప్రవేశించి, పూతమంత్ర పునశ్చరణ మొనరించి, పునీతులై, మహత్తర జీవిత చరితార్థతనంది ధన్యులగుచున్నారు.

క ల గూ ర గం ప

భారతంలో అఖండయతి

శ్రీ మంగిపూడి కృష్ణమూర్తి

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు ఆగస్టు 1961 భారతిలో 'పాఠగ్రంధి పర్యాలోచనము' అను శీర్షికతోగల వ్యాసమునందు భారతకవుల అఖండయతి ప్రయోగాలను గురించి చర్చించినారు. ఆ వ్యాసములో శ్రీ శాస్త్రిగారు ఇట్లు వ్రాసినారు. "భారతకవులు ముగ్గురును అఖండయతిని వాడినారు. అట్టి పాఠములు వ్రాత ప్రతులలో ఉన్నవి. అవి అచ్చు ప్రతులలో మారిపోయినవి. అట్లు మార్చినవారు అఖండయతి ప్రతిపక్షులైన పరిష్కర్తలు." ఇవి శ్రీ శాస్త్రిగారికి 'తోచిన మాటలు'. కానీ ఆంధ్ర మహాభారతాన్ని పరిశీలించిచూస్తే, నేడున్న అచ్చుప్రతులలో కూడా అఖండయతి ప్రయోగాలు చాలా కనబడుతున్నవి.

అఖండయతిని నిర్వచించి, ఉదాహరణలిస్తూ, అనంతామాత్యుడు తన ఛందోదర్పణంలో ఈ క్రింది విధంగా చెప్పినాడు.

"వ. ఈ నిత్యసమాసయతిపేరఖండయతి

గీ. అఱ యనంగను బోవుట కర్థమైన
సంధి నిత్యసమాసోక్తి జరగు రెంట
నసుర వీరులనెల్ల నుక్కఱ వధించె
భానుకులుడు రావణుని నేపఱిచెననగ"

ఛందోదర్పణము ప్రథమాశ్వాసము. 100—101.

ఈ రకానికి చెందిన అఖండవడి ప్రయోగాలు ఆంధ్ర మహాభారతంలో చాలా ఉన్నవి. కనుగొనుడు.

1\. క. ఎఱకలుగల కుల శైలము
తెఱగుమెయిన్ రయము మెరయ దివికి నెగసి బె
ట్టుఱుము జలధరము క్రియ ను
క్కఱి భువనంబెల్ల నద్రు నార్చుచు గడిమిన్.

అరణ్య షష 345

2\. చ. ఎఱుగవుగాక రాఘవు సుదీర్ఘ భుజాబలరూఢి నాజిలో
నుఱిక తదీయ బాణరయమోర్వవశంబె పినాకికైన ను
క్కఱి మరి నీకు నిత్తెరగుగాదన కేఖలు డొక్కొబుద్ధిగా
గఱపినవాడు సేటునకు గాలము సేరెనొనాకయిమ్మెయిన్.

ఆరణ్య షష 320

3\. చ. ఎఱిగితి నేను నిన్ను విబుధేంద్రుడవీవు జగత్త్రయంబుగ్ర
చ్చఱి భవదీయ రక్షణమునందమెలంగుచుమండు. . .

ఆరణ్య సప్త 367

4\. చ. చిఱునగవొప్ప గాండివము చెచ్చెర సజ్యముసేసి సేనలు
క్కఱి రభసంబుమై నడరె గవ్వడి ద్రోణియునీడబోకయు
త్తఱి దరుమంగ నస్త్రములు దందడి మార్కొనిమండు
చుండె జిచ్చఱి పిడుగుల్ వడిందొరగు చాడ్పున నంబర
వీథి[illegible]గమై. విరాట. పంచమ· 143.

ఎఱ్ఱాప్రెగడ మరికొన్ని రకాలకు చెందిన అఖండయతులను వాడినాడు.

5\. ఎఱినార్యుండు సకలలో కైక విదితడయిన. . . .

ఆరణ్య సప్త. 469

6\. . . . . .నిశ్చల రూఢి జాలనొ
ప్పారెడు భూత ధాత్రి నిఖిలైకధురీణతబేర్మిబొందెడున్

ఆరణ్య సప్త. 244

నన్నయభట్టు ఈ క్రింది విధంగా అఖండయతిని ప్రయోగించి ఉన్నాడు.

7\. కం. ప్రస్తుత ఫణిసత్త్రభయ
త్రస్తాత్ములమైన యస్మదాదులకెల్లన్. . . . .

ఆది. ద్వితీ. 219

ఇట్లే కవిత్రయంచే వాడబడిన అఖండయతుల కెన్నిటినైనా ఉదాహరణలను చూపించవచ్చును. ఇకపోతే, శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, అచ్చుప్రతులలో గూడా ఉన్న పై ఉదాహరణలను పేర్కొనడంమాని, ఎక్కడాలేని ఒక ఊహా పాఠాన్ని కల్పించి, అది వ్రాతప్రతులలో ఉండి ఉంటుందనీ, దానిని పరిష్కర్తలు అఖండయతి ప్రతిపక్షులు, అచ్చు ప్రతులలో మార్చివేసిఉంటారనీ సెలవిచ్చినారు. శ్రీ శాస్త్రిగారు చెప్పిన వాక్యము లివి :

"వారికి (పరిష్కర్తలకు) అర్థదృష్టిహ్రస్వము. ఇందు కొక్క తార్కాణము.

సీ. నీలజీమూతంబు లీల నాక్షేపించి
నల్లనైతోఁ తెంచునట్టి తనువు
గల హిడింబుండు. . . . .

ఇది వ్రాతఃప్రతుల పాఠము. 'నట్టితనువు' అనుటలోఁ గల అఖండయతిని తప్పించుటకై పరిష్కర్తలు 'నల్ల

గృహము' అని మార్చినారు. మార్పులో 'న' కు 'న' యతి కుదిరినదిగాని అర్థ మధ్వాన్నమైనది'' అని శ్రీ శాస్త్రిగారు సెలవిచ్చినారు. నిశ్చయముగా ఇక్కడ శ్రీ శాస్త్రిగారు పొర బడ్డారు. పై సీసపద్యానికి మూలముతైన శ్లోకాలను గమ నిస్తే వారి పొరపాటు సువ్యక్తమవుతుంది. సంస్కృత భార తంలో హిడింబాసురవర్ణన రెండు చోట్ల కన్పిస్తున్నది.

''తత్ర తేషు శయానేషు హిడింబోనామరాక్షసః
అవిదూరే వనాత్తస్మాత్ సాలవృక్షం సమాశ్రితః
క్రూరోమానుషమాంసాదో మహావీర్యపరాక్రమః
ప్రావృడ్జలధరశ్యామః పింగాక్షోదారుణాకృతిః
దంష్ట్రా కరాళవదనః పిశితేప్సుః క్షుధార్దితః
. . . . ''
యదృచ్ఛయా తా నపశ్యత్ పాండుపుత్రాన్ మహారథాన్
సంస్కృత భారతం. ఆది 152 అధ్యా 1—4 శ్లో

పై శ్లోకాలను నన్నయభట్టు పూర్తిగా అనువదించ కుండా క్లుప్తంగా వచనంలో చెప్పివేసినాడు.

''తత్సమీపంబున బాలసాలతరుషండమండపమున హిడిం బుడను నొక్క రక్కసుండు వారి దవ్వులం జూచి,మై వెంచి రూక్ష కేశంబులు విదిచి యావులించి నీల్గి. . . . .''
ఆది. షష్ఠ. 186.

సంస్కృతభారతమునందు హిడింబుని వర్ణన మరల 153 వ అధ్యాయమునందు (ఆదిపర్వములో) ఇట్లు చేయ బడింది.

''తాం విదిత్వా చిరగతాం హిడింబో రాక్షసేశ్వరః
అవతీర్య ద్రుమా త్తస్మాత్ ఆజగామాశు పాండవాన్
లోహితాక్షోమహాబాహు రూర్ధ్వకేశో మహాననః
మేఘసంఘాతవర్ష్మాచ తీక్ష్ణ దంష్ట్రోభయానకః
తమాపతంతం దృష్ట్వైవ తథా వికృత దర్శనం
హిడింబోవాచ విత్రస్తా భీమసేన మిదంవచః''
ఆది. 153 అధ్యా. 1—3 శ్లో

పై శ్లోకాలకు నన్నయ్య అనువాదం.

''అట హిడింబుండు హిడింబ మసలుటకు మహా క్రోధా నలజ్వలిత చిత్తుండయి

సీ. కాల మేఘంబునుబోలె విశాలమై
నీలమై దేహంబు గాలుచుండ
ఘనతటిల్లతలయట్లెనిమిది దంష్ట్రలు
మెఱవంగ బండులు గొఱికి పెలుచ
నతిరోష లోహితాయత వృత్త నేత్రముల్
దిరుగంగబెట్టుచు బరుషకేశ
జాలంబుగాడ్పున దూలంగ గాలోప
మానుష్ట చనుదెంచుమానుషాదు

ఆ. డనుజ జూచి కష్టమనుజుల గూడినా
వనువు సేయకుండ జనునె నీకు
ననుచు నదరి పలుక విని హిడింబయు గడు
వెరచి భీమసేను మఱపుసొచ్చె''
ఆది. షష్ఠ . 202

ఇది హిడింబాసురుడు వర్ణించబడిన రెండవ సంద ర్భము. శ్రీ శాస్త్రిగారు తార్కాణంగా చూపించిన సీస పద్యం, పై శ్లోకాలలోని 'సంఘాత మేఘవర్ష్మాచ' అను దానికి తెనుగుసేత అయి ఉంటుందని వారి అపోహ.

''నీలజీమూతంబు లీల నాక్షేపించి నల్లనై తోఁతెంచు నల్లగృహముగల హిడింబుండు. . . . . .'' అను సీసము పై రెండు సందర్భములలో చెప్పబడిన శ్లోకము లలో వేటికివి సంబంధించినదికాదు. సంస్కృత భారతంలో, తరువాతి అధ్యాయంలో హిడింబాసురుని గృహము కూడా వర్ణింపబడినది. చూడండి.

''కుంతీ : యదివాస్య వనస్యత్వం దేవతా యదివాప్సరాః
ఆచక్ష్వ మమ తత్సర్వం కిమర్థం చేహతిష్ఠసి
హిడింబా : యదేతత్పశ్యసివనం నీలమేఘ నిభం మహత్
నివాసో రాక్షసస్యైవ హిడింబస్య మమైవ చ
తస్యమాం రాక్షసేంద్రస్య భగినీం విద్ధిభామిని''
ఆది. 154 అధ్యా. 3—5 శ్లో.

పైన చూపబడిన కుంతీ హిడింబా సంభాషణకు నన్నయ్య గారి అనువాదం.

''. . .హిడింబంజూచి యిది వనదేవతయో సురకన్య యో యనుచు విస్మయం బందిరంత గుంతి శాంత వచనంబుల నీ వెవ్వరిదాన విటయేలవచ్చితని యడిగిన నది యిట్లనియె.

సీ. నీలజీమూతంబు లీల నాక్షేపించి
నల్లనై తోఁతెంచు నల్లగృహము

గల హిడింబుండను బలవంతు రక్కసు
వెలయును. . . . ."

ఆది. షష్ఠ, 213—214.

పై శ్లోకాలను, నాటి ఆంధ్రానువాదాన్ని పరికిస్తే అచ్చు ప్రతులలోనున్న "నల్లనై తోలెంచు నల్లగృహము" అను పాఠమే సరియయినదని నిర్ధారణగా చెప్పగలము. అంతేకాని శ్రీ శాస్త్రిగారు ఊహించినట్లు అది హిడింబుని ఆకార వర్ణనకు సంబంధించిన పద్యముకాజాలదు. దానితో "ఒల్లు ఇల్లుగా" మారనూలేదు.

ఏతావతా నేను చెప్పేదేమంటే, కవిత్రయం అఖండ యతిని అంగీకరించినారు. కాని శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు అందులకు ఉదాహరణగా ఊహించి, యిచ్చిన పద్యపాఠము మాత్రం సరియైనదికాదు. మీదు మిక్కిలి "నల్లగా లోలెంచు నల్ల గృహము" అను దానిని అర్థం చేసుకోవడంలో కూడా శ్రీశాస్త్రిగారు పొరబడినారు. "నల్ల" అనే విశేషణం పునరుక్తమయిన దనీ, నన్నయ్యభట్టువంటి మహాకవి ఇటువంటి చౌకబారు దోషాలకు గురియయి ఉండడనీ వారన్నారు. ఇక్కడ "నల్ల" అను విశేషణం పునరుక్తం కాలేదు. "నల్లగా లోలెంచు + అల్ల గృహము = నల్లగా తోలెంచు నల్ల గృహము" అయినది. నీల వర్ణములోనున్న పెద్ద వృక్షమే హిడింబుని నివాస స్థలం. దానినే హిడింబ "అల్లగృహము" అని చూపించినది. దీనిలో పరిష్కర్తలు చేసిన నేరమేమీలేదు. పైపెచ్చు, శ్రీ శాస్త్రిగారే, మూలమునూ, అనువాదమునూ సమగ్రంగా పరిశీలించకుండా తమవిమర్శలో పొరపాటు చేసినారు.

చంద్రభూష క్రియాశక్తి రాయలెవరు ?

శ్రీ బండారు తమ్మయ్య

ప్రౌఢదేవరాయలు (క్రీ. శ. 1422—1446) కర్ణాట రాజ్యమును బరిపాలించు కాలమున శ్రీనాథ మహాకవి జైత్రయాత్రకరిగి యా కర్ణాటాస్థానమునందు బండిత కవిగా నుండిన యష్ట దిగ్జయ యశోవిషంబ్దుండగు గౌడ డిండిమ భట్టారకుని నుద్భట వివాదమున నోడించి యాతని కంచుఢక్కనుబగులుగొట్టించి యాతని కవిసార్వభౌమ బిరుదము నూడిచికొనిన సన్నివేశమాతని జీవితమందలి యొక సుప్రసిద్ధ సంఘటనము. దీని నా కవి సార్వభౌముడు ఘనముగ సంభావించికొనియుండెను. శ్రీనాథుని చాటువుగా వినవచ్చెడి

"దీనారటంకాల దీర్థ మాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
బలుకుతోడై తాంధ్రభాషా మహా కావ్య
నైషధగ్రంథ సందర్భమునను
బగులు గొట్టించి యుద్భట వివాద ప్రౌఢి
గౌడ డిండిమభట్టు కంచు ఢక్క
చంద్రభూష క్రియాశక్తి రాయలయొద్ద
పాదుకొల్పితి సార్వభౌమ బిరుదు

అను చాటు పద్యమును, కాశీఖండ సప్తమాశ్వాసాంతమున కృతిపతి వీరభద్రారెడ్డిని సంబోధించుచు నాతడు లిఖించిన

"కర్ణాట క్షితిపాల మౌక్తికసభాగారాంత రావర్తిత
స్వర్ణ స్నాన జగత్ప్రసిద్ధ కవితా సంస్తుత్య చారిత్ర !"

అను పద్యమును, విజయనగరమున రాజ దర్శనము కయి వేచి యున్న కాలమున రచించిన చాటువులలోని

"దక్షిణోపేంద్ర ప్రౌఢ రాయ క్షితీంద్ర !"

"ప్రౌఢ దేవేంద్ర రాయ భూపాలవరుని సమ్ముఖమ్మున దయ చూడు మమ్మనుచు !" అను సంబోధనములు నిందుకు ప్రబల నిదర్శనములు. పూర్వోక్తమయిన యుద్భట వివాద సమయమున ప్రౌఢ దేవరాయల సమక్షమున మాధ్యస్థ్యము వహించి డిండిమ భట్టారకుని కవి సార్వభౌమ బిరుదము నాతని కూడ దీయించి శ్రీనాథుని కంటగట్టించిన పండిత మౌళి, చంద్రభూష క్రియాశక్తి రాయలని పయిచాటువు వలన ద్యోతకమగుచున్నది. క్రియాశక్తి పీఠమానాడు విజయనగర ప్రాంతముల ప్రతిష్ఠితమయిన యొక శైవాచార్య మఠము. ఆ మఠాధిపతులు క్రియాశక్తి యొడయారులని వ్యవహరింప బడెడివారు. కన్నడములో ఒడయను (డు) శబ్ద బహు వచన రూపము ఒడయరు. ఒడయడనుగా ప్రభువు. కాగా ఒడయుడు, రాయడు సమానార్థకములు. క్రియాశక్తి యొడయరుకు సమానార్థరూపమే క్రియాశక్తి రాయలు. శ్రీనాథుని గవి సార్వభౌమ బిరుద పాదు కొల్పిన వ్యక్తి చంద్ర భూష క్రియాశక్తి రాయలెవరనునది యిదమిద్ధముగ నింత దనుక జరిత్రకారులచే నిర్ణీతము కాలేదు. క్రీస్తుశకము పదిరెండవ శతాబ్దిలో బసవేశ్వరునిచే వీరశైవ మతోద్ధరణము జరిగిన కాలమున శైవమతశాఖ లనేకములు వీర శైవమున విలీనమయిపోయెను. పాలకురికి సోమనాథుని ద్విపద బసవ పురాణము సప్త మాశ్వాసమందలి "దేవలకులు మంత్ర దీక్షాన్వితులును, శైవపాశుపతాది శాసన ధరులు, వారి వారిక లింగవంతులై కూడి, వారి వారికలింగ వంతులై చూచి, వీర మహేశ్వరాచార నిరూఢి, భూరి ప్రసాదోపభోగులె నడువ" అను వాక్యము లీ విషయము నిరూపించును. పది రెండవ శతాబ్దికి బూర్వము కర్ణాటాంధ్ర దేశముల వెలసిన పాశుపత, కాలాముఖ మతములు చాలవరకు బదుమూడు, పదునాలుగు శతాబ్దాలలో వీర శైవ మఠములుగా మారిపోయినవని చరిత్రజ్ఞులు పలువురు తలంచుచున్నారు. క్రియా శక్తి మఠము గూడ ప్రౌఢదేవరాయల కాలమునకు వీరశైవమఠముగనో, తదుప మఠముగనో పరిగణితమయియుండునని తలంచుట సత్యదూరము కానేరదు.

కలగూరగంప

చంద్రభూష (శేఖర) క్రియాశక్తి నామాంకితులగు శైవాచార్యులు శాసనములందు వేర్వేరు కాలములలో భిన్న భిన్నముగ గానవచ్చుచున్నారు. బుక్కరాయ, హరిహరరాయుల కాలమున క్రీ. శ. 1349 నాటి కొండూరు శాసనములో నొక చంద్రశేఖర క్రియాశక్తి పేర్కొనబడియున్నాడు. అతడే శ్రీనాథుని కాలమును గూడ నుండెనని తలంచుట యంత యసంగతము కాజాలదు. క్రీ. శ. 1378 నాటి వోగతి (మైసూరు రాష్ట్రము) శాసనములో వేరొక చంద్రశేఖర క్రియాశక్తి పేర్కొనుబడుటచే నాతఁడే కొండూరు శాసనమున బేర్కొనబడినవాడు కాదగుననియు, శ్రీనాథుడు గౌడ డిండిమభట్టుతో వివాదించుటకయి కర్ణాటాస్థానమున కేగినది క్రీ. శ. 1406 ప్రాంతమున గొండవీటిలో బెదకోమటి వేమారెడ్డి యాస్థానమున విద్యాధికారిగా నున్నప్పుడు మొదటి దేవరాయల కాలమందయి యుండుననియు, మిత్రులు శ్రీ నేలటూరు వేంకట రమణయ్యగారు 1945 అక్టోబరు భారతిలో "చంద్రభూషణ క్రియాశక్తి" అను వ్యాసమును బ్రకటింపగా నందలి యసంగతులు బరామర్శించుచు, శ్రీనాథుఁడు కొండవీడులో బెదకోమటి వేమన, రాచ వేమనల పాలనమంతరించిన తర్వాత, రాజమహేంద్రవరమున అళ్ళయవేమ, వీరభద్రారెడ్లు, యాశ్రయమంది వారి మంత్రి బెండపూడి యన్నామాత్యుని కంకితముగా భీమేశ్వర పురాణము రచించిన యనంతరమే క్రీ. శ. 1430—1435 ప్రాంతమున గర్ణాటా స్థానమున కేగుచు మార్గమధ్యమున విజయనగరరాజుల యుద్యోగియైన వల్లభరాయుని వినుకొండలోగాని, మోపూరులోగాని సందర్శించి క్రీడాభిరామ రచనమున నాతనికి సహకరించియుండునని 1946 మే నెల భారతిలో "శ్రీనాథుడు చంద్రభూషక్రియారాయలు" అను ప్రతి వ్యాసమున సప్రమాణముగ నిరూపించియున్నాను. శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయల యాస్థానమున డిండిమభట్టు నోడించి, కనకాభిషేక సత్కారమంది, తిరిగి వచ్చునపుడు మార్గమున రాచకొండయందు రావు వంశ్య సర్వజ్ఞసింగ భూపాలుని సందర్శించినది, భీమఖండ రచన యనంతరము, కాశీఖండ రచనమునకుబూర్వము ననుట నిస్సందేహము. అందుగూర్చిన చర్చ లనవసరములు.

ఇక ప్రౌఢదేవరాయల యాస్థానమున శ్రీనాథ డిండిమ భట్టారకుల వివాదమున మాధ్యస్థ్యము వహించిన చంద్రభూషణ క్రియాశక్తిరాయలు, బుక్కరాయలునాఁటి కొండూరు శాసనమున నుదాహృతుడయినవాడుగాని, క్రీ. శ. 1378 నాఁటి వోగతి శాసనమున నుదాహృతుండనిగాని, కాక క్రీ. శ. 1420—1440 మధ్య శాసనములలో బేర్కొనబడిన మరొక వ్యక్తిగానవచ్చి, యాతనికి ప్రౌఢదేవరాయనికి సంబంధమును స్థాపించు నాధారములున్నచో శ్రీనాథునికి గవి సార్వభౌమ బిరుదమును బాదుకొల్పిన వాడాతడేయయియుండునని నిరూపించుటకభ్యంతరము లుండనేరవనియే నా యభిప్రాయము. విజయనగర సామ్రాజ్యమును స్థాపించిన తొల్లింటి సంగమ వంశ రాజులు బుక్కరాయాదులు సామాన్య శైవ మతస్థులయినను వారి వంశ్యులలో ప్రౌఢ దేవరాయలు నాతని పుత్రులు మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు వీర శైవ మతమును స్వీకరించినట్లు ప్రబల ప్రమాణము లున్నవి. మైసూరు ఆర్కియాలజి రిపోర్టు (1923 సంవత్సరము) 91 పేజీలో 92 నంబరుగా నుదాహరింపబడిన కొంగిగపుడ శిలా శాసనము (క్రీ. శ. 1419) ఆరవ పంక్తిలో రెండవ దేవరాయలు (ప్రౌఢ దేవరాయలు) వీర శైవాగమసార సంపన్న బిరుదమును వహించినట్లు చెప్పబడినది. ఎపిగ్రాఫియా కర్నాటికా 15 నంబరు వాల్యూములోని అరిసికేరిజిల్లా 238, 239 శాసనములలో రెండవ దేవరాయలకు నంజప్ప, మూరురాయ బసవశంకర నెరినాయక నామాంకితులగు కుమారులుండినట్లు చెప్పబడినది. ఈ పేరులు వారి వీర శైవతకు ద్యోతకములు. విరూపాక్ష పండితుడు కన్నడమున రచించిన చెన్న బసవ పురాణములో రెండవ దేవరాయలు తన కొమరితను వీరశైవ జంగమ స్థలమునకుజెందిన వీరన్న యొడయరు అను నతనికి బెండ్లి గావించినట్లు చెప్పబడినది. చామరసు రచించిన ప్రభు లింగలీలను బఠించిన తర్వాత ప్రౌఢదేవరాయలు ముగ్ధుండయి వీరశైవ దీక్షితుడయినాడని కర్ణాట విద్వాంసులు పరంపరగా విశ్వసించుచున్నారు. ఆతని మంత్రులు లక్కణ జక్కణాదులు గూడ నాతని మార్గమనుగమించిరి. కర్ణాటభాషలో, క్రీ. శ. 1672 సంవత్సరమున రచించిన భైరవేశ్వర కావ్య కథా సూత్ర రత్నాకరము, క్రీ. శ. 1650 నాఁటి గురురాజ చరిత్ర, క్రీ. శ. 1763 నాటి చోర బసవరాజ చరిత్ర మున్నగు గ్రంథములవలన గూడ నీ విషయము వ్యక్తము కాఁగలదు.

వీరశైవ పంచాచార్య సింహాసనములలో, ద్వితీయాచార్యుడు దారుకుని (కురుళసిద్ధని) నద్ధర్మ సింహాసనము

బళ్లారిజిల్లా ఉజ్జినిలోను, చతుర్థాచార్యుడు పండితారాధ్యుని సూర్య సింహాసనము శ్రీశైలము, గూళూరు (మైసూరు రాష్ట్రము) నిడుమామిడి (అనంతపురము జిల్లా) అను క్షేత్రములందును నెలకొనియున్నవి. గూళూరునందలి పండితారాధ్య పీఠమునకు సంబంధించిన చరిత్రము సేలముజిల్లా హోసూరు వాస్తవ్యుడు పుర్లకవి పండిత చరిత్రమనుపేరితో క్రీ. శ. 1800 ప్రాంతమున తత్పీఠాచార్యుల యాదరానురోధమున ప్రబంధ రూపముగ రచించియున్నాడు. ఆ గ్రంథము నేడు గూళూరు మఠాధీశ్వరులచే 1952 సంవత్సరమున బెంగుళూరులో ముద్రింపబడి ప్రకటింపబడినది. ఆ గ్రంథము చివర నొసంగబడిన తత్పీఠాచార్యుల కట్టెవల్లరిలో నొక చంద్ర భూషణ శివాచార్యుని నామము కానవచ్చుచున్నది. అతడే పండితారాధ్య పీఠాధీశ్వరుడుగా క్రిందటి 1433—1450 సంవత్సరముల మధ్య నుండినట్లు తెలియుచున్నది. అతనికి సంబంధించిన శాసన మొకటి నిడుమామిడి మఠములో నేటికిని భద్రపరుపబడియున్నది. దాని నకలీ క్రింద బొందు పరచుచున్నాను.

“శుభమస్తు. కాళయుక్తి సంవత్సర శ్రావణశుద్ధ 10 శుక్రవారము శ్రీమద్రాయ రాజగురు మహా మండలాచార్య శ్రీ చంద్రభూషణదేవ ఒడెయార నిడుమామిడిన సుదేవ స్థానదలి, అరణమరసరమగ బాబరనను ప్రతిష్ఠ నాడిద బసవ రాజదేవరు మంగళమహాశ్రీ” ఈ శాసన కాలము క్రీ. శ. 1—5—1438 తేదికి సరియగును.

ఈ పండితారాధ్య పీఠమందలి లేఖ్యములుబట్టి యీ చంద్రభూషణాచార్యుడు తరుచు రాజాస్థానమున విజయ నగరమునందే యుండెడివాడని, తుద కచ్చటనే లింగైక్యమయ్యెనని తెలియుచున్నది. అతని సమాధి యిప్పటికి హంపీ క్షేత్రములో నున్నదట. వీర శైవ దీక్షానంతరము ప్రౌఢ దేవరాయలు ఉజ్జినియందలి సద్ధర్మ సింహాసన పీఠమునకు బండితారాధ్య సూర్య సింహాసన పీఠమునకు రెండింటికి గూడ శిష్యుడుగా నుండినట్లు తెలియుచున్నది. ఉజ్జిని సంస్థానమునకు సంబంధించి పూవల్లి పంచపన్నెగెనందీశ శివకవి కర్ణాట భాషలో రచించిన మరుళారాధ్య విజయమను గ్రంథములో ప్రౌఢదేవరాయలు చిరకాలము సంతానములేక యప్పటియుజ్జిని పీఠాధీశ్వరుల యనుగ్రహాశీర్వాదములవలన సంతతి బడసినట్లున్నది. ఇందుచే నాతడు విజయనగరమున దనయాస్థానమున బండితారాధ్య పీఠాభిషిక్తుండయిన చంద్రభూషణ శివాచార్యునిగూడ నిలిపికొని గురు భక్తితో నాతనిగూడ సేవించుచుండినట్లు తలంపనగును. అప్పుడుపపీఠములుగా నుండిన క్రియాశక్తి పీఠములు గూడ నీ చంద్రభూషణ శివాచార్యుని పర్యవేక్షణ పరిపాలనము లోనే యుండియుండును. శ్రీనాథుని కవి సార్వభౌమ బిరుదమును ప్రౌఢదేవరాయల యాస్థానమున బాదుకొల్పిన పండిత పతంను డీతడేయయి యుండునని తలంచుట సర్వ విధముల సంగతముగనుండునని నా యభిప్రాయము. విజ్ఞులు పర్యాలోచింతురు గాక!

కన్యాకుళం యుద్ధము

శ్రీ వేదం వెంకటకృష్ణశర్మ

ప్రాచీన కాలంలోని దక్షిణ తిరువాంకూరు ఈనాటి కేరళ రాష్ట్రంలో చేరినభాగంకాదు. కేరళప్రభువైన మార్తాండ వర్మ దాన్నిగెలిచి తనరాజ్యంతో కలుపుకునేంతవరకు అది ప్రత్యేకం ‘వేనాడు’—అనేపేరితో వ్యవహరింపబడుతూ వచ్చింది. 17—వ శతాబ్దిలో దాన్ని ఏలినరాజుకు చాలా శౌర్యసాహసౌదార్యాదిగుణాలతో ఒప్పుతూవుండిన “ఇరావికుట్టిపిల్లై” అనే మహావీరుడు మహామంత్రిగా, సర్వసేనాధిపతిగా పేరుపొందినాడు. అతడి నిసర్గస్వభావాన్నిబట్టి దేశింగుమహారాజుతో లేదా, తాంద్రపాపారాయుడితో పోల్చదగినవాడనవచ్చును. పైవారిమీద జానపద గేయాలు వెలసినట్లే, “ఇరావి” అనే యీ మలయాళవీరుని మీదకూడా జానపదగేయం వెలిసినది.

ఆకాలంలో వేనాడు సర్వస్వతంత్రతంత్రంగా సర్వాధికారాలుగల పెద్దరాజ్యం. సామంతరాజ్యాలకు అధిపతులయిన ఎనమండుగురు వేనాటి రాజ్యాంగాలకు మంత్రులుగాను సేనాధిపతులుగాను ఉండేవారు. అందరు చక్కగా తరిబీతయిన సేనలు గలవాళ్ళుకూడా. వాళ్ళందరూ వంశపారంపర్యంగా పాలెగాళ్ళ కుటుంబాలకు చెందినవాళ్ళు. అదేవిధంగా ఇరావికుట్టిపిళ్ళ అనే అతడుకూడా దక్షిణ తిరువాంకూరిలోని ఒకపెద్ద పాలెగాని కుటుంబంలో క్రీ. శ. 1602 సంవత్సరములో పుట్టినవాడు. అయితే మంత్రివర్గంలోని తక్కినపాలెగాళ్ళకంటె అద్భుతమయిన మేధాశక్తి, శరీరదార్ఢ్యం గలవాడు. గనుక శీఘ్రకాలంలోనే ఉన్నత పదవికి రాగలిగినాడు. 30 ఏండ్లప్రాయం వచ్చేటప్పటికి అతడు మహామంత్రి—సర్వసేనాధిపతి అయి, రాజ్యతంత్రమంతా తననిశితమతితో నడిచేట్టు వర్తించినాడు.

ఆకాలానికి 17—వ శతాబ్దికి చాలముందుగనే మధురను పాలిస్తూ వచ్చిన పాండ్యచోళ నాయకరాజులు కూడా ఆదక్షిణ తిరువాంకూరిమీదకి మాటిమాటికి దండెత్తిరావటంకూడా అగిపోయింది. ఆతరువాత జరిగినకథనే ఈ మలయాళీజానపదగీతం వర్ణిస్తుంది. అప్పటికి మధురరాష్ట్రప్రభువైన తిరుమలనాయకుడు తనసైన్యాధిపతిఅయిన వేలయ్యప్పన్ అనే అతడిస్వాధీనంలో కొంతసేనను వేనాటిమీదకు పంపుతాడు. అది ఆరంబోలెకనుమలో ఇరావిసైన్యంతో తలపడుతుంది. ఆ మొదటి తాకిడిసే వేనాటిసేన దిగ్విజయంపొందుతుంది. ఆయుద్ధంలోనే నాయకరాజసైన్యపతి వేలయ్యన్ నేలకూలడంకూడా తటస్థిస్తుంది. తిరుమలనాయకు డది విని ఆశ్చర్యచకితుడై మైసూరుప్రాంతానికి సంగ్రామయాత్రకు వెళ్ళిఉండిన తనసర్వసేనాధిపతిఅయిన రామప్పయ్యన్ అనేఅతడిని వెంటనే రమ్మని ఆజ్ఞాపించినాడు. అతణ్ణి పెద్దసేనా సమూహంతో తక్షణం ఇరావిని మార్కొనటానికి పంపినాడు.

కలగూరగంప

ఇంతలో వేనాటిపాళెగాండ్రలో కుట్రఒకటి ఆరంభమయింది. ఇరావితప్ప తక్కినయేడుగురు పాళెగాండ్రును, మంత్రులవర్గంలోని తక్కినవారు, ఏకాంతంగా చేరి రహస్యాలోచనలకు దిగినారు. తాము సామ్రాజ్యాధిపతిఅయిన తిరుమల నాయకుని సేనను అందులో అమితశక్తిసామర్థ్యవంతుడయిన సర్వసేనాధిపతిని ఎదిరించి పోరాడలేమని నిశ్చయించుకున్నారు. వెంటనే ఆరామప్పయ్యన్‌కు అతనిపక్షంలో చేరుతామని వార్త పంపినారు. తదనుగుణంగా 'ఇరావి'తో రేపు యుద్ధమనగా ఈదినం సాయంతనమే తాము పగవాడిసేనలకు కుడియెడమ పార్శ్వలలో మార్కొని యుద్ధంచేయగలమని, అతడు సేనామధ్యంలో ప్రవేశించి ప్రతాపం చూపవలెనని ప్రోత్సాహంచేయగా ఇరావి అందుకు సమ్మతించినాడు.

రాత్రి ఇరావితల్లికీ, భార్యకూ భయంకరమైన దుస్స్వప్నాలు వచ్చినవి. మరుసటిదినం తెల్లవారగానే ఇరావి యుద్ధసన్నద్ధుడవుతూవుండగా ఒకనల్లటిగ్రుడ్లగూబ పొడుపడి శవాలతోనిండి ఉన్న యుద్ధభూమిలో వికారంగానూ భీతావహంగానూ కూస్తూఉండినట్లును, ఏనుగులు గుంపులు గుంపులుగా చుట్టుకొని ఒకసింహాన్ని సంహరించినట్లును కొడుకుతోచెప్పి యుద్ధానికి ఆనాడు పోవడం శ్రేయస్కరంకాదని చెప్పినది. అతని యిల్లాలితనకు అంతకంటేకూడా గుండెలుజలదరించే చెడ్డకలలు వచ్చి నవనీ పూడలతో వ్రేళ్ళూనుకొన్న బ్రహ్మాండమయిన మర్రిచెట్టు క్రుంకుర్వేళ్ళతోకూడా భూమి సదిలిపోయేంత పెద్దశబ్దంతో కూలిపోయినట్లు, తాము పడుకునే బంగారు పట్టెమంచం నించి సుడులుచుట్టుకొంటూ చితాగ్నిమోస్తరు పొగలురేగి ఆకాశాన్ని ఆవరించినట్లు, పవిత్రమైన తనమెడలోని మంగళసూత్రంగల బంగారు గొలుసు నిర్హేతుకంగా ముక్కలుముక్కలై నేలమీదరాలినట్లు దుస్సహమయిన పాడుకలలు కన్నట్లు చెప్పి, తనమగని యుద్ధయాత్ర నిలుపమని ప్రార్థించింది. కాని వారికి ప్రశాంతంగా స్తిమితంగా ఇరావి సమాధానంచెప్పినాడు. "పుట్టినతరువాత చావు అనేది ఎన్నటికైనా తటస్థించకతప్పదు. ఈశరీరంఅనే విత్తు నాటినవాడు భగవంతుడు. బీజంవేసినవాడు ఫలితకాలంలో దానిఫలాన్ని స్వాదీనంచేసుకోవటం లోకసహజం.అలాగే భగవంతుడు నాజననానికి ఎట్లు కారణభూతుడో అట్లే నన్ను తాను స్వీకరించటానికి కారణభూతుడేగదా! ఇందులో అక్రమం ఏముంది ?—కనుక మీరు నా విజయాన్ని కోరుతూ నెమ్మదిగా ఉండవలెనని మనసారకోరుతున్నాను. జీవికాపత్పరంపరలు భగవదధీనం అనే పెద్దలవాక్యం మరవరాదు."

తరువాత ఇరావి కవచం ధరించి తల్లికి నమస్కరించి తనకుమ్రొక్కిన భార్యను లేవనెత్తి వోదార్చి ప్రభువయిన ఉన్ని కేరళవర్మ'నగరుకు వెళ్ళాడు.ఆయనఇరావినిదీవించి ఖడ్గాన్నిఅందించినాడు. అలా రణరంగానికి బయలుదేరిన ఆ మహాయోధుణ్ణి వేల కొలదిమంది పౌరులు వెంబడించినారు. తీరా యుద్ధభూమిని సమీపించి వెనుదిరిగిచూచి తన్నెడబాయకవచ్చే జనానీకానికి నమస్కరించి వారివారి నివాసస్థానాలు చేరమనీ, తానుత్వరితంగానే వచ్చి వారిని కలుసుకుంటానని నమ్మబలికి పంపివేశాడు.

అనంతరం జరిగిన ఆయుద్ధాన్నిగూర్చి జానపదగేయం విస్తారంగా వర్ణిస్తుంది. నాయకప్రభుసేనామధ్యంలో ఇరావి చొచ్చుకుని ముందుకు వెళ్ళుతూవుంటాడు. ఆశత్రువాహిని రెండు పాయలుగా చీలిపోతుంది. వేనాటి సామంతులు తమకుట్రనుఅనుసరించి పగవారిసైన్యానికి కుడియెడమదిక్కులలో నిలిచి వాటిని తాము నిర్మూలనపరుస్తూవుండేవాళ్ళమోస్తరే ఇలావికి తోపింపజేస్తూ అగ్రభాగం చేరుకొన్నారు. ఇంతలో నాయకరాజు సర్వసైన్యాధిపతిఅయిన రామప్పయ్యన్ ఏకోన్ముఖంగా సైన్యమంతా ఇరావిని చుట్టుకునేటట్లు ప్రోత్సహిస్తాడు. అంతమందితో తానుపోరాడవలసివున్నా ఇరావి ఏమాత్రంవెనుదీయక శత్రువులను తుత్తుయలుచేసి నేల గూలుస్తాడు. ముఖాముఖి ఆశూరాగ్రేసరుణ్ణి ఎదురుగా నిలిచి మార్కొనేమొనగాడు లేకపోయినాడు. రామప్పయ్యనుకూడా సాహసింపలేకపోయినాడు. తుట్టతుదకు కుట్రదారులలోనే ఒకడు వెనకనుండి బలంగా ఇరావి నెత్తిమీద కొట్టినాడు. ఈయుద్ధం క్రీ. శ. 1644లో జరిగింది. అప్పుడు ఇరావి యమస్సు 32ఏండ్లుమాత్రమే....

ఈవార్త ప్రభునిచెవినిబడగానే శోకసాగరాన మునిగిపోయెను. ఇరావి మాతృదేవికి అర్ధాంగికి వోదార్పుగలుగుటకై అతడెన్నివిధాల ప్రయత్నించినా ప్రయోజనము లేకపోయింది. తుదకారాజుకు అంతటిమహావీరుని కోలుపోవుటచే తనజీవితమే వ్యర్థమనితోచింది.

ఆవీరునిక్రింద ఒకజట్టునకు సేనాపతిగఉండిన కాళీనాయరుకు ఇరావియెడల చాలవిశ్వాసం ఉండేది. అతడు తన నాయకుడి తలనైన తేవలెననేసంకల్పంతో వైరులసేనలో జొరబడి ఇరావి

శీర్షాన్ని కనిపెట్టి తిరిగితెచ్చేసమయంలో విరోధులు అతణ్ణి బంధించి రామయ్యప్పన్‌వద్దకు తీసుకొనివెళ్ళినారు. అతడు ఆతలనుఇమ్మనీ అతనికి సేనలో గొప్పపదవిఇుస్తాననీ ఆశ చూపినాడు. కాని నాయరు లోబడలేదు. బలాత్కారంగా అతనిచేతఉన్న ఇరావి తలను తీసుకొని అతణ్ణి అసర్వసేనాధిపతి తరిమివేసినాడు. అంతతో కథ ముగుస్తుంది.

ఆపైన రామప్పయ్యన్ ఇరావితలను తీసుకొనివెళ్ళి తిరుమలనాయకుడికి సమర్పిస్తూ, మనవేలయ్యను వధించిన పగ నేటితో తీరింది ప్రభూ?—అన్నాడు. కాని ఆతలను పరిశీలిస్తూ తదేక దృష్టితో చూచిన ఆ నాయక మహామండలేశ్వరుడి కండ్లలో నీళ్ళు గిర్రునతిరిగింది. "రామప్పా! ఇంతటివీరుడు—రాజభక్తుడు మహాయోధుడు ఈభూలోకంలో మరొకడున్నాడనుకుంటావా ? జీవంలేకున్నా ఈముఖం ఎంత గంభీరంగా ఉన్నదో చూచినావా ? వేనాటిలో ఇంతటివీరుడున్నాడని తెలిసివుంటే ఇదివరకెప్పుడో సామ్రాజ్యసర్వసైన్యాధిపత్యం నిన్ను వరించిఉండేదేనా?దురదృష్టం వల్ల విశ్వాసఘాతులకుట్రకు లోనై మరణించాడు. కాని నీవు కూడా ఇతణ్ణి మార్కొలేవు సుమా ? అయినా నీ సాహసం మాకు తెలియనిదికాదు గాని ఏవిధంచేతను ఇరావి వధ సక్రమయిందని ఇప్పుడేకాదు, భావికాలంలోనూ సమర్థించడం అశక్యం.

ఈ జానపదగేయాన్ని ఇంతచక్కగా వ్రాసినవాడు కూడా ఆ ఇరావియుద్ధాన్ని ప్రత్యక్షంగాచూచినట్లు తెలుస్తుంది. ఈ గేయంలో మలయాళ పదాలకంటే అరవపదాలే ఎక్కువగా కనిపిస్తవి. దీన్నిపట్టి దక్షిణ తిరువాంకూరు 16—17 శతాబ్దాల నాటికే అరవలకు కూడా నివాసస్థానంగాఉండినట్లు ఏర్పడుతుంది. ఆకాలంలో అది వారి అధికారానికి లోబడిఉన్నట్లుకూడా నిదర్శనాలు కనిపిస్తవి. రాష్ట్రవిభజనకాలానికి అది మలయాళంలో చేరి మద్రాసురాష్ట్రంలో ఒకభాగం అయింది.

విట్ఠలరంగనాథ రామాయణము

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

లోగడ భారతి (జులై, 1961 సంచిక) లో కల కలగూర గంపయందు 'రంగనాథ రామాయణము' ప్రకటించునప్పుడు

'నా నొప్పు గోన ర–ఙ్గక్షితీంద్రునకు.' ఇట్లు సంస్కృత పద్ధతిలో వ్రాసిన 'న—ఙ్ఞ'లకు సంయుక్తయతి చెల్లునో, లేదో స్పష్టముగా తెలియుటలేదు అని వ్రాసియుంటిని.

ఇప్పు డదియే మూలపాఠము కాబోలన్నను, దానిని బలపరచుట కొక పూర్వలక్షణప్రయోగము కలదు.

క. వితత సుకవి వాక్యం బవ
గతమై 'కవయో వదంతి కావ్యం' బని స
త్కృతి నీక్రియఁ బెట్టించిన
నతిశయమై యుండు సుప్తిఙ్గంతం బయ్యున్
—(కవిజనా దోషి. 25 ప.)

ఈ కంద పద్యములో రేచన వైకల్పికముగా 'అతి—అంత; నతి—జంత'. ఉభయవళి ప్రయోగించినట్లు కనబడుచున్నది. అచ్చులకును, హల్లులకును మైత్రి ఉభయ తారకముగా కూర్చబడినది.

ఇందలి 'నతి' శబ్దము సంస్కృతపద మనుకొన్నచో అది 'వక్ర' వ్యంగ్యోక్తి యతి కుదాహరణము కాబోలన నీలున్నది. ఇట్లది అఖండయతిగా వ్యంజకమగుచున్నది. గోనవిట్ఠల రఙ్గనాథ రామాయణ ప్రయోగమీ రేచన ఛందోలక్షణమును వ్యాఖ్యానించుచున్నది.

ఏ కవి కూడ తన తాతపేరును వంశక్రమ విరుద్ధముగా మార్చి చెప్పి, కులద్రోహము కావింపడనుట నైజము. ఈ గోన వంశ కవిచరిత్ర నెరుగని లాక్షణికుడెవడో ఇందలి 'నా—జ' యతి తప్పని దానిని 'నా—న్న' యతిగా మార్చి లక్షణము సాధించినాడేకాని, కవి వంశభ్రష్టత గుర్తింపలేకపోయినాడు.

'గోనకులార్ణవ—కువలయేశుండు
నా నొప్పుగోనర—ఙ్గక్షితీంద్రునకు
ననఘాత్మయగుచున్న—నన్నమాంబికకు,
దనయుండు సాహిత్య—తత్వ కోవిదుడు
దానప్రసిద్ధుండు—ధర్మశీలుండు
భూనుతాచారుండు—బుద్ధ భూవిభుడు.

: : : : : : : :

తెలుగున నొప్పగా—ద్విపద రూపమున
నతి పూర్వ రామాయ—ణము మున్నుచె (ప్పె)

* * *

మా తండ్రి బుద్ధిక్ష—మా నాథు పేర
. . . .
. . . . మేము
గైకొన్న యుత్తర—కథ యెట్టిదనిన'

గోనవిట్ఠల రంగనాథరామాయణమన్న సంపూర్ణనామము, 'రంగనాథరామాయణ'మన్న సంగ్రహనామముగా వ్యవహరింపబడినంతమాత్రముననే దీని కృతిపతి 'రంగక్షితీంద్రుడు' కాడని, రంగనాథకవి పేరు మరియొకటి కనబడినంతనే దీని రచయిత రంగనాథుడనుట ప్రక్షిప్త కవి చరిత్ర కాకపోదు గద !

గ్రంథ విమర్శనము

శ్రీనాథుని కవితాసమీక్ష-రెడ్డిరాజుల చరిత్రము

రచయిత : శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రిగారు. ప్రతులకు : ఆకెళ్ళ శేషాద్రి, రామారావుపేట, కాకినాడ. 263 పుటలు. వెల రు. 4.

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగా రాంధ్రులకు చిరపరిచితులైన సాహిత్య పరిశోధకులు. 'భారతి', 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక' లలో వారు వ్రాసిన అనేక వ్యాసములు వాఙ్మయ జిజ్ఞాసువుల కుపాదేయములైనవి. సాహిత్య రసికులలో చాల మందికి వలెనే శాస్త్రిగారికిని శ్రీనాథునిపై, ఆయన కవితపై ప్రీతి మెండు. రసభావ భావనా మహనీయమైన శ్రీనాథ కవితకు మురిసిన లోక మాయనను శృంగార పురుషుడని భావించుచుండగా శాస్త్రిగారు 'శ్రీనాథ కవితా సమీక్ష' యను గ్రంథము వ్రాసి ఈశ్వరార్చన కళాసంపన్నమైన ఆయన వ్యక్తిత్వమును నిరూపించినారు. అది మొదటి సంపుటము. శ్రీనాథ కవితా సమీక్ష యన్న సూత్రము తెగకుండ రెడ్డి రాజుల చరిత్రమును పరామర్శించిన ఈ గ్రంథము ద్వితీయ సంపుటము. ఇందులో నున్నది శ్రీనాథుని కవిత్వమునకు సంబంధించిన లాక్షణికమైన విమర్శ కాదు. శ్రీనాథకృతులలోని అవతారికా పద్యములను ఉపలబ్ధములైన శాసనాధారములతో పరిశీలించి వాని యథార్థ్యమును నెలకొల్పుచు రెడ్డిరాజుల చరిత్రము నరయుట దీనిలక్ష్యము. శ్రీనాథ కవితాలతాలవాలమైన రెడ్డిరాజుల చరిత్ర భూమి యిందు పరామృష్టమైనది.

విడివిడి విషయము లిట్లుండనిచ్చి, ఈ గ్రంథమున వెల్లడిగా రూపుగట్టిడిని రెండు విషయములు. రెడ్డిరాజుల విద్యా ప్రాభవ వైశిష్ట్య ధార్మిక వర్తనములవర్ణన మొదటిది. శ్రీనాథుని కవిపద పదవీ సముద్యోగవివరణము రెండవది.

అద్దంకి రాజధానిగా కృష్ణానదీతీర భూములను పాలించిన ప్రోలయ వేమారెడ్డి (క్రీ. శ. 1325—1358) కాకతీయుల అనంతరము యవనుల దండయాత్రచే నుత్సన్నమైన ధర్మమును తెలుగు దేశమున పునరుద్ధరించినవాడు. ఇతనికి తమ్ముడైన మల్లారెడ్డి భుజబల మాపుగా నుండినది. ఈ మల్లారెడ్డియే ఎఱ్ఱాప్రెగ్గడకు ప్రోలయవేముని ఆశ్రయము కుదిర్చినవాడు. ప్రోలయవేముడు శ్రీశైలమున పాతాళగంగకు, అహోబలమున కొండమీదికిని సోపానములు నిర్మింపజేసిన ధార్మికుడు. ప్రోలయవేముని సోదరు డన్నారెడ్డి. అతనికి నలుగురు కొడుకులు. వారిలో అనపోత అనవేములను వారిని ప్రోలయ వేముడు పుత్రులుగా గైకొనెను. ప్రోలయ వేముని అనంతరము అనపోతారెడ్డి కొండవీడు దుర్గము కట్టించి రాజధాని నద్దంకి నుండి యచటికి మార్చి పాలించెను. (క్రీ. శ. 1353—1364) కాకతి గణపతిదేవుడు క్రీ. శ. 1244 లో మోటుపల్లి యోడరేవునకు వాణిజ్య సౌకర్యములు కూర్చుటకై అభయశాసనము వేయించినట్లుగానే అనపోతారెడ్డి కూడ క్రీ. శ. 1358 లో ఒక ధర్మశాసన స్తంభము నెత్తించెను. శత్రువుల నాటుకొనుటలోనే ఈతడు తన శక్తి నెల్ల వినియోగింపవలసి వచ్చెను. ఇతని తర్వాత పాలించినవాడు అనవేమారెడ్డి. ధర్మాన్నవేముడని ప్రసిద్ధి గన్నవాడు. శ్రీశైల మల్లికార్జునాలయమున వీరమంటప మెత్తించినవాడు. వాణి సరస్వతి యను విద్యాంసు డీయనవద్ద విద్యాధికారి. అనవేముడు క్రీ. శ. 1364—1386 మధ్యకాలమున పరిపాలన సాగించినవాడు. ఇతని తర్వాత అనపోతారెడ్డి కుమారుడైన కుమార గిరిరెడ్డి క్రీ. శ. 1386—1403 లలో పరిపాలించెను. అనపోతారెడ్డి తర్వాత అతని కొడుకు కుమారగిరి రాజ్యమునకు రాక అనవేముడు వచ్చుటకు, అతని తర్వాత కుమారగిరికి రాజ్యము లభ్య మగుటకు కారణము కాటయ వేమారెడ్డి. అనవేమ కుమారగిరు లిద్దరును 'వసంతరాయ' బిరుదాంచితులే. కుమారగిరి వసంతరాజీయమను నాట్యశాస్త్ర గ్రంథమునకు కర్త. కాటయవేముడు నరేసరి శాకుంతలాది నాటకత్రయమునకు కుమారగిరి రాజీయమను పేర వ్యాఖ్యానము వ్రాసెను. అనవేముని వలెనే కుమారగిరి కూడ పరమ ధార్మికుడు. 'కిం భూయసోక్తేన యదస్తి ధర్మ్యం కృత్యంస తత్సర్వ మధాతనోతి' యనిపించుకొన్నవాడు. దాక్షారామమున తులాదానము చేసినవాడు. అనవేమ కుమారగిరుల కాలమున రాజ్యభారమును వహించిన మహావీరుడు కాటయ వేమారెడ్డి.

కుమారగిరి భూపాలు డాతని విక్రమమునకు సంతోషించి రాజమహేంద్రవర ప్రాంతము నాతని కిచ్చెను. కాటయవేము డా ప్రాంతమును క్రీ. శ. 1403—1420 వరకు పాలించు చుండెను. ఇట్లుండగా కుమారగిరికి పెదతాత మనుమడగు పెదకోమటి వేమారెడ్డి మామిడి సింగన్న మంత్రిత్వముతో కొండవీటికి రాజయ్యెను. ఈ మామిడి సింగన్న తండ్రి పెద్దన అనవేమారెడ్డి మంత్రి. అనవేమునివద్ద బాలసరస్వతి విద్యాధికారి, త్రిలోచనాచార్యుడు, ప్రకాశ భారతీయోగి యను ఆస్థానకవులు నుండిరి. పెదకోమటివేమునకు శ్రీనాథుడు విద్యాధికారి యయ్యెను. వామనభట్ట బాణాదు లాస్థానకవులు. పెదకోమటివేముడు అమరు శతకమునకు 'శృంగారదీపిక' యను వ్యాఖ్య, 'సప్తశతీసారటీక' (నూరు గాథలకు వ్యాఖ్యానము), సాహిత్య చింతామణి, సంగీత చింతామణి అను శాస్త్ర గ్రంథములను వ్రాసినవాడు. మంత్రియైన మామిడి సింగన్న కూడ సంస్కృతమున 'సోమ సిద్ధాంతసార' మను గ్రంథము వ్రాసినవాడు. కొండవీటిలో సేనాధిపత్యము నెరపుచుండిన అల్లాడరెడ్డి యను నాతనికి రాజమహేంద్రవరమును పాలించు చుండిన కాటయ వేమారెడ్డితో వియ్య మందుటచే బాంధవ్యము కలిసినది. కాటయవేముని రాజ్యభార మెక్కువ మోసినవాడు అల్లాడరెడ్డి. పెదకోమటి వేమారెడ్డి కొండవీటి నాక్రమించుకొనుటచే కాటయవేమునితో వైరము వచ్చెను. రాజమహేంద్రవరమున నున్న అల్లాడరెడ్డి పెదకోమటివేముని తిరుగగొట్టు చుండెను. కాటయవేముని అనంతరము అల్లాడరెడ్డి కుమారులు వేమారెడ్డి వీరభద్రారెడ్లు రాజమహేంద్రవరమును పరిపాలించిరి. వీరభద్రారెడ్డి రాజు. వేమారెడ్డి నిర్వాహకుడు. మంత్రి బెండపూడి అన్నయ. క్రీ.శ. 1415——1434 వరకు వీరి పరిపాలనా కాలము. కాటయవేము డనేక దానములు చేసినవాడు. అల్లయ వేమభూపాలు డనేకవేల 'గోచర్మదానము' లు చేసినవాడు. 'గోచర్మదాన మనగా నాలుగు పుట్లు పండుము భూమి నిచ్చుట.' వీరందరును ఈశ్వరార్చన కళాసంపన్నులే.

ఇంక శ్రీనాథుని కవిపద పదవీ సముద్యోగమును పరిశీలింతము. శ్రీనాథుడు పండితుడైన తెలుగు కవి. కుమార గిరి కాటయ వేములు సంస్కృతవిద్యా దురంధరు లగుటచే కాబోలు శ్రీనాథునకు వారుండగా కొండవీటిలో ఆశ్రయము దొరుకలేదు. కాటయవేముడు రాజమహేంద్రవరము పోగా పెదకోమటి వేమారెడ్డి కొండవీటికి రాజయ్యెను. శ్రీనాథుడు పెదకోమటివేముని మంత్రియైన మామిడి సింగన్నకు తన నైషధాంధ్రీకృతిని కృతి యిచ్చి అందులో కృతిపతిని వర్ణించుటలో కోమటివేముని వర్ణనతో నారంభించి వ్రాసెను. దీనికి ఫలము సింగన్న ఆశ్రయమే కాక శ్రీనాథుని వలన పెదకోమటివేము డనేక పౌరాణిక శాస్త్రీయ విషయములు వినుట. పిమ్మట అతనిని విద్యాధికారిగా నియమించుట జరిగినది. పెదకోమటి వేమారెడ్డి అనంతరము శ్రీనాథుని కండ పోయినది. కొండవీటికిని రాజమహేంద్రవరమునకును వైరము. అందుచేత శ్రీనాథుడు నేరుగా రాజమహేంద్రవరము పోవుటకు వీలు లేదు. ఇది వీలులేదు కనుక శ్రీనాథుడు కంచికి పోయినాడు. అవచితిప్పయకు హరవిలాసము కృతి యిచ్చినాడు. తిప్పయ కొండవీటి రెడ్ల మన్నన గలవాడు. తిప్పయను పొగడుటలో కుమారగిరిరెడ్డి వైభవమును కూడ స్మరించి రాజమహేంద్రవరము రెడ్ల మందరి కాళ్లకు బందములు వైచినాడు. తరువాతనే రాజమహేంద్రవరమున బెండపూడి అన్న మంత్రికి భీమఖండము కృతి యిచ్చుట. కాని రాజాశ్రయము లభించినది కాదు. రాజమహేంద్రవరము సంస్కృత విద్యాక్షేత్రము. దానికి తూగగలది నాటి విద్యానగరము. శ్రీనాథుడు ప్రౌఢదేవరాయల ఆస్థానమునకు పయన మైనాడు. డిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టించి కవిసార్వభౌమ బిరుదముతో కనకాభిషేకముతో తిరిగి వచ్చినాడు. వచ్చుచు తెలంగాణమున ప్రవేశించి రాచకొండ నేలుచుండిన రెండవ సర్వజ్ఞ సింగ భూపాలుని దర్శించి వచ్చినాడు. ఈ యాత్రతో శ్రీనాథుని పాండిత్య వైభవము సుప్రతిష్ఠిత మైనది. తరువాతనే వీరభద్రారెడ్డి పేర కాశీఖండము చెప్పుట. ఇది ఈ గ్రంథమున దర్శితమైన క్రమము.

కాటయవేముడు కొండవీటి వైభవమును రాజమహేంద్రవరమునకు కూర్చుట, రాచకొండ వెలమ దొరలకు రెడ్డిరాజులకును గల స్పర్థ విద్యా విషయకముగా కూడ పరిణమించుట ఇందు చక్కగా చూపబడినవి. కొండవీటిరెడ్డి రాజులకు మూల గూరశక్తి ఇలువేల్పు. కాటయవేము డీ దేవతను రాజమహేంద్రవర ప్రాంతమున నెలకొల్పెను. కొండవీడు రాజ్య ప్రతిష్ఠాపనాచార్యులైన ఘోడే రాయ గురువులు అచటి రాజులకు గురువులు. కాటయవేముడు వారిలో నొకరిని దెచ్చి పట్టిసము వీరభద్రేశ్వరాలయమున నుంచెనట. అట్లే కృష్ణాతీరము నందలి వేదాద్రినృసింహునికి ప్రతిగా కోరుకొండ నృసింహస్వామిని వేదాద్రినృసింహునిగా జేసెను. రెండవ సర్వజ్ఞసింగ భూపాలుడు రసార్ణవ సుధాకర, సంగీత రత్నాకర సుధాకరములను శాస్త్రగ్రంథములను, రత్నపాంచాలిక యను రూపకమును వ్రాయగా పెదకోమటి వేమారెడ్డి కొండవీటిలో శృంగార దీపిక, సప్తశతీసారటీక, సాహిత్యచింతామణి, సంగీత చింతామణులు వ్రాసినాడు.

"శ్రీనాథుని కృతులకు రెడ్డిరాజులతో సాక్షాత్సంబంధమో లేక పరంపరా సంబంధమో కలదు. అతని కృతిపతు లందరు పరమేశ్వర పాదారవింద భక్తి తత్పరులు. ఈశ్వరార్చన కళాశీలు డగుటయే శ్రీనాథుడు రెడ్డిరాజులను, వారి మంత్రులను ఆశ్రయించుటకు మూలము. శ్రీనాథుడు సద్భావముతో రెడ్డి ప్రభువుల చరిత్రమును చిత్రించినాడు. వారివారి చరిత్రములను యథాతథముగ తీర్చిదిద్దినాడు. అనపోత అనవేములు ప్రోలయవేమున కభిమాన పుత్రులు. అనపోతారెడ్డికి కాకతి గణపతి దేవునితోడి సామ్యము గలదు. కుమారగిరిరెడ్డి వ్యక్తిత్వము, కాటయవేముని ధార్మికత్వము, రాజకీయ నిర్వహణము. శ్రీనాథుడు దర్శించిన సింగభూపాలుడు రెండవ సింగ భూపాలుడే. తుల్యభాగా నదీతీరమునకు గల చారిత్రక సంబంధము, అల్లయవేముని చరిత్రమునందలి విశిష్టత అనునవి ఈ గ్రంథమున గల కొన్ని ప్రధాన విషయములు.

సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ గ్రంథమునకు వ్రాసిన తొలిపలుకులో అన్నట్లు "ఈ గ్రంథ మంతయు నొకయెత్తు. వీరి తుల్యభాగాపరిశిష్టరస్థ ప్రాంత పరిశోధన, స్థల నిర్ణయాదికము లొక యెత్తు. అల్లాడ వేమారెడ్డి వేమవర శాసనము గొడ్డారెడ్డి కుంకుదురు శాసనము మొదలైన వానిలోని సీమావధులనాయా ప్రదేశాంశముల కరిగిచూచి స్థలజ్ఞులను విచారించి తెలిపిన నూతనాంశములు చాలగలవు. అవి తత్ప్రాంతవాసుల కెక్కువ యానందప్రదములు కాగలవు." గౌతమీ తీరమందలి కోరుకొండ నృసింహస్వామియే కాటయవేముని నాటినుండియు వేదాద్రి నృసింహస్వామి యనుపేరుతో పిలువబడుచు వచ్చెననియు శ్రీనాథుడు తన కాశీఖండ కృత్యవతరణికలోని పద్యమున బేర్కొన్న వేదాద్రి నరసింహు డీతడే యనియు నిరూపించుట తిరుగులేనిది.

కర్తృత్వ విషయములకు సంబంధించి సాహిత్య జిజ్ఞాసువుల కాసక్తి కలిగించు ఒకటి రెండభిప్రాయముల లిందున్నవి. క్రీడాభిరామము వినుకొండవల్లభరాయ కృతమని యున్నది. వల్లభరాయుడు మురికినాటిలోని మోపూరును పాలించినవాడు. అది శ్రీనాథ రచనమని కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సోపపత్తికముగ నిరూపించినారు. క్రీడాభిరామమున మధుమావతి జన్మక్రమమును వర్ణించు పద్యమున 'పావనంబైన తమిలేటి పరిసరమున వేంగి కురవాటికాదేశ విపిన భూమి' అని యున్నది. తమిలేటి పరిసరమున వేంగికి సమీపమున గలది పానారసీమ కాని కురువాటసీమ కాదనియు శ్రీనాథుడు వ్రాసి యున్నచో నిట్లు 'చారిత్రక ప్రమాణమునకు సరిపడని విషయము' నిట్లు గూర్చి యుండడనియు పాపయ్యశాస్త్రిగారభిప్రాయ పడుచున్నారు. వల్లభరాయనివారు పూర్వమునుండి విజయనగరరాజులతో రాజకీయ సంబంధము గలవారు. ఈ వంశమున రెండవ తరమువాడు చంద్రామాత్యుడు పెదబుక్కరాయల మంత్రి. వల్లభరాయని తండ్రి హరిహరరాయల రత్న భాండాగార రక్షకుడు. వల్లభరాయుడు మురికినాటి మోపూరిని పాలించినవాడు. ఇది కారణముగా శ్రీనాథుడు తన విజయనగర యాత్రలో వినుకొండకు వచ్చి అతని క్రీడాభిరామమునకు వంశావతారాది పద్యములు కూర్చి యిచ్చి విజయనగరమున వారి సాహాయ్యముచే కనకాభిషేకము నందగలిగిన డని యూహించుచున్నారు.

అట్లే పోతన శ్రీనాథునకు కొంచెము తరువాతివాడనుచు శాస్త్రిగా రిట్లన్నారు : "పోతన భాగవతానువాదము కథాసంవిధానము గల చోటులందే ప్రధానముగ సాగినది. ప్రత్యేకముగ వేదాంత చర్చయే సాగినచోటులం దాతడు రచన సాగింపలేదనియే మన మూహింపవచ్చును. ప్రథమస్కంధము, ద్వితీయస్కంధములో గొంతభాగము సప్తమస్కంధము మొదలు దశమస్కంధము నందలి పూర్వార్ధము ఉత్తరార్ధములో కుచేలోపాఖ్యానము నాతని రచన యగుట కేవలము వేదాంత విషయమును నిరూపించిన భాగములలో నారయాదుల రచనలే కానవచ్చుటయే యీ యూహకు మూలము."

ఈ గ్రంథమున అనుపదము శాస్త్రిగారి పరిశ్రమ వెల్లడి యగుచున్నది. విశదమైన దర్శనముతో విస్పష్టమైన చారిత్రక సామగ్రితో వ్రాసిన గ్రంథమిది : ఈ గ్రంథము నందలి అనేక విషయముల కాధారమైన అనపర్తి శాసనము, కాటయవేముని అన్నవరదాన శాసనము, అల్లయ వేమారెడ్డి వేమవరపు శాసనము—అనువాని సంస్కృత పాఠములు తెలుగు సంగ్రహములతో గూడ అనుబంధముగా నీయబడినవి.

సాహిత్య జిజ్ఞాసువు లందరు సాదరముగా చూడదగిన గ్రంథము.

నైమిశము

సాహిత్య వ్యాసాలు : కర్త : డాక్టర్ కేతవరపు రామకోటిశాస్త్రి బి. ఏ. (ఆనర్స్) పి. హెచ్‌డి., ప్రచురణ : క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ—2. పుటలు 176. వెల. రు. 3.

ఈ పుస్తకమున వ్యాసకర్త అప్పుడప్పుడు వ్రాసి 'భారతి' మొదలగు పత్రికలలో ప్రకటించిన ఆరు సాహిత్య వ్యాసము లున్నవి. వీనిలో ఘటికాచల మహాత్మ్యము, కన్యాశుల్కము అను మొదటి రెండును గ్రంథస్థ విషయమును విమర్శించునవి. ఆంధ్ర భారత విమర్శనము, ఆంధ్ర గేయ వాఙ్మయము అను తరువాతి రెండును విమర్శన పద్ధతికి సంబంధించినవి. కవిత్వము—కావ్యము, ఆత్మాశ్రయ కవిత్వము అను చివరి రెండును కవితా కళకు సంబంధించిన మూలతత్త్వము నరయ బ్రయత్నించునవి. వస్తు కాఠిన్యమునుబట్టి బహుశః వీని నీ క్రమములో కూర్చియుందురు గాని 'ఆత్మాశ్రయ కవిత్వము' తో నారంభించి కన్యాశుల్క నాటక విమర్శముతో ముగించియుండిన బాగుండెడిది. ఎందుకనగా మూలభూతములైన అంశములను గూర్చి వ్యాసకర్తకు గల నిశితాభిప్రాయములే పూర్వ పూర్వ వ్యాసము లంటరి విమర్శలకు హేతుభూతములుగా నున్నవి. వస్తు కాఠిన్యమేమైన నున్నచో నది తక్కువ కాలేదు. ఇప్పుడున్న దానికి వ్యతిరేకక్రమమున గూర్చి యుండినచో వ్యాసకర్త దృష్టి, అభిప్రాయములు తెలిసివచ్చి తరువాతి వ్యాసములతో మరింత పొందికపడి పాఠకులకు సులభముగా నుండెడిది.

వ్యాసకర్త వివేచనాపరుడు. కవిత్వము, ఔచిత్యము అను వానిని గూర్చిన వ్యాసకర్త అభిప్రాయము లించుక తీవ్రముగా నుండును. వివేచనకు ఫలమైన వింగడింపు, వాడి ఉన్నవి కాని అవి వేడిలో పడిన ట్లున్నవి. పరిణతి సాధ్యములైన పట్టువిడుపు లంతగా కనబడవు. కవిత్వము—కావ్యము అను వ్యాసమున ఔచిత్యమును గూర్చి ఆంధ్ర భాగవతోపన్యాసములలో

శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు చెప్పిన మాటలను, అట్లే ఘటికాచల మాహాత్మ్య గ్రంథ పరామర్శమున వశిష్ఠు డరుంధతికి కాంచీనగర వర్ణనము చేయుటను—వ్యాసకర్త విమర్శించినారు. ఆచార్యులవా రన్న మాటలివి : "ఔచిత్య మనగానేమి ? ప్రపంచమున నెట్లు జరుగుచున్నదో అట్లే చెప్పుట. ఎట్లు జరుగుటకు వీలున్నదో అట్లు చెప్పుట." ఈ వాక్య ముట్టంకించి శాస్త్రిగా రిట్లు వ్రాయుచున్నారు. "ఇది కాదౌచిత్యము. దేని కేది తగినట్లుగా ఉండునో అది ఉచితము. తద్భావ మౌచిత్యము. కవి ఏ పరమోత్కృష్టమైన ఆశయమును దృష్టిలో పెట్టుకొని రచన కుపక్రమించినాడో తదుత్కర్షకు హేతుభూతమైన సర్వభావ భావన మౌచిత్యము." ఈమాటలు వ్రాసి సరేసరి క్షేమేంద్రుని మాటలుగూడ చెప్పబోయినారు. 'పోతన్న కవిత్వములో ఔచిత్యము చాల తక్కువ యని యనేకు లాతనిపై వేయు అభాండము'—ఆచార్యుల వారు దీనిని గూర్చి ముచ్చటించుచు ఆమాట అన్నారు. 'ఔచిత్య మనునది కవిత్వమునకు గావలసిన గుణములలో నొక్కటియే గాని యౌచిత్యమే కవిత్వము గాదు' (ఆం. భాగ. ఉప. 164 పు.) అన్నది ఉదాహృత వాక్యమునకు ఇంచుక పూర్వ వాక్యము. 'ఇవి రెండును—ముఖ్యముగ దేశ కాలముల బట్టి, హృదయ ధర్మమును బట్టి—మారునవే" (165 పు.) ఇది ఉదాహృత వాక్యమునకు తరువాతి వాక్యము. ప్రపంచమున జరుగునది దేశకాలములను బట్టియు, ఎట్లు జరుగుటకు వీలున్న దనునది హృదయ ధర్మమును బట్టియు మారునని ఆయన అభిప్రాయము. నాట్యమునందు నాట్యధర్మి, లోక ధర్మి ఉన్నట్లుగనే కావ్యమునందును కావ్యధర్మము లోక ధర్మము ఉండునని యొప్పుకొన్నను అందులో గూడ లోక ధర్మమే ఎక్కువగా నుండుననక తీరదు. కనుకనే ఆచార్యులవారు లోకమును ప్రమాణముగా నంగీకరించినారు. ఇంక శాస్త్రిగారి యౌచిత్య నిర్వచనమ్ము అనుభవమున కందనిదిగా నున్నది. 'దేని కేది తగినట్లుగా నుండునో అది ఉచితము' అన్నారు శాస్త్రిగారు. బాగున్నది. ఆ తగినట్లుండుటగాని, ఉండకపోవుట గాని నిర్ణయించుట యెట్లు ? అధికారి యైనవాడు నిర్ణయింపగల డందమా? ఆ యధికారులకు మాత్రము భిన్నాభిప్రాయము లున్నచో నెట్లు ? ప్రమాణ నిరపేక్షముగా నధికారి మాత్రము నిర్ణయము చేయగలడా ? ఒకవేళ చేసినను అది ఇతరులకు విశ్వాస్య మగుట యెట్లు? ఇవన్నియు అనుభవములో అడ్డము వచ్చు చిక్కులు. అధికారి గూడ లోకమును ప్రమాణముగా గొని చెప్పవలసినవాడే. అలౌకికమైన దానిని చెప్పుచోట తన హృదయధర్మము ననుసరించి శిష్టరంజకముగా చెప్పవలసి వచ్చును. ఆచార్యులవారి అనుభవ పరిణతమైన మాటలకు శాస్త్రిగారి ఏకతావాదము (idealism) నకు భేదము స్పష్టము. శాస్త్రిగారి నిర్వచనమును చూచినపుడు తమిళులు సాహిత్యమును 'ఇలక్కియమ్' అనుట జ్ఞప్తి వచ్చినది. ఇలక్కియ మన్నది బహుశః 'లక్ష్య' శబ్దభవము.

శాస్త్రిగా రిట్టి దృష్టితోనే ఘటికాచల మాహాత్మ్య గ్రంథమును విమర్శించినారు. దానికి సంప్రదాయము తెలియమి యొకటి తోడైనది. ఘటికాచల మాహాత్మ్య ముత్కృష్టమైన రచన యని నేను చెప్పవచ్చుట లేదు. పాండురంగ మాహాత్మ్యమున కంటె నవరమైన దనుట నిశ్చితము. కాని విమర్శించిన అంశముల నించుక విపులముగా విమర్శింపవలెనని చూపుట సమీక్షకుని యుద్దేశము. క్షేత్ర మహాత్మ్యములలోనే కాక 'ప్రబంధము' లని పేరు పెట్టు కొన్న గ్రంథములలోనే వస్త్వైక్యమను గుణము కాన్పింపక పోవుట తెలుగు సాహిత్యమునం దొక లక్షణము. ఘటికాచల మాహాత్మ్యములోని ధవలాంగ, నారద జనన కథలు రెండును సాధుసంగమశ్రీని ప్రపంచించునవి. ధవలాంగునికి వశిష్ఠదర్శన మాత్రమున విశ్వామిత్రు డిచ్చిన శాపము పోయినది. నారదుని కథలో సాధుసంసేవన ఫలము చెప్పబడినది. ధవలాంగుని కథలో అల్లిక సరిగా లేదనుట కంటె వాని శాప విమోచనమునకు హేతుభూతుడైన వశిష్ఠుడు ఘటికాచలమునకు వచ్చి స్వామి దర్శనము పొందుట యను దానిని గమనింపవలసి యున్నది. "ఉత్సుకతన్ హరి యా శైలమునకు వేంచేయుటకు కారణం బెయ్యదియో" అని భృగు నడుగుట ఆ క్షేత్ర మహిమలోని అద్భుతమును గూర్చి గాని విష్ణు వచ్చుటకు వచ్చిన కారణము చెప్పుమని కాదు. శాస్త్రిగారా పద్యములో నతికిన 'ఎరిగింపగదే' అన్నమాట తరువాతి పద్యములోనిది. వేడుక యయ్యెడు తద్గిరి చూడామణి కథ వినంగ .... ఎరిగింపగదే' అన్నాడు. శతశృంగమునుండి ఘటికాచలమునకు వచ్చుచున్న సప్తర్షుల తీర్థయాత్రలో కవి వశిష్ఠునిచేత కాంచీపుర వర్ణనము చేయించినాడు. రచన ప్రబంధమార్గమున నున్నదనుట నిర్వివాదము. అంతమాత్రమున వశిష్ఠుని పాత్ర అధోగతి పాలైన దనుట న్యాయ్యముకాదు. 'త దాలోకన పరయగు నిజ వధూటి కాంక్ష యెరిగి' 'మందస్మితాననాబ్జుం డగుచు' వశిష్ఠుడు వర్ణించినాడు. ఈచోట కొంచె మాలోచింపవలెను. కంచి మోక్షదాయకమైన ఏడు పట్టణములలో నొకటి. వశిష్ఠాదులు దానిని వైష్ణవ క్షేత్రముగా దర్శించిరి. ఆ దంపతులును పవిత్ర దాంపత్యమున కుదాహరణభూతులు. తీర్థయాత్ర యనుటకంటె నది ప్రయాణ సమయ మనుట గమనింపవలసిన సంగతి. ప్రక్కనున్న భార్య ఉత్సాహముతో నూరుఃజూచుచున్నది. 'మందస్మితము' తో జెప్పినవాడు మెల్లగా భార్యకు ముచ్చట చెప్పియుండునుగదా. 'గోపురస్థిత గోపుర' మైన కంచి వైష్ణవ క్షేత్రమని కవి హృదయము. వశిష్ఠ హృదయము. ఇంక ఆ విష్ణువు మారజనకు డగుటచే కాబోలు 'విశ్వగుణాదర్శమునందు వేంకటాధ్వరి ఘటికాచల నృసింహుని వర్ణించుచు 'స్మరకేళి పుషే శ్రియః' అని వాచ్యముగా జెప్పుటయే కాదు, కంచినే వర్ణించుచు 'సుమనోజనవాదరణ స్థానం, స్థానే సద్రూప శోభిసీసేయమ్ సురతాభ్యుదయ విధాత్రీ శుభకాంచీ సాధురంజయతి చేతః' అన్నాడు. ఇందు శ్లేష యున్నను ఏది ముందు స్ఫురించునో నేను చెప్ప నక్కరలేదు. ఇక్కడ రామకృష్ణుడు పాటించిన ఔచిత్య మేమనగా తక్కిన ఋషులను మాటాడింపక పోవుట. 'తక్కిన యార్యురును ప్రమోద మొదవం గనుగొని పుర విభవంబున్ విను

తించి రుదంచితాంచితాతి విస్ఫుట ఫణితిన్.' అన్నాడు. అతి విస్ఫుట ఫణితినని వీరి మాటలను చెప్పుటలో వశిష్ఠ కథన మెట్టిదో ఊహకు రావలెనుగదా! వశిష్ఠుని మాటలు తక్కిన వారు విన్నారని రామకృష్ణు డనలేదు చూడుడు. ఋషులకు ఘటికాచలమున నృసింహుడు ప్రత్యక్ష మైనాడు. అప్పుడు 'ప్రసవాయుధవైరి' విమానమున నచ్చుటకి వచ్చినట్లు కవి వర్ణించినాడు. రామకోటి శాస్త్రిగారు కారణము వెదకినారు. శివుడు వచ్చుట తృతీయాశ్వాసాదిలో నున్నది. ద్వితీయాశ్వాసాంతమున ఋషులు నృసింహుని స్తోత్రము చేసిన దండకములో రామకృష్ణకవి 'దక్షాధ్వర ధ్వంసి చేతః ప్రమోదాతి నిష్ణాత వేషా'యని వర్ణించినాడు. శివుడు నృసింహుని జూడ వచ్చినాడు. అంతేకాదు శివుడు 'రుద్రు' డైనచో నారసింహుడు 'మహారుద్రుడు.' నృసింహ ద్వాదశనామస్తోత్రమున 'ఏకాదశో మహారుద్రః' అని యున్నది. విశ్వగుణాదర్శకారుడు కూడ ఘటికాచల నృసింహుని 'శంభు సంభావనీయాయ స్తంభసింహాయ మంగళ' మ్మని వర్ణించినాడు. తృతీయాశ్వాసమున శివుని రాకను జెప్పిన పిదప చెప్పిన సీసపద్యము, దీర్ఘ వచనము నృసింహపరములే కాని శివపరములు కావు. 'మిక్కిలి కంటి వాని' నన్నమాట నృసింహపరమే. నృసింహధ్యాన శ్లోకములో 'జానున్యస్త కరాంబుజం త్రిణయనం రత్నోల్లసద్భూషణ' మ్మని యున్నది. 'బాలచంద్రునిపై నున్న బాలచంద్రుబోలు నలికోర్ధ్వ పుండ్రంబు' అనుదాని అర్థము విచార్యమని శాస్త్రిగారు వ్రాసినారు. నృసింహుని 'మాణిక్యాద్రి సమప్రభమ్మ' నియు, 'ఇందు ధవళమ్మ' నియు ధ్యానశ్లోకములు వర్ణించుచున్నవి. ఇది యాధారముగా రామకృష్ణుడు చమత్కరించినాడు. తెల్లని నొసలు బాలచంద్రుడు. దానిమీది నామము బాలచంద్రుడని కవి హృదయ మనుకొందును. అథవా 'బాలచంద్రునిపైనున్న' అనియైన పాఠము కావచ్చును. భగవంతుడగు నృసింహుడే స్వయముగా తాను ప్రహ్లాదుని రక్షించుట మొదలగు కథా విషయమును సూచించుట ఆత్మోత్కర్ష యనరాదు. 'దృఢభక్తి ఫలనహేతువుగాదే' అని ఉపన్యసింపజేసిన ఘట్ట మది. ప్రహ్లాద 'కథా ప్రకారంబు సూచించువాడై' నృసింహు డా కథ దడవినాడు. 'హరియు విరించియు...' నన్న పద్యము బహుశః, హరుడు విరించియు నని యుండవలసినదే. విరించి రాక సూచితము కాలేదనుట, ఋషుల స్తోత్ర పాఠములోని 'పురహర పురందరాదిక దురధిగమంబై' ఇత్యాది మాటలు వారి రాకకు పొత్తు కుదురనిచ్చుట లేదనుట —విడు పెరుగని విమర్శ. బ్రహ్మ వచ్చినా డనుట సూచితము కాకున్నను వచ్చినాడనుకొన్నచో నిబ్బంది యేమి? నృసింహునకు ఈశ్వరునకు చెప్పినంత సాదృశ్య సాన్నిహిత్యములు బ్రహ్మకు నృసింహునకు చెప్పముగదా. అందుకే ఈశ్వరుడు వచ్చి సంభావించినటుల సూచింపబడినది. పురహర పురందరాదులకు నృసింహుడు దురధిగమ్ము డన్నచో చూడరాని వాడని గాని, ఆయనయే దర్శన మిచ్చినపుడు చూడరారాదని గాని చెప్పగలమా? ఇది క్షేత్ర మాహాత్మ్యము. శాస్త్రిగారు చూచినట్లుగ నీనిని చూడరాదు. మహాకవి విషయము గనుక నింత దూరము వ్రాయవలసి వచ్చినది. కన్యాశుల్కమువీాద శాస్త్రిగారి విమర్శ చక్కగా నున్నది. ముఖ్యముగా ఆయన చూపిన సంవిధాన దోషములు గమనింపదగినవి.

ఆంధ్రభారత విమర్శనమను మూడవ వ్యాసమున శాస్త్రిగారు సంస్కృత భారతమును 'అథెంటిక్ ఎపిక్' గాను తెనుగు భారతమును 'లిటరరీ ఎపిక్' గాను చెప్పి దేని కది విడిగా చదివి ఆ రెంటి తారతమ్యములను చెప్పవలెనే కాని ఎక్కడి కక్కడ పోల్చి చూడరాదని అభిప్రాయ పడుచున్నారు. ఇట్లు చేసినచో విమర్శ సర్జనశీల మగుట నిశ్చయమే గాని యోగ ప్రతియోగ మార్గమున జూచుటవలన అట్టి సర్జనశీలమైన విమర్శ చక్కగా బోధపడుట కవకాశ మేర్పడును. వస్తు వక్కడి దైనపుడు మూలముతో బోల్చుట తప్పనలేముగదా? ఇంతకును భారతమంత గ్రంథమున గల పరమార్థము నొక్కసారిగ భావింపగల సామర్థ్య మెవ్వరికైన— సామాన్యులకు—సాధ్యమా? శాస్త్రిగా రిక్కడ కూడ వేల విడచి సాము చేయుచున్నారనిపించుచున్నది.

ఆధునికుల అనేక గేయములు రగడ భేదము లనుట నీవరకే విమర్శకులు పరామర్శించినారు. ఆంధ్రగేయ వాఙ్మయమను శాస్త్రిగారి వ్యాసమున "పదములు గేయములగుటవలన వెనుకటి వన్నియు సంగీత గేయములుగాను, శ్రీశ్రీ నుండి సాహిత్య గేయములుగాను మనము గేయ వాఙ్మయమును విభజించుకొనవలయును. నేడు ప్రచారమున నున్న గేయ కవిత యను వ్యపదేశము నంగీకరించి కవితా విమర్శనమునకు బూనుకొనవలయున" నుట పరమార్థము. నేడు గేయకవిత యను వ్యపదేశము నంగీకరింపనివారు లేరు. గేయకవితా విమర్శయు జరుగుచున్నది. 'మేధాశక్తిచేత సంయతమును సంభావితమునునై లయాన్వితమైన సుష్ఠు శబ్దముల ద్వారా వ్యక్తీకరింపబడిన మనోహరమును ఉత్కృష్టమును ఐన ప్రతిభ కవిత్వము' (124 పు.) 'కథా ప్రాధాన్యము కలిగి ఔచితీ మర్యాదకు లోబడిన సుష్ఠు భావ భావనామయమైన గ్రంథము కావ్యము. కేవలము వస్తుభావ భావనా రమ్యమై అంతస్సూత్రముగా కథ నిముడ్చుకొని నిర్వహింపబడిన గ్రంథము ప్రబంధము' (154 పు). సాహిత్య విద్యార్థు లీ నిర్వచనముల పరిశీలింతురు గాక. పై నిర్వచనములు కవిత్వము—కావ్యమునను ఐదవ వ్యాసములోనివి కాగా 'కవిత్వ మెప్పుడును ఆత్మాశ్రయమే' అనుట చివరి వ్యాసమున పరమార్థము. రచన అంతయు

కవిదే అయినను ఆత్మాశ్రయ కవితలో కవి లౌకిక వ్యక్తిత్వము ప్రధానమగును; పరాశ్రయ కవిత్వమున పాత్రల వ్యక్తిత్వము, దృష్టి, అనుభవము ప్రధానము లగును. మొదటి దానిలో కవి అహంకారము స్ఫుటముగా నిలుచును. పాత్ర చిత్రణకైన అహంకార నిరాసముచే పరాశ్రయ కవిత్వమున అచ్ఛముగా నూతన వ్యక్తులే సృజింపబడుదురు. మొదటిదాని కంటె లౌకికాహంకారము చోటుచేసుకొనని రెండవది రసానందహేతువు.

వ్యాస మనునది ప్రధానముగా మననశీలమైన రచనా ప్రక్రియ. మాటల కూర్పును బట్టి భావముల నేర్పు ఏర్పడుట దాని వైచిత్రి. శాస్త్రిగారి వచన రచన విలక్షణమైన ఒక మార్గమున చక్కగా నడుచును. కాని పాఠకుని మరింత మన్నించి నెమ్మదిగా వ్రాసినచో తమ భావములను వారి కలవరించుట సులభమగును. ఇప్పటి ఈ వ్యాసములలో స్వయం ధీరతాముద్ర యెక్కువని చెప్పినచో చాలును.

సాహిత్య విద్యార్థు లందరు తప్పక చదువ తగిన గ్రంథము.

ఎస్. కె.

మ ధు వ న ము

రచయిత : శ్రీ నారపరెడ్డి రామిరెడ్డి, ప్రాప్తిస్థానము : దేశికవితామండలి, విజయవాడ. మూల్యం : మూడు రూపాయలు.

కవిత సంపుటిలో విన్నపము చేస్తూ శ్రీ నారపరెడ్డి రామిరెడ్డి తనకు ఆంధ్రసాహిత్యం పట్ల గల వివిధాభిప్రాయాలను వెల్లడి చేశారు. అభ్యుదయం పేరిట వచ్చిన సుడిగాలి ధర్మమా అంటూ ఎందరెందరో కవి కుమారులు రూపు మాశారనీ, స్వతంత్రభావాలనీ, వ్యక్తిత్వాలనీ కోల్పోయారని కవితాగానం మృత్యుగర్జనలను చేసిందనీ అన్నారు. ఈ అభ్యుదయవాదు లిచ్చిన అవకాశాన్ని పురస్కరించుకుని సనాతన ఛాందసత్వము సన్మానాలను జరుపుకొందనీ—యీపై యిద్దరూ ఎడదిడ్డం, పెడదిడ్డంగా ఉండడం మూలంగా వాటికి సిసలైన కవిహృదయం దూరంగానే ఉందన్నారు. అటువంటి అదనులో స్వతంత్రంగా ఆలోచన చేయడానికి సాధన అవసరం కనుక సహజ కవితాస్రవంతిని పెడదోవలు పెట్టిన వికృత స్వభావాలను అధిగమించి సంప్రదాయ కవితావాహినిని స్పష్టం చేయాలని యీ 'కవిత' ను రాశానన్నారు శ్రీ నారపరెడ్డి. కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి రాసిన పండిత ప్రతిజ్ఞ నాధారంగా తీసుకుని దీనిలోని కవితల నల్లామన్నారు. ఇది భావదాస్యం కాదో!

ఈ రచనలో కంకాళ కవి అభ్యుదయవాది. సనాతనవాది పండితుడు. వనకన్య కవితలు తదితరులు. కంకాళకవి అభ్యుదయ ప్రగల్భాలు పలికి భయపెడితే వనకన్య భయపడుతుంది. పండితు డామెను కోరితే చాతవంటూ హేళన చేస్తుంది. వాద ప్రతివాదాలతో పండితుడూ అభ్యుదయుడూ (కంకాళ కవి అన్నారు రచయిత. గాని ఆమాట పలకడానికీ విన డానికీ కూడా యింపుగా లేదు.) శిఖపట్లు పడుతూవుంటే కవీ (అసలు కవి) వనకన్య చెట్టాపట్టాలు వేసుకుని సాగిపోతారు. ఇది యితివృత్తం. కవిత్వాన్ని గురించి అంటే రచనాశైలిని గూర్చి ప్రత్యేకించి చెప్పుకోవలసినదిలేదు. మనం సామాన్యంగా రోజూ చదువుతూన్న కవనాల ధోరణిలోనే నడిచింది. అభ్యుదయ కవి అతని భాషలోనూ, పండితుడు తన భాషలోనూ మాట్లాడుతే వనకన్య సొగసైన ఊర్వశిలాంటి భాషలో మాట్లాడుతుంది. అసలు కవి రచయిత స్వంత గొంతుక అనుకోవచ్చు.

ఇక యీ సంపుటిలో రెండోది—'కథగా దిది—వధ' అన్న గేయకథ. పెద్ద అచ్చులో వరసగా వేసేస్తే చిన్నపిల్లల కథలాగా బాగుంటుంది. చిన్న పల్లెటూళ్లో అందరికీ యితని మీద కక్షే! బ్రతుకు భారంకాగా బస్తీకి వచ్చి రిక్షా లాగి లాగి చనిపోయిన సామాన్యుని కథ యిది. దాన్నే వధగా మార్చారు కవిగారు.

'రజని' అన్నది యింకో కథాగేయం. పూర్ణిమ, కన్నెకల గాధలలాగా విషాదపూరితం అయిన కథ. ముస్లిం యువతి ఒకతె హిందూ యువకుణ్ణి వివాహం చేసుకోవాలని చూస్తుంది. ఆ యువకుణ్ణి చంపాలని విసరిన కత్తి ఆ అమ్మాయికి తగిలి మరణిస్తుంది. ఆ కత్తి విసిరినది పైవా రెవరూ కాదు. ఆమె సోదరుడే. తను చేసిన పనికి పశ్చాత్తాప పడతాడు. "మతము చేసిన పశువు కూడా మనుజుడై విలపించె నప్పుడు" అన్నారు కవి.

ఇంకా ఈ సంపుటిలో ఏకాంతవాసం, శాంతిగీత, నిరీక్షణ మొదలైన కవితలు ఉన్నాయి.

"మధువనము" అన్న కవితా సంపుటిలో నారపరెడ్డి మెత్తని మనసున కోర్కెలు నీరు కారితే వూరకనే కృశించక ఏర్చి గూర్చిన కవితలు ఉన్నాయి. ధ్వని ప్రాధాన్యం, కొత్త గొంతు తప్పించి భావాలన్నీ పాతవే. ఈ సంపుటి పరిచయంలో శ్రీ ఆరుద్ర

"పద్మ తూర్పారపోస్తున్న వాళ్ల కిచట
పొల్లు నెల్లులు
సెపరేటు పోగులేను
పొల్లు సైతము పోనీయ కల్లినారు
మేలు బిస్కట్లవంటి
పద్యాలు నీరు" అన్నారు.

గ్రంథ విమర్శనము

స్వాగతం, ఆమె—నేను, కలువకన్నె మొదలైన అనేక ఖండిక లున్నాయి. పదగాంభీర్యం, పద్యాలల్లడంలో నేర్పూ కన్పిస్తుంది వీటన్నిటిలోనూ. కాని యీ పద్యాలు చదివి యీ కవి బాట యిది అని తేల్చుకోలేము. నిజమే ! ప్రణయిని గురించీ, ప్రేయసిని గురించీ—విరహం ఆవేదన అన్నిటిని గురించీ తరతరాల మానవుని పాటూ భావనాకూడా ఒకటే కదా ! కవి వ్యక్తిత్వాన్నిబట్టి ఆయా భావనలకి ప్రత్యేకత ఏర్పడానికిగాని, వాటంతటఅవి అందరికీ మామూలే.

అ ద్దం లో నీ డ లు

రచయిత : శ్రీ మాదిరాజు రంగారావు. ప్రాప్తిస్థానం: రసధుని ప్రచురణలు, హైదరాబాదు. మూల్యం: ఒక రూపాయి.

మాదిరాజు రంగారావు యువ కవుల కోవవారు. ఆమధ్య కొత్తగా బయలుదేరిన కవితాధోరణులకు ఈయన ఒకవిధంగా ప్రతినిధి. ఇటు అభ్యుదయం పేరూ, అటు సనాతనత్వం పేరూ తగల్చలేము వీరికి. ఇటు ప్రేమా, విరహం బాపతు కవిత్వానికిచ్చే పేరూ యివ్వలేం. వీరి కవిత్వం ఒక కొత్త పోకడ. వీరిది కార్మిక, కర్షకుల కష్టసుఖాలు—మిషను జీవితం గడిపే పీడితజనుల ఘోషా కాదు. ప్రేమా విరహం, వసంతం, వడగాడ్పు—ఏం కాదు. వీరి కవిత్వం అంతా అంతరాంతరాలలో రేగిన వ్యక్తిగత బాధకు రూపకల్పన. ఆత్మఘోష. అదే అద్దంలో నీడ. ఆ అద్దం చేతి అద్దం అయితే—కనిపించే దృశ్యం పరిమితం. ఆ అద్దం ప్రకృతి అయితే కనిపించే దృశ్యం సువిశాలం కావచ్చు. ఇదే అద్దంలో కవికి "భూతాల సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదింపబడిన తీర్మాన పాఠం—హిమబిందు రూపంలో అంతటా ప్రకటింపబడిన సమీకరణ పత్రాన్ని చదవడానికి ప్రయత్నించే చెట్లు" కన్పించాయి. అలాగే ప్రపంచపు ప్రతి అణువు కదలికా కన్పించింది కవికి. సహృదయుడైన ఏ కవికైనా, రచయితకైనా కన్పిస్తుంది. శ్రీ రంగారావులో కన్పించేది—ఆరోగ్యకరమైన హాక్కులు. అదే—మానవుడి మొట్టమొదటి కోరిక సుఖం అనీ, తరువాతది కష్టాలు తొలగించుకోవడం అనీ, నిదురపోవడం, మేల్కొనడం, బ్రతుకు గడపటం, వీటిపై సాగు పక్షిలాగా దేవునిపై ఊహాలు సాగించడం .... ఇదంతా సత్యం కాదా? ఎదుటివాడి సుఖం తనది అనుకోవడం, ఎదుటివాడి కోసం జీవించాలనడం—మొదలైనవన్నీ ఆదర్శాలుగా చెప్పడం బాగానే ఉంటుంది కాని అది మానవ సహజం, నైజం అనిపించుకోదు అందుకే రిక్షా ఎక్కే పెద్దమనిషి బానిసలపై స్వారిచేసేవాడిలాగ, చిత్రింపబడడం, ఫ్యాక్టరీ యజమాని కూలిల రక్తం తాగే రాక్షసుడు అనడం—అంతా వికృతంగా విన్పిస్తాయి. క్రీస్తియను సిద్ధాంతాలలాగా వల్లెవేయడానికేమోగాని, తోటివారు చదివి గుర్తించుకుందుకు నిజాలే బాగుంటాయి. అనేకవిధంగా రచనలకి ప్రాణం పోస్తాయి కూడా.

మ ం జీ ర గా థ

రచయిత : పురుపూరు కోదండరామిరెడ్డి. ప్రాప్తిస్థానం : మందాకినీ హంసమాల, నెల్లూరు. మూల్యం : 3—50.

తమిళ ఆదికావ్యం, శిలప్పదికారం అనేదానికి మక్కికిమక్కి తెలుగు అనువాదం యీ మంజీరగాథ. కణ్ణగి కోవలన్‌ల ప్రేమగాథ. కణ్ణగి కోపానలమునకు వెల్బడి మధురానగరం దగ్ధమైన గంభీరగాధ. ఈ కథ చదువరులకి ఉత్సాహంగా ఉంటుంది. కాని అనువాదశైలి సాఫీగా లేనందున విసుగు జనించినా—మూల గ్రంథమును అతి జాగ్రత్తగా అనుసరించిన ఘనత యీ రచయితకి దక్కుతుంది. నిర్బంధ పఠనీయాంశంగా దీన్ని చేస్తే తప్ప ఆధునిక రచనా రీతులకు, నవలలకు కథానికలకు అలవాటుపడ్డ ఆంధ్ర మహాజనులు యీ చారిత్రక గ్రంథాలలాంటి రచనని ఆదరించలేరేమో ! అయినా పరిశోధనాంశాలలో అభిలాష గలవారికి మన్ననీయం యీ మంజీరగాథ.

స ం జ దీ ప ం

రచయిత : పూ. భా. ప్రాప్తిస్థానం : శోభా ప్రచురణలు, విజయనగరం. మూల్యం : రు. 1—50.

పూ. భా గల్పికలు చదివి ఆనందించనివారు అరుదు. సంసార జీవితాన్ని మునిమాణిక్యంలాగా ఒకే కోణంలోంచికాకుండా సీరియస్‌గా, చింతలతో, వంతలతో సహా చూసి, చూసినదాన్ని చక్కగా రాయకల్గినవారు పూ. భా. ఎంతటి గంభీరమైన భావాన్ని అయినా, ఒక్క చిన్ని మాటలో చెప్పి ఒప్పింపకల నేర్పు ఉంది వీరికి. అందుకే ఈ సంజదీపం సంపుటి ద్వితీయ ముద్రణకు వచ్చిందంటే ఆశ్చర్యంలేదు. పూ. భా. యిలాగే యింకా గల్పికలు కల్పించి పాఠకుల కందించాలని ఆశ.

శ్రీమతి కె. రామలక్ష్మి.

వార్తలు

శ్రీరంగం నారాయణబాబు కాలధర్మం

ఆధునికాంధ్ర సాహిత్యంలో అధివాస్తవిక ధోరణి ప్రవేశ పెట్టిన వారిలో ప్రముఖులు శ్రీ శ్రీరంగం నారాయణబాబు చెన్నపురిలో అక్టోబరు 2 వ తేదీ ఉదయం స్వర్గస్థులయినారు.

ఈయన అతి నవ్యపద్ధతిలో కవితా చిత్రణంలో మిక్కిలి నేర్పరి. విజయనగరంలో 1907 మేలో జన్మించారు. చిన్ననాటినుంచి నాటకాల్లో వేషాలు వేసేవారు. సంగీత శాస్త్రంతో చక్కని పరిచయం సంపాదించుకొన్నారు. శ్రీ శ్రీతో బాటు విశాఖపట్టణంలో కవితాసమితి నిర్వహించారు. తొలుత ప్రబంధ పద్ధతిలో ప్రారంభమైన వీరి కవిత క్రమక్రమంగా విప్లవాత్మకధోరణివైపు తిరిగింది.

కొంతకాలం వీరు విజయనగరం రచయితల సంఘాని కధ్యక్షులుగా ఉన్నారు. కపాలమోక్షం, కిటికీలో దీపం, వూరవతల, గడ్డిపరక, మౌనశంఖం, పండుగనాడు మొదలయినవి వీరి ప్రముఖ రచనలు. ఇవిగాక అప్పుడప్పుడు వీరు కొన్ని కథానికలు కూడా రచించారు. భక్తకబీర్ సినిమాలో నటించారు.

నాటి మధ్యాహ్నం అంత్యక్రియలు జరిగాయి. శ్రీ శ్రీ; ఆరుద్ర, శ్రీ కృష్ణంరాజు మొదలైన రచయితలు, మిత్రులు వీరికి తమ శ్రద్ధాంజలి సమర్పించారు.

సూర్యదేవ్ దీక్షావిరమణ

పంజాబీసుబా నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రతి నిరశన వ్రతం సాగిస్తున్న శ్రీ యోగిరాజ్ సూర్యదేవ్ అక్టోబరు 2 వ తేదీ సాయంకాలం పంచామృత ప్రాశనంతో తమ దీక్ష విరమించారు. గత 49 రోజులనించి ఈయన నిర్విరామ నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు.

10 ఏళ్ల పసిబాలిక పంచామృతం అంది స్తూండగా పదివేలమంది ప్రజ 'హిందీ భాషా అమర్ రహే' అనే మహా నినాదంతో ఆయన నభినందించారు. ఇంకా 'సూర్యదేవ్ జిందాబాద్' అఖండభారత జిందాబాద్' అంటూ పెద్ద నినాదాలు చేశారు. అనంతరం శ్రీ సూర్యదేవ్ ఫల రసంకూడా పుచ్చుకున్నారు. మిత్రులు, శ్రేయోభిలాషులు అనేకు లాయన నభినందించారు.

ఆగస్టు 15 నుంచి నేటి వరకు నిరశనదీక్ష కొనసాగిస్తున్న శ్రీ సూర్యదేవ్ నేటితో 37 పౌనులు బరువు కోల్పోయారు. దీక్ష విరమణకు పూర్వం ఒక వైద్య బృందం ఆయన దేహారోగ్య స్థితి పరిశీలించింది. ఒక వారం రోజులపాటు జావ మొదలయిన ద్రవ పదార్థాలు మాత్రమే స్వీకరించాలనీ, పక్షం రోజులపాటు సంపూర్ణ విశ్రాంతి అవసరమనీ ఈ వైద్యబృందం సలహా ఇచ్చింది.

శ్రీ సూర్యదేవ్ పత్రికా విలేఖరులతో ప్రసంగిస్తూ ఈనెల 22 వ తేదీన తాము ఢిల్లీ వెళ్లి భారత ప్రధాన మంత్రిని, దేశీయాంగశాఖా మంత్రిని కలుసుకోగలమని అన్నారు.

ఈయన పంజాబులో రోహటక్ జిల్లాలో ఘవార్ గ్రామంలో జన్మించారు. వయస్సు 60 సంవత్సరాలు. సంఘ సంస్కరణల కోసం ఈయన ఇంతకు పూర్వం 8 సారులు నిరాహారదీక్ష స్వీకరించారు.

పాఠ్యపుస్తక ప్రచురణకు కేంద్రసంస్థ

పాఠ్య పుస్తకాలు రాష్ట్రీయ స్థాయి కంటె పై స్థాయిలో వ్రాసి తద్వారా జాతీయైక్య భావం పెంపొందించాలని ఢిల్లీలో సమావిష్టమయిన జాతీయ సమైక్య సభ వెలువరించిన ఆమోదిత ప్రకటనలో సూచించింది.

వివిధ రాష్ట్రాలమధ్య పాఠ్యపుస్తక రచనా పద్ధతిపై సలహా లివ్వడానికి, ఆయా పాఠ్య గ్రంథావళి పరిశీలనకు, ఆయా రాష్ట్రాల సుప్రసిద్ధ విద్యావేత్తలతో, అధ్యాపకులతో ఒక జాతీయ సలహామండలి నియమించాలన్న విశ్వవిద్యాలయాల ఆర్థిక సలహాసంఘం సిఫారసు జాతీయైక్యసంఘం ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాంటి పాఠ్య పుస్తకాలు తయారు చేసే పని ఒక కేంద్ర సంఘం చేపట్టవలసి ఉన్నదని కూడా పై సంఘం సూచించింది.

అల్పసంఖ్యాకభాష లుపయోగిస్తున్న పాఠశాలలు, కళాశాలలు, ఆ యా రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు అనుబంధించుకోలేనప్పుడు, ఆయా రాష్ట్రాలకు వెలుపలఉన్న విశ్వవిద్యాలయాలతో వాటికి అనుబంధం ఏర్పరచ వచ్చునని కూడా పై సంఘం అనుమతించింది. ప్రతిరోజు ప్రారంభంలో సూచించిన ప్రార్థనతోబాటే మన రాజ్యాంగంలోని పీఠిక కూడా పఠించవచ్చునని జాతీయ సమైక్య సంఘం సూచించింది. పై సూచనలవల్ల జాతీయ సమైక్యభావం దృఢతరంగా పెంపొందగలదని పలువురు వక్తలు వెల్లడించారు.

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.

Bharathi 7th October 1961 Regd No. M. 1956

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		క్యాజువల్	కాంట్రాక్టు
4 వ కవరు పేజి			
2 రంగులు	...	రు. 125/-	రు. 100/-
ఒకేరంగు	...	రు. 100/-	రు. 90/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	90/-	75/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	70/-	60/-
అర్థ పేజి	...	35/-	30/-
పావు పేజి	...	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥ నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒకకాలం ఇంచికి కేవలం రు. 2/- చొప్పున ప్రకటించబడును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-00
6 మాసముల చందా	...	రు. 6-00
విడి ప్రతి	...	రు. 1-00

మేనేజరు, భారతి,
మద్రాసు-1.